d. No. H. 373

ఆంధ్రప్రదేశ్

సంపుటి 6

సంచిక 1

రు 1961

ర్తీక - మార్గశిర

1883 శకం


ప్రణాళికా

వార

ప్రత్యేక

సంచికతో





పంట కోతలు - మహబూబ్‌నగరంలో



ఏమిటీ వినోదం?

ఆంధ్రప్రదేశ్

సంపుటి 6 | నవంబరు 1961 కార్తీక-మార్గశిర 1883 శకం | సంచిక 1

విషయసూచిక

ముఖచిత్రం: నాగార్జునసాగర్ ఆనకట్ట

వెనుకఅట్ట: బ్రాడ్‌గేజ్ రైలుగా మార్చబడిన గుడివాడ-భీమవరం రైలుమార్గానికి గత అక్టోబరు 8వ తేదీన యూనియన్ రైల్వేశాఖ మంత్రి ప్రారంభోత్సవం చేశారు.

చందా వివరాలు

సంవత్సరానికి	—	3 రూపాయలు
విడి ప్రతి వెల	—	25 నయాపైసలు

Edited & Published by the Director of Information & Public Relations, Andhra Pradesh, Hyderabad-1
Printed at Vir Milap Press, Mukarramjahi Road, Hyderabad.

మహాత్ముఁడు - ఆంధ్రులు

(౧౯౨౧)

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

గుంపులుగుంపులై తెలుఁగుకొమ్మలు గాంధికి నంజలించి మీ
పంపులు మాశిరమ్మునకుఁ బ్రన్ననిక్రొవ్విరిదండ లంచు వాల్
జంపుల కంకణమ్ముల బులాకుల బన్నసరాల కానుకల్
నింపిరి దేశభక్తిరమణీయలు తండ్రికిఁ దగ్గబిడ్డలై

ఒకముదియవ్వ పున్నమకు నూరినవెన్నెలబింకమున్ గకా
వికలొనరించు క్రొంజిలుఁగువిచ్చెను విచ్చి ఋషీంద్రుహస్తమం
దకుటిలభక్తితో నిడి మహాత్మ! యిదే పదివేలు; వేఱుసే
యక ననుఁ దేర్పవే యనుడు నయ్యకు జల్లున రాలె నశ్రువుల్

ఈదెసనుండి యాదెసకు నేఁగు కృపామయు నాఁపి తండ్రి! నీ
పాదము లిందు మోపవలెఁ బల్కులు గుప్పవలెన్ దరిద్రతా
వేదనఁ దొప్పదోఁగునిఱుపేదల మీహృదయం బొకండె నీ
కీఁదగుకట్న మంచు గురు నెద్దిరి పల్లెల మాలమాదిగల్

ముసిముసినవ్వు దొంతరలమోములతో నొకహద్దులేనిసా
హసములతో విశుద్ధహృదయమ్ములతో సభ కెక్కి మంజుల
ప్రసవనిబద్ధహారములు బాపుమెడన్ జిఱుచేతులన్ దగి
ల్చి సొగసి తేఱి "తాతయకుజే" యని కుత్తుక లెత్తి రర్భకుల్

తల్లులు ఱొమ్ముచేఁపి పలుతంత్రములన్ బఁరగించి యెంత గా
సిల్లినఁ బోరు మానని కసిఙ్గా విడనాడనిచిట్టిపాప లా
యల్లరిపూలతోఁటలు మహాత్ముఁడు వేదికఁ జేరినంత ను
త్ఫుల్లముఖంబులన్ మునులపోల్కిఁ గుదుర్కొని రేవివేకమో!

కమ్మనిపాటలన్ దెలుఁగుగాయకవర్యులు గాంధిధర్మగం
ధమ్ములు చిల్కఁ సభ్యులకుఁ దన్పు ఘటించిరి; సత్కవీంద్రబృం
దమ్ములు పొంగి సాధుకవితాపవమానకుమారముల్ రసా
ర్ద్రిమ్ములు వీచి మోహనునిర[illegible]లనిచ్చల [illegible] దుయ్యెలన్

మనము తథాగతు జీస
న్సను గంటిమొ లేదొ కాని సుకృతంబెదియో
నినుపారి నేఁడు గాంధిని
గనినార మటంచు నెపుడు కరఁగిరి తెల్గుల్

చిత్తము నెట్టెటో మఱలఁజేసి త్రిలింగముఁ బాసి మోహనుం
డుత్తరభారతక్షితికి నుత్సుకతన్ బయనించెఁ; బల్లియల్
పత్తనముల్ స్వరాజ్యనిధి ప్రబ్బునటుల్ ధన మిచ్చి భక్తిసం
పత్తిని దన్నుఁ గొల్వ నవభా విభవమ్ము గడించె నయ్యెడన్

మతి సెడె గాంధి; కెవ్వరు సుమాళమునన్ శతలక్షలిత్తు; రే
గతి నితఁ డొడ్డుపట్టు నని గర్వము నజ్ఞతయున్ నటింప భూ
పతులు హసింప సాగఁ దనపట్టినపట్టు రవంత వీడఁబో
క తిరిగెఁ దండ్రి కాంగ్రెసువికాసము కోరి నిరంతరమ్ముగన్

పలువురు నాయకుల్ తనకు బాసటగా నడుముల్ బిగించి పె
న్నలసట కోర్చుచున్ ధనసమార్జన సేయఁ దొడంగి; రెల్లసీ
మలఁ గలపేదవారు వసుమన్మణులున్ దమశక్తిమేరలన్
దొలఁగినకాన్కలిచ్చి పరితుష్టి కదించిరి నేతృకోటికిన్

గడువునకంటె ముందె గుణకంధికి గాంధికి గెల్పు వచ్చె; ను
గ్గడువుగఁ జేరె విత్త; మధికారులమోములు సిగ్గువెల్లువం
బడె; నిట మెచ్చఁ దగ్గయది బంబయిపౌరులయీవి; వారికిన్
విడిముడి యుండుఁగాక ప్రభవించునుదారత యింత యొప్పునే!

రాటములు, సభ్యులున్ దొలి
పూటఁన చిక్కెనను గురుఁడు పొంగక కట్టా
రాటంపడె సొమ్మన;కది
కోటిపదేన్లక్ష లాయె; గొసరాతిరికిన్

కోరిక తీరి కాంగ్రెసునకున్ జవసత్వము లగ్గలించుటన్
దేఱెను గాంధి; దేశమునఁ దియ్యనిపాటల నాలపించుచున్
మీఱెను రాటముల్: పసిఁడిమేడలు గట్టినలాంకషైరు బే
హారులు దస్త్రాల్ ముడిచి యాకసపుందెసఁ జూచి రొక్కటన్

నా "మహాత్మ కథ" నుండి

ఆంధ్ర ప్రదేశ్

మనకింకను కావలసిన సాహిత్య గ్రంథములు

డాక్టర్ గిడుగు వెంకట సీతాపతి

మనకు అనగా నాకున్ను ఈ నా వ్యాసము చదివే వారికిన్ని మాత్ర మేకాదు; 'తెలుగువారి కందరికిన్నీ కావలసిన అని, నా అభిప్రాయము. ఇకను (ఇఁకను, ఇంకను) అంటే ఇక ముందే కాక ఇంతకు పూర్వమున్ను ఇప్పుడున్ను ప్రకటితములగుతున్న గ్రంథములలో కొన్ని గ్రంథముల వంటివి కూడా అని నా ఉద్దేశము సాహిత్య మనగా సాహిత్య గౌరవమును పొందగల గ్రంథములు సాహిత్యము, వాఙ్మయము, సారస్వతము అను నీ మూడు పదములను కొందరు అర్థ భేదమును పాటింపక సమానార్థములుగా వాడుతున్నారు. వాక్+మయము—వాక్కుతో నున్నదంతా వాఙ్మయమే. అనగా లోక వ్యవహారములో ఉన్న సాధారణ లేఖలు, దస్తావేజులు, దాన పట్టాలు, ప్రకటనలు మొదలయిన వన్నీ వాఙ్మయములో చేరదగినవే. సాహిత్యము కూడా వాఙ్మయములో ఒక భాగమే అయినా కొన్ని విశిష్ట లక్షణములు కలది మాత్రమే సాహిత్యము కాగలదు. సారస్వతము "సరస్వతి" కి సంబంధించినది. సంగీతం చతు సాహిత్యం సరస్వత్యాః కుచద్వయమ్। ఆ పాత మధురంత్వేకం—అన్యదాలోచనామృతం" అనుట వలన సంగీతమున్ను సాహిత్యమున్ను కలిసి సారస్వతము అగును. వీటిలో చెవిని పడుతూ ఉన్నంత వరకే మధురముగా అంటే చెవికింపుగా ఉండేది సంగీతము. సాహిత్య మనేది ఆలోచించిన కొలదీ అమృతము వలె ఉండగలది. ఆ సాహిత్యమునకు లక్షణమేమి? "శబ్దార్థయోః యథావత్సహ భావేన విద్యా సాహిత్య విద్యా" అని రాజశేఖరుడు తన కావ్య మీమాంస యందు చెప్పినాడు. మొదటి ఆలంకారికుడైన భామహుడు "శబ్దార్థౌ సహితౌ కావ్యం" అని చెప్పి నప్పుడు సాహిత్యము నందలి కావ్యమును చెప్పినాడన వలెను.

సంస్కృత భాషలో గల అలంకార శాస్త్రములు—కావ్యమీమాంసలు అన్నియును గద్య పద్య కావ్యములను, నాటకములను ఉద్దేశించి రచితము లయినవి. కావ్యములు అలంకారములతో దోష రహితములై రస వ్యంజకములై ఉండవలె నని మమ్మటాదులు చెప్పిన కావ్య లక్షణమును విమర్శించి "వాక్యం రసాత్మకం కావ్యం" అని విశ్వనాథు డన్నాడు. ఇది కూడా కావ్య గౌరవమునకు తగిన లక్షణము కాదని "రమణీ యార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం" అని జగన్నాథ పండితరాయలు రస గంగాధర మందు కావ్య లక్షణమును నిరూపించెను. విశ్వనాథ జగన్నాథులు మమ్మటుని కావ్య లక్షణమును ఖండించి చూపిన ఆక్షేపములు సరికావని నాగేశ భట్టారకుడు మమ్మటుని కావ్య లక్షణమును సమర్థించెను.

శబ్దార్థములు రెండును కలిసి కావ్య శరీరము అయిన ప్పుడు ఈ కావ్య శరీరమునకు ఆత్మ యేది? అనేది మరియొక ప్రశ్న పుట్టినది. రసమే కావ్యమునకు ఆత్మయని భరత మహర్షి, అలంకారమే కావ్యాత్మయని భామహుడు కావ్యమునకు అందమును సమకూర్చుటలో అలంకారము కంటె ఎక్కువ యన దగినది గుణము కనుక గుణము కావ్యాత్మయని దండి చెప్పెను. దండి చెప్పిన గుణము కూడా అలంకారము వంటిదే కదా? కావ్య శరీరములో గల శబ్దార్థములు రెండున్ను అలంకారముల తోను గుణముల తోను ఉండవలసినవే కనుక గుణము కూడా కావ్యాత్మ కాజాలదు, "రీతిరాత్మా కావ్యస్య" అని కావ్యాత్మ రీతి యని వామనుడు నిర్వచించెను. అది కాదు ధ్వనియే కావ్యాత్మయని ఆనందవర్ధనుడు నిర్ణయించినాడు

భరత మహర్షి ఆనంద వర్ధనుడు కావ్యాత్మగా జెప్పిన రస ధ్వనులు పరస్పర సమ్మతములా? కొంచమైనను భేదము కల్గియుండుటవల్ల విరుద్ధములా అన్న సందేహము కలుగును. రసమే ముఖ్య మయినది. ధ్వని వస్త్వ లంకారముల నాశ్రయించు కొన్న ధ్వని రసమందుండును అని కొందరు ఆక్షేపించినారు. ధ్వని ప్రత్యేకించి కావ్యాత్మగా—విశ్వనాథ, విద్యానాథ, జగన్నాథులు సమర్థించినారు.

"వక్రోక్తిః కావ్య జీవితమ్" అని కుంతకుడును ఉత్తిబి సేసో కబ్బో బాసా జాహోదు సాహోదు" అని యుక్తి విశేషమె అనగా చెప్పుటతో గల చమత్కారమే కావ్యమునకు జీవమగునదిగా రాజశేఖరుడును నిర్వచించినారు. ఔచిత్యము కావ్యాత్మ యని క్షేమేంద్రుడు ఏదో భిన్నాభిప్రాయములను సమన్వయించి సామరస్యము సమకూర్చుటకు చెప్పినట్లు చెప్పెను అంతే కాని ఔచిత్యము శబ్దమందును అర్థమందును ఉండ వలసిన గుణమే అని అందరును ఒప్పుకొందురు. అంతేకాని అది పైని వివరించిన రసము అలంకారము మొదలయిన వానికంటె ఎక్కువగా కావ్యాత్మ యనిపించు కొనుటకు విశిష్టార్హత గలది కాదని కొందరి మతము.

ఈ చర్చయంతా సంస్కృత కావ్యాలకు వర్తించు నట్లు ఆలంకారికులు నిర్వచించినారు వాల్మీకి కాళిదాసాదులు ఈ అలంకార శాస్త్రములను చదివి తమ కావ్యములను గాని నాటకములను రచింపలేదు. ఆ మహా కవుల గ్రంథాలను చూచే ఈ ఆలంకాలకులు కావ్య లక్షణములను నిరూపించి నారు సంస్కృత కావ్యములను అనువదించుటకు గాని అనుక రించుటకు గాని పూనుకొన్న తెలుగు కవులకు ఈ అలంకార లక్షణములను అనుసరించి రచన సాగించ వలసిన ఆవశ్యకత కలిగినది. వారిలోను అభిప్రాయ భేదము లేక పోలేదు. కావ్యమందలి కథావస్తువెట్టిది కావలెనన్న విషయములో పిల్లలమఱ్ఱి పినవీర భద్రుడు—

"ప్రఖ్యాతంబన మిశ్ర బంధమన నుత్పాద్యంబనంగాఁ ద్రిధా
విఖ్యాతంబగు" వస్తువందు మఱి యద్యా హారమున్ జేయఁగా
ప్రఖ్యాతంబితి వృత్తమైనఁగృతి సెప్పన్ వక్తకున్ శ్రోతకున్
విఖ్యాతిన్ గలిగించుఁ బుణ్య మహిమన్ విశ్వంభరా మండలిన్

ఇందుకు భిన్నముగా రామరాజభూషణుడు తన వసుచరిత్రయందు—

"కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నము లాద్య సత్కథల్"
వావిరి పుట్టు రత్నముల వారి తసత్కవి కల్పనా విభూ
షావహ పూర్వవృత్తములు సానలఁదీరిన జాతి రత్నముల్
గావున నిట్టి మిశ్ర కథగా నొనరింపుము నేర్పు పెంపునన్.

అనగా కథావస్తువు కేవలము ప్రఖ్యాతమైన పౌరాణిక కథయో చారిత్రక కథయో అయి ఉండవలె నని తన పూర్వులతో పాటు పినవీరభద్రుడు పల్కగా, ప్రబంధ యుగమందు కృష్ణదేవ రాయల తర్వాత ప్రసిద్ధుడయిన రామరాజ భూషణుడు ప్రఖ్యాతమైన దాని కంటె మిశ్రమైన కథావస్తువే మేలయినదని తన వసుచరిత్రకు సంగ్రహించెను. ఇట్టి మార్పు మన తెలుగు సాహిత్యములో కలిగినట్లే అంతకు పూర్వము సంస్కృత సాహిత్యములో కూడా భవభూతి వల్ల కలుగక పోలేదు. అతని మహా వీర చరిత్ర ఉత్తర రామ చరిత్ర ప్రఖ్యాత కథలనే కథావస్తువులుగా అంగీకరించినవి. కాని మాలతీ మాధవ నాటకములోని కథ కేవలము కల్పితము అందువల్ల అతడు ఆనాటి విమర్శకుల తీవ్ర ఖండనలకు గురి కావలసి వచ్చెను. అయితే అతడు వారి ఆక్షేపణలకు లొంగి పోయినట్లు కనబడదు అందుకు నిదర్శనముగా

యేనామకే చిదిలహనః ప్రథయంత్యవజ్ఞాం
జానంతితే కిమపితాన్ ప్రతినైషయత్నః
ఉష్పత్స్యతే మమతుకోఽపి సమాన ధర్మా
కాలోహ్యయంనిరవధిః విపులాచ పృథ్వీ॥

అని తాను చేసిన పని పూర్వ సంప్రదాయానికి విరుద్ధమయినా సాహిత్యాభి వృద్ధికి తోడ్పడ గలదే అని సమర్థించు కొన్నాడు. కాని ఆతనిని అనుసరింపగల ధైర్యమున్న వారు కనబడలేదు.

తెలుగు సాహిత్యంలో కూడా ప్రఖ్యాతము లైన కథా వస్తువులనే ఎత్తుకొని ప్రఖ్యాతము లయిన వారినే కథా నాయికా నాయకులనుగా పెట్టుకొని కావ్యములు రచించిన వారే ఎక్కువ. రామరాజ భూషణుడు కనబరచినంత స్వాతంత్ర్యము నైనను వహించి మిశ్ర బంధ కావ్యములు వ్రాసిన వారు నూరేండ్ల క్రిందటివరకును కొలదిగా మాత్రమే ఉన్నారు.

పింగళి సూరన రచించిన కళాపూర్ణోదయ మందలి కథా వస్తువు ప్రఖ్యాత కథ వలె పైకి కనబడు నట్లుగా బ్రహ్మను కృష్ణుని నారదుని రంభను కుబేరుని కథలో దూర్చినా కథా వస్తువు కల్పితము. కలవాణి యను వేశ్యను కథా నాయికగా చేసినందుకు అతనిని ఆక్షేపించిన పండితులు లేకపోలేదు. అందుకు సమాధానము చెప్పిన వారును లేకపోలేదు. అయితే ఆ సమాధానము సంప్రదాయ సిద్ధమైన నియమమునకు బద్ధమైనదిగా నున్నదే కాని స్వాతంత్ర్యము వహించుటకు తగినదిగా లేదు. కలవాణీ పూర్వ జన్మమందు భారతి ముంజేతి చిలుక; శాపవశమున వేశ్యగా పుట్టినది. కనుక ఉత్తమ నాయికగానే మనము గ్రహింప వచ్చునని కొందరు చెప్తున్నారు. అంతే కాని కథా వస్తువు ఎందుకు ప్రఖ్యాతమైనది కావలెను? కేవలము నీచ జాతికి చెందిన సాంఘిక కథా వస్తువు ఎందుకు కాగూడదు? అంతేకాక కథలోని ప్రధాన పాత్రలు కేవలము ప్రఖ్యాత జాతుల వారిలోనే ఉండవలె నన్న నియమము ఎందుకు పాటించ వలెను. పేదలు, నిరక్షరాస్యులు, తక్కువ జాతి

వారు అయిన కుటుంబముల లోని వారు ఉత్తమ పాత్రలుగా ఉండడానికి ఎందుకు పనికిరారు? అని ప్రాచీన లక్షణములను ఎదిరించి నూతన మార్గములను త్రొక్కిన వారు నూరేండ్ల క్రిందటి వరకును లేకపోయిరి.

బ్రిటిషుయుగములో బ్రిటిషు ప్రభుత్వమువారు నెలకొల్పిన పాఠశాలలలోను కళాశాలలలోను విద్యార్థులుగా నుండిన తెలుగు వారికి ఆంగ్ల సాహిత్య పరిచయము అంతకంతకు ఎక్కువయిన తర్వాత మన కవులకును పండితులకును గ్రంథ రచన విషయములో ఉండిన సంకుచిత భావము గుర్తుకువచ్చినవి. అంతవరకును వెలిసి యుండిన తెలుగు సాహిత్య గ్రంథములు తెలుగు పాండిత్యము సంపాదించుకొనుటకు అనుకూలముగా ఉండేటట్లు రచితములయినవేకాని పామరులయిన సాధారణ జనులు చదువుకోదగిన రీతిగా రచితములు కాలేదన్నవిషయం స్పష్టమైనది అంతేకాక కావ్యరచనయే ఎక్కువగా సాగినది కాని గద్యరచన అంతగా సాగలేదు. సాగినంతవరకును వ్యావహారిక భాషలో సాగియుండుట చేత పండితుల దృష్టిలో అది సాహిత్య ధర్మమును పొందలేదు. అందుచేత హయగ్రీవశాస్త్రి వ్యావరిక భాషలో రచించిన పంచతంత్రము మొదలయిన గ్రంథములు పనికిరాలేదని చిన్నయసూరి కావ్యభాషలో క్లిష్టశైలిని రచించిన నీతిచంద్రిక బదులలో పాఠ్య గ్రంథమయినది చిన్నయసూరి గద్యరచనకు నూతనముగా తెచ్చిపెట్టిన ఈ మార్పు ఆదర్శప్రాయమయి సుమారు అరువది సంవత్సరములకాలము వచన రచన ముందుకు సాగుటకు మారుగా వెనుకకు పోయినది. ఆంగ్లసాహిత్యమందు టాల్‌స్టాయి కథల వంటివి చదివిన మన తెలుగు వారికి నూతన భావము ఉదయించినవి. పేదలు, తక్కువ జాతులలో ఉన్నవారు, పామరులు మొదలయిన వారి జీవితములు కూడా కథలకు కావ్యాలకు నాటికలకు నాటకములకు కథా వస్తువు కావచ్చుననిన్ని, ఆదిగువ తరగతుల వారి నుండి తమ రచనలకు కావలసిన నాయికా నాయకులను ఎన్నుకోవచ్చుననిన్ని మన తెలుగు రచయితలు గుర్తించినారు. ఆ రచనలు సాహిత్య ధర్మమును పాటించలేదు కనుకను వ్యావహారిక భాషలో ఉన్నవి కనుకను వాటిని మన పండితులు సాహిత్యములో స్థానములేదన్నట్లు నిరాకరించినారు. అప్పటికే సాహిత్య గౌరవము పొందకుండా యక్షగానములు, క్షేత్రయ పదములవంటి గేయములు, అన్నమాచార్య కీర్తనలు త్యాగరాజ కృతుల వంటిపాటలు మొదలయినవి సాహిత్యములో చేరవన్న అభిప్రాయముతో నుండిన మన తెలుగు పండితులు తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథములో వీటిని పేర్కొనలేదు.

ఆంగ్ల సాహిత్య గ్రంథములు చూచిన వారికి ఇవికూడా సాహిత్యములో చేరవలసినవే అనిన్ని ఇట్టివి ఇంకను రచితములు కావలెనన్న ప్రోత్సహము దేశములో నుండే రచయితలకు కలిగించవలెనని్ని తోచినది. అంతేకాక మరియొక విషయముకూడా గోచరించినది. కావ్యరచన దర్బారులో నున్న రాజులకు మహారాజులకు పండితులకు వినిపించి వారి మెప్పును పారితోషికములను పొందగల దినములు అంతరించినవి. పెద్ద వారికి కావలసిన గ్రంథములతో పాటు పామరులకు పేదలకు పనికి వచ్చే గ్రంథములే ఈ కాలమున ఎక్కువగా కావలెను ఆ గ్రంథములోని భాషసాధారణ జనులు నిత్యమును వాడుకొంటూ ఉన్నభాషకు ఎంత చేరువగా ఉంటేవారికి అంత ప్రయోజన కారిగా ఉంటుందన్న విషయము ఇటీవల స్పష్టమయినది.

నూటికి అయిదుగురు అక్షరాస్యులును వేయింటికి ఒక్కరు కావ్యములను చదువుకోగల వారున్ను ఉన్నకాలమందు ఆ చదువుకోగలవారు మడి మాన్యములు గలవారై సావకాశముగా భోజనము చేసి హాయిగా చదువుకొనే దినములలో భారతం, రామాయణం, భాగవతం, మనుచరిత్ర, వసుచరిత్ర మొదలయిన పెద్ద గ్రంథాలు చదువుకొనుటకు చాల అవకాశాలుండేవి "నిరుపహతి స్థలించు.." అని పెద్దన్నగారు చెప్పినట్లు రాజభోగాలు అనుభవింపగల పెద్దన వంటి పెద్దకవులు పెద్ద పెద్ద గ్రంథాలు రచించుటకు గాని అవి సావకాశముగా చదువుకొనుటకు గాని అప్పటి పరిస్థితులు అనుకూలముగా ఉండేవి. కాని ప్రపంచమందంతటను పరిస్థితులు మారిపోయినవి. పెద్దపెద్ద గ్రంథాలు ఈకాలములో రచించుటకు గాని, చదువుటకు గాని, ఇప్పుడు అవకాశము లేదు.ఆ ఉత్సాహము లేదు అంతే కాదు జీవన యాత్ర గడుపుకొనుటకు ప్రతిదినము ప్రొద్దస్తమానము పని తొందరలో ఉన్నవారికి పెద్ద గ్రంథములు చదువుకొనుటకు అవ మెక్కడుండగలదు. స్కాట్సు నవలలవంటి పెద్ద పెద్ద నవలలమీద ఇప్పుడెవరికిని మోజులేదు అట్లే మనదేశములో భారత భాగవతాది పెద్దగ్రంథములు ఎక్కడనో కాని మరి కనబడవు. అందుచేతనే ఇతరదేశములలో వలెనే మనదేశములోను మన తెలుగు సాహిత్యములోను కావ్యఖండికలు, గేయములు కథానికలు, తెలుగు ఏకాంకికలు మొదలయిన కొత్త రచనలు బయలుదేరినవి.

కావ్యకళ పెద్ద గ్రంథములలోనే కాదు చిన్నగ్రంథములందును ఉండ గలదు. "వాక్యం రసాత్మకం కావ్యం" అన్నారు. భారతం భాగవతం రామాయణాదులలోగల ఉపాఖ్యానాలు అన్నీ ఒక్కొక్క కావ్యఖండిక యని చెప్పవచ్చును.

ఇకనాటకముల విషయములో 'కావ్యేషునాటకం రమ్యం' అనిన్ని రచనవిషయంలో గాని విద్యార్థులు చదువుకొను విషయంలో గాని కావ్యాలయిన తర్వాత నాటకమను ఆశయ ముండేది. ఇప్పుడందుకు విపరీతముగా బాలయువకులు నాటికలు నాటకములు ముందుగా రచియించి రచయితలు కాగోరుతున్నారు. పూర్వకాలమందు నాటకములు రచియించినవారు సాహిత్య లక్షణ ములందు చెప్పిన నియమములను పాటించేవారు. విమర్శకులు ఆ లక్షణములన్ని ఉన్నవా అని ఏ నాటకమయినను పరిశీలించే వారు. నాటకమాడునప్పుడు ప్రజారంజకము కాకపోయినను లాక్షణికులు చెప్పిన లక్షణములు ఉంటేచాలును అది ఉత్తమయిన నాటకమనేవారు. ఇప్పుడు ఆ లక్షణములు ఉన్నా లేకపోయినా ప్రదర్శించినప్పుడు ప్రజల ఆమోదమును పొందినదే ప్రశస్త నాటకముగా గ్రహిస్తున్నారు. జనరంజకముకాగల నాటకము గాని నాటికగాని రచించుటకు పెద్ద పాండిత్య మక్కరలేదు. కావ్యమీ మాంస చదువనక్కరలేదు. రసజ్ఞత లోకజ్ఞత రచనా చమత్కృతి ఉంటే చాలును. నేటి మన సాహిత్యములోవేయిన్నీ నాలుగువందల నాటకములున్నవి సుమారు ఎనిమిది వందల నాటికలున్ను ఏకాంకికలున్ను ఉన్నవి. ఇంకా ప్రతిదినము పుట్టుతునే ఉన్నవి. ఊరూరా కవులే ఇంటింటా కవులే అని కొందరు తృణీకరిస్తూ మాట్లాడుతున్నారు. అట్టివాడొకడు నాతో ప్రసంగించినప్పుడు "నీకొంప ఏమిమునిగినది? నిన్నేం చదువుమని కాని కొనుమని కాని ఆగ్రంథకర్తలు బలవంతపెట్టినారా?" అన్నాను. "వ్రాస్తే మంచిగ్రంథాలు వ్రాయవలెను లేకపోతే మానుకోవలెను గాని ఈచేతగాని రచనలెందుకు?" అన్నాడు. కంటే మంచి అందముగల పిల్లలను కనండి లేకపోతే కనడం మానేయండి అంతేకాని ఈ అందచందాలు లేని పిల్లలను ఎందుకుకంటారు? అంటే నీవు మానుకొంటావా? నాయిష్టంకాదు నాసంతాన విషయం నీకెందుకు? నాపిల్లలను నిన్నేమి పోషించుమన్నానా? అంటావుగదా?" అన్నాను అతడు మరి మాటాడలేదు.

ఆధునిక యుగంలో ఇంగ్లీష్ ఫ్రెంచి, జర్మను, రష్యన్ మొదలయిన భాషలలో గల సాహిత్య వీధులు కొన్ని మన తెలుగులో లేవు. వ్యాసములు మొన్నమొన్నటి వరకును లేకుం డెననే చెప్పవలెను.

1862లో ప్రకటితమయిన సామినేని ముద్దునరసింహం గారి హితసూచనిలో గల వ్యాసములకు పూర్వము వ్యాస రచన అంతగా సాగలేదు కందుకూరి వీరేశలింగముగారు చిన్న చిన్న వ్యాసములు రచించినారు. ఆతర్వాత వ్యాసరచన క్రమంగా సాగుతూవచ్చినది కాని కావ్య సాహిత్య విమర్శక రచనలే కొద్ది గానైనను సాగుతూ ఉన్నవికాని ఇతర విషయములను గూర్చిన వ్యాసములు చెప్పుకోదగినవిన్ని లేవు.

నూటాఇరువదేండ్ల క్రిందట-1938 లో ప్రకటితమయిన యేనుగుల వీరాస్వామయ్య రచించిన కాశీయాత్రచరిత్ర చరిత్ర రచనలలో మొదటిది. 1846లో కోలా శేషాచల కవి రచించిన నీలగిరి యాత్ర రెండవది. మండపాక పార్వతీశ్వర శాస్త్రి రచిం చిన యాత్రా చరిత్ర మూడవది. ఇటీవల యాత్రా చరిత్రలు రచిం చిన వారిలో చెప్పుకోదగినవారు జొన్నలగడ్డ సత్యనారాయణ గారు ప్రముఖులు. మంత్రిప్రగడ నరసింహంగారు రచించిన బదరీనాథ చరిత్రకడు చిన్నది. సాహిత్య ధర్మము అంతగాలేనిది.

దేశ స్వాతంత్ర్యము వచ్చిన తర్వాత స్వతంత్ర భావము లతో రచితములయినవి. బులుసు వేంకటరమణయ్యగారివి రెండు గలవు 1, నా దక్షిణదేశ యాత్ర చరిత్ర 2 నా ఉత్తర దేశ యాత్ర చరిత్ర (1958). ఇవి చాలవు ఇంకా ఎన్నెన్నో ఎంద రెందరో రచింపవలసి ఉన్నవి:

చిత్రలేఖనము, శిల్పము మొదలయిన కళల గూర్చి వ్యాస ములు సైతము అత్యల్పముగా ఉన్నవి. ఇప్పటికి కొన్ని కొన్ని వ్యాసములు మాత్రమే కొన్ని పత్రికలలో ప్రకటితములు అవుతూ ఉన్నవి. గ్రంథరూపమున ప్రకటితములయిన వాటిలో కొండూరు వీరరాఘవాచార్యులు 1946 లో రచించిన శిల్పదర్శనము మెచ్చుకో దగినది. 1956లో శ్రీపాద గోపాల కృష్ణమూర్తి రచించిన ఆంధ్ర శిల్ప పరిచయము రాష్ట్ర ప్రభుత్వమువారి బహుమతికి పాత్ర మయినది.

చరిత్ర విషయములో కొన్ని గ్రంథములు సాహిత్య గౌరవమును పొందదగినవిగా రచితములయినవి. భారతదేశ మునకు స్వాతంత్ర్యము సిద్ధించిన తర్వాత హిందూదేశ చరిత్ర బ్రిటిషువారు ఉపదేశించిన రీతిగాగాక స్వతంత్ర దృష్టితో రాజ ద్రోహం కాగలదన్న భయములేకుండా వాస్తవముగా సాగిన సాంఘిక రాజకీయాభివృద్ధిని పరిశీలిస్తూ రచనసాగవలసియున్నది. ఇంతవరకు ఏవో వ్యాసములు మాత్రమే ప్రకటితములయినవి. ఇందుకు పద్మభూషణ అయ్యదేవర కాళేశ్వరరావు, మామిడిపూడి వేంకట రంగయ్య మారేమండ రామారావు, రాళ్లబండి సుబ్బారావు మొదలయిన వారు కొంత వరకు కృషి చేసినారు. వీరి యాజ మాన్యమున చారిత్రక గ్రంధ రచనల సాహిత్య ధర్మము చూపిస్తూ సాహిత్యము గౌరవము పొందగల రచనలు సాగవలసియున్నది.

జీవిత చరిత్రలు, స్వీయ చరిత్రలు కొన్ని గలవు గాని చాలదు ఈ విషయమున నాకు తోచిన దొకటి మనవి చేయుదును. 1945 లో దాసరి లక్ష్మణస్వామి రచించిన స్వీయరచన వ్రాత ప్రతి నేను చూచినప్పుడు నాకు కలిగిన ఆశ్చర్యము వివేకము ఇతరులకు చెప్పదలచినాను. ఇతడు అంత గొప్ప కవిగాని పండితుడు గాని ప్రసిద్ధుడుగాని కాడు ఇతడు స్వీయ చరిత్ర రచించుకొనుట హాస్యాస్పదముగానే నాకు తోచినది. దీనికి నా అభిప్రాయము కావలెనన్నప్పుడు ఆశ్చర్యము కలిగినది. కాని ఆ వ్రాతప్రతి నాకతడు ఇచ్చిననాటి రాత్రి చదువుటకు ఆరంభించి అది మనోజ్ఞముగా ఉండుటచేత రాత్రి ఒంటి గంటవరకు చదివి ఆనందించినాను. అందు స్వవిషయము కొద్దిగా మాత్రమే. అదియైనను తెర వెనుకనే ఉంచి ఏబది సంవత్సరముల అతని మండల మందలి— అందులో ముఖ్యముగా పిఠాపురం రాజావారి ఆధీనములో నుండిన చరిత్ర— సాంఘిక రాజకీయాది విషయములు చక్కగా వర్ణింపబడినవి. ఈ చరిత్ర విషయము ఇప్పటికంటె మరి ఇన్నూరు సంవత్సరముల తర్వాత ఎక్కువ ప్రాముఖ్యమును సంపాదించగలదు ఇట్టి స్వీయ చరిత్రలు ఇంకా కావలెను.

లేఖలరూపమున ఉండగల సాహిత్యము మన తెలుగులో అత్యల్పము. రెంటాల సుబ్బారావుగారి కమలాలేఖలు ఆంగ్ల భాషలో ఉన్నవి. అందులో ఆనాటి సాంఘికాచార వ్యవహారములు ప్రతిబింబితములు. దానికి తెలుగున అనువాదము కావలెను. అట్టి లేఖలు ఎన్నైనను సాహిత్య దృష్టితో రచితములు కావలసియున్నది. ఈ లేఖల ద్వారా రచయితలు తమ అనుభవములను చమత్కరించి రచించుటకు అవకాశమున్నది.

ఇంచుమించుఇటువంటివే ఆచంట జానకిరాముగారు రచించిన పూర్వకాలస్మృతులు, మా తండ్రిగారి చరిత్రకు సంబంధించి నేను కృష్ణా పత్రికలో రచించినవిన్ని ఇట్టివి ఎన్నైనా సాహిత్య వీధులలో ఉండదగినవి.

స్వాతంత్ర్య సంగ్రామ దినములనాటి స్మృతులు రచింపగలవారున్నారు. వారు ఆనాటి రాజకీయ తంత్రములను, స్వార్థ పరిత్యాగముగలవారి కుతంత్రములను, బాధలు పడినవారి విషయములను "స్మృతులు" అనే శీర్షిక క్రింద సాహిత్య గౌరవమును పాటిస్తూ వ్రాయవచ్చును. అవి మన తరము వారికే రాబోవు తరముల వారికిని మనోజ్ఞములుగా నుండగలవు.

మరియొక సాహిత్య విషయములో స్వాతంత్ర్య సిద్ధి కలిగిన తర్వాత కేంద్ర ప్రభుత్వమువారును రాష్ట్ర ప్రభుత్వముల వారును ఎక్కువ శ్రద్ధ వహించి పనిచేస్తున్నారు. అది వయోజన విద్యాభివృద్ధికిని బాలసాహిత్య రచనాభివృద్ధికిని సంబంధించినది. ఈ రెండు విషయములలోను ప్రాథమిక విద్యార్థుల విషయములోను, వయోజన విద్యార్థుల విషయములోను గ్రాంధిక భాష అను పేరును కావ్యభాషకే విధించుటచేత వీరి విద్యాభివృద్ధి మందముగా సాగినదేకాని వడి వడిగా సాగలేదు. ప్రభుత్వమువారు చాటుచాటుగా వ్యావహారిక భాషను, పిల్లల భాషను బడులలోను గ్రంథములలోను ప్రవేశపెట్టుతున్నారేకాని అధికార రూపముగా ఒక నిర్ణయమును ప్రకటించి ప్రవేశ పెట్టుట లేదు. అందుచేత బాలసాహిత్యములోని రచనలకును ప్రాథమిక పాఠశాలలోని పాఠ్యగ్రంథములందుగల రచనలకును భేదము ఎక్కువగా కనబడుతున్నది. ఈ రెండింటికి సామరస్యము సమకూర్చుటకు ప్రభుత్వము విద్యాశాఖవారు శ్రద్ధవహించవలసియున్నది. వయోజన విద్యకును, బాల సాహిత్యమునకును కావలసిన గ్రంథములు పెంపొందించుటలో ప్రభుత్వమువారు రచనల పోటీ పెట్టు ఉత్తమ గ్రంథములకు బహుమతులిస్తున్నారు. బాల సాహిత్య రచనాలయములను ఏర్పరచి రచయితలకు కావలసిన శిక్షణము ఇప్పిస్తున్నారు. ఇందుకు మనము ప్రభుత్వమువారిని అభినందిస్తూ కృతజ్ఞత చూపవలసినదే కాని బడులలో పాఠ్య గ్రంథములందలి భాషమీదా నేటి వ్యవహారములో ఉన్న భాషకు చేరువగా యుండునట్లు చూడవలసియున్నది.

తెలుగు సాహిత్య చరిత్రలో దేశ స్వాతంత్ర్యము 1947 న లభించిన తర్వాత ఆంధ్ర రాష్ట్రము విశాలాంధ్రము ఏర్పడిన నాటి నుండిన్ని ఆధునిక సాహిత్య రచనలు పైని సూచించినట్లు త్వరిత గతికి సాగినవి సాగుతున్నవి. ఇంకను ఎక్కువగా సాగగలవను నమ్మకము కలదు.

ఇందును గూర్చి గ్రంథముల పట్టికలు ఏదో ఒక ప్రణాళికను అనుసరించి 1947 నుండిన్ని 1961 వరకున్ను ప్రభుత్వము వారు ప్రకటించిన యెడల సాహిత్య చరిత్ర రచయితలకును, విద్యాశాఖవారికిని విద్యలో అభిరుచిగలవారికిని చాలా ఉపయోగకరముగా నుండగలదని నా అభిప్రాయము.

"రావమ్మా! నవ వధూ!"

శ్రీ జంధ్యాల లక్ష్మీనారాయణ శాస్త్రి "సుధాంశు"

రావమ్మా! నవవధూ!
నవజీవన రాగమధూ!

★

పరమముగ్ధ భావంవలె
అరవిచ్చిన పద్మంవలె
పాలకడలి కెరటంవలె
పారిజాత పుష్పంవలె

రావమ్మా నవవధూ!
నవజీవన రాగమధూ:

మాధవీ విలాసంవలె
మధువసంత హాసంవలె
పుష్పించిన అందంవలె
పూర్ణ రసానందం వలె

రావమ్మా: నవవధూ:
నవజీవనరాగమధూ!

దీపశిఖా దీధితివలె
దివ్యకాంతి సంతతివలె
ఇంద్రచాప సుందరివై
ఐహిక భాగ్యేందిరవై

రావమ్మా నవవధూ:
నవజీవన రాగమధూ

శశిముఖలావణ్యాంచిత
శరద్గగన రాగిణివలె
స్వచ్ఛజీవనాన్విత ప్ర
శస్త శైల వాహినివలె

రావమ్మా నవవధూ
నవజీవన రాగమధూ

సహజ మధుర సౌమ్యమతీ,
సరస భావజయగీతీ:
జగదద్భుత జీవయాత్ర
సాగింపగ రావమ్మా:

రావమ్మా:నవవధూ!
నవజీవన భాగ్యమధూ

స్నేహమయీ రావమ్మా
గృహదీపము వెలుగింపగ
భాగ్యవతీ రావమ్మా
ప్రణయదీప్తి వెలయింపగ

రావమ్మా నవవధూ
నవజీవన రాగమధూ

పుట్టింటికి శుభగౌరవ
పుష్పమాల పంపింపగ
మెట్టినింట శ్రీసుఖసం
ప్రీతిగీతి విన్పింపగ

రావమ్మా నవవధూ
నవజీవన రాగమధూ

ముద్దులొలుకు నిరతము నీ
ముఖఫలక శ్రీతిలకము
కాంతులొలుకు సతతము నీ
గళసూత్రము కల్యాణీ


రావమ్మా నవవధూ
నవజీవన రాగమధూ

సుధామధుర సుమసుగంధ
సుందర సుస్నేహాంకిత
సుఖ జీవన మందుకొమ్మ
సుఫల శోభ గైకొమ్మా

రావమ్మా నవవధూ
నవజీవన రాగమధూ

ప్రణయ మూర్తి రావమ్మా
ప్రభువదాను పత్నివై
శాంతిసుధాకరుణకిరణ
సంక్రాంతీ:రావమ్మా:

రావమ్మా! నవవధూ
నవజీవన రాగమధూ



అదునులోనె వచ్చి హృదయ పూర్వకముగ
సాయపడిన నరుని మాయచేసి
బ్రతుకు నరునికన్న భస్మాసురుడె మేలు
జనను తాంత రంగ! వినుర! రంగ!

కళా కృష్ణుల "కృష్ణశతశతి"

కొండజాతులు - సవరలు

శ్రీ జి. వి. రామమూర్తి

భూమి పుట్టి కొన్ని కోట్ల సంవత్సరాలు అయింది. భూమితో పాటే దాని మీద జీవరాసి కూడా పుట్టింది. జీవరాసులు రెండు రకాలు చెట్లు చేమలు మొదలయినవి ఒక రకము. క్రిములు, పురుగులు, పక్షులు, జంతువులు మొదలయినవి రెండవ రకం, ఈ రెండవ రకమునేమనము జంతుకోటి అంటాము. ఈ జంతుకోటిలోకే వస్తాడు మానవుడు. కాని మానవుడు రూపు రేఖలలో యితర జంతువులు లాగ ఉండక వేరుగా ఉంటాడు. కోతులు మాత్రం మానవులను కొద్దిగా పోలి ఉంటాయి. అయినా కోతికి మనిషికి భేదం ఉంది. కోతులు మాట్లాడ లేవు, వాటికి ఒంటినిండా రోమం ఉంటుంది. మనిషి తల కన్నా కోతి తల చిన్నది. జంతుకోటిలో అన్నిటికన్నా మానవుడు గొప్పవాడు.

మానవుడు సంఘజీవి ఒంటరిగా ఉండ లేడు. పక్షుల్లాగ, తేనెటీగల్లాగ చీమల్లాగ మానవుడు కూడా తన తోటి వారిలో కలసి మెలసి జీవిస్తూ ఉంటున్నాడు. తన తెలివితేటలతో నాగరికతను అలవరచుకుంటూ, నివసించడానికి యిళ్లు నిర్మించుకొనడము, కట్టుకొనడానికి బట్ట నేయడము, తినడానికి పంటలు పండించుకొనడమూ, శత్రువుల బారినుండి రక్షించుకొనడానికి ఆయుధాలను తయారు చేసుకొనడము మొదలయినవి నేర్చుకొన్నాడు మానవుడు

నానాటికి తన తెలివితేటలను అభివృద్ధి పరచుకొంటూ భూమి మీద వేగంగా పోవడానికి బండ్లు, రెళ్లు, మోటారు కార్లు మొదలయినవి, నీటి మీద ప్రయాణము చేయడానికి పడవలు, నావలు, ఓడలు, స్టీమర్లు మొదలయిన ప్రయాణ సౌకర్యాలనే కాక పక్షుల్లాగ ఆకాశంలో ఎరగడానికి విమానాలు నిర్మించుకున్నాడు. అంతటితో తృప్తి పడక భూమికి కొన్ని కోట్ల మైళ్ల దూరంలో ఉన్న చంద్రమండలానికి, శుక్రమండలానికి వెళ్లాలని నేటి మానవుడు ప్రయత్నాలు చేస్తున్నాడు.

ఇటువంటి గొప్పగొప్ప ప్రయత్నాలు జరుగుతున్న యీ కాలంలో కూడా చాలా చాలా వెనుక బడ్డ అనాగరకులైన కొండ జాతివారు యింకా మన దేశములో ఉన్నారు. ఉత్తర హిందూ దేశములో ముండా, కోల్, సంతాల్ మొదలయినవారు మధ్య హిందూదేశంలో భిల్లులు, గోండ్ ఖోండ్, సవర మొదలయిన వారు, దక్షిణ హిందూదేశములో కురుంబా, పన్యన్ మొదలయిన కొండజాతులు వారు ఉన్నారు

ఈ కొండజాతుల వారి ఆచారవ్యవహారాలు మనము తెలుసుకుంటే ఒకానొకప్పుడు మానవులందరూ ఎలా జీవించేవారో మనము ఊహించడానికి వీలవుతుంది. కనుక మన ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న కొంత మంది అనాగరకులయిన కొండ జాతి వారిని గురించి తెలుసుకుందాము.

మన ఆంధ్రప్రదేశ్‌లో చెంచు, కోయ, సవర ఎరుక, ఏనాది, లంబాడీ మొదలయిన కొండజాతుల వారు ఉన్నారు. కాని వీరిలో ఎరుక, ఏనాది లంబాడీ జాతులవారు నాగరకులయిన పల్లెటూరి వారితోను, పట్నవాసము వారితోను యితర కొండజాతుల వారికన్నా ఎక్కువ పరిచయము చేసుకుని కాస్త నాగరకతను సంపాదించుకున్నందువలన యిప్పుడు వీరిని కొండ జాతులవారిగా కాకుండా, వెనుకబడ్డ జాతుల వారిగా మనము అనుకోవచ్చును.

చెంచు జాతివారు నల్లమల అడవులలోను, కృష్ణా నదిలో యల్లోను, ఎక్కువగా ఉంటున్నారు. దక్షిణమున కర్నూలు నుండి ఉత్తరమున శ్రీ కాకుళమువరకు అక్కడక్కడ యీ చెంచులు కనిపిస్తూనే ఉంటారు. వీరి నివాసము కొండలమీదనే. కొండల మీదనున్న అడవులలో దొరికేకాయలు, పళ్లు, తేనే మొదలయిన ఉపయోగకరమైన దినుసులను, చేరువలో ఉన్న పల్లెలకు, పట్నాలకు తీసుకునిపోయి, ఆక్కడ అమ్మి, వారికి కావలసిన బట్టలు ఉప్పు, మొదలయిన సామగ్రిని కొనుక్కొని పోతూ ఉంటారు. వీరు కూడా సవరలు, కోయలు కోదులులాగునే మొలచుట్టూ మాత్రం గుట్టలు కట్టుకుని అనాగరకులుగానే బ్రతుకు తున్నారు. వీరికి లిపి అంటూ లేకపోయినా ప్రత్యేకము బాష ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న కొండ జాతులలో ఎక్కువ మంది కోయలు. వీరు తూర్పు గోదావరి జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాలలోని అడవులలోను, ఒరిస్సాలోని మల్కనగిరి, తెలంగాణాలోని గోదావరి లోయల్లోను, బస్తరు అడవులలోను నివసిస్తున్నారు. వీరి ఆచారవ్యవహారాలు, వేషభాషలు చాలా వెనుకబడే ఉన్నాయి. వీరు చాలా అమాయకులు, స్నేహపాత్రులు.

కోయలకన్నా, చెంచులకన్నా ఎక్కువ వెనుక బడి ఉన్న వారు సవరలు, కొండ జాతులవారి అందరిలోను ప్రాచీనులు యీ సవరలు. అంతే కాదు కోల్, ముండా, సంతాల్, కోయ గదబ, మొదలయిన యీ కొండజాతులు వారంతా ఒకప్పుడు సవరలేనని, కాని వివిధ ప్రాంతాలలో నివాసాలు ఏర్పరచు కొనడంవలన వివిధ రకాల పేర్లు వీరికి వచ్చాయని చరిత్రకారుల అభిప్రాయము. వీరినిగురించి మనం వివరంగా తెలుసుకుంటే యితర కొండ జాతుల వారిగురించి మనము ఎక్కువగా తెలుసుకొనవలసిన అవసరము మనకు అంతగా ఉండదు. కనుక యీ సవరలు గురించిన వివరాలు ఎక్కువగా తెలుసుకుందాము

మనదేశంలో ఆదినుండి నివసిస్తున్న ఆదిమవాసులలో అతి ప్రాచీనులు యీ సవరలు. శ్రీ రాముడు సీతను వెతుక్కుంటూ లక్ష్మణునితో గూడా అరణ్యాలలో తిరుగుతున్నప్పుడు ఒక్క సవర స్త్రీ శ్రీరామునికి ఫలాలను ఆహారంగా పెట్టి భక్తితో నమస్కరించింది. ఆమె పేరు శబరి. అంటే శ్రీ రాముని కాలము నాటికే సవరలు ఉండేవారని మన పురాణములవలన మనకు తెలుస్తున్నది. ఈ సవరలను గురించి కథలు యింకా కొన్ని మన పురాణాలలో ఉన్నాయి

మన దేశచరిత్రను బట్టి చూస్తే పూర్వం వింధ్యపర్వతాలకు ఉత్తరము వైపునకు అటు గంగా నది వరకున్నూ, దక్షిణమున యిటు గోదావరి వరకున్నూ యీ సవరలు వ్యాపించి ఉండినట్టు తెలుస్తున్నది. వీరిలో కొంతమంది రాజ్యాధికారులుగా కూడా ఒకప్పుడు ఉండినట్టు తెలుస్తున్నది, ఒకసారి శ్రీకాకుళం (శ్రీకాకుళం జిల్లా) వద్ద ఒక దేవుడిగుడిపైన వీరు దండెత్తినట్టు ఒక శాసనం వలన తెలుస్తున్నది. సుమారు 1250 సంవత్సరాల క్రితం కామార్ణవ అనే కళింగ రాజు శ్రీ కాకుళం వద్ద శబరాదిత్యుడనే సవరాజును ఓడించినట్టు కొర్ని శాసనం వల్ల మనకు తెలుస్తున్నది.

మన పుణ్యక్షేత్రమయిన పూరీలోని జగన్నాధ స్వామిని ఒకప్పుడు యీ సవరలు అడవులలో పూజిస్తూ ఉండే వారట. తర్వాత పూరీ రాజయిన ఇంద్రజుమ్న మహారాజునకు యీ దేవుడు కలలో కనబడి తాను ఒక మానుగా మహానదిలో కొట్టుకు వచ్చి పూరీ వద్ద సముద్రంలో తేల్తానని చెప్పాడట. ఆ మానును విగ్రహాలుగా చెక్కించి తనను ఆరాధించమని చెప్పినాడట. పూరి రాజుకల నిజమయినది. ఒక పెద్ద మాను పూరీ వద్ద సముద్రంలో తేలగా ఆ రాజు దానిని శిల్పులచేత విగ్రహాలుగా చెక్కించ దలచాడే కాని ఏ శిల్పి ఆ పనిని చేయలేక పోయినాడు. చివరకు దేవుడే శిల్పి రూపంలో వచ్చి ఆ మానును మూడు ముక్కలుగా చేసి, తనకొక ప్రత్యేకమయిన గదిని యిస్తే ఆ గదిలో ఏకాంతముగా కూర్చుని మూడు విగ్రహాలను చెక్కగలనని చెప్పినాడట, పూరీ రాజు ఆ విధముగానే చేసినా, శిల్పి చెప్పిన వ్యవధికన్నా ముందుగానే ఆ గది తలుపులను తొందరపడి తెరవడం వలన ఆ శిల్పి మాయమయినాడట. విగ్రహాలకు సంపూర్ణమయిన ఆకారం ఏర్పడకుండా మొండిగా ఉండి పోయినవి.

అడవిలో తాము పూజిస్తున్న విగ్రహమే పూరీ క్షేత్రమునకు వేరు రూపములో వచ్చినట్లు సవరలు తెలుసుకుని పూరీ రాజుతో యుద్ధము చేయుటకు వచ్చినట్టు, తర్వాత ఉభయులు సంధి చేసుకుని కొన్ని షరతులు ఏర్పరచుకున్నట్టు ఒక కథ ఉన్నది. ఆ షరతులలో కొన్ని యిప్పటికీ ఆచారములుగా నిలచి ఉన్నవి. జగన్నాధస్వామి రథమును లాగుటకు సవరలు పేనిన మోకులనే యీ నాటికీ ఉపయోగిస్తున్నారు. తొలి రోజున సవరలే రథమును లాగ వలెను. ఆ దినమున జగనాధస్వామికి అర్పితమైన సమస్త భోజ్యములు యీ సవరలకు యివ్వ బడుతున్నాయి. ఈ కథను బట్టి సవరలు ఎంత ప్రాచీనులో మనం ఊహించ వచ్చును.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రవహిస్తున్న ముఖ్య నదులలో గోదావరి పెద్దది. ఈ 'గోదావరి' అన్న పేరు సవర భాషనుండే వచ్చినది. సవరదేశంలోనుండి ప్రవహించి వస్తున్న ఉపనది. 'శబరి' 'గోదా' నదిలో కలియడం వల్లనే 'గోదాశబరి' అయి 'గోదాబరి', 'గోదావరి'గా మారినది. సవర భాషలో 'గో' అంటే పెద్ద అనిన్నీ 'దా' అంటే నీరు అనిన్నీ అర్థం. సవరభాషలోని 'గోడా' తెలుగులో 'గోదా' అయినది.

ఉత్తరమున గంగానది దిగువనుండి, దక్షిణమున గోదావరి వరకు ఒకప్పుడు వ్యాపించి ఉండిన యీ సవరలు యిప్పుడు ఒరిస్సా రాష్ట్రంలో వంశధారానది ప్రాంతమున గుణుపురం,

(22 పేజీ చూడుడు)

కర్తవ్యము

శ్రీ కన్నెకంటి వీరభద్రాచార్యులు
(పల్నాటి సోదర కవులు)

హాయిగ నిద్రపోవు సమయమ్మిదియా! తొలికోడి కొక్కొరో
కో యని కూయుచున్నదదిగో? యవిగో యవిగో మహోదయ
చ్ఛాయలు క్రమ్ముకున్నవి దిశావలయమ్ముల నింకమేలుకొ
మ్మోయి! సహోదరా! కదలవోయి! జగమ్ము సముద్ధరింపఁగన్

లోకముఁ దీర్చిదిద్ది నవలోకన చేయు మహాప్రణాళికల్
నీకడనుండెనేడు! పయనింపుము దీక్షధరించి, వానినిం
జేకొని చిత్తశుద్ధిఁగృషిఁ జేసెదవేని సహోదర ప్రజా
నీకమునుద్ధరించెద వనేకవిధమ్ముల నోయువ ప్రభూ!

ఆకలమున్ భుజించుచు మహాటవులఙ్గిరి గహ్వరాదులన్
మూకలు మూకలై తిరుగు మూఢమతుల్ మనతమ్ములంత సు
శ్లోక చరిత్రులై మనుటచూడఁ దలంచెదవేని బాధ్యతం
గైకొని రమ్ముతోడు పడుఁగాక నిరంతరముం బ్రణాళికల్

నెలవులులేక వృక్షముల నీడలలో నివసించు సోదరుల్
కలరు భవత్ప్రదేశమునఁ గొంచుము వారలకిండ్లు వాకిళుల్
నిలిపెడి సూత్రముల్ కలవనేకములంచు బృహత్ప్రణాళికల్
తెలుపుచునుండె నింకవెనుదీయక చేయుము తత్ప్రయత్నమున్

వేలకుఁదిండిలేక పలవించుచునున్న యనాథబాలికల్
బాలకులెందరో గలరు పారఁగఁ జూడుము వారిసత్కృపం
బాలనఁజేసి పెంచఁగల బాటలనిల్పుము సోదరా! దయా
శీలుఁ డవై ప్రణాళికలఁ జేకొని తాతవచించినట్టులన్

కొరఁతలతోఁ దపించు నిరుగుంబొరుగున్ సవరించుటెట్లా? పే
దరికముతో శ్రమంబడెడి తమ్ముల వృద్ధికిఁదెచ్చు టెట్టులో

వరుసగ సత్ప్రణాళికలు వాకొనుచున్నవి మేలుకొమ్మిదే
తరుణము సోదరా! శతవిధమ్ముల దిద్దెద వీవులోకమున్

అవిరళ కీర్తిశాలులు మహామహితాత్ములు దేశనాయక
ప్రవరులు వృద్ధులైరి యిక భారము మోపుట పాడిగాదు గౌ
రవమునుగాదు. నీకు వివరంబొనరింతు సమస్త ధర్మముల్
యువజనసింహ! మేలుకొనుమోయి! ధరింతువుగాక దీక్షలన్

ఏ పనిముఖ్యమో? యెచటనెయ్యది చేసిన సౌఖ్యమో? ప్రజల్
చూపెడి పట్టులంగదసి చూచి గ్రహించి మితవ్యయమ్ముతో
నా పనిఁబూర్తి చేయఁ దగు? నట్టులచేయక పోయినన్ మహా
పాపము నీకుఁ జుట్టుకొను బాధ్యత కల్గినవాఁడవౌటచేన్

కలవు వనుల్ గనుల్-పసిఁడికంఁడలనిండి మహా తరుల్ గిరుల్
కలవు నదుల్ నిధుల్ కలవు-కమ్మని పంట లొసంగు రేగడల్
కలవు-ప్రణాళికల్ కలవు-కానదరిద్రముఁ బారద్రోలుటల్
సులభముగాదె! మేల్కొనుము సోదర! దేశమునుద్ధరింపఁగన్
పంటమాగాణియై ఫలితమ్మొసంగదా
నీరసించిన రాతినేలయైన
సౌదరాజంబైను సౌఖ్యంబునీయదా
కూలిపోయెడి పూరి గుడిసెయైన
అమరనందనవనంబై హాయిగూర్పదా
కడుభీతిఁ గొల్పుకారడవియైన
శ్రీమంతుఁడై యష్టసిద్ధులర్పింపఁడా
పస్తులుండి తపించు బక్కయైన
పంచవర్షప్రణాళికా ప్రగతినడిచి
యుందులభియించుచుందు సాయమ్ము వడసి
యభ్యుదయదీక్షఁదాల్చి సత్యముననిల్చి
తగినకృషి, జేసికొన్న? సోదరుఁడలెమ్ము
ఒకపనిఁబూర్తిచేయ వినియోగ పడంగల విత్తమున్ వికా
వికలొనరింపఁ బోక నెరవేర్పుము దానినిఁగానిచోఁ బ్రణా
ళికలు రవంతయైనను ఫలింపవు కీరితి దక్కవోదు నా
యకులకు-విశ్వసింపరు సుమానిను సోదరులింక నెన్నడున్

మరీచిక

శ్రీ మధురాంతకం రాజారాం

'ఉద్ధారకరారు మహాత్ములు' అంటారు. తీరని పనుల్లో నుంచి తీరిక కల్పించుకుని మామగారు హఠాత్తుగా వూడిపడటం ప్రకాశానికి ఆశ్చర్యం కలిగించడంలో అబ్బురమేమీలేదు. వస్తూ వస్తూ ఆయనొక్కరే వచ్చారుగూడా కాదు! తనవెంట శోభను గూడ తీసుకొచ్చారు. కానీ యిక్కడొక సందేహం ప్రకాశానికి. మామయ్య శోభను తీసుకొచ్చాడా, లేక శోభే తనవెంట మామ్యను తీసుకొచ్చిందా అని!

ఊళ్ళోకి కారురావడమైతే పొలంలో నుంచే చూశాడు ప్రకాశం. కానీ అది మామగారి కారని గుర్తించలేకపోయాడు ఎలాగుర్తించ గలడు! ఆకసంలో మబ్బులు మారినట్టు, ప్రకృతిపైన ఋతువుల ప్రభావం మారినట్టు మామయ్యగారి అభిరుచులు గూడా తరచుగా మారిపోతూవుంటాయి. క్రితం సారి (అనగా మూడు మాసాల నాడు) ప్రకాశం చూచినప్పుడు మామయ్యగారిది విష్ణుదేవుడి రెండో అవతారమైన ఆది కూర్మంలాంటి కారు. ఇప్పుడు ఊళ్ళోకి వచ్చింది అది కాదు. ఇది జర్రిపోతులాంటి సరికొత్తరకం కారు.

అయిదు నిమిషాలు గడవకముందే తమ్ముడు చంద్రం గసబోసుకుంటూ పరుగెత్తివచ్చి "అన్నయ్యా! వచ్చిందెవరో చెప్పుకోచూద్దాం" అన్నాడు.

"బడలిక కాస్తాతగ్గిన తర్వాత నువ్వేచెప్పు" అన్నాడు ప్రకాశం.

"ఎవరో అయితే నేనిలా దౌడు తీస్తూ వచ్చేవాడినేనా అన్నయ్యా! మామయ్యగారు శోభాదేవిగారితో సహా విజయం చేశారు" అన్నాడు చంద్రం.

ప్రకాశం విన్నాడు. కానీవిననట్టే చెరకునాటిన చాళ్ళకు నీళ్ళు కట్టుకోసాగాడు.

"అదేమిటన్నయ్యా! అమ్మనిన్ను నిల్చున్న పాళాన పరుగెత్తుక రమ్మన్నది.

ప్రకాశం నవ్వాడు అమ్మ ఆమాట చెప్పివుండదని ప్రకాశానికి తెలుసు. వచ్చిన బంధువులకు ఆమె తనంతటతానే ఆతిధ్య మర్యాదలు నెరపుకోగలదు. అందులో ఆమెకు తన తోడ్పాటు అనవసరం. కానీ చంద్రం వుద్దేశంవేరు. మామయ్యగారంతటి వారు శోభాదేవితో సహావిచ్చేసి తమగృహాన్ని పావనం చేస్తుంటే తానెదురేగి స్వాగత సత్కారాలు నెరపకపోవడం అనుచితమనీ, అసమంజసమనీ వీడిభావం!

"అలాగే వెళ్తాను గానీ నేను చేస్తున్నపని నువ్వు చేయాలిరా చంద్రం" అన్నాడు ప్రకాశం.

'ఓ, అదెంతపని' —అన్నట్టు పాంటు పైకెగ మడిచి పారందుకున్నాడు చంద్రం.

పట్టణంలో ఫిఫ్తుఫారం చదువుతూ సెలవుల్లో స్వగ్రామానికి వచ్చిన విద్యార్థి చంద్రం. ఐనా అతనిది నీరెండకు కోషిల్లిపోయే సుతిమెత్తని ప్రాణంగాదు పారచేతబట్టుకుని కాలువ త్రవ్వకానికి పూనుకుంటే జాముసేపు వంచిన నడుము పైకెత్తకుండా యిసుక త్రవ్విపోయగలడు చంద్రం. తలకుగుడ్డ చుట్టుకొని, ముందు మడక చేతికి తీసుకుంటే అతడు కోడెల్ని జవనాశ్వాల్లా పరుగెత్తించగలడు. ఆడివిలో ఆకుకొట్టి బండి కెత్తితే సొగసైన చంద్రం తప్పితే మరొకరు కూర్చోడానికి వీలేలేదు. ఈ ఒళ్ళుదాచుకోకుండా పనిచేయడమనేది చంద్రానికి వంశపారంపర్యంగా సంక్రమించిన సుగుణం.

వ్యవసాయానికి సంబంధించిన కార్యకలాపాలన్నింటిలోనూ చంద్రానికి శిక్షగురువు ప్రకాశం. పలక చేతికిచ్చి ఓనమాలు దిద్దబెట్టించినట్టే, పారా పలుగు చేతికిచ్చి ప్రకాశం తమ్ముణ్ణి పొలానికి పంపించాడు.

ప్రకాశం తమ్ముడి కిచ్చిన శిక్షణ మాటలరూపంలో గాదు అతడు చేసి చూపెట్టేవాడు. ఆమాటకొస్తే పట్ట పరీక్షలో అగ్రశ్రేణిలో ఉత్తీర్ణుడైన ప్రకాశం పల్లెటూరికి తిరిగివచ్చి, యిక్కడే

పాడుకోగలడని ఎవ్వరూ అనుకోలేదు. లాయరై రాష్ట్రముఖ్య నగరంలో బోర్డు కడతాడనుకున్నారు కొందరు. కాదుకాదు. ఫలానా కాలేజిలో లెక్చరరు కాబోతున్నాడనుకున్నారు కొందరు. అబ్బే లెక్చరరేమిటి, యిరవయ్యేళ్ళకల్లా బియ్యేముగించాడు గనుక అంత కంటే గొప్పకొలువే దొరక వచ్చునని ఊహాగానాలు జేశారు కొందరు. ఐతే అందరి ఊహాల్నీ తల్లక్రిందులు చేసేశాడు ప్రకాశం. కాలేజి వార్షికోత్సవాల్లో నాటకాలాడి బహుమతులు సంపాదించుకున్న ఉత్సాహాన్ని, క్రీడారంగంలో బ్యాటు చేబట్టి క్రికెట్టు బాలును బౌండరీలు దాటగొట్టిన ఉత్సాహాన్నీ, మాకే పార్లమెంటులో ప్రధాన మంత్రిగా ఎన్నికై ప్రతిపక్షసభ్యుల పిడి వాదాలను చిన్నచిన్న ఛలోక్తులతోనే చిత్తుచిత్తు చేసిన ఉత్సాహాన్నీ అలాగే తనలో ప్రోది చేసుకొనివచ్చి, బావిగట్టున మామిడి చెట్టు క్రింద నిల్చుని 'ఈ పొలంలో బంగారం పండించాలి' అనుకున్నాడు ప్రకాశం.

నోళ్ళు బారగిల తెరుచుకుని ముక్కుమీద వ్రేలేసుకుని, మూకీ భావంతోనే తమ ఆశ్చర్యాన్ని వెల్లడించుకున్నారు లోకులు.

'దూడలదుక్కి, పడచుల సేద్యం' అంటూ లోలోపల సంతృప్తిపడ జూచిన వాళ్ళు గూడా లేకపోలేదు. ఐతే మనసునూ శరీరాన్నీ ఆరోగ్యంగా వుంచుకుని, చిత్తశుద్ధతో కార్యోన్ముఖుడైన మానవునికి ఏవిద్య అయినా అసాధ్యం కాదు. కాదనే ఋజువు చేయగలిగాడు ప్రకాశం!

"హాలికులకు కుశలమా?" హాల్లో వాలుకుర్చీలో మేను వాల్చిన మాధవరావుగారు ప్రకాశం వైపు జాలిగా చూస్తూ పరామర్శించారు.

''జవాబు నీకు తెలిసిందేగద మామయ్యా! పద్యాన్ని చర్విత చర్వణం చేయడమెందుకు?" అన్నాడు ప్రకాశం.

"ఎందుకా! ఉండబట్టలేక" గిరుక్కున ముఖం మరో వైపుకు త్రిప్పుకున్నారు మాధవరావు గారు.

ప్రొద్దు పడమటికి వ్రాలి, ఎండ కాస్తా చల్లబడిన తర్వాత మామగారితో మాట్లాడ వచ్చుననుకున్నాడు ప్రకాశం. శోభతో మాత్రం ఎప్పుడంటే అప్పుడే మాట్లాడుకోవచ్చు. కాదంటే ఏమాత్రం వేడితగిలినా ఆపాలు పొంగి పోతుంది. పొంగినప్పుడల్లా కాసిన్ని మంచినీళ్ళు చిలకరిస్తూ వుండాలి. ఆకిటుకు ప్రకాశానికి బాగాతెలుసు!

కానీ ఎక్కడుంది శోభ? ఆమె మేడకు ముందువైపున తోటలో లేదు. పెరట్లోలేదు. వంటలక్కకు సాయపడుతున్న అమ్మనడిగితే "ఎక్కడుందో చూడారాబాబూ! నాకేంతెలుసు! నేనేమైనాకొంగులో ముడివేసుకున్నానా ఏమిటి?" అంటూ చిరునవ్వులు ఒలకబోసి ఆమె ప్రకాశాన్ని కాస్తా వుడికించడానికే పూనుకుంది. ప్రకాశం యిల్లంతా వెదికి చివరకు శోభను మేడపైన గ్రంథాగారంలో సంధించాడు.

సన్నగా అంచులు వచ్చి, అక్కడక్కడా చిన్నచిన్న పువ్వులు పూచి, వన్నెలో గులాబీ రేకులా తెలువారుతున్న వాయిల్ చీరకట్టుకొంది శోభాదేవి. అదిజాకెట్టో చోళీయో, కాక బ్లౌజో నిర్దిష్టంగా దాని పేరేమిటో ప్రకాశానికి తెలియదుగానీ ఆకంచుకం శోభాదేవి లావణ్యాలకు మరింత శోభనే సంతరిస్తోంది. ఆమెనుదుట మెరిసి పోతున్నది శుద్ధతదియ నాటి చంద్రరేఖ కాదు. చమ్కీ అద్దిన బొట్టు! మెడలో పచ్చల పతకం వ్రేలాడుతున్న తెల్లరాళ్ళనెక్లెసు. ఒక్కమాటలో చెప్పాలంటే అందాలకు మెరుగులు దిద్దుతున్న అలంకారాలు శోభాదేవివి! ఓక్షణం పాటు ద్వారం దగ్గరే నిలబడి పోయాడు ప్రకాశం. వెన్నెల్లో అద్దాల మహిదీ ఎదుట నిల్చున్నట్టుగా వుంది ప్రకాశం పరిస్థితి! కానీ ఆమైమరపు తృటిపాటులో చెదరిపోయింది. చెంపకు చేరందేసిగా వున్న ఆకళ్ళ కుదింపు, ముద్దమందారాల్లాంటి ఆపెదవుల బిగింపు, ముక్కుపుటాన ద్యోతకమౌతున్న చెమర్పు—యివన్నీ ప్రకాశానికి అతని వూహాకందని ఏదో వుగ్రోషానికి చిహ్నాలుగా మాత్రమే భాసిస్తున్నాయి!

"సుస్వాగతం శోభా! మాట మాత్రమైనా లేకుండా వచ్చేశావ్! వస్తావని తెలిసివుండే ఏవైనా ఏర్పాట్లు చేయడానికీ వీలుండేది..." అంటూ గదిలో ప్రవేశించాడు ప్రకాశం.

చల్లటి పలకరింపుగూడా శోభాదేవికి కోపకారణం కాగలదని ఎవ్వరనుకోగలరు!- ''మాటలు నేర్చావులేబావా! ఏం ఏర్పాట్లు చేసేవాడివి? లేదంటే మేళగాళ్ళని రప్పించి పూరేగించే వాడివేమో! అంతేగదూ!" దురుసుగా నాలుగు మాటలు వడ్డించి, అంతటితో బదులుకు బదులు తీర్చుకున్నంత తృప్తిగా గోడవైపు చూస్తూ కూర్చుంది శోభ.

"ఆముచ్చటపైన నీకంతగా మనసుంటే కాదనడానికి నేనెవర్ని శోభా!" చిరునవ్వును పెదవుల చివళ్ళలో నొక్కి పట్టుకుంటూ అన్నాడు ప్రకాశం.

తటాలున తల పైకెత్తింది శోభాదేవి! ప్రకాశం గూడా తన వైపు ఓర చూపులు బరపుతున్నాడు. చూపులొందొంటితో కలుసుకున్నాయి శోభాదేవి తలదాచుకుంది. ఆదించుకోడంలో ఆమెకు తన ఓటమి స్ఫురించి ఈ విధంగా మాట్లాడుతూ కూచుంటే ఈ

మనిషిని జయించలేమబ్బా—అనిపించిందేమో, వెంటనే విషయాంతరం లోకి వచ్చేసింది.

"అబ్బబ్బ, ఈ గదిలోకి గాలైనా రాదు. ఎలా కూర్చుంటావో మరి! పైగా ఈ పుస్తకాల వాసనొకటి. చదువుకున్న వాడిదేనన్న విషయాన్ని ప్రదర్శించడానికి కాకపోతే ఎందుకు బావా యిన్ని పుస్తకాలు?" ముఖంపైన క్రమ్ముకుంటున్న స్వేద బిందువుల్ని తుడుచుకుంటూ, 'యిక దీనికేం చెబుతావో చెప్పమన్నట్టుగా సర్దుకుని కూర్చుంది శోభా దేవి.

కిటికీ తలుపులు తెరిచి గాలిని లోపలికి ప్రవేశపెట్టడం ద్వారా శోభచేసిన ఆరోపణలో పూర్వార్థాన్ని పూర్వ పక్షం చేసి, ఉత్తరార్ధానికి మాత్రం జవాబు చెప్పదలచుకున్నాడు ప్రకాశం. "ఈ పుస్తకాలు ప్రదర్శనం కోసమేనని నువ్వు భావించడంలో తప్పేమీ లేదు శోభా! అసలు మానవజీవితమంతా ప్రదర్శనార్థమే నన్న భావం బలపడిపోతోంది. చదువు సదసద్వివేకం కలిగించి ఆత్మవికాసానికి దోహదకరం కావడానికిగాదు. సంపద గంగా ప్రవాహంలా ప్రవహించి పాపంలాంటి లేమిని క్షాళనం చేయడానికి గాదు, అంగ సౌందర్యం విలువైన వస్తువులా దాచుకోడానికికాదు. అన్నీ బడాయి కోసమే! నువ్వు మహోన్నతమైన జీవిత విధానంగా భావిస్తున్న దానిలో నుంచీ ఈ ప్రదర్శనాన్నీ ఈ బడాయినీ మినహాయిస్తే మిగిలేదేమైనా వుంటుందా శోభా! ఉండదనే నా విశ్వాసం!"

"నువ్విలాంటి అనాగరికమైన బ్రతుకును ఎన్నుకున్నది అందుకేనాబావా?" అమాయికత్వాన్ని అభినయిస్తూ అడిగింది శోభ.

ప్రకాశం మళ్ళీ ఒకసారి నవ్వక తప్పిందిగాదు శోభ తనను అనాగరికుణ్ణిగా భావించడంలో విడ్డూరమేమీ లేదు. ఆమె ఉద్దేశాన్ని అనుసరించి నాగరిత ఫ్యాన్సీ షాపుల్లోని అద్దాల బీరువాల్లో విక్షిప్తమై వుంటుంది, హేరాయిలు బాటలును బ్రద్దలుచేసి, ఫేసు పౌడరు డబ్బాను చితకగొట్టి, పెదవులపైన రంగు తుడిచేస్తే అంతటితో ఆ నాగరికత ఆఖరు! అలాంటి బుద్బుదప్రాయమైన నాగరికతపట్ల ప్రకాశానికి జాలి మాత్రమే కద్దు. మోజు లేదు.

శోభ ఏదో పనివున్నట్టు లేచి క్రిందికి వెళ్ళిపోయింది. పది పదిహేను నిమిషాలు గడచిపోయిన తరువాత ప్రకాశం ఆలోచనలోనుంచీ తేరుకుని క్రిందికి దిగి వచ్చేసరికి ఆమె పట్టె మంచం పైన బోరగిల పడుకుని కాగితపుటంచులకు ఎరుపు రంగు పూసిన అపరాధ పరిశోధక నవలలో లీనమైవుంది.

ప్రకాశం నిట్టూర్చాడు. శోభకు తన గ్రంథాగారం ఎలా రుచిస్తుంది మరి? పది పేజీలు చదివేలోగానే హత్య జరిగిపోవాలి. ఆపైన అనుమానం ఒకరిపైనుంచి మరొకరిపైకి వెళ్తూ వచ్చి చివరకు అనుమానించడానికి బొత్తిగా వీల్లేని వ్యక్తి హంతకుడుగా ఋజువుకావాలి ఊపిరి బిగబట్టి ఉద్వేగంతో వుక్కిరి బిక్కిరౌతూ పుస్తకంలోని పుటలవెంట కళ్ళనూ, మనసునూ పరుగెత్తించి నందుకు హంతకుడెవరో తెలియడమే ప్రతిఫలం. చదివిన తర్వాత ఒకటి రెండు రోజుల వరకూ ఎవరు పిలిచినా వులికి పడుతూ, ఏ నీడ కనిపించినా అదిరి పడుతూ ఉత్త పుణ్యానికి బెంబేలు పడిపోవడమే ఫలశ్రుతి!

"ముత్యాలు రాలిపోతాయన్న భయం లేకపోతే ఆ చదివే దేమిటో బలంగానే చదవగూడదా శోభా! నేనూ కాసేపువింటాను" అంటూ మంచంపైన ఓ వారగా కూర్చున్నాడు ప్రకాశం.

"బిగ్గరగా చదడవడానికిదేమైనా భారతమా, భాగవతమా!" అంటూ మంచం అంచుకు జరుక్కుని, క్రిందికి జారిపోబోయింది శోభాదేవి.

"ప్రమాదం, ప్రమాదం! అంతగా యిష్టం లేకపోతే దూరంగా వెళ్ళిపొమ్మనగూడదా శోభా!" అంటూ క్రిందికి దిగేశాడు ప్రకాశం.

"ఇది మరీ బాగుంది! మీ యింటికి వచ్చి నిన్నే దూరంగా వెళ్ళిపొమ్మనడమా!" బుంగ ముఖం పెట్టి ప్రకాశం వైపు కొరకొర చూపులు చూచింది శోభ.

"ఇదిగో ప్రకాశం! మామయ్యను స్నానానికి రమ్మను. అన్నట్టు శోభ ఎక్కడ?" అంటూ గది గుమ్మం దగ్గరికి వచ్చి నిల్చుని "రావమ్మా శోభా! వడ్డించడమైనా నీ చేతనౌతుందో కాదో చూడాలి" అంది పార్వతమ్మ.

"ఆ పనిగూడా నువ్వే చేసేస్తే, మిగిలిన కార్యక్రమాన్ని శోభాదేవిగారు సలక్షణంగా నిర్వహిస్తారు లేవే అమ్మా!" అంటూ గొల్లున నవ్వేశాడు ప్రకాశం.

భోజనాలు పూర్తయ్యేసరికి ఒంటిగంట కావచ్చింది. ఇంటిల్లిపాదీ పడుకుని పైకి లేచేసరికి గంట మూడు దాటింది. పాలేరును వెంటబెట్టుకుని వెళ్ళి చంద్రం కొట్టించి తీసుకొచ్చిన తాటికాయలను చూడగానే మాధవరావుగారికి ప్రాణాలు లేచి వచ్చాయి. "అమ్మాయ్ శోభా! సూక్ష్మంలో మోక్షంగా కానీ ఖర్చయినా లేకుండా చంద్రం ఉపాహారం సిద్ధపరిచేశాడు. ఎలాగైనా

పల్లెటూరివాళ్ళు తెలివైన వాళ్ళు!" అంటూ ఆయన తాటిముంజలు కబళించడంలో నిమగ్నులయ్యారు.

అంతలో మంచినీళ్ళుదుత్తలంతేసి ఎడనీరు బొండాయలతో చిన్న పాలేరు ప్రత్యక్షమయ్యాడు.

కమ్మని ఎడనీటిని కడుపునిండుకూ ఆస్వాదించి గర్రున తేన్చారు మాధవరావుగారు.

బయట వడగాడ్పుల ఉధృతం కాస్తా తగ్గేసరికి లోపల పార్వతమ్మ పళ్ళెరాలనిండుకూ పకోడీలను గ్లాసులనిండుకూ కాఫీని హాజరు పరిచింది

మాధవరావు - రు నోరు విడిచేశారు. "ఇలాగైతే మనం ఆరోగ్యంగా యిల్లు చేరుకోడం సందేహమేనమ్మా శోభా! లేక పోతే ఈ చిరుతిండ్లు ఒకదాని తరువాత ఒకటిగా యిలా ప్రత్యక్షమయ్యేవేనా? కానీ, ఏం చేద్దాం మరి! వాళ్ళు ప్రియంగా తీసుకొస్తే మనం వద్దని చెప్పలేము గదా!" కొత్తిమేర ఘుమాయింపులతో నోరూరిస్తున్న పకోడీలపట్ల ప్రలోభపడకుండా వుండలేకపోయారు మాధవరావుగారు!

"అలా పొలాలవైపు వెళ్లొద్దాం, వస్తావా మామయ్యా"! అంటూ మాధవరావుగారిని కదిపి చూచాడు చంద్రం.

"నన్నిలాగే ఈ వాలు కుర్చీలో సేద తీరనివ్వురా చంద్రం! శోభకీయింట్లో ప్రొద్దుపోవడం లేదేమో పాపం, వస్తుందేమో అడిగి చూడు..."

టాయిలెట్ చేసుకుని వాహ్యాళికి సిద్ధంగానే వుంది శోభాదేవి.

"ఫ్లాస్కులో పోసివుంచాను. మీ బావకు కాఫీ తీసుకెళ్తావటమ్మా శోభా!" మెత్తగానే ఓపని పురమాయించింది పార్వతమ్మ.

"ఎందుకులేవదినా! ఫ్లాస్కు నేనే తీసుకొస్తానుగానీ నువ్వు నీ ఎత్తు మడమల బూట్లతో గనుమలమీద పడిపోకుండా నడిస్తే చాలు..." ఫ్లాస్కును భుజానికి తగిలించుకుని ముందుగా దారి తీశాడు చంద్రం.

సంధ్యా సమయం కన్నులకు పండువుగా వుంది. ఎండల మూలంగా బడలిపోయిన ప్రాణాలకు హాయిని గొలుపుతూ పైరు గాలి చల్లగా వీస్తోంది. ఊరు దాటుకోగానే పంట పొలాలు. ఆ పొలాల్లోబడి అర ఫర్లాంగు దూరం నడవగానే ఓ చిన్న యేరు. ఏటిగట్టున కొబ్బరితోట. "ఇక్కడినుంచీ మన పొలాలు ప్రారంభమౌతాయి వదినా! గుర్తుంచుకో. ఎందుకైనా మంచిది" అన్నాడు చంద్రం.

ఏపుగా పెరిగి చలువ పందిరిలా క్రమ్ముకున్న కొబ్బరి చెట్లలోనుంచీ, సన్నగా మెలికలు తిరుగుతూ వెళ్తున్న కాలిబాట వెంట శోభాదేవిని నడిపించుకపోతున్నాడు చంద్రం ఏ లగ్నాన పుట్టాడోగానీ వాడి నోరు క్షణం సేపైనా వూరుకోదు. దారి పొడుగునా అతడి లెక్చరు నిర్విరామంగా సాగిపోతోంది. ఈ చెట్టుంది చూచావా వదినా! ఇది మన తోటలో కల్లా పొడుగాటిచెట్టు. ఒకసారి మా చిన్న పాలేరుతో పందెం వేసుకుని ఈ చెట్టుపైకి ఎగబ్రాకేశాను ఎక్కడినుంచీ చూచాడోమరి, అన్నయ్య పరుగెత్తుకొచ్చేశాడు. నేను మెల్లగా క్రిందికి దిగడమేమిటి, అన్నయ్య నా తలపైన వేడి వేడిగా నాలుగు మొటికలు వడ్డించడమేమిటి రెండూ ఒక్కసారిగా జరిగాయి. భద్రంగా చూచిరా వదినా! ఒకసారి నేనూ నీలాగే ఆకాశం కేసి చూస్తూ నడిచి యిక్కడ కాలు జారి బురదలో దబ్బున పడిపోయాను. ఇదిగో, యిక్కడనుంచీ మన మామిడి తోపు అదిగో, అదే మన మిషను బావి. బావిలో నీలావుకొరమీనులున్నాయి వదినా! చూద్దువురామరి!"

"పోయిన వేసవిలో మేము మహాబలిపురం వెళ్లొచ్చాము. చంద్రం! నీలాగే మాకొక గైడ్ దాపురించాడు" చిరాకుతో ఓ చురుక తగిలించింది శోభా దేవి.

ఉత్సాహం కాస్తా చప్పబడిపోయిందేమో, చంద్రం నడకలో గూడా శోభాదేవికి వెనుకబడిపోయాడు.

బావిదగ్గరికి రాగానే అదే తన గమ్యస్థానమైనట్టు గానుగ చెట్టు క్రింద నిల్చుని చుట్టూర కలయజూడ సాగింది శోభాదేవి.

అవులిస్తే ప్రేవులు లెక్కపెట్టగలడు చంద్రం. "అన్నయ్య కోసమా వదినా! ఉండుండు. ఇప్పుడే పంపిస్తాను..." ఫ్లాస్కును గానుగ చెట్టు కొమ్మకు తగిలించి అతడు విహంగంలా తుర్రున పారిపోయాడు.

నీటిలోనుంచి బయట పడినచేపలా క్రొత్త పరిసరాల మధ్య ఒంటరిగా నిల్చుంది శోభాదేవి. ఓ వైపున కనుచూపు ఆనినంత వరకూ పచ్చటి తివాసీలా వున్న పైరు పచ్చలు, మరోవైపున పశ్చిమాకాశానికి అడ్డంగా కొబ్బరి తోటలు, రసాల వనంలోంచి వినిపిస్తున్న కోయిల కూత, సంధ్యా సూర్యుడి సువర్ణ కాంతులు, క్రొత్త ప్రపంచంలా భాసిస్తున్న ఆ ప్రదేశంలో ఒకటి రెండు నిమిషాల పాటు అవకురాలై నిల్చుండిపోయింది శోభాదేవి.

"వచ్చేశావా శోభా! ఈ రోజు సాయంత్రం ప్రకృతియింత

అందంగా వుందేమిటా అనుకున్నాను. కారణం చంద్రం చెప్పగా తెలిసింది." నడుముకు చుట్టుకున్న ఉత్తరీయాన్ని తీసి పచ్చికపైన పరుస్తూ "కూర్చో శోభా! సృష్టి సౌందర్యాన్నంతా ఈరోజే తనవి తీరేటట్టుగా చూచేస్తే, యింక రేపటికేమి మిగిలే టట్టు?" అన్నాడు ప్రకాశం.

"సృష్టిలోకెల్ల చిత్రమైన వాడివి బావా నువ్వు! నిన్ను చూస్తుంటే చాలు. ఇంకా సృష్టినిగూడా చూడాలా ఏమిటి?" ఉత్తరీయాన్ని భుజాల పైన పూలదండలా వేసుకొని పచ్చికపైన కూలబడిపోయింది శోభ.

"అదేమిటి శోభా! నీనోటంట అపూర్వమైన మాటలు వింటున్నాను. నాలో ఏం చిత్రం కనిపించింది నీకు?" విస్మయంతో ప్రశ్నించాడు ప్రకాశం.

"లేకపోతే యిదేం బ్రతుకు బావా! ఏముందిక్కడ? మరి కొంత సేపటికి చీకటి పడిపోతుంది. చీకటిలో ఈ చెట్లు, ఈ తోటలు జడలు విప్పుకున్న దయ్యాల్లా కనిపిస్తాయి. నడవడానికి దారైనా కనిపించదు. ఇందాకా నేను వీధిలో నడచి వస్తుంటే నన్నొక వింత మృగానికి మల్లే చూచారు ఎవరినో సాధించాలన్న హఠం కాకపోతే, యిక్కడ దేన్ని చూచుకొని బ్రతుకుతున్నావు బావా నువ్వు!"

ప్రకాశం తలవంచుకుని కూర్చున్నాడు. శోభకు బదులు చెప్పడమైతే సులభమే! కాని ఆ జవాబు ఆమెకు రుచిస్తుందన్న నమ్మకం మాత్రం తనకు లేదు. ఐనా ప్రయత్నించడం తనవిధి ..

మళ్ళీ కొనసాగిస్తోంది శోభ. "నువ్వు ఋషీశ్వరుడిలా కాలం గడప తలచుకుంటే. మేము నీకు తపోభంగం కలిగించాలన్న దురుద్దేశంతో వచ్చా మనుకోవద్దు బావా! మేమేదో చుట్టపు చూపుగా వచ్చాము. రేపు ఉదయాన్నే వెళ్ళిపోతాము నువ్వూ. నీ పొలాలు క్షేమంగావుంటే మాకదే చాలు!"

"చూడు శోభా! ఒతండ వాదమని ఆదిలోనే కొట్టి పారేస్తే నేనేమి చెప్పలేను. వినదగు నెవ్వరు చెప్పిన—అన్నారు. శ్రద్ధగా వినాలి నువ్వు. అలాగని నేను గహనాతి గహనమైన విషయమేమి చెప్పబోవడం లేదు..."

"ఉపోద్ఘాతం చాల్లే బావా! నేనేమో సావధానంగానే వున్నాను." వేగిరించింది శోభ

"మానవులు కూపస్థ మండూకాల్లా బ్రతికిన రోజులు కాల గర్భంలో కలిసి పోయాయి ప్రతి సామాన్య మానవుడి బ్రతుకు లోనికీ కాంతినీ, శాంతినీ తేవాలన్న ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ మార్పు నీకళ్ళకు కనిపించడం లేదా శోభా?"

"మూర్ఖురాలనండీ బావగారూ! మరికొంత వివరంగా సెల వివ్వాలి..."

"అందమగు చోట సర్వమూ అందమే శోభా! ఉడుకు మోత్తనంలో గూడా నువ్వు భువన మోహనంగా వున్నావు." ఓపింత సేపు గలగలా నవ్వేశాడు ప్రకాశం.

ఈసారి మరింత నెమ్మదిగా ప్రారంభించాడు ప్రకాశం. "వివరంగానే చెబుతాను శోభా! ఈ చెట్టుంది ఇది ఎక్కడైతే పుట్టిందో, ఏ భూమిలో నుంచీ సత్తువను పీల్చుకుని పెరిగి పెద్దదైందో ఆ భూమికే తన నీడను ప్రసాదిస్తోంది. ఈ మాత్రం నిజాయితీ లేకపోయిన తరువాత మానవుణ్ణి ఏమనాలో నాకు తోచదు. నీ తోడి వాళ్ళ బ్రతుకులోకి యించుక కాంతి తేలేక పోయిన తర్వాత నువ్వు చదివేం లాభం? నీ చుట్టూరా వున్న వాళ్ళని అసహ్యించుకుని, వాళ్ళకు దూరంగా వైదొలగి కూర్చుంటే యిక నీ సంస్కారానికి ఎక్కడి మూల్యం? చూడు శోభా! మా నాన్న యిక్కడే బ్రతికాడు. మా తాతయ్య యిక్కడే బ్రతికాడు వాళ్ళు తామూ తిన్నారు. పది మందికీ పెట్టారు. వాళ్ళెలా బ్రతికారు? ఈ భూదేవిని నమ్ముకునే బ్రతి రు. తనను తీసుకెళ్ళి పరులకు అమ్మకో వద్దని కవితో మొర పెట్టుకున్నదట సరస్వతి. రైతుబిడ్డ వూరు వదలి పెట్టి దేశాలపై బడితే భూదేవి మాత్రం కంట నీరు పెట్టుకోదా శోభా?"

"అలాగైతే కలుగులో ఎలుకలాగ రోజులు వెళ్ళదీయడమే నీ జీవితానికి పరమార్థమా బావా?"

"అదిగో, నాకూ నీకూ పేచీ రావడమల్లా అక్కడే శోభా! కలుగులో ఎలుకలా బ్రతకడం కాదు. ఆధునిక విజ్ఞానం మానవుడికి ప్రసాదించిన వరాలను మోసుకొచ్చి పల్లె సీమను వెలుగు వెల్లువల్లో ముంచడమే నా ధ్యేయం. మా తాతయ్య ఈ బావి క్రింద 'రామన్న రామా' అన్న పదం పాడుకుంటూ తొలి కోడి కూత నుంచీ మధ్యాహ్నం ప్రొద్దు తిరిగేదాకా మోట తోలుకునే వారు కాని మర నొక్కగానే పాతాళ గంగను పైకి తీసుకొచ్చే విద్యుత్తు నాకిప్పు డిక్కడ సేవలు చేస్తోంది. అక్కడ మీ పట్టణంలోనే గాదు, యిక్కడ మా మేడలో గూడ రేడియో పాడుతుంది. ప్రపంచ వార్తల్ని మోసి తెచ్చే దిన పత్రిక ఉదయం నేను లేవక ముందే కిటికీ గుండా నా గదిలో పడుతుంది. మా వూళ్ళో యువ జన సంఘముంది. రీడింగు రూముంది. పిల్లలాడుకునే పార్కుంది. చేయవలసిన పనులింకా చాలా వున్నాయని మాకు తెలుసు. రోము

నగరం ఒక్క రోజులోనే నిర్మింప బడిందా శోభా? వేదిక పైన నిల్చుని ఆడవాళ్ళకు హక్కులవసరమని ఉపన్యాసము వర్షిస్తే సరి పోయిందా శోభా? ఇక్కడికి వచ్చి చూడు దరిద్రం వల్ల నైతే నేమి, తరతరాలనాటి సంకుచిత సాంసారిక వాతావరణం వల్ల నైతేనేమి, మ్రగ్గిపోతున్న ఆడవాళ్ళకు కాస్త ఉల్లాసాన్ని కలిగించు. తీరిక సమయాల్లో వాళ్ళకు వ్రాయడానికీ చదవడానికీ నేర్పించు. మానవ సేవ అన్న పేరుతో నేను డాబులు చెబుతు న్నాననుకుంటున్నావా శోభా? ఆ విధంగా లోక ప్రతారణం చేయ వలసిన అవసరం నాకేమీ లేదు. ఈ జీవితంలో నా కానందం వుంది ఉట్టిలో వెన్న ఉండగా నెయ్యికోసం వూరిపైకి బయల్దేరిన వాడిని ఏమంటారు? పిచ్చివాడంటారు. నేను పిచ్చివాణ్ణిగా చలా మణీ గావడమే నీ అభిమతమా శోభా?"

"ఎందుకులే బావా! నీ మనసులో వున్న వుద్దేశం వేరు, తెగేదాకా లాగితే తాడు తెగిపోతుందని నీకు తెలుసు. నువ్వదే పని చేస్తున్నావు..."

ప్రకాశం నిర్ఘాంతపోయాడు. "తెర్ల తేరకు అభాండంగూడానా శోభా! అవసరం వచ్చింది గనుక తేట తెల్లంగా నా మనసును ఆవిష్కరించుకుంటున్నాను. ఇక్కడ నీకు విరుద్ధమైన శక్తులేవీ పనిచేయడం లేదు. మా అమ్మకు నువ్వంటే ప్రాణం. ఇక చంద్రం సంగతి సరేసరి. ఎటొచ్చీ నేనే కాస్త చెడ్డవాణ్ణి పట్టిన కుందేటికి మూడే కాళ్లనడం నా స్వభావం..."

"ఆ మొండితనంలో మా నాన్నగారు మాత్రం నీకు తీసి పోతారనుకుంటున్నావా బావా?"

"మామయ్యకు స్వంత అభిప్రాయాలు గూడా వున్నాయా శోభా? అత్తయ్య ఎటు మొగ్గితే ఆయనచే మొగ్గేస్తాడు. ఉత్త పుణ్యానికి ఆయనను తీసుకొచ్చి మధ్యలో యిరికించడం అన్యా యం..."

"ఇంత దూరం వచ్చాక చెప్పక తప్పుతుందా బావా? ఈ వూరు నా పాలిటికి చెరసాలలా కనిపిస్తుంది. నాకు సొసైటీ కావాలి. వినోదం కావాలి. ఈ మట్టి మనుష్యుల మధ్య బ్రతకడం నాచేత గాదు..."

ఒకటి రెండు గడియలకు మునుపే సూర్యుడస్తమించాడు. కానరాని ద్వారాల్లోనుంచి చీకట్లు పొంగి పొరలి వచ్చి లోకాన్ని కావిలించు కుంటున్నాయి. ఇటు ప్రకాశమూ, అటు శోభా యిద్దరూ గూడా చిన్నబోయిన అవనతవదనాలతో కదలకుండా కూర్చు న్నారు.

"ఫ్లాస్కులో కాఫీవుంది తీసుకోనేలేదా అన్నయ్యా!"

చంద్రం పలకరింపుతో తల పైకెత్తి "ఇప్పుడేం కాఫీలేరా చంద్రం! నువ్వు శోభను యింటికి తీసుకెళ్ళు. నేనలా నిమ్మతోట దాకా వెళ్ళి కొన మడిలో నీళ్ళున్నాయో లేదో చూచి వస్తాను" అన్నాడు ప్రకాశం.

ప్రకాశం యిల్లు చేరుకునే సరికి ఎనిమిది గంటలైంది. కుర్చీ ఆరుబయట వేయించుకుని అతడి రాక కోసం వేచివున్నారు మాధవరావుగారు.

"కూర్చోరా ప్రకాశం! నీతో కొంచెం మాట్లాడాలి." ప్రకాశం లోపలికి రాగానే ఆయన ఉపక్రమించారు.

"భోజనమైన తరువాత తీరిగ్గా మాట్లాడుకో గూడదా మామయ్యా!"

భోజనాలయ్యేదాకా ఓపిక బిగ పట్టుకున్నారు మాధవరావు గారు. ఆయన సాధారణంగా సంసారానికి సంబధించిన విషయాలను గురించి తలపెట్టరు. తలపెడితే తాడో పేడో తేల్చుకునేదాకా నిద్రపోరు.

"పనులన్నీ వదిలిపెట్టి నేనింతదూరం రావడమెందుకో ఎరుగుదువా ప్రకాశం?" మళ్ళీ ఆయన ముగ్గులోకి దిగేశారు.

"చెప్పకముందే తెలుసుకోడానికి నాకేమైనా జోతిష్యం తెలుసునా మామయ్యా!" ఆశ్చర్యం ప్రకటించాడు ప్రకాశం.

"తెలియదు గనుకనే చెబుతున్నాను. అవకాశాలు మనం దొరకమన్నప్పుడల్లా దొరుకవు. దేనికైనా అదృష్టం కలసిరావాలి. ఇప్పుడు మనకు కలసి వచ్చిందదే! ప్రారంభంలోనే రెండు వందలా యాభై రూపాయల జీతం. త్వరలోనే ప్రమోషను. చూద్దాంగిద్దామని తటపటాయించడానికీ వీల్లేదు. అపాయింట్ మెంటు ఆర్డరు చేతికి వచ్చినట్టేననుకో! నాలుగో నాటికల్లా ఉద్యో గంలో చేరిపోవాలి..."

ప్రకాశం సాభిప్రాయంగా తల్లి వైపు చూచాడు "ఇల్లూ వాకిలీ వదిలిపెట్టి ఉద్యోగానికి వెళ్ళవలసిన గ్రహచారం ప్రకాశా నికి ఏమొచ్చిందన్నయ్యా!" అంది పార్వతమ్మ.

"ఈ యిల్లూవాకిలీ రెక్కలు గట్టుకుని పైకెగిరి పోవు గాని, నువ్వూరుకో చెల్లెమ్మా!" అంటూ పార్వతమ్మ నోటికి తాళంవేసి, "ఏమంటావు ప్రకాశం!" అని నిలదీసి అడిగారు మాధవరావు గారు.

"అనడానికేముంది మామయ్యా! అమ్మ చెబుతున్న మాట గూడా అంత తేలిగ్గా కొట్టి వేయదగిందిగాదు..."

"మిగిలిన వాళ్ళమాటల్ని మాత్రం పూచిక పుల్లకన్నా హీనంగా తీసి పారవేయ వచ్చునట్రా ప్రకాశం! మాదేం పోయింది గానీ నువ్వొక్కడే ఊళ్ళేలు. చెప్పడం నా బాధ్యతగనుక, యింత దూరం పనిగట్టుకుని వచ్చానుగానీ, నువ్వీమురికి దిబ్బపైన త్రుప్పు బట్టిపోతేమాకేమీ యిబ్బంది లేదురా అబ్బాయీ! .. ఒరే చంద్రం అ డ్రయివరు ఎక్కడ పడి వున్నాడో చూడు లేపి కూర్చోబెట్టి ఉదయం నాలుగింటికే బయల్దేరాలని చెప్పు..."

నిశ్చింతగా వాలు కుర్చీలోనే నిద్ర పోయారు మాధవరావు గారు.

*　　*　　*

"మా అమ్మాయి నీకు చేదైపోయిందటరా ప్రకాశం. పోనీలే నాయనా! మాకు దగిన సంబంధాలు మాకు దొరక్కపోవు..." రుసరుసలాడింది అత్తయ్య.

ఆవిడకేమని బదులు చెప్పాలో తోచక ప్రకాశం నవ్వు కున్నాడు. అచ్చమైన అబద్ధాన్ని తిరుగులేని సత్యంలా చెప్పగల గడం అత్తయ్యకే చెల్లు! ఆమెతో వాగ్వాదానికిది సమయమూ గాదు, సందర్భమూగాదు

ఇల్లంతా హడావిడి వుంది, దేశీయ, విదేశీయ జంత్ర వాయిద్యాల కలగలుపు సినిమా సంగీతం మాధవరావుగారి మేడలో జరుగుతున్న సంబరానికి చౌకాగా తయారై అనవ్య ప్రచారం సాధించి పెడుతోంది ద్వారాలకు మామిడాకుల తోరణాలు, విందు జరగబోతున్న హాల్లో పైకప్పు కనిపించకుండా రంగు కాగితాల అలంకారాలు. మేడ క్రిందికీ పైకి చెదదిరుగుతున్న నౌఖర్లు! ఈ సందడి కంతా తలమానికం అత్తయ్య ఆవిడ సర్కసు ప్రద ర్శనంలో మేనేజరులా యిల్లంతటా తానై వీర విహారం చేస్తోంది. "ఒరే రాయుడూ! తివాసీ ఎక్కడ? ఒసేవ్ సుబ్బలక్ష్మీ! వెండి గ్లాసు లేవీ? అయ్యా గుమాస్తాగారూ, కిళ్ళీలకు ఆర్డరిచ్చారా, లేదా? అదేమిటి ప్రకాశం! నీ కెందుకు నాయనా నిలువుగాళ్ళ శిక్ష? ఏదో ఓపరికం లేకపోయినా యిలా అల్లాడుతున్నాను. అల్లా డకపోతే మాకెవరున్నారు? ఇదిగో సుబ్బలక్ష్మీ! ఇంటికొచ్చిన బంధువుకు కాఫీ తీసుకొచ్చి యివ్వాలని తెలియదూ నీకు? నువ్వె క్కడ పెడితే అక్కడ శిలా విగ్రహమైపోతావే బంగారు తల్లీ! మొదట ఓలోటానిండుకూ కాఫీ తీసుకొచ్చి ప్రకాశానికివ్వు. మందీ మార్బలం లేనివాళ్ళం బాబూ, మర్యాదలు సరిగ్గా జరగలేదను కోకు..."

అత్తయ్యపట్ల సానుభూతి మాత్రమే కగిలింది ప్రకాశానికి ఆవిడమరేం చేస్తుది? బోలెడు ఆస్తిపాస్తులు కలలోనైనా ప్రాతి కూల్యం ప్రకటించని భర్త. ఒక్కగానొక్క కూతురు. ఆకూతురు ముద్దూ ముచ్చటలు ఆవిడ గాకపోతే మరెవరు చూస్తారు?

సుబ్బలక్ష్మిలోటానిండుకూ కాఫీ తీసుకొచ్చింది. పంచ కోల కషాయంలా వున్న కాఫీని అవలీలగా జుర్రేశాడు ప్రకాశం. ఈ కాఫీ ఏనాడు పుట్టిందో తెలియదు. ప్రభవించినచోట నదులు నిర్మలంగా వున్నట్టే, ఈ కాఫీ గూడా ఆదిలో శుచిగానూ, రుచి గానూ వుండివుంటుంది. కాలక్రమాన తీపి తగ్గి పోయిన కొద్దీ, అంతకంతకూ హెచ్చిపోతున్న చేదే మానవుడి జిహ్వాకు పరమ రుచ్యంగా పరిణమిస్తోంది.

ప్రకాశం మళ్ళీ ఒకసారి విరాగిలా తనలోతానే నవ్వు కున్నాడు.

పోర్టికోలో కారాగింది. వచ్చినవాడు మామయ్య తెచ్చినవి పెద్ద పెద్ద బుట్టలు. హాల్లో ఓ మూలగా వేసివున్న కుషను కుర్చీలో కూర్చున్న ప్రకాశానికి ఆ బుట్టల్లో ఏముందో తెలుసునే అవకాశ మెక్కడ? కానీ ఆవున్న గుండెజబ్బేదో మామయ్యకే వుంది. చిన్నచిన్న విషయాలకంతా సస్పెన్సును పరిపోషించి ఆయన ఎదుటివారికి గుండె జబ్బు తెచ్చిపెట్టడు. మూతలు వూడదీసి తెచ్చి నవాటిని గంభీరంగా ప్రదర్శిస్తున్నాడు మామయ్య.

ముక్కు మీద వేసుకున్న వ్రేలిని వెనక్కు తీయలేక పోయింది అత్తయ్య. పూలా! ఉండండుండండి బాబూ! మూడు బుట్టల నిండుకూ పూలేనా! బజారులో యింక పువ్వులు లేవటండీ! ఐతే చేస్తున్న వ్యాపార సాపారాలన్నీ వదలిపెట్టి టోకుగా పూల వ్యాపారం ప్రారంభిస్తారుటండీ? ఉత్సవ సమయాల్లో మూల విరా ట్టుకు వేసే పాటి పుష్పహారాలు రెండా? ఇవి చాలక చిన్న సైజువి ఒక డజనా! పైగా సాదా పూలసరాలు ఓబుట్టెడా! పూల పల్లకీ కట్టించుకుని మనమిద్దరమూ పూరేగుదా మనుకున్నారా ఏమిటండీ! అయ్యో రామా, ఈయనేం మనిషమ్మా!"

మామయ్య ముఖాన కత్తివేటుకు నెత్తురు చుక్క లేదు. ఒకవేళ తనుచేసింది పొరబాటేమోనన్న సందేహం ముఖంలో ప్రతిఫలించి ఆయన వాలకాన్ని దీనాతి దీనంగా మార్చి వేసింది. అత్తయ్య తుపానులా విరచుకు పడితే సంజాయిషీ చెప్పకోడానికి మాటలు స్ఫురించవంతేగానీ, యిది మామయ్య పెద్దగా ఆలో చించిన తర్వాత చేసిన పనైవుండదు. బహుశా బజారుగుండా వెళ్తూ అంగళ్ళలో పువ్వుల్ని చూచి వుంటాడు మామయ్య. తానింట్లో సరదాగా అమ్మాయికి పుట్టిన రోజు పండగ జరుపు

కుంటూఉండగా పువ్వులు బజారులో ఎందుకుండాలి—అన్న ధర్మ సందేహం కలిగి వుంటుందాయనకు.

కానీ అత్తయ్యగూడా పట్టు విడుపులు తెలియని మనిషి గాదు. తీరా తెచ్చిన తర్వాత నచ్చలేదని వాపసు చేసి వేరే వాటిని పంపమని చెప్పడానికి యివి చీరలూ, నగలూ కావు ఆమె వెంటనే తన ధోరణికి సవరణ ఆపాదించుకుంది. "తెస్తేతెచ్చారు గానీ అందుకోసం దిగాలు పడి నిల్చిపోతారటండీ. వేడుకకొక వెల వుందా ఏమిటి? ఆ మాట కొస్తే పప్పులేని పెళ్ళి పువ్వులు లేని సంబరమూ. ఒరేయ్ రాముడూ, ఈ పుష్పహారాన్ని తీసుకెళ్ళి దర్వాజాకు తగిలించరా. ఈ పూల దండలు తీసుకెళ్ళిపటాలకు వేసుకోవే సుబ్బలక్షీ..."

కొండలా ఎదురైన యిక్కట్టు మంచులా పడపోతే ఎవరికి మాత్రం ఆనందం కలుగదు? మామయ్య ముఖం కల కలలాడింది

" మీపుణ్యానికి మీరిక బజారుకు వెళ్ళింది చాలుగానీ కుర్చీ వేయించుకుని గుమ్మం దగ్గర కూర్చోండి. ఆరింటికల్లా అతిథు లొక్కరొక్కరే వస్తారు. అన్నట్టు మొదటి అతిథి ఎప్పుడో వచ్చే శాడండోయ్! మీ అవస్థలో మీరు చూచారేగాదు..."

"ఏదీ, ఎక్కడ! ఎవరు?" కళ్ళజోడును సర్దుకునే తొందరలో పైకప్పుకేసి చూస్తూ అడుగుతున్నాడు మామయ్య.

"ఇదిగో, యిక్కడున్నాను మామయ్యా! భూమిపైన" అన్నాడు నవ్వుతూ ప్రకాశం.

"ఊహూ, భూమిమీదనే వున్నావన్నట్టా ప్రకాశం! బలే వాడివిరా నువ్వు!" అపాదమస్తకం ఊగిసలాడి పోతూ విరగబడి నవ్వేశాడు మామయ్య.

మామయ్యపట్ల జాలి మాత్రమే కలిగింది ప్రకాశానికి! భార్యా విధేయత కృష్ణ భగవాను నంతటి వాడికే తప్పింది గాదు. ఆమాటకేమి గానీ హృదయంలో చంద్రహాసం వుంచుకుని, పెదవిపైన మందహాసం మెరిపించడం అయనచేత గాదు. లోపల బయటా ఆయన ఒకే మనిషి కోపమో తాపమో, ఖేదమో మోదమో ఎప్పటి కప్పుడు మనోకాసారంలో ప్రకోపించిన భావాలను ఎదుటివారిపైన కుండలతో కుమ్మరించి ఆయన మళ్ళీ మామూలు మనిషైపోతాడు.

"వచ్చిన వాడిని, కాళ్ళూ చేతులు ముడుచుకుని యిక్కడ కూచున్నావా ప్రకాశం! ఈవినోదం నీదిమాత్రం కాదూ? వెళ్ళు వెళ్ళు మెడపైకి వెళ్ళి కాసేపు రెస్టు తీసుకో..."

మెట్లెక్కి మెల్లగా మేడపైకి వెళ్ళాడు ప్రకాశం. అతడి పాదాలు అప్రయత్నంగా శోభాదేవి గది ఎదుట ఆగిపోయాయి. అంత ప్రయత్నంగానే అతని చేతులు రెక్క తలుపుల్ని తెరిచాయి ద్వారానికి నేరుగా గోడకానించివున్న నిలువుటద్దానికి అభిముఖంగా కూర్చొని తిలకం దిద్దుకుంటూ వుంది శోభ.

వచ్చిన వ్యక్తిని ప్రతిబింబంగా అనువదించి పెడుతున్న నిలువుటద్దంలోకి సూటిగా చూస్తూ "వచ్చావా బావా!" అంది శోభ.

"వచ్చానుశోభ" అన్నాడు ప్రకాశం.

"సంతోషంగా వుందిబావా" క్షణం సేపు ఆగి "నువ్వు రావడం" అంటూ పూర్తిచేసింది శోభ.

"ఆనందంగా వుంది శోభ!" రెండుక్షణాలు ఆగి "నువ్విలా చెప్పడం" అంటూ ముగించాడు ప్రకాశం.

అమ్మక్షేమంగానే వుంది శోభా! చంద్రం నిన్ను మరిమరీ అడిగినట్టు చెప్పమన్నాడు—అంటూ కుశల వార్తలు చెప్పుకుందా మనుకున్నాడు ప్రకాశం.

" అమ్మాయ్ శోభా; జయప్రద వచ్చేసింది" క్రిందినుంచీ ధనుర్ముక్తమైన బాణంలా పిలుపు పరితెంచివచ్చింది.

"ఏదీ, ఎక్కడ వచ్చేశావా జయప్రదా." ఒక్క పరుగులో వెళ్ళి మెట్లుదిగుతోంది శోభ.

జయప్రద పూలరెమ్మ, ఆరడుగులుండదు గానీ వున్నట్టే కనిపిస్తుంది. శరత్కాలమేఘం కైవడి వినీల గగనంలో తేలిపోతున్న అప్సరసాలా ఆమె తెల్లటి షిఫాన్ చీరకట్టుకుంది. కుటిల కుంతలాల పైనుంచి చెవుల కడ్డంగా క్రిందికి తీసి నీలి రంగుసిల్కు మఫ్లరు బిగించింది. ముద్ద మందారాల లాంటి ముచ్చటైన అరుణాధరాలామెవి. శోభాదేవి ఆఖరు మెట్టుపైన వుండగానే తామర కాడల్లాంటి బాహువులను సాచి జయప్రద ఆమెను తన కౌగిల్లోకి తీసుకుంది. "ఎలాంటి మొగుడు దొరుకుతాడో నీ పట్టపు రాణీలా ఉన్నావే శోభా." అంటూ స్నేహితురాలి బుగ్గల్ని చుంబించింది

"వన్ మినట్, వన్ మినట్! కదలకుండా నిల్చో శోభా! మీరిందాకా వున్నట్టే వుండండి జయప్రదాదేవి గారూ!" మెడకు తగిలించుకున్న తోలు పెట్టెలో నుంచి కెమెరాను పైకితీస్తూ తుమ్మెద రెక్కల వంటి నూనుగు మీసాల కుర్రవాడు పైజామా పైన లాల్చివేసుకున్న స్ఫురద్రూపి హాల్లోకి వచ్చేశాడు

"ఎందుకైనా మంచిది! ఒకటికి రెండు ఫోటోలు తీసేయ

వయ్యా చక్రపాణీ!" కిటికీలోంచి హెచ్చరిస్తోంది అత్తయ్య.

"రైటో రైటో అంటూ కెమెరా క్లిక్ మనిపించాడు చక్రపాణి" ప్రథమ కబళంలోనే మక్షికా పాతంలా (?) వచ్చి రాగానే అద్భుతమైన దృశ్యం ఎదిరైందండీ జయప్రదగారూ! ఎన్లార్జి చేయించి మీకిద్దరికీ చెరొక కాపీ బహూకరిస్తాను......" కెమెరాను యధా స్థానంలో పదిల పరచుకుంటూ అన్నాడు చక్రపాణి.

"అంతలో వేరొక గెస్ట్ ద్వారం దగ్గర ప్రత్యక్షమయ్యాడు. టాక్సీలోనుంచీ క్రిందికి దిగి ఠీవిగా అడుగులు వేస్తూ వచ్చి ద్వారాని కడ్డంగా సిల్హౌట్‌లా నిల్చున్న ఆగంతకుడు ముప్పైయేళ్ళ వాడు. పూర్తిగా ఆధునికమైన వేషం అతనిది. కర్ణుడికి అతడి కవచమైనా అంత పొందికగా అమరి వుండదు. నీలిరంగు పాంటు దానిపై మోకాళ్ళదాకా వ్రేలాడుతున్న కోటు. త్రిప్పి పెట్టిన 'V' లాగా ముకుపుటం క్రింది నుంచీ ఏటవాలుగా క్రిందికి దిగిన చురకత్తి మీసాలు; కళ్ళకు నల్లద్దాల సులోచనాలు. నుదిటిపైకి జారి గాలికి కదులుతున్న ముంగురులు. పెదవుల మధ్య నిర్విరామంగా కాలుతున్న సిగరెట్టు......

కోర్టులో సాక్షిని పిలిచినట్టుగా వసారాలోనుంచీ అనౌన్స్ చేస్తున్నాడు మామయ్య— "శచీంద్రబాబు. శోభా, శచీంద్రబాబు వచ్చేశాడు..."

అత్తయ్య స్వయంగా వెండి గ్లాసులో కాఫీ తీసుకొచ్చింది, శోభ ఆసనం చూపించింది. మామయ్య టేబిల్ ఫాను తెచ్చి అతనికి దగ్గరగా పెట్టమన్నాడు. ఉపచారాల పట్ల సమ్మోదాన్ని ప్రకటిస్తున్న మందస్మితంతో శచీంద్రబాబు పాతకాలంనాటి భారీ కుర్చీలో సుఖాసీనుడై పోయాడు.

గంట ఆరున్నరై విద్యుద్దీపాలు వెలగగానే పుట్టినరోజు పండుగకు ఉత్తేజం సమకూరినట్టయింది కార్లు, రిక్షాలు, మోటరు సైకిళ్లు ఒక్కొక్కటిగా వచ్చి మేడ యెదుట నిలుస్తున్నాయి. హాల్లో అతిథుల కలకలం ఉధృతమౌతోంది గిరజాలు పెంచుకుని, శుభ్రంగా మీసాలు గొరుక్కున్న భుజాల పైనుంచీ పాదాల దాకా పచ్చటి సాలువాను దిగవిడుచుకున్న ఒకానొక కవి కుమారుడు నలుగురు మిత్రుల్ని ప్రోగు చేసుకుని స్వీయ కవితా గానం చేస్తున్నారు. అరవై యేళ్ళ వృద్ధు డొకాయన యిటీవల తాను హాజరైన పెళ్ళిలో జరిగిన విందును గురించి నోరూరగా జవులు పుట్టగా ముచ్చటిస్తున్నాడు. వరండాలో నుంచీ మామగారి మాటలు శ్రవ్య నాటికలా వినిపిస్తున్నాయి. "నువ్వుగూడా ఆలస్యం చేయాలటయ్యా సుగుణాకరం. ఈ మధ్య ఏదో అరవ చిత్రాన్ని తెలుగులోకి దించటానికి ప్రయత్నాలు చేస్తున్నావట గా. శోభ చెప్పింది. ఓహోహో, విశ్వనాథంగారా. నెల రోజులుగా తమ దర్శనాలే లేవు. మీ అబ్బాయికి నాగపూరు బదలీ అయిందటగా. చెప్పారే కారు చెప్పకపోతేనేం లెండి, ఆసక్తి వుంది గనుక తెలుసుకోడానికి తంటాలు పడుతూ వుంటాం... రావమ్మా ఉషా. ప్రొద్దు పోయి చీకటి పడుతుండగా మాయింటికి ఉషస్సు వచ్చేసిందండోయ్..."

మామయ్య హితవు ప్రకారం కాసేపు రెస్ట్ తీసుకుంటే బాగుండుననిపించింది ప్రకాశానికి, కాళ్ళీడ్చుకుంటూ అతడు డాబా పైకి వెళ్ళాడు. పది మందితో కలిసి మెలిసి వుండగలగడం భగవంతుడు యివ్వవలసిన వరం. తన కలాంటి వరం అనుగ్రహింప బడలేదు. లేకపోతే బోలెడుమంది అతిథులు కులాసాగా కాలక్షేపం చేస్తుండగా తనిలా ఏకాంతాన్ని అన్వేషించేవాడు కాదు.

(సశేషం)

కొండ జాతులు - సవరులు

(11 వ పేజీ తరువాయి)

మందసా, పర్లాకిమిడి తాలూకాలలోని కొండల మీదను, ఆంధ్ర ప్రదేశ్‌లోని పాత పట్నం, టెక్కలి, పాలకొండ తాలుకాలలోని కొండలమీదను, ఉత్తర ప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ వద్దను, ఉత్తరమున సింగభూమ్, సంబల్ పూరు వద్దను, యింకా ఉత్తమున సాంగూర్ వద్దను ప్రస్తుతము నివసిస్తున్నారు. కాని వీరు ఆ యా ప్రాంతములలోని భాషలు నేర్చుకొని వీరి మాతృభాషను మరచి పోతున్నారు. ఈ సవరలు అంతా కలిసి మనదేశంలో ఆరు లక్షల మంది ఉంటారు. వీరిలో రెండు లక్షల మంది ఏ యితర భాషల సంపర్కమూ లేకుండా అచ్చమైన సవరభాషను మాతృభాషగా మాట్లాడే వారు ఉన్నారు.

సత్యం, శివం, సుందరం

శ్రీ యస్. శ్రీనివాసాచార్యులు

బృందగానం:—

సత్యం, శివం, సుందరం
నిత్యం మన మందరం
కావాలని కాంక్షిద్దాం
కరువునవల తరిమేద్దాం.

సత్యం:—

ఎవరోహో! నేడిటుమము
అవసరముగఁదలచువారు
గమియించే కాలానికి
కళ్ళెంబును వేయువారు

శివం:—

భాస్వద్ఘన దీప్తులలో
భారతీయ విఖ్యాతిని,
వెలిగించగ గలవారలు
తలతురెట్లు మాయునికిని?

సుందరం:—

వేషలతో, భూషలతో
భాషణంబు సొబగులతో
మిడిసి పడెడి వారలు, నే
డెటులు మమ్ముతలచిరహో!

ముప్పురు:—

కలగాంచుట లేదుగదా!
కలవరింత కాదుగదా!
ప్రక్కకీడ్వబడిన మమ్ము
వెక్కిరింప బోరుగదా

....

(కొందరు వ్యక్తులు ప్రవేశింతురు)

1వ, వ్యక్తి:—

దివికి దీటగు—దేశమేయిది
భువిని నిరుపమ—భూమియేయిది!
నేటికిట్టులు—నివురు గప్పిన
నిప్పుగా మారెన్.

2వ, వ్యక్తి:—

ధరలునింగిని—దాటిపోయెను
కరవు దేవత—కాలిగజ్జెల
రవళులవ్వె,వి—రామమెరుగక
విపులరొదవెట్టున్.

3వ, వ్యక్తి:—

మనిషి మనిషికి—మధ్యపొరపొ
చ్చములు నిండెను—శాంతిమండెను,
పదవులందలి—భ్రమలు పెరిగెను
తుదకు యేమౌనో!

4వ, వ్యక్తి:—

కన్న తల్లిని—కానివారికి
కనులు మూసుక—కట్నమిచ్చే
పరమనీచులు—పలువురైతే,
భాగ్యమెటులబ్బున్.

5వ, వ్యక్తి:—

అన్నివిధముల—ఆశలుడిగెను
యెన్నడొకో—'ఈతితొలగుట'
భరతమాతృ— ప్రాగున్నతి
తిరిగివెలుగ దొకో?

....

స శి సుం:— (ముప్పురు)

కూరిమితో దేశముకై
వీరలిట్లు వాపోవుట
మనస్ఫూర్తిగానైతే
మనకాదరమబ్బునుగద.

. . . .

(మరొక వైపునుంచి కొందరు ప్రవేశిస్తారు)

1వ. వ్యక్తి:—

నిరంతరాయ, మానవీయ
నిస్తుల ప్రవృద్ధిజేయ
నస్మాదృశులే శరణం
తస్మాత్కురు జాగరణం

2వ. వ్యక్తి:—

నిస్మృతగత సంప్రదాయ
విఖ్యాతికి ప్రతినిధులం
ఎదురులేని నిరంకుశులం
పదవులు మాసొంతధనం.

3వ. వ్యక్తి:—

స్వార్ధమేమి లేకుంటే
వ్యర్థము మాజీవితం
నీతి నియమ మనుకుంటే
గోతిఁబడుటయే ఖాయం

4వ. వ్యక్తి:—

త్యాగం. సేవా ధర్మంబని
భోగాలను చేజేతుల
వదలుకొనుట మూర్ఖత్వం
వచ్చేదేమిటి? భస్మం.

5వ. వ్యక్తి:—

అందుకనే అయినంతకు
ఆచార మనాచారంబని
పాటింపక నధికారపు
కోటలొ పాగా వేస్తాం.

6వ. వ్యక్తి:—

దేశముకై చింతిస్తూ
దేబెముఖా లేయం

పదవులు నిచ్చే షరతున
పరులనైన 'సై' యంటాం

అందరు:—

కారులు, హోదా, జల్సా
గౌరవాలు నిల్వాలంటే
ప్రజల మేలు అనవసరం
నిజాయతీ దరి జేర్చం.
కుక్షులలో తెలియకుండ
లక్షలు లక్షలు దాస్తాం.
సొమ్మెవ్వరిదను మాటను
సుషుప్తినైన తలపోయం.
ప్రజలకొఱకు దీక్షబూని
ప్రాణాలకు నీళ్ళొదలిన
'పొట్టివారి' లాంటివారు
గిట్టరు మాకిది నైజం
అచ్చమైన వేషంతో
స్వచ్ఛమైన సేవకులని
భ్రమజెందెడు నట్లాచర
ణము నందున నేర్పరులం.
మావంటికిది రైటే
మీవలె క్షేమైనగాని
మెరమెచ్చుల కోసము, మా
పరువు మంట గలుపుకొనం.

. . . .

స. శి. సుం. (ముగ్గురు)

ఛీఛీఛీ యేతాదృశ
వాచాలుర మూలంగా
భరతదేశ విఖ్యాతులు
పతనమగు సమూలంగా
రణోన్మాద రక్షస్సును
నణగ ద్రొక్కి యధోలోక
మృత్తికగా మార్చాలని
క్రొత్త క్రొత్త మార్గాలను
సాటి పాలకులకు జూపి
పాటింపగ జేయుటకై
యహోరాత్రములు శ్రమించు
నెహ్రూజీ—వీరివలన

మనశ్శాంతి లేకుండగ
మథనంబును జెందుగదా;
సర్వముఖాభివృద్ధి
సత్వరముగ కావాలని
సౌహార్దంతో పెద్దలు
శ్రమియిస్తే లాభమేమి?
పైరులతో పంటలతో
పారిశ్రామిక రీతులతో
విద్యా విజ్ఞానంబుల
సద్యః ఫల కాంక్షలతో
కోట్లు వ్యయము కాగల్గిన
గొప్ప గొప్ప పద్ధతులతో
ప్రణాళికను వేసియు
ఫలితం శూన్యంబే కద.
మనము కొంత ఓరిమితో
మనమంటే ఆదరించు
మనుజులలో చేరి, మనికి
గనుట ధన్య మొనరింతము.

. . . .

(తిరిగి మొదటి బృందం)

అందరు:—

దేశమంతా—దివ్యదీప్తుల
తేజరిల్లగ-జేయుటకు మన
మందరము దృఢ—మైన సత్యము
నమలు పరచ వలెన్.
సత్య దీక్షా—శ్రమిక జాతికి
నిత్య వృద్ధిసు—నిశ్చితమ్మట
పెంపుc జెందిన సంపదల శివ
మింపు గొల్పు గదా.
మంగళ ప్రద—మైన భువిలో
నిగినంటును—నిత్యవైభవ—
మందు, సుఖములు—అందుబాటగు
సుందరంబిదియే.
సత్యం, శివం, సుందరం
నిత్యం మన మందరం
కావాలని కాంక్షిద్దాం
కరువు నవల తరిమేద్దాం.



అమరమందు నాలుగైదు శ్లోకము లెవ్వో
నోటి కమరినంత మేటికాడు
కప్ప గంతు పెద్ద గొప్ప దూకుడు గాదు
జనసుతాంతరంగ! వినుర! రంగ!

కళా కృష్ణుల "కృష్ణశతశతి"

ప్రాచీనాధునిక కవితారీతులు:

డాక్టర్ దివాకర్ల వేంకటావధాని

ఏ భాష యందైనను గవితారీతి యెల్లకాలమొక్క మాదిరిగా నుండదు. అది కాలభేదమును బట్టి మార్పుచెందు చుండును. ఆమార్పు ప్రక్రియా పరిమాణము లందును, వస్తువర్ణనములందును, ఛందస్సంప్రదాయములందును,భాషాభావములందును గోచరించును. ఇట్లు మాఱినంత మాత్రమున నది యానంద స్పంధాన దక్షముకా కుండబోదు. బాహ్యమైన దేహమెంత పరివర్తన మందినను ఆంతరమైన యాత్మ లెస్సగ నుండునంతవఱకుఁ గావ్యత్వమునకెట్టి భంగమును గలుగఁజాలదు కొందఱుప్రాచీన కవిత్వమునభిమానింతురు; కొందఱాధునిక కవిత్వమునాదరింతురు. అదివ్యక్తిగతమైన రుచిభేదము. షట్టినకాలమునుబట్టి కావ్యముల యుత్తమాధమతల నిర్ణయించుట యుచితముకాదు. "పురాణమిత్యేవనసాధు సర్వం, నచాపికావ్యం నవమిత్య వద్యమ్మని కవికులగురువు కాళిదాసుచెప్పిన దెంతయుసత్యము. వాని న్యూనాధిక్యములు తత్కర్తల ప్రతిభా విశేషములపైనే యాధారపడి యుండును.

మనము ప్రాచీనాధునిక కావ్యములు రెండును బఠింతుము, ఆనందింతుము ఇట్లుప్రయోజన సిద్ధిసమానమే యయ్యునా రెండు తెలుఁగులలోఁ గొంత యెన్నఁదగిన తారతమ్యము గోచరించును అదిపలువిధములఁగ నుండును. దానిని బరిశీలించుటయే యీ వ్యాసము యొక్కయుద్దేశము. ప్రాచీనాధునికములను పదములిచట బాహుళ్యదృష్టిచేఁ జెప్పఁబడినవి. ప్రాచీనులలోనప్పటి సంప్రదాయముల కెదురెత్తి స్వతంత్రమార్గము నవలంబించినవారు కొందఱు లేకపోలేదు. అట్లే యాధునికులయ్యు నవ్యసంప్రదాయముల నభిమానింపక ప్రాచీన పద్ధతినే పాటించువారును గొందఱున్నారు. కానియట్టివారిసంఖ్య యల్పముగానుండును. కాలప్రభావమునకు లోఁబడి తదనుగుణముగా వ్యవహరించువారి సంఖ్యయేయెప్పుడైన నధికమై యొప్పారును. ప్రధానముగా వారినిదృష్టిలోనుంచుకొనియే యీ పరిశీలనము చేయఁబడుచున్నది.

నన్నయనుండి నేఁటివఱకుఁ బ్రవర్తిల్లివచ్చుచున్న వాఙ్మయమును బరిశీలించినచో నందువివిధ ప్రక్రియలు కాన్పించును. నన్నయాదులు పురాణములలో పురాణప్రాయములైన యితిహాసములనో రచించిరి. ఆకాలమునకట్టి రచనలవసరములయ్యెను. తరువాత కొన్నికథాకావ్యములు, కావ్యములు బయలు దేరినవి. పిమ్మట ధీరోదాత్త నాయకములు. శృంగారరసప్రధానములు, వర్ణన బహుళములు, శబ్దార్థాలంకార శోభితములునైనప్రబంధములు వెలువడినవి. అనంతరము ప్రబంధములతోపాటు గేయ రచనయుఁ బ్రబలినది. ఆధునిక కాలమునఁ బాశ్చాత్య కవితా ప్రభావితములై భావ అభ్యుదయ కవితోద్యమములు ప్రచారము పొందినవి. ఈ యుద్యమములకు సంబంధించిన కవితా ప్రక్రియలకును దత్పూర్వ ప్రక్రియలకును జాల భేదమున్నది ఇవి పురాణములును గాదు, ప్రబంధములును గాదు; లఘు కావ్యములు లేక ఖండ కావ్యములు, లలిత, పిరదౌసి, కృషీవలుడు మున్నగునవి లఘు కావ్యములు. కృష్ణపక్షము, దీపావళి మున్నగువాని యందలి కావ్యములు ఖండ కావ్యములు. ఈ విధముగాఁ బ్రాచీనాధునిక కవితా ప్రక్రియల యందలి పారదిక్యము సుస్పష్టమే. ప్రక్రియల యందే కాక పరిమాణ మందును వానిలో భేదము కన్పట్టును పురాణములు బహువిస్తృతములైనవి. పురాణములంత విస్తృతములు కాకపోయినను ప్రబంధములుకూడాఁ బెద్దవే వీనిలో సుమారు వేయి పద్యగద్యము లుండును. లఘుకావ్యములు ద్విత్రిశత ప్రమితములు. ఖండ కావ్యములలో నైదు మొదలిరువది ముప్పది వఱకుఁ బద్యములుండును. ఆధునిక కాలానుగుణముగఁ గావ్యముల పరిమితి కృశింపవలసి వచ్చినది. పురాణములనో ప్రబంధములనో వ్రాయుటకుఁ గవులకును, జదువుటకుఁ బఠితులకును బహుకార్యవ్యగ్రతా సంకులమైన యీ కాలమున నవకాశము చాల తక్కువ ఇప్పుడల్ప కాలములో పనల్పమైన యానందాను భావము కావలయును.

వస్తు విశేషమునఁ గూడఁ బ్రాచీనాధునిక కావ్యములందు భేదము గోచరించును. పురాణములు ప్రఖ్యాత వస్తుకములని వేఱే

చెప్పనవసరము లేదు. ప్రబంధములలోఁ గొన్ని కల్పిత వస్తుకములు, కొన్ని సాంఘిక చరిత్ర వస్తుకములు, కానిపించినను బెక్కు ప్రఖ్యాత వస్తుకములే. వానికి భారత భాగవత రామాయణ ములు మూల ప్రభావములు. ఆధునిక కావ్యము లందలి వస్తువుల స్వభావమే వేఱు. అందుఁ గొన్ని కల్పితములు, కొన్ని జానపద ములు, కొన్ని జాతీయములు. పెక్కు సాంఘికములు. ప్రాచీనులు లేదో ప్రఖ్యాతమైన యితి వృత్తమును గ్రహించి యందలి పాత్రము లను దద్భావములను దటస్థులుగా నుండి చిత్రింతురు. ఆంగ్ల పరిభాషా ననుసరించి యట్టి రచనలను బరాశ్రయము లందురు. (objective) కవులకును, ఆ పాత్రలకును, వారి భావములకును ఎట్టి సంబంధము నుండదు. మఱియుఁ బ్రాచీనులు సమకాలిక జన ప్రవృత్తులను దమ కావ్యములలోఁ బ్రతిఫలింప జేయుట కంతగా యత్నించి యుండలేదు. అట్టివేవైన నందుఁ జొచ్చినచో నదికేవల మానుషంగికమే. ఆధునిక కవిత్వము చాలవఱకాత్మా శ్రయముగా (Subjective) నుండును. అందుఁగవులవృత్తాంతము, వారి భావములు కూడ నెక్కువగా గోచరించుటయే యిందుకుఁ గారణము. మఱియు సమకాలిక రాజకీయ సాంఘికాది ప్రవృత్తు లందు విశదముగాఁ జిత్రింపఁబడును. పేదల కడ గండ్లు, గ్రామి కుల సుఖ దుఃఖములు, సామాజిక వ్యవస్థా ధర్మములు మున్నగు నంశములు కూడ వానిలో నెట్లో చోటు చేసికొనును. మొత్తము మీద జన సామాన్యముతో నాధునిక రచనల కున్నంత సంబంధము పూర్వ రచనలకుండదు. పూర్వులు జీవితమును సంతోష సౌఖ్య మయముగా దర్శించి యుండుట చేతను, లాక్షణికులయందు భక్తి గౌరవములు కలవారగుట చేతను మోదాంత కావ్యములనే రచించిరి. "మంగళాదీని, మంగళ మధ్యాని, మంగళాంతానికావ్యాని" అనునది వారి యాదర్శము. పాశ్చాత్య వాఙ్మయ ప్రభావము చేతను, వాస్తవిక జీవిత చిత్రణాసక్తి చేతను ఆధునికులు కేవల మోదాంతములనే కాక విషాదాంతములైన కావ్యములనుగూడ రచింతురు. పూర్వులు వస్తువున నలౌకిక సన్నివేశముల నుత్సాహ ముతోఁ బ్రవేశ పెట్టుదురు. అట్టి వొకొక్కప్పుడు కథా వస్తువు నసహజ మొనరించి యందలి 'ప్రాయోభావము' నకు లోపమాపా దించు చుండును ఆధునికుల లౌకిక మహిమాను భావాదుల నంతగా విశ్వసింపరు. అందుచే నట్టి వానికిఁ దమ కావ్యములం దవ కాశము కల్పింపరు.

కావ్యమష్టాదశ వర్ణన భరితమై యుండవలెనని లాక్షణి కులు నియమించిరి. సంస్కృత కావ్యసందర్భములందాయా సందర్భములందా వర్ణనలన్నియుఁగన్పించును. వాని ననుసరించి ప్రబంధ కవులుకూడ నష్టాదశ వర్ణన నియమమును బాటించిరి. కథా సందర్భమున కత్యవసరములైనను గాకపోయినను వారా వర్ణనల కెట్లో ప్రసక్తి కల్పించి పాండితీ స్ఫోరకముగా వానిని సంతరించి యుండిరి. అవి కొన్నిచోట్ల నతిదీర్ఘములై ప్రధాన కథను మఱుఁగు పుచ్చుటయో, దాని సహజగమనమున కాటంకము కల్గించుటయో కూడ సంభవించుచుండును. పూర్వులు వర్ణన ప్రాగల్భ్యమును వలెఁగా సంవిధానచాతుర్యమునంతగా బ్రకటించి యుండలేదు. ఆధునికులు తమ కావ్యములలో వర్ణనలు చేయుదురు కాని కథా బంధమున కత్యావశ్యకములైన వర్ణనలకే యందు తావు కల్పింతురు. వానినైనను సుదీర్ఘములు కావింపక పరిమిత బంధు రములుగాఁ గూర్చుచుందురు.

పురాణములు బహు విస్తృతము లగుటచే నైకరసబంధుర ములై యుండును. ప్రబంధములు పెక్కు శృంగార రస ప్రధానములు. అందయోగ సంయోగ సంభోగ శృంగారములు మూఁడును గానిపించును అందలి నాయికానాయకము ప్రణయ వ్యాపారమును సూక్ష్మముగాఁ బరిశీలింప హార్దమైన యనురాగము కంటెఁ దానవమైన కామమే యెక్కువగా గోచరించును ఆరస పోషణ మం దొకొక్కప్పు డతిమాత్రమై సభ్యతామర్యా దన తిక్రమించుటయుఁగలదు, దక్షిణాంధ్ర యుగమునందలి ప్రబంధ ములలో శృంగార రసకులనీతిధర్మములకుఁగూడ దూరమై విశృంఖలముగా వర్తించినది ఆధునికులును శృంగార రసమును వర్ణింతురు. కాని వీరి శృంగామము కొంచెముగూఢమై యౌచిత్య సీమ నతిక్రమింపక యమలమై యొప్పారును, వీరుకామమునకు గాక దివ్యమైన యనురాగమునకుఁబ్రాధాన్యమీయ యత్నింతురు. అందుచే వీరి శృంగార మమలినమని ప్రశస్తికెక్కినది. వీరి దృష్టిలో స్త్రీ కేవలభోగ్యవస్తువుకాదు అనురాగమూర్తి; ఉపాస్య దైవము, వీరి విరహమాంతరమైనది. ఇందుఁజిగురాకు సెజ్జలు, పన్నీటి పోఁతలు చంద్రమన్మథాద్యుపాలంభములు నెచ్చటనోకాని కానిపింపవు, శృంగారముతో పాటు కరుణమును గూడ వీరు మిక్కిలి యభినివేశముతో వర్ణింతురు. దీనుల దురవస్థలను, ఐశ్వరమదాంధుల దౌర్జన్యములను, జగద్విలయ హేతువులైన మహాయుద్ధముల దుష్ఫలితములను విశదముగా వివరించి వీరార్ద్రహృదయుల కన్నీరు మున్నీరుఁగా బావింతురు,

నాయకుల నెన్నుకొను విషయమునఁగూడఁబూర్వాధునిక కవులలోఁజాలభేదమున్నది. ఒకటి రెండపవాదములున్నను బూర్వులనాయకులందఱును ధీరోదాత్తులు. సామాన్యులను నాయ కులుగా గ్రహించుట లక్షణమునకు విరుద్ధమగుటచే వారిదృష్టి

యెప్పుడును రాజులు మంత్రులు, తత్కుమారులు మున్నగువారి వంకకే ప్రసరించినది. వారికావ్యములందు(గుపీనులైన ధీరులకు దప్ప సామాన్యుల కంతగా స్థానముండదు. ఆధునికులు కావ్యమును జగత్తునకు(బ్రతిబింబముగా భావించి జగజ్జనుల కందరికిని అందు చితమైన స్థానము కల్పింతురు. ఈ విషయమున వారికిఁ బాశ్చాత్యుల కావ్యములుకూడ(గొంత వఱకొజ్జబంతులైనవి. కృషీవలుడు, నాయు(డుబావ, హరిజను(డు మున్నగువారెవ్వరైన వారి కావ్యములందు నాయకత్వమునకర్హులే.

పూర్వులు కావ్యమున కానందమే పరమప్రయోజనముగా భావించిరి. అది యానంద సంధాన దక్షమైనచో సంఘమున కుప యోగించినను ఉపయోగింపక పోయినను వారికి బాధలేదు. భావకవులుతామూహ ప్రపంచమున దర్శించిన శాంతి సుఖసమత్వాదులను సంఘమున(బ్రత్యక్షముచేయుటకై కవిత్వము నొక సాధనముగా గ్రహించిరి. అభ్యుదయకవులు మఱొక యడుగు ముందుకు వేసి కవి సంఘమునందలి వ్యక్తి యేమనియు, నత(డు సంఘమునకు దూరముగా బ్రదుక జాలడనియు నందుచే(దన కవితాశక్తిని సంఘాభ్యుదయమునకై వినియోగించి తీరవలెననియు వాదింతురు. ఈకారణము చేతనే పలువురు పూర్వకవులు గంధర్వనగర విహారము సాగించినట్లు కన్పింప నాధునికులు తమ చుట్టునున్న సంఘమునంటి పట్టుకొని యిహ లోకసంచారులుగానే గోచరింతురు

చంద స్సంప్రదాయములందు(గూడ(బూర్వాధునిక కావ్యములందు(దారతమ్యము కానిపించును పూర్వులు వృత్తజాత్యుపజాతులను మూ(డింటిని వాడిరి. రగడలవంటి గేయప్రాయములైన పద్యములను వారెడనెడ వాడియుండినను వారి కావ్యములలో నట్టి వానికి బ్రాచుర్యము తక్కువ. వారచ్చటచ్చట సందర్భములను బట్టియు నాశ్వాసాంతములందును గొన్ని వింత వృత్తములను వాడియుండుట నిజమే, కాని వారికెక్కువమక్కువ కూర్చినవి శార్దూల మత్తేభములు, చంపకోత్పలములు. కందములు, సీసగీతములుమాత్రమే కొందఱు కావ్యముల నాద్యంతము ద్విపదలలో వ్రాసి యుండిరి. ఆధునికులును సాధారణములైన పై పద్యములను వాడకుండలేదు. కాని వారి కభినివేశము గీతిగేయాదులందే. వారు మాత్రాగణ ఘటితములైన పలురకముల గేయములను గల్పించి కావ్యములందు(జొప్పించిరి. అభ్యుదయ కవులు కొందఱాంగ్లమునందలి 'రైమ్'నుబోలిన నియమమును బాటించినను, గొందఱు గణములను బూర్తిగావిడిచి వచనరూపగేయములందే తమభావములనువ్యక్తము చేయుచున్నారు. గణయతి ప్రాసాదులు భావప్రసరణమున కాటంకములుగా నుండునని వారియుహ వస్తుభావాదులందువలనే ఛందస్సు విషయమున(గూడ వారెక్కువ స్వాతంత్ర్యము ప్రదర్శించిరి.

సంస్కృతమున కాదికవియైన వాల్మీకితోడనే కవిత్వమునకు సంబంధించిన కొన్నిసమయము లేర్పడినవి. కాళిదాసాది మహాకవులెల్లరు నాకవి సమయములను యథోచితముగాఁ బాటించియుండిరి. ఆంధ్రకవులు వారి యడుగుజాడలలోనే వర్తించిరి. లాక్షణికులా కవి సమయములన్నిటిని లక్షణగ్రంథములలో వివరించి తరువాతి కవులకు మార్గదర్శకులైరి. ముఖమును చంద్రపద్మాదులతోను, నడుమును శూన్యసింహ మధ్యములతోను, ఊరువులను రంభాస్తంభములతోడను, ఇతరావయముల నితర వస్తువుల తోడను బోల్చుటయందును, ఆయాఋతువులయందు వాస్తవముగా గోచరించినను గోచరింపక పోయినను సమయాను గుణములైన వర్ణనము కావించుటయందును వృక్షలతాదులదోహద విశేషములను వర్ణించుటయందును ఈకవి సమయాను సరణము గోచరించును. కావ్యపాఠకులకు గవిసమయములు సుపరిచితములై పోవుటచేనవి సహజతకించుక దూరములైననువింతగా(గనిపింపవు. ఆధునికులీకవి సమయముల నెక్కువగాఁ బాటింపరు. వారు ప్రకృతిని బరిశీలించి యుచితములైన యుపమానములను గల్పించుకొందురు. వర్ణనములపట్ల నూహకాక వాస్తవికతవారికి ప్రీతిపాత్రము.

పూర్వకవులయందుఁ ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసములు పుష్కలము గాఁ గనిపించును. వారు తమ రచనలలోఁ బ్రతిభతోపాటు పాండితినిగూడఁ బ్రకటింప యత్నించిరి. దీనికి ఫలితముగా వారి రచనలు శబ్దార్థాలంకార మయములు దీర్ఘసమాస భూయిష్ఠములనై ప్రౌఢత వహించుట సంభవించినది వారిశైలియాలంకారికము. ఉపమారూపకోత్ప్రేక్షతిశయోక్తులు వారిసొమ్ములు.అవకాశములభించినప్పుడెల్లవారను ప్రాసయతికాదులను వాడియుండిరి. ఇవ్వన్నియు వారి శైలికి ప్రౌఢతతో పాటించుక కృత్రిమతకూడ(గల్పించినవి. ఆధునికులలంకారములలోను సమాస్య భావోక్తులనే యాదరింతురు. శబ్దాలంకారముఁకై వారు ప్రయత్నింపరు, ఎచ్చటనైన గన్పించినచో నవి యయత్నసిద్ధములైనివే. ప్రౌఢతా పాండిత్య ప్రదర్శనము కంటె మార్దవ సుబోధతాసౌందర్యములు వారికెక్కువధ్యేయములు. ఇంక భాషావ్యాకరణములను గూర్చి కొంత చెప్పవలయును. పూర్వులు కావ్యమున కాత్మయైన రసము విషయమున వలెనే శరీరమైన శబ్దము విషయమునఁ గూడ నెక్కువ శ్రద్ధ వహించిరి. వారిరచనలు బాహ్యాంతరములు రెండింట సౌందర్యసామగ్ర్యమును

సేకరించుకొన్న యనవద్య మూర్తులు. వారు భావములందెంత ప్రౌఢులో భాషావ్యాకరణము లందంత పరివిజ్ఞాతులు. అందుచే వారి భాష వ్యాకరణము సంస్కృతమై సలక్షణముగా నుండును. ఎచ్చటనైననొండు రెండు స్ఖాలిత్యములు తోఁచినచోనవి ప్రమాదా పతితములైనట్టివే. ఆధునికు లాంతరములైన రసభావములందుఁ జూపునంత శ్రద్ధ బాహ్యమైన శబ్దమునందుఁ జూపరు. భావకవులు పలువురు సలక్షణమైన భాషనేవాడిరి. కాని వారును భాషా భావములు రెండింటిలో భావములయెడనేమొగ్గుచూపిరి. అభ్యుదయ కవులు నిశ్శంకముగా వ్యావహారిక భాషనే వాడుదురు. ఛంద స్సంప్రదాయము లందును భావములందునువలెనే భాషయందుఁ గూడ వారు మిక్కిలి స్వతంత్రులు. భాషసుబోధమై భావప్రకటన కల్యమై యున్న వారికిఁ జాలును. అది లక్షణబద్ధమగునా కాదా యను విచారముతో వారికిఁ బని లేదు. అది నియమ బద్ధమై యుండుట భావ స్వాతంత్ర్యము నరికట్టు ననియు వారి యభిప్రాయము.

రసవంతమై యుడునంత వఱకు రీతి ప్రాతదైనను గ్రొత్తదైనను సహృదయులకు సమానమే. ఇటీవలఁ గొందఱు 'నూతన ముంత్రాగ్గుణ సమ్మితమ్ము' నగు రచన కావించుచున్నారు. ఆంగ్లమున వీరిని నియోక్లాసిసిష్టు లందురు వీరి కవితలో నిజమైన క్రొత్త ప్రాఁతల మేలు కలయిక గోచరించును. ఇది పూర్వాధునిక కవితా గుణముల నన్నిటిని స్వాయత్తము చేసికొన్న చక్కని పద్ధతి. నాకుఁ జూడఁగా నీ పద్ధతి యభ్యుదయో దర్కమని పించును. ప్రాజ్ఞులు పరీక్షించి తగిన త్రోవ త్రొక్కి యాంధ్ర సరస్వతి కభిన వాలంకృతులు కూర్తురుగాక.



ప్రేమ పేరు చెప్పి కామాగ్నిలో పడి
మ్రగ్గి నరుడు సుఖపు భ్రమలు కనును
పొగల విసము క్రక్కు సిగరెట్టె షోకురా
జననుతాంతరంగ! వినుర! రంగ!

కళాకృష్ణుల "కృష్ణశతశతి"

తెనుఁగు కాఁగడా

శ్రీ జ్ఞానానందము

ఒకనాడు శాత్రవనికర గర్వముఁ జీల్చి
        తీండ్రించె దెసలు మా తెనుగు కత్తి
ఒకనాడు దివ్య రాజ్యకవాటములవిప్పి
        తేనెలొల్కించె మా తెనుగువాణి
ఒకనాడు పెరభూములకు సోయగముదిద్ది
        ఘనతగాంచినది మా తెనుగులక్ష్మి
ఒకనాడు ప్రకటశౌర్యక ధోజ్జ్వలతఁజాటి
        ప్రణుతులందినది మా తెనుగుశక్తి

        ఒక్కనాడుర్విసత్కళాభ్యుదయమంద
        నాణెమగు వేదమధుర భాండములనించి
        గొనబు దేశాలఁబంచిన తెనుగుతల్లి
        కొరతులనీయరండు రండాంధ్రులారా!

శబ్దశాసనుని భాషా జీవరసధునీ
        జలబిందువులయందు జలకమాడి
ఉభయవాఙ్మయ ప్రవీణోద్దండు హోమకుం
        డాన దీక్షామహేంధనము వైచి
ప్రౌఢ సాహిత్య సామ్రాజ్య ధూర్వహుని మొ
        య్యారంపు రచనకు నంజలించి
సహజ సత్కవితా విశారదు భక్తి మో
        హన భావ పంక్తికి తనువు మఱచి

        జిగిబిగిన వ్రాయుసుకవి విశేష రచన
        యసదృశంబగునని దాని పసనెఱింగి
        దేశదేశాల్ సవాల్ జేయు తెనుగు తల్లి
        కంజలిఘటింప రండు రండాంధ్రులార!

కాకతీయుల వీరగాథా ప్రబంధ శౌ
        ర్యాంకితంబైన ప్రఖ్యాతి పటిమ
కృష్ణభూపుని కళా రేఖా ముఖస్ఫూర్తి
        బెడగు పొట్నూరు దిగ్విజయ ఘోష

రఘునాథ భూజాని ప్రజ్ఞా విశేషంబు
            వినుచు తంజావుర తెనుగు ప్రతిభ
పాపరాయని వినిర్వక్ర విక్రమ పుష్టి
            గణపించు తత్కథా గౌరవమ్ము

            వీర రుద్రాంబికా లసద్వీర చరిత
            ఖడ్గ తిక్కన పౌరుష కాయ బలము
            తెలుగు దాసరి పాటలో నుఱకలెత్తు
            నా మహాశక్తికిడుదు జోహారు లాంధ్ర!

పాషాణములకు జీవము బోసి చివురించి
            చేవనందినది మా శిల్పరచన
స్వర్గంపు రససిద్ధి సరిగాదు నాకంచు
            పలికి పోయినది మా తెలుగు కవిత
కమనీయ చిత్రాలు ఘంటికా ముఖమున
            వెలువరించినది మా తెనుగు కుంచె
కటిక తాళ్ళను నైన గఱగించి గాంధర్వ
            మునఁ బేరు వడసె మా తెనుగు గీతి

            ఖండ ఖండాంతరముల సఖండ కీర్తి
            తేజరిల్లి వర్ధిల్లె మా తెనుగు తల్లి
            అదె కనంబడు స్థూపాల యందు నెక్కు
            పరమ భాగ్యమ్ము పూర్వాంధ్ర వైభవమ్ము

వెలయింపవలె నాంధ్రి విమల గాంధర్వ వి
            ద్యా వైభవైక విన్యాస దీప్తి
చాటింపవలెనాంధ్రి సాహిత్య సంపద
            నఖిల భూ భువనమ్ము నవఘళింప
కొండాడవలెనాంధ్రి నిండారు శిల్ప క
            ళా ఖండములు సముల్లాసమంద
మెఱయింప వలెనాంధ్రి మేల్మి చిత్తరువులు
            పెఱ దేశముల వారు పెదవి గరువ

            మిన్నుముట్టగావలె కళోన్మేష మూర్తి
            భావ శబలతా భాసం విభా సమాన
            సంపదౌన్నత్య మపుడు విస్తరిత మయిన
            తెలుగుసీమ యుప్పొంగి సత్కళ భజించు

నవభారతంలో భాషారాష్ట్రాల వైశిష్ట్యం

శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు

మహాత్మా గాంధిగారి నాయకత్వము క్రింద గొప్ప త్యాగములను చేసి మనము స్వరాజ్యము సంపాదించుకున్నాము. ప్రతి పురుషునికి, స్త్రీకి ఓటు హక్కుగల ప్రజా రాజ్యమును సంపాదించుకున్నాము. ఆస్తి యున్నను లేకపోయినను, చదువు వచ్చినను, రాకున్నను వయస్సువచ్చిన వారందరికి ఓటుహక్కు ఇవ్వబడినది ఆ ఓటరులే ఈ 40 కోట్ల జనసంఖ్య గల ప్రజా రాజ్యమునకు ఏలికలు. ఆ ఓటరులు ఎన్నుకొన్న ప్రతినిధులే సార్వభౌమాధికారము గల లోక సభలోను, రాష్ట్రముల విధాన సభలలోను సభ్యులై యున్నారు. ఓటరుల యొక్క మాతృ భాషలోనే శాసనములు చేయబడుట, ప్రభుత్వము నిర్వహింపబడుట, న్యాయస్థానములలో విచారణ, తీర్పులివ్వబడుట సహజమైన పునాది హక్కు. భరత వర్షము చాల పెద్ద దేశము. ఇందు కొన్ని భాషలు ముఖ్యమైనవిగనున్నవి. ఈ దేశమునకు ఇంగ్లాండు, ఫ్రాన్సు, ఈజిప్టు, టర్కీలలో వలె ఏక రాష్ట్ర విధానము పనికిరాదు. ఇందువలన మన దేశమును వివిధ రాష్ట్రములుగ చేసి రాష్ట్రములకు కొన్ని విషయములలో మాత్రం శాసన నిర్వహణ, ప్రభుత్వ పాలనాధికారములను కలుగచేసి యావత్తు దేశమునకు సంబంధించిన విషయములలో మాత్రము కేంద్ర పార్లమెంటు, కేంద్ర ప్రభుత్వము అధికారములను కలిగి యుండునట్లుగ సంయుక్త ప్రభుత్వము ఏర్పాటు చేయబడినది రష్యా, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా మొదలైన విశాలమైన దేశములలో ఇట్టి సంయుక్త ప్రభుత్వమే స్థాపింపబడియున్నది. అందువలన సరియైన ప్రజా రాజ్యము స్థాపింపవలెనన్న యుద్దేశ్యముతో రాష్ట్రములన్నిటిని ఏక భాషా రాష్ట్రములుగ ప్రజల భాషలలో స్థాపించుకున్నాము. మన రాజ్యాంగ విధానము యొక్క 8వ షెడ్యూలులో దేశములోని 14 భాషలు జాతీయ భాషలుగ అంగీకరింప బడినవి, ఇవన్నియు అనాదినుంచి మన ప్రజలచే వాడబడుచున్న మాతృభాషలు. ఈ భాషలన్నిటికి వేల సంవత్సరములుగ వాజ్మయము కలిగి విశేషముగ వైజ్ఞానికాభివృద్ధిని పొందిన భాషలు. మన భారతదేశము యొక్క నాగరికత, ధర్మము, విజ్ఞానము యావత్తు ఈ భాషలలోనే ప్రజలలోని అడుగు భాగమునకు వ్యాపించి భారతదేశముయొక్క, ఐక్యత, సౌష్ఠవము అంత ర్జాతీయ ప్రతిష్ట వేల సంవత్సరాలుగ స్థాపింప బడనది. అందువలన ఈ భాషలన్నిటిని అంగీకరించి వీటిని జాతీయ భాషలుగ చేసినారు.

సంస్కృతము, ఉర్దు రెండు భాషలు యావద్భారత దేశములో వ్యాపించిన భాషలు, కనుక వాటి రెంటికి ప్రత్యేక రాష్ట్రములు లేవు. వాటి మీద భాషా రాష్ట్రములు నిర్మింపబడ లేదు. తక్కిన భాషలలో హిందీ భాష ప్రజల మాతృ భాషగా గల ఉత్తర ప్రదేశము, బీహార్, మధ్యప్రదేశ్, రాజాస్థాన్ రాష్ట్రములు హిందీ భాష యొక్క ఏక భాషా రాష్ట్రములుగ చేయబడినవి. పంజాబు మాత్రము గురుముఖి, హిందీసమానముగ నున్నందున ద్విభాషా రాష్ట్రముగ చేయబడినది. తక్కిన 11 దేశభాషలకు 11 రాష్ట్రములున్నవి. ఈ ఏర్పాటు సహజముగను, ప్రజా ప్రభుత్వమునకు స్థిరత్వమును, బలమును ఇచ్చునదిగను నున్నది ఏ నాగరిక దేశములో కూడ జాతీయ ప్రభుత్వము, శాసన నిర్మాణము, న్యాయస్థానముల కార్యక్రమము విదేశ భాషలలో జరుపబడుట కని విని ఎఱుగము. మన దేశములో మాత్రమే గాక విదేశ ప్రభుత్వము క్రిందనున్న అన్ని దేశములలోను విదేశ భాష ఆయా ప్రజల మీద బలవంతముగ అంటకట్టబడి ప్రభుత్వ భాషగా చేయబడుటయే చారిత్రక విషయము. ఏ దేశమైనను స్వతంత్రమును పొందగనే తన యొక్క స్వభాషలోనే, లేక స్వభాషలలోనే ప్రభుత్వ నిర్వహణము చేసుకొనుటయే ఆత్మ గౌరవకరమైన విషయము. ఆ పనినే మనము చేసుకొని యున్నాము. కనుక భాషా ప్రయుక్త రాష్ట్రములను ఖండించువారు దేశాభిమానులని చెప్పతగిన వారు కారు. యావద్ భారత దేశమునకు కూడ మన దేశభాషలలో నెక్కువ వ్యాప్తముగ నున్న హిందీ భాషనే అధికార జాతీయ

భాషగ నిర్ణయించుకొని రాజ్యాంగములో వ్రాసుకున్నాము. అంత మాత్రము చేత ప్రస్తుత ప్రపంచములో ముఖ్యముగ ప్రకృతి శాస్త్ర జ్ఞానము విశేషముగ గల యూరపు ఖండములోని భాషలను మన విద్వాంసులు నేర్చుకొనకూడదని కాని, మిగుల అభివృద్ధి చెందిన ప్రకృతి శాస్త్రజ్ఞానమును సంపాదించ కూడదని గాని అంతర్జాతీయ విషయములలో నవీన జాతులతో మనము తులతూగ కూడదని గాని ఎవరును చెప్పుట లేదు. అందువలన అంతర్జాతీయ రంగములో ప్రధాన భాషయైన ఆంగ్లమును మూడవ భాషగా అభ్యసించి తన్మూలమున ప్రకృతి శాస్త్రవైజ్ఞానికాది విశేషములను గ్రహింపవచ్చును.

హైస్కూళ్లలో మాతృభాషలో విద్య నభ్యసించిన విద్యార్థులకు కళాశాలలకు పోగానే ఆంగ్ల భాషలో యావత్తు విద్యను నేర్చుకొనుట చాల కష్టముగానున్నది. హైస్కూళ్లలోని బోధనా భాషయే కళాశాలలో కూడ బోధనా భాషగ నుండవలెను. బోధనా భాష తెలుగు కాగానే తెలుగులో వ్యవసాయ, సాంకేతిక, ప్రకృతి శాస్త్రములు, చరిత్ర, అర్థిక రాజకీయ శాస్త్రము ఇంజనీరింగు మొదలైన అన్ని విషయములలోను పాఠ్యగ్రంథములు వ్రాయబడి ప్రచురించబడును. ఈ పాఠ్యగ్రంథములే గాక ఈ విషయము లన్నిటిలోను సామాన్య ప్రజల కొరకు నవీన విజ్ఞానమునిచ్చు గ్రంథములు విరివిగా వెలువడును. ఆధ్యాత్మిక గ్రంథములు తెలుగులో గలవు గాని నవీన విజ్ఞానము నిచ్చు గ్రంథములు తెలుగులో గాని, యితర ప్రజల భాషలలో గాని లేవనియే చెప్ప వలసి యున్నది అమెరికాలో ఆంగ్లభాషలో ప్రకృతి శాస్త్ర, సాంకేతిక గ్రంథములు విద్యాలయములలో పాఠ్యగ్రంథములుగాక సామాన్య జనులకొరకు సంవత్సరమునకు ఒకకోటి డెబ్బది లక్షలమ్ముడు పోవుచున్నవి. నవీన విజ్ఞానము ప్రజలలో విరివిగా వ్యాపించనిది భారత జాతి నవీన జాతిగా వృద్ధి చెందక మౌఢ్యములోనున్న జాతిగనే యుంటగలదు. సర్వకళాశాలలలో నుత్తీర్ణులైన విద్యార్థులే ప్రభుత్వోద్యోగముల నాక్రమించియు న్యాయవాదులు ఉపాధ్యాయులు డాక్టర్లు మొదలగు వృత్తులలో ప్రవేశించియు, సామాన్య ప్రజలకు నాయకులగుదురు, ఆంగ్ల విద్యాధికులు ప్రజల భాషయందు నిర్లక్ష్యము చూపి ప్రజలను తమకన్న తక్కువగా చూచుటయు, సామాన్య ప్రజలు వీరిని విదేశ వ్యామోహితులని తలచుటయు తటస్థించి ఉభయులును ఐక్యత యేర్పడక అవినాభావ సంబంధము లేని రెండు వర్గములుగ చీలి యున్నారు, ఎంతటి తెలుగు పండితులైనను ఆంగ్ల విద్యాధికులచే తక్కువ వారుగ హీనముగ చూడబడుచున్నారు. ఆంగ్ల విద్యాధికులైన ఉద్యోగస్థుల వేషభాషలు, అభిరుచులు, భావములు సామాన్య ప్రజలకు సంబంధించనివై యున్నందున వారు ప్రజలలో కలసి మెలసి యుండలేక పోవుటయు, ప్రజలను తక్కువగ చూచుటయు ప్రజలు వీరి యందు భయమును అసూయను కలిగి యుండుటయు జరుగరాదు సాధారణముగ ప్రజల దైనందిన జీవనమునకు సంబంధించిన విద్య, ఆరోగ్యము, వైద్యము, వ్యవసాయము, పశురక్షణ, సహకారము మొదలయిన శాఖలలో పని చేయు నుద్యోగులవల్ల పొందవలసిన లాభములను ప్రజలు సంపూర్ణముగా పొందుట లేదు. ఇంతేగాక ఆంగ్ల విద్య జాతీయ నాగరికతను తుడిచివైచి పాశ్చాత్య నాగరికతను వ్యాపింప చేసినది. మన ఆధ్యాత్మిక నాగరికతను పునరుద్ధరించుటకే తాను స్వరాజ్యమును సంపాదించుచున్నానని మహాత్మ గాంధి చెప్పినాడు. మన దేశ భాషలన్నిటిలోను ఒకే భావములు, ఆదర్శములు, ఆధ్యాత్మిక నాగరికత గలదు. వాటిలోనే క్రింది నుంచి పై వరకు విద్యా విధానముల నేర్పాటు చేసి నవీన విజ్ఞానమును కూడ వాటిలోనే యిచ్చిననే గాని భారత జాతి తన యొక్క ఆధ్యాత్మిక తత్వమును ప్రపంచములో తన అగ్రస్థానమును, నిలుపుకొనదు. జపాను అటులనే చేసినది. ఇతర జాతులను కేవలము అనుకరించు జాతి ప్రత్యేక వ్యక్తిత్వమును గోల్పోయి హీనస్థితిని చెంద గలదు. మన జాతీయ రాష్ట్ర ప్రభుత్వములు శాసనసభలు న్యాయ స్థానములు, తెలుగు మొదలగు దేశభాషలలో నిర్వహించబడుటకు ఆయా రాష్ట్రములలోని తెలుగు మొదలగు ప్రజల భాషలు బాగుగా వచ్చి నవీన విజ్ఞానమును కూడ సంపాదించిన పట్టభద్రులు కావలసి యున్నారు. కనుక వారు తెనుగు భాష మూలముననే యావత్తు విజ్ఞామును పొందినవారుగ నుండవలెను. జపాను, చైనా, రష్యా, ఈజిప్టు, తురుష్కము, సిరియా, ఇరాకు మొదలైన దేశములన్నిటిలోను తమతమ మాతృ భాషలలోనే యావత్తు విద్యనిచ్చుచు, పరిపాలనను జరుపుకొనుచు స్వతంత్రమును కాపాడుకొని అభివృద్ధి చెందుచున్నారు. పాశ్చాత్య భాషలను ఉత్తమ ప్రకృతి శాస్త్రజ్ఞానముకొరకు మితముగ వాడుకొను చున్నారు. కమ్యూనిష్టు రష్యాలో మన భారత దేశములో వలెనే అనేక భాష లున్నవి. ఐనను ప్రతి రాష్ట్రములోను అచటి మాతృ భాషలోనే విశ్వవిద్యాలములను స్థాపించి యావత్తు విద్యను నేర్పుచు రష్యా భాషను ద్వితీయ భాషగ నేర్పుచున్నారు, రష్యా భాషకు మన దేశములోని హిందీ భాషకుగల స్థానము గలదు భాషారాష్ట్రముల తోపాటు, విశ్వ విద్యాలయములలో మితముగ ఆంగ్ల భాషను వాడుకొనుచు యావత్తు విద్యను దేశభాషలలో గరపుట, భారత

జాతి ఐహికాముష్మిక నాగరికత గల గొప్ప జాతిగ మరల నభివృద్ధి చెందుటకు మిగుల ఆవశ్యకమై యున్నది. దేశ భాషలకు వెనుక మాతృభాషగా సంస్కృతమున్నది గనుకను సంస్కృతములోనే మన ప్రాచీన నాగగికత యంతయు కలదు గనుకను సంస్కృత భాషా వ్యాపకము కూడ అవసరమై యున్నది. సాహిత్య గ్రంధములనే గాక ఉపనిషత్తులు భగవద్గీత, రామాయణము, భాగవతము మొదలగు ఆధ్యాత్మిక గ్రంథముల పఠనమునకు ప్రభుత్వము, ప్రజలు ప్రోత్సాహముగలుగచేసి, విదేశ పాలనముక్రింద ఆంగ్లనాగరికత, ఆంగ్లవిద్య వ్యాపించినకాలములో మన దేశములో నేర్పడిన ఆధ్యాత్మిక నైతిక పతనమునుండి దేశమును పైకి లేవదీసి మరల గొప్ప జాతిగ గావించవలెను. అపుదే చల్లని ఆధ్యాత్మిక ధర్మ ప్రేమ శాంతి సందేశమును భారతదేశము ప్రపంచమున కివ్వగలదు. భాషా రాష్ట్రములే ఆయా రాష్ట్రములలోని దేశభాషల సర్వతోముఖాభివృద్ధికి అవిరళ కృషిని చేయగలవు ఈ కారణములచేతనే మనము అనేక సంవత్సరములాందోళనము గావించి ఆంధ్ర రాష్ట్రమునేగాక విశాలాంధ్రమును కూడ సుందరమైన హైదరాబాదు నగరము రాజధానిగ అయిదు సంవత్సరాల క్రిందట నవంబరు 1 వ తేదీన స్థాపించుకొనియున్నాము. ఇందువలన ఆంధ్రుల అభివృద్ధి దినదిన ప్రవర్ధమానముగ సర్వతోముఖముగ జరుగుచున్నది, ఆంధ్రులకు ఆత్మగౌరవము, వ్యక్తిత్వము మరల నేర్పడినవి. ఇంక మీద ఆంధ్ర భాష ప్రభుత్వ భాషగా పరిగణింప బడవలసి ఉన్నది. విశాలాంధ్రములో విశ్వవిద్యాలయములలో గూడ విద్యను ఆంధ్రభాషలో బోధింపవలసియున్నది. మనము మన దేశములోని భాషలన్నిటిని భాషా రాష్ట్రములనన్నిటిని, వివిధ భాషలు మాటలాడు ప్రజలను గౌరవించి ప్రేమించవలెను. భారత జాతి యొక్క ఐక్యతను దృఢపరచవలెను. ఒక భాషనుండి మంచి సంగతులను రెండవ భాషలోనికి తర్జుమా చేసుకోవలెను. భాషా రాష్ట్రముల సరిహద్దుల మార్పుల కొరకు తగువులాడుట బొత్తిగా కూడదని. ఉన్న రాష్ట్రములతోనే తృప్తిచెంది వివిధ రాష్ట్రముల యొక్క మొత్తపు దేశము యొక్క అభివృద్ధిని శాంతముగను, స్థిరముగను సంవత్సరముల కొలది గావించుకొనుట కర్తవ్యము. సరిహద్దు సమస్యలు క్లిష్టముగానుండకమానవు. వాటి తగవులతెరువునకుపోక సరిహద్దులలోనే గాక నితర చోట్లకూడ నివసించు అల్పసంఖ్యాకుల భాష, లిపి, వాఙ్మయము, మతముల సంరక్షణను భారత రాజ్యాంగ చట్ట ప్రకారము పొందుటకే ప్రయత్నించ వలెను.

భారతదేశమునకు ధార్మిక ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, సాంఘిక ఆర్థిక నాగరికతా ఐక్యత ఎల్లప్పుడును గలదుగాని యావత్తు భారతదేశము హిమవత్పర్వతములు మొదలు కన్యాకుమారి వరకు రాజకీయ పరిపాలనా ఏకత్వమును పొందుట జరిగి 1950 నుండియే సంపూర్ణమైన ప్రజారాజ్యము ఏర్పడినది. ఈ ఐక్యతను, ఈ ప్రజారాజ్యమును సుస్థిరముగ గావించుకొని శాశ్వతముగ కాపాడుట భారతీయులందరియొక్క పవిత్ర ధర్మము. భారతీ నాగరికతకు అనాది నుంచియు సర్వమత సహనము, ధర్మ నిర్వహణము, గ్రామ స్వరాజ్యము, గ్రామ వ్యవసాయ గ్రామ గృహ పరిశ్రమల వికాసము ప్రధాన లక్షణములై యున్నవి. వీటిని మనము గట్టిగా పునరుద్ధరించ వలెను. మన జాతీయ ప్రభుత్వము సంకల్పించిన పంచవర్ష ప్రణాళికల యొక్కయు, గ్రామ స్వరాజ్య పునరుద్ధరణ యొక్కయు, జయమునకుత్సాహముతో తోడ్పడవలెను. ఈ పని యంతయు దేశభాషల ద్వారాను, భాషా రాష్ట్రముల మూలముననుమాత్రమే జయప్రదముగా జరుగగలదు. ఇపుడు మనకు ఈశాన్యమున నున్న కమ్యూనిస్టు చైనా దేశము, మనకు పెట్టని కోటగాను ఉత్తరమున నైసర్గిక సరిహద్దుగానున్న హిమవత్పర్వతములను దాటి మనదేశములో జొరబడి పెన్నెండువేల చదరపు మైళ్ల ప్రదేశమును స్వాధీన పర్చుకొని ఇంకను నలుబదివేల చదరపు మైళ్ల భూభాగము రావలెనని తగవులాడుచున్నది. ఎప్పటికైనను భారతదేశమును కబళించి యిచటి ఆధ్యాత్మిక నాగరికతను నాశనము గావించి ఈదేశమును కమ్యూనిజములోకి కలుపుకొన వలెనని చైనా నాయకులువ్విళ్లూరు చున్నారు. మూడవ ప్రపంచయుద్ధము కావలెనని కోరుచున్నారు. మనకు వాయువ్య మూలనున్న పాకిస్తానము మనదేశములో శాశ్వతభాగమైన కాశ్మీరును కబళించుటకు అమెరికాయిచ్చిన ఆయుధములతో మనదేశము మీద దాడులు సల్పుచున్నది. మనదేశములో చైనాకు పాకిస్తానుకు స్నేహితులైన దూతలు కొంతమందికలరు. కావున మనదేశములోని ముఖ్యముగా యువకులు, యువతులు అట్టి విదేశ ఏజంట్లనుండి జాగరూకులై యుండవలెను. అంతేగాక మనదేశము యొక్క సురక్షితమును, స్వతంత్రమును ఐక్యతను, ప్రజారాజ్యములో మాన ప్రాణ ధనములర్పించి కాపాడుటకు అందరు ప్రజలును ఎల్లప్పుడు తయారుగా నుండవలెను. భారతస్వాతంత్ర సమరచరిత్రలో ఆంధ్రులకెంతటి మహోన్నతమైన స్థానమున్నదో అంతటి మహోన్నత స్థానమును దేశాభివృద్ధి పురోగమనచరిత్రలోను సమైక్యతలోను స్వాతంత్ర్య పరిరక్షణలోను సైతము మనము సంపాదింప వలసి ఉన్నది.

ప్రబోధము

శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

తన దేహమ్మున రక్తమాంసములు స్వార్థత్యాగ మేపార న
ప్పనముం జేసి యనన్య సాధ్యసరణిన్ స్వాతంత్ర్య భాగ్యమ్ముఁదె
చ్చెను రాష్ట్రమ్మున కాంధ్ర వీరవరుఁడౌ శ్రీరాము; లప్పూర్వపుం
దిన మేతెంచెఁ; దదాత్మశాంతికయి ప్రార్థింపంగ రండీశ్వరున్

చిరకాలేహితమైన రాష్ట్రము లభించెం; బాసె నాంధ్రాళి దు
స్తర దాస్యమ్ము; తలిర్చె నిక్కువములై తత్స్వప్నముల్ నేఁటికిం;
బరితృప్తిం గన కంతమాత్రమునఁ దత్స్వాతంత్ర్య మత్యంత సు
స్థిరమై రాష్ట్రములందు మేటి, యను వాసిం గూర్ప యత్నింపుఁడీ!

నన్నయభట్టువంటి కవినాథులఁ, దిక్కనవంటి వీరులం,
దిన్ననివంటి భక్తుల, సుధీమణి రాయలవంటి రాజులం,
జిన్నయవంటి శాబ్దికుల సిద్ధయశస్కులఁ గాంచె; నేరికే
నెన్నఁ దరంబె యాంధ్ర జనయిత్రి యహీన మహానుభావతల్

అన్యదేశముల ననన్యాదృశయశమ్మునించిన యాంధ్ర వాణిజ్యగరిమ;
జీవకళల బ్రహ్మసృష్టికి సీడనఁబరఁగిన యాంధ్ర శిల్ప ప్రశస్తి;
దేశభాషలనెల్లఁ దెలుఁగు లెస్సను పేరికనువైన యాంధ్రకావ్య ప్రసిద్ధి:
సంగీత భిక్ష నొసంగి ద్రవిడుల దిద్దిన యట్టి యాంధ్రగీతి ప్రతీతి।

తలఁచి కొని పొంగిపోయిన ఫలములేదు:
మోడువాఱిన తద్యశో భూరుహమ్ము
చివురులం, బూల, ఫలములఁ జెలఁగ మగుడ
దోహదము సేయఁ బూనుఁ డాంధ్రులు! సతమ్ము.

పండెం బున్నెపుఁబంట। యాంధ్రవనిలో స్వాతంత్ర్య భానుప్రభల్
నిండెన్: దాస్యతమమ్ములుం దొలఁగె; నున్మీలన్మనః కంజముల్
మెండౌ వాఙ్మధుబిందులన్ నినిచె వల్లించెం గవిశ్రేష్ఠులన్
గండుంగోయిల లాంధ్రకీర్తి పదముల్, గల్గున్ శుభోదర్కముల్.

పంచాయితీ రాజ్యం

శ్రీ యం. గున్నేశ్వరరావు

భారతదేశంలో పదకొండు లక్షలకు పైగా గ్రామాలున్నాయి. ప్రజలు నూటికి ఎనభై మంది వరకూ వ్యవసాయదారులు, వీరు వేద యుగంలోనే సౌష్ఠవమైన జీవన విధానానికి అనుగుణమైన హంగులన్నీ అమర్చుకొన్నారు. ప్రతి గ్రామంలో కాల ప్రవాహం వాటి నన్నిటినీ తారుమారు చేసింది. పరరాజుల పాలనలో పడ్డాం మన్ని మనం మరచి పోయాం. పరదాస్యం బాగా పట్టుబడింది. అదే బాగుందని మైకంలో పడిఉన్న ప్రజానీకాన్ని జాగృతి పరచి దాస్యంనుంచి విడిపించారు త్యాగమూర్తులైన మన బాపూజీ, వేదయుగం నాటి పురాణకాలం నాటి స్వయం సమృద్ధమైన గ్రామరాజ్యాన్ని పునర్నిర్మించాలని పూనుకున్నారు మన నెహ్రూజీ. పథకం తయారయింది, అదే పంచాయతీ రాజ్యం. దానిని ధైర్యంతో అమలు పరచడానికి ముందంజ వేసినవి రెండే రాష్ట్రాలు 1. ఆంధ్రప్రదేశ్ 2. రాజస్థాన్. ఆ ఘనత అప్పటి మన ముఖ్యమంత్రి, నేటి భారత కాంగ్రెస్ నాయకులు శ్రీ నీలం సంజీవ రెడ్డి గారికే దక్కింది; వారికి మన కృతజ్ఞతలు. ఈ పంచాయతీ రాజ్యాన్ని విజయవంతంగా ముందుకు సాగిస్తున్న గౌరవం మన ఆంధ్రులదే.

ఈపథకాన్ని అమలు పరచడం ప్రారంభించి రెండు సంవత్సరాలైంది 1961 నవంబరు 1వ తేదిన పంచాయతీ రాజ్య ద్వితీయ వార్షికోత్సవం రాష్ట్రమంతటా విజయవంతంగా జరుపుకుంటున్నాం ఈసందర్భంలో ప్రాచీన భారతీయ గ్రామీణ జీవిత విధానాన్ని ఒక్కసారి జ్ఞాపకం చేసుకోడం ఎంతైనా అవసరం. ఆరోజులలో ఒక గ్రామంలో కొన్ని కుటుంబాల ప్రజలున్నారంటే వారందరికీ ఎంతో అన్యోన్యత. ఎవరి నిర్ణీతవిధులను వారు నిర్వర్తించు కొనే వారు ఆగ్రామానికి కావలసిన ఆహార పదార్థాలు, పప్పు—చముదు దినుసులు అక్కడే పండించు కొనేవారు, వారికి కావలసిన వ్యవసాయ పరికరాలు తయారుచేసే కమ్మరులు వడ్రంగులు అక్కడే ఉండేవారు. అవసరమైన వస్త్రములు, మృణ్మయ పాత్రలు అక్కడే తయారయేవి. చాకలి మంగలిలేని గ్రామాలు అప్పట్లోలేవు పై వృత్తులవలంభించిన వారందరికీ మాన్యాలుండేవి. ఇంటింటా రాట్నాలుండేవి. ఎవరికి తగ్గని వారికుండేదిగనుక నిరుద్యోగ సమస్య కవకాశమేలేదు. అప్పుడు గురుకేంద్ర విద్య అమలులో ఉండేది గ్రామంలో సమర్థుడైన శమదమాది సత్త్వ గుణసంపన్నుడైన పండితుని ఆశ్రయించేవారు విద్యార్థులు. ఆయన ఫలాపేక్ష లేకుండా విద్యా దానంచేసేవాడు శిష్యులాయనను దైవంగా భావించి విద్య నభ్యసించేవారు. గ్రామంలో ఒక నాయకుడు ఆయన కయిదారుగురు సలహాదారులు ఉండేవారు. వీరే పంచాయతీదారులు. వీరు నిష్పక్షపాతంగా చేసిన నిర్ణయాలకు ఎదురు చెప్పే వారులేరు. వారిదెంత నిరాడంబర జీవనం: ఎంత ప్రశాంత వాతావరణం. అందుకే వారు నిశ్చలమైన చిత్తంతో పరిశోధనలు చేసి, నేటికీ అబ్బురమయ్యే జ్యోతిష, ఖగోళ, భూగోళ శాస్త్రాలను సృష్టి రహస్యాలను విప్పిచెప్పి ఆస్తికతను సుస్థిరంచేశారు.

ఆ గ్రామీణ జీవిత విధానం కాలప్రవాహంలో పయనించి పయనించి ఎన్నో మార్పులుపొంది అన్నిటికీ యితరులపై ఆధారపడే ప్రస్తుత పద్ధతికి దిగింది. మన గ్రామాలకు చక్కని త్రోవలే లేవు. కావలసిన తిండిగింజలు పండవు నూలుతీయడం మనకు రాదు. కట్టగుడ్డలేదు త్రాగడానికి ఆరోగ్యకరమైన నీళ్లులేవు; చదువుకునే అవకాశాలు చాలా తక్కువ, ఎవరికి వారే పెద్దలనడం వల్ల కోర్టునకెళ్లకుండా మన తగవులు తీరవు. యిట్లా నానాటికి అధోగతి పాలవుతున్నాము ఇంతదీన పరిస్థితిలో ఉన్న గ్రామాలను పునరుద్ధరించి స్వయం సమృద్ధం, స్వయంపోషకం, స్వయం పరిపాలనాదక్షమైన గ్రామాలుగా తయారుచేయడమే నేటి పంచాయితీ రాజ్య ప్రధానాశయం.

1959 పంచాయితీ రాజ్యచట్టము ననుసరించి రాష్ట్ర ప్రభుత్వమువారు తమలో కేంద్రీకృతమైన అధికారము లనన్నిటిని వికేంద్రీకరించి తే 1—11—59 నుండి జిల్లా పరిషత్తులకు పంచా

యితీ సమితులకు పంచియిచ్చారు. ఇప్పటికి 21 జిల్లా పరిషత్తులు 271 సమితులు ఏర్పడ్డాయి మనరాష్ట్రంలో. ప్రతి రెవిన్యూ జిల్లాకు ఒక పరిషత్తు. సుమారు ప్రతి 80,000 జనాభాగల ప్రాంతానికొక సమితి ఉద్దేశింపబడ్డాయి ప్రతి సమితికి వ్యవసాయము, పశువైద్యము, వైద్యము, ఆరోగ్యము, విద్య సాంఘికవిద్య, సహకారము స్త్రీసంక్షేమము శిశుసంక్షేమము, లఘుపరిశ్రమలు, పంచాయితీలు, సామాన్య నీటి వనరులు, సివిల్ వర్క్సు అన్నిశాఖలు అప్పగించబడ్డాయి. స్థూలంగా చెప్పుకోవాలంటే ప్రతి సమితి చట్టబద్ధమైన ఒకచిన్న రాష్ట్రప్రభుత్వము లాంటిది. ఈ పంచాయితీ రాజ్య వ్యవస్థలో ప్రతిగ్రామము ఒకప్రత్యేక పంచాయితీగానో ప్రక్క గ్రామపంచాయితీతో చేరినదిగానో ఉంటుంది ఆగ్రామపంచాయితీల అద్యక్షులందరు సమితి సభ్యులు. సమితిలో ఏ అభివృద్ధి కార్యక్రమం కొనసాగాలన్నా వారంతా దీక్ష వహించాలి అభివృద్ధి కార్యక్రమాలను నిర్ణయించుకొనే అధికారం పూర్తిగా వారిదే. వారు అధికారులకంటే బాధ్యతలను గుర్తించి నిర్వర్తించడంలో తత్పరులు కావాలి. ఏఒక్క గ్రామంలోనయినా ఒక అభివృద్ధి ప్రణాళికను అమలు పరచుకోడంలో గ్రామస్తులు వారి నాయకులు అశ్రద్ధ చేస్తున్నారంటే సమితి ద్వారా ఆగ్రామానికి జరుగ వలసిన ఉపకారాన్ని సదవకాశాన్ని వారు కోల్పోతున్నారన్నమాట.

పైని పేర్కొనిన శాఖలన్నిటిలోను యోగ్యతలు పొందిన ఉద్యోగులు సమితికి సిబ్బందిగానున్నారు. వారుకూడ భారతదేశ పౌరులే. భారతదేశ పునర్నిర్మాణంలో వారికి కూడ పూర్తి బాధ్యత ఉంది. యోగ్యతలను పొందినది సంఘసేవకొఱకే ఉద్యోగం పూలపాన్పుకాదు. కంటకావృతమైన చీకటిత్రోవ. చదివి తాను సంపాదించిన విజ్ఞానాన్ని వినియోగిస్తూ అనుభవంతో అజ్ఞానులైన అమాయకులైన గ్రామీణ ప్రజానీకాన్ని అభివృద్ధి మార్గాల్లోనికి తీసుకుపోవాలి. గ్రామస్తులలో ఉద్యోగులున్నారుకదా మన గ్రామానికి కావలసినవి వారే చేస్తారని చేయాలని అభిప్రాయం ఉండకూడదు. ఉద్యోగులు ప్రజలతో ఉన్న ఉత్సాహాన్ని పునర్నిర్మాణ దీక్షను సరియగు సలహాల నిచ్చి, సాంకేతిక మగు అడ్డంకులను తీర్చి దారి చూప గలరేగాని తమంతటతాము ఏ పనీ చేయలేరు. ఉద్యోగుల సేవను తమకై వినియోగించుకొనే బాధ్యత తమ తమ ప్రజలలో ఉండాలి.

ప్రజలందరూ దీక్ష వహించి సాధించవలసినది ముఖ్యంగా మూడు విషయాలు: ప్రక్క గ్రామంనుంచి, పట్టణంనుంచి తమ గ్రామంలోనికి బాటఉండి తీరాలి. తమ పిల్లలు చదువుకునేందుకు (కనీసం ప్రాథమిక) బడి ఉండాలి ఏ చెఱువునీరో చెలమ నీరో త్రాగి తరుచు రోగాలకు గురికాకుండా పరిశుభ్రమైన నీటినిచ్చే బావి ఉండాలి. తరువాత ప్రజలలో నున్న దురాచారాలు, త్రాగుడు చుట్టలు బీడీలుకాల్చడం, పేక జూదం ఆటలు మాన్పించాలి. ప్రతి పయాపైసకు విలువనిచ్చి దుర్వ్యయం చెయ్యకుండా పొదుపు చేసుకోడం నేర్చుకోవాలి. కోళ్ల, పందుల పెంపకం తేనేపట్టు పురుగుల పరిశ్రమ, కుట్టుపని, నవారునేత మొదలైన గృహపరిశ్రమల వల్ల ధనార్జన నేర్చుకోవాలి పిల్లలు, పెద్దలు ముఖ్యంగా స్త్రీలు చదువుకొని తీరాలి.

ఈవిధంగా ప్రజలు, సమితి సభ్యులు, ఉద్యోగులు కలసి కృషిచేసినప్పుడు దేశం అచిరకాలంలో అభ్యుదయమునంది, మన జాతీయ నాయకులు ఆశించిన పంచాయతీరాజ్యం గ్రామరాజ్యం, రామరాజ్యం చేకూరి ప్రపంచానికే ఆదర్శప్రాయమౌతుంది. అందుకు మనమంతా యీద్వితీయ వార్షికోత్సవ సందర్భములో దీక్షతీసుకోవాలి ఈ సత్సంకల్పానికి దయామయుడగు పరాత్పరుడు తోడ్పడి మనకు కార్యసిద్ధిని చేకూర్చుగాక.



ప్రదేశావతరణ

శ్రీ ఆర్. శ్రీమన్నారాయణ శర్మ

వినుమోయి ఆంధ్రా!
విమల గుణ సాంద్రా!

"ఆంధ్ర ప్రదే"శా వ, తరణేతి హాసమ్ము
ఆంధ్రజననీమంజు, లాస్యదరహాసమ్ము! వినుమోయి

"శాత వాహన" విభుల సామ్రాజ్య చరితమ్ము
ప్రాత రాంధ్ర ప్రతాపముల రస భరితమ్ము. వినుమోయి

చాళుక్య, రాజుల కళాలక్ష్య వచనమ్ము
సాగించె ప్రథమాంధ్ర సద్గ్రంథ రచనమ్ము. వినుమోయి

కాకతీయాధిపుల కదన పాండిత్యమ్ము
లోక విఖ్యాత మాలోకింప నిత్యమ్ము. వినుమోయి

కృష్ణరాయల. కావ్య దృష్టిప్రసారమ్ము
వృద్ధిపొందిన నాటి విద్యా ప్రచారమ్ము. వినుమోయి

'అమరావతీ, శిల్ప సముదయంబానాటి
ప్రముఖాంధ్ర శిల్పముల ప్రతిభకదియేసాటి. వినుమోయి

పూర్వాంధ్ర జాతీయ గర్వముద్దీపింప
పూర్ణ స్వతంత్ర స్వ రాష్ట్రమును సాధింప. వినుమోయి

నలుబదేండ్లకు పైగ నడచిన స్వరాష్ట్రోద్య
మమ్ము సాధించెరా! మనవిశాలాంధ్రమ్ము. వినుమోయి

'మఃకోటి, తెలుగు వా రొక్కటైరీనాడు!
చక్కబడు నింకపే రెక్కుచు 'తెలుగునాడు' వినుమోయి

పరగ కృష్ణా తుంగభద్రగోదావరులు
ప్రవహింపగా మనకు పాడిపంటలు వరలు. వినుమోయి

అన్నిరంగములందు నందగ వికాసమ్ము
"ఆంధ్రప్రదేశమున"కలరు నవకాశమ్ము. వినుమోయి

"ఆంధ్రప్రదేశము న, వాభ్యుదయ మార్గమును
అందుకొనిసాగిపో" నర్థింతు దైవమును.

వినుమోయి ఆంధ్రా!
విమల గుణసాంద్రా!! వినుమోయి

నిజరూపాలు

శ్రీ ముద్దంశెట్టి హనుమంతరావు

పాత్రలు

సీతారామయ్య	—	50 సం॥
భాస్కరం	—	25 సం॥
సూర్యం	—	26 సం॥
రాజారావు	—	30 సం॥
అన్నపూర్ణ	—	20 సం॥

సీతారామయ్య యింట్లో ముందుగది. గదిమధ్య ఒక టేబిలు. రెండు కుర్చీలూ, వుంటాయి. గోడలకు ఒకరిద్దరు దేశ నాయకుల ఫొటోలు, తతిమ్మావి సినిమా స్టార్సు ఫొటో తగిలించబడి వుంటాయి. ప్రేక్షకులకు ఎదురుగా వున్న ద్వారానికి నీలిరంగు కర్టెను వుంటుంది. కుడివేపు మరోద్వారం... ఆకుపచ్చ కర్టెను అల్లల్లాడుతూ వుంటుంది. ఈ ద్వారానికి ప్రక్కనే రెండడుగుల దూరంలో బుక్ షెల్ఫు వుంటుంది. షెల్ఫులో అక్కడక్కడ పుస్తకాలుంటాయి.

సీతారామయ్య కొడుకు భాస్కరం పాతికేళ్ళ యువకుడు

తెర లేచేసరికి భాస్కరం బుక్ షెల్ఫు దగ్గర నుంచుని రెండు మూడు పుస్తకాలు తీసి. మళ్ళీ పెట్టేస్తూ, చివరికి ఒక పుస్తకం తీస్తాడు. పేజీలు త్రిప్పుకుంటూ వచ్చి, టేబిలు దగ్గర కూచుంటాడు. చదవడానికి వుపక్రమించే సమయానికి కుడివేపు గదినుండి రాజారావు వస్తాడు. గడ్డం మీసాలు బాగా మాసి వున్నందువల్ల అతని వయస్సుయిదమిద్ధమని తేల్చడం కష్టం. మాంచి ఒడ్డూ పొడుగూ, వున్నవాడు. మొహం మీద పూర్తిగా మానని గాయాలు, కాస్తంత వికృతంగా కనిపిస్తాయి. ఫుల్ చేతుల షర్టు టక్ చేశాడు.

భాస్క: (పుస్తకం మూసేసి) రండి..,రండి...ఎక్కడికిలా బైలుదేరారు?

రాజా: (బద్ధకంగా కుర్చీన కూలబడి) ఎంతని యింట్లో కూచోవడమండీ? బోరింగనిపిస్తూంది. అందుకే అలా వీధిలోకి వెళ్ళి రావాలని బైలుదేరాను.

భాస్క: వంట్లో అస్వస్థతగా వుంది కదా, మీరిలా తిరగడం నిషేధమేమో?

రాజా: పోనిద్దురూ: మనకి అన్నీ నిషేధాలే: ఏవిటోనండీ, నా వంట్లో స్వస్థత చేకూరడం లేదుగాని, యెన్నాళ్ళిలా మీకు యిబ్బంది కలిగించడమా అనిపిస్తుంది.

భాస్క: ఇబ్బందేమిటండీ? ఆ విషయంలో మీరు మరేమి బాధపడకండి. మొగమాటం, అంతకంటె అవాంఛనీయం. మా బావగారి స్నేహితులు...(క్షణం మౌనంగా బాధపడి) మా బావ యేలోకంలో వున్నాడో గానండీ, యెంత మంచి

వాడనుకున్నారు? వాళ్ళ ఆఫీసులో అందరి అభిమానము సంపాదించుకున్నాడు. కొద్దిరోజుల్లో ప్రమోషనుకూడా వస్తుందని చెప్పాడు. సరిగ్గా యిదే సమయానికి యీ ఘోరం జరగాలా? ఆ రోజు, ఆ ప్రయాణమన్నా మాను కున్నాడు కాదు...

రాజా: (భారంగా) అలా అని మన సంతృప్తికోసం అనుకొంటాం గానండీ, విధిరాత యెవ్వరూ తప్పించలేరు. ఆ రోజు ప్రయాణం తప్పించుకున్నా, రావల్సిన మరణం, మరో విధంగా దాపురిస్తుంది. ఇద్దరమూ, ఒకే బండిలో ఒకే పెట్టెలో ప్రక్క-ప్రక్కనే కూచుని ప్రయాణం చేస్తున్నామూ- అతడు మృత్యువు వాత పడ్డమేవిటి? నేను కొద్దిపాటి గాయాల్తో బైటపడి బ్రతికిపోవడమేవిటి? అంతా పర మేశ్వరుని లీలండీ?

భాస్క: (బాధగా) నిజమేనండీ మరి! (క్షణం ఆగి) మా చెల్లాయి చాలా దురదృష్టవంతురాలండీ? పుట్టిందగ్గర్నుంచీ, కష్టాల్నే కౌగళించుకుంటూవుంది. ఆమెపుట్టిన నాల్గుసంవత్సరాల్నాడే తల్లిని కోల్పోయింది. మా పెద్దనాన్న చెల్లాయిని యెంతో గారాబంగా పెంచుకొచ్చాడు. కాని, ఆమెకి పెళ్ళయిన సంవత్సరమే, జీవితంచాలించుకున్నాడు. భర్తే సర్వస్వంగా భావించుకుని బ్రతుకీడ్చుకొస్తున్న మా అన్నపూర్ణకి యీ విధంగా మళ్ళీ అన్యాయం జరిగింది... ఆమెకంటె అభా గ్యులు యీ లోకంలో యెవరుంటారు చెప్పండి? ఆలో చించండి. ఆమె మనస్సు యెంత వికలమైపోయి వుంటుందో! ఆమె వ్యధను చూళ్ళేక పోతున్నానండీ:

రాజా: (నిట్టూర్చి) మనం మాత్రం యేం చెయ్యగలమండీ? విధిని దిక్కరించడం మానవమాత్రుల తరం కాదు. మీ బావగారి దుర్మరణం, యీ క్షణంలోకూడా నా కళ్ళకు కట్టినట్టు అగుపిస్తుందండీ! నిజంగా అతను చాలా దురదృష్టవంతుడు. ఆయన దగ్గరున్న నోట్ బుక్కులో అడ్రసు ఆధారంగా మీకు ఉత్తరం రాయగలిగాను. నేను రావడానికి వీలు లేక పోయింది యిన్నాళ్ళూ... హాస్పిటల్‌లో నన్నూ చేర్చారు గా...? ఆలస్యమయినా, స్వయంగా వచ్చి మీతో యీ వివరాలన్నీ చెప్పాలని యిలా వచ్చాను. ఇటువంటి దుర్వార్త అందించిన నేను చాలా దురదృష్టవంతుణ్ణండీ!

భాస్క: మీ వుత్తరం చూసి మేమూ కొంత సందిగ్ధంలో పడ్డాం.. కాని, మీరు మా బావగారి రూపురేఖలూ, చేతిమీది పచ్చ బొట్టు పేరుతో సహా వుత్తరం రాస్తుంటే మాకు మతి పోయింది నమ్మక తప్పింది కాదు. (బాధగా) మనిషి యెంత గంభీరంగా వుండేవారనుకున్నారు? ఇంచుమించు మీ లా వుండేవాడు అతని రూపం యిప్పటికీ నా కళ్ళలో మెదుల్తూ వుంది.

రాజా: నిజంగా మీ చెల్లాయి దురదృష్టవంతురాలండీ: పాపం యీ లేత వయస్సులో వైధవ్యం రాసిపెట్టిన బ్రహ్మ గుండెలు యెంత కఠినమైనవో సుమండీ: పోనీ, మీ బావగారికి యేదన్నా యిన్సూరెన్సు వుందా?

భాస్క: (విసుగ్గా) వుందట లెండి. మానాన్న దానికోసమే తహ తహ లాడుతూ, యెప్పుడు ఆ దబ్బు వస్తుందా అని యెదురు చూస్తున్నాడు. కాని అతని మరణం గురించిన సరైన సర్టిఫికేటు సంపాదించలేక, ఒకటే గింజుకుంటు న్నాడు, మనిషి పోయాడన్న విచారం ఆయనికి బహు స్వల్పం... తండ్రి అవుతే యేం లెండి.. అతని ప్రవర్తన నాకేమీ నచ్చడం లేదు.

రాజా: అలా అనకండి. జీవితంలో డబ్బేకదండీ ప్రాధాన్యమైనది? దానికోసం తాపత్రయ పడ్డంలో తప్పేముంది?

భాస్క: (ఆశ్చర్యంగా చూస్తూ) మీరూ అలాగే అంటున్నారా?

రాజా: నేనే కాదండీ! ప్రతి మానవుడూ అదే అంటాడు. డబ్బు లేకపోతే, మనిషి మనుగడే వుండదు మీ చెల్లాయి జీవిత మంతా యిక్కడే గడవాలి. అందుకు డబ్బు వుండాలామరి?

భాస్క: మా అన్నపూర్ణ జీవితమంతా యిక్కడ గడపాలని మీరు అభిప్రాయ పడుతున్నారు. (నిట్టూర్చి) కాని. అసలు విషయం మీకు తెలీదు. ఆమెకి మళ్ళీ పెళ్ళి చెయ్యాలని ప్రయత్నిస్తున్నాడు మా నాన్న యెవరేం చెప్పినా వినుపిం చుకునే రకం కాదు.

రాజా: (విస్తుపోయి) మళ్ళీ పెళ్ళా?

భాస్క: ఔనండీ: మీకు ఆశ్చర్యంగా వుందా?

రాజా: ఆశ్చర్యమని కాదు గాని, మీ చెల్లాయి ఒప్పుకుందా అని?

భాస్క: ఆమె యిష్టాయిష్టాలతో మా నాన్నగారికి ప్రమేయమే లేదండీ. బ్రహ్మ ఆయన్ని పొరపాటున మానవుడిగా సృష్టించాడు గాని, రాక్షసుడిగా సృష్టించవలసింది.

రాజా: ఇంతకీ పెళ్ళికొడుకు యెవరు?

భాస్క: చూసే వుంటారు. అప్పుడప్పుడు యిక్కడికి వస్తుంటాడు లెండి. కుటుంబారావని యీ వూళ్ళో ఓ పెద్ద భూకామం

దున్నాడు. అతని పుత్రరత్నమే "సూర్యం" అనే అబ్బాయి పెళ్ళికొడుకు. ఒక్కగానొక్క కొడుకు. చదువు సంధ్యలు తగలబెట్టుకుని, పైలా పచ్చీసుగా వూళ్ళో తిరుగుతూ వుంటాడు. గారాబు కొడుకు గాబట్టి, తండ్రికూడా యేమీ అనడు. అతడు అడింది ఆట. పాడింది పాట. మా అన్నపూర్ణంటే ఆ అబ్బాయికి ప్రాణం. అదో పిచ్చిలెండి. కొడుకు పట్టుబట్టాడో లేదో, తండ్రి ప్రయత్నాలు ప్రారంభించాడు. మా నాన్నతో సంప్రదింపులు సాగిస్తున్నాడు.

రాజా: అయినా ఆమెకి యిష్టం లేకపోతే మీ నాన్నగారు స్వతంత్రించి ఒప్పుకోవడం కూడా న్యాయంగా లేదండీ. భర్త పోయాడన్న వ్యధతోనే ఆమె కృషించి పోతూవుంటే యింక యిదో గొడ్డలిపెట్లా? ఎంత అభాగ్యురాలు! పోనీ, చదువుకున్న మీరైనా ఆమె అసహాయతను గుర్తించి మీ నాన్నను గట్టిగా అడక్కూడదూ?

భాస్క: (సాలోచనగా) అదే నేనూ అనుకుంటున్నానండీ: ఆయన నియంతృత్వాన్ని అరికట్టాలనే అభిలాష నాకూవుంది కాని పరిణామాల్ని వూహించి యేపనిలోనైనా ప్రవేశించాలికదా: (లోపల్నుంచి యెవరో వస్తున్నట్టు చప్పుడు అవుతుంది)

భాస్క: మా నాన్న వస్తున్నట్టుంది... అలా బైటికి పోదాం పదండి...(లేస్తాడు)

రాజా: పదండవుతే...(లేచినుంచుంటాడు)

(ఇద్దరూ బైటికి నిష్క్రమిస్తారు. క్షణంలో లోపట్నుంచి సీతారామయ్య వస్తాడు. సుమారు యాభై యేళ్ళ వ్యక్తి. మొహంలో సౌమ్యత కన్పించదు. వస్తూనే భాస్కరం టేబిలుమీద వదిలివేసిన పుస్తకం చూసి తీస్తాడు)

సీతా: (విసుగ్గా) వీడితో మహా గొప్ప చావొచ్చి పడింది కదా! ఎక్కడి పుస్తకాలు అక్కడే పడి వుంటాయి. శ్రద్ధన్నది ఒక్కపిసరు లేదు. (పుస్తకం షెల్ఫులో పెట్టి యెడమ వేపు వెళ్తాడు సరిగ్గా అప్పుడే లోపలికి వచ్చిన 'సూర్యం' వెనక్కిచూస్తూ ముందుకు నడిచి సీతారామయ్యను ఢీకొంటాడు)

సీతా: (కోపంగా) ఏవిఁటబ్బాయ్ యిది?

సూర్యం: (కంగారుగా) అబ్బే...అబ్బే... క్షమించండి ... ... మిమ్మల్ని చూసుకోలేదు...క్షమించాననండి...అనండి... ప్లీజ్...ప్లీజ్,

సీతా: (వెనక్కి జరిగి) అన్నట్టే లేవయ్యా మరి నన్ను చంపకు. (సీరియస్‌గా) ఏవిఁటిదంతా? నడుస్తున్నపుడు ముందుకు చూసి నడుస్తారుగాని చూపు వెనక్కి నడక ముందుకీనా? ఇదెక్కడి పద్ధతయ్యా:

సూర్యం: నన్ను చెప్పనీయండి మరి! మరేమో...మరేమో...మీ అబ్బాయీ, యింకొకాయనా, యిప్పుడే బైటికి వెళ్తున్నారు లెండి. నన్ను చూసి వాళ్ళేదో అనుకుంటున్నారు. ఇద్దరూ నావేపు యెంత తీక్షణంగా చూశారనుకున్నారు. చివరికి నావేపు చూస్తూ, తుప్పున ఉమ్మేశారండీ: నాగుండెల్లో ఆటంబాంబు ప్రేలినట్టయ్యింది అందుకే గభరాగా అటు వేపు చూస్తూ వచ్చి మిమ్మల్ని ఢీకొన్నాను

సీతా: (చిన్నగా నవ్వి) వాళ్ళు మామూలుగా వుమ్మకుంటే నీ కొచ్చిన నష్టమేమిటి? చూడబ్బాయ్, యిటువంటి పిచ్చి పిచ్చి వేషాలు నాకు గిట్టవు.

సూర్యం: నాకేం పిచ్చిలేదండీ. మొన్ననే డాక్టరుకూడా సర్టిఫై చేశారు.

సీతా: (విసుగ్గా) అబ్బబ్బ నీకు పిచ్చి ఉందని నేను అన్లేదోయ్... నీ పిచ్చి వేషాలు గిట్టవంటున్నాను. ఆఁ... మీ నాన్నగారు యింట్లో వున్నారా?

సూర్యం: ఉన్నారండి. ఆయనకోసమే మీరు వెళ్తున్నట్టున్నారు.

సీతా: నీకెలా తెలుసు?

సూర్యం: మనం ఆవులిస్తే ప్రేవులు లెక్కబెడతామండి. నా సంగతి మీకు తెలీదు.

సీతా: అహ అలాగా! సంతోషించాంలే! మీ నాన్నగారు వస్తామన్నారు...వచ్చారుకాదు చూడు. మంచీ చెడ్డా మాట్లాడుకోవడం వుందామరి. ఏదో నువ్వు మా అన్నపూర్ణని పెళ్ళి చేసుకోడానికి మోజుపడుతూ ఒకటే కాలుమీద కూచున్నావని అంటే, యెంతో కష్టంమీద దాన్ని ఒప్పించాను. ఈ తరుణం దాటిందంటే, చిక్కొవస్తుంది. స్త్రీ హృదయం యెప్పుడు యెలా మారుతుందో బ్రహ్మకే తెలియదు... మనం అనగా యెంత? మీ నాన్నగారు యివన్నీ యోచించరు.

సూర్యం: నిజమే సుమండీ మీరన్నది. "క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్" అన్న మాటలు యిప్పుడు నాకు జ్ఞప్తికి వచ్చాయండీ. ఈ తరుణం మించనివ్వొద్దండీ. ప్లీజ్. తక్షణం వెళ్ళండి. నాన్నగారితో ముఖాముఖీ నాలుగు

మాటలు ఆడేయండి. మీరెలాగూ కట్నం యివ్వరని అంటున్నారు.

సీతా: నేను అనడమేమిటి మీనాన్నే అన్నాడుగా!

సూర్యం: అదే అనుకోండి, మాటవరుసకు చెప్తున్నా. మీరుకోరిన విధంగా తిరిగి మేమే యివ్వడానికి ఒప్పుకున్నాం కూడాను. ఇంక జాప్యం చెయ్యాల్సిన అవసరం కూడా నాకేమి అగుపించలేదు. మా నాన్న మీరన్న ప్రతి మాటకీ ఒప్పుకుంటాడులెండి. లేకపోతే నేను సన్యాసుల్లో కలిసి పోతానని అతని భయం. ఒకవేళ యేదన్నా పేచీ పెడితే నాతో చెప్పండి.

సీతా: (మందహాసంతో సూర్యం భుజం తట్టుతూ) భేష్! తండ్రికి తగ్గ కొడుకువి...ఈ పట్టుదల ఆఖరు వరకూ వుండాలి సుమా! వస్తావా పోదాం?

సూర్య: (ఆముదం త్రాగినట్టుగా మొహంపెట్టి) నన్ను రమ్మంటారా?

సీతా: ఇక్కడేం చేస్తావ్ మరి?

సూర్య: (తడబడి) మరేం...మరేం...అన్నపూర్ణను చూడాలని యెంతో ఆశతో వచ్చానండీ! చెప్పకేం—ఆమెతో నా మనోభిప్రాయాన్ని వెల్లడిచెయ్యాలని యెన్నాళ్ళనించో అనుకుంటున్నాను.

సీతా: పెళ్ళి కాకండా, యిలా మాట్లాడ్డం మంచిదికాదు...ఎవరైనా చూస్తే, మాకు అప్రతిష్ఠకాదూ?

సూర్య: అప్రతిష్ఠ యేఁటండీ? అన్నపూర్ణని నేనేగా పెళ్ళిచేసుకుంటాను? ఇందులో తప్పేముంది?

సీతా: అయినా సరే—సంఘం అంటూ ఒకటి వుందిగా మరి! ఆ మూడు ముళ్ళూ పడే వరకూ కాస్త ఓపిక వడితేకాదూ?

సూర్య: (విసుగ్గా) అన్నీ పాత ఆచారాలేనండీ!

సీతా: సరేగాని, ఒకవేళ మీ నాన్న యేమాత్రం వెనుకంజవేసినా, నువ్వుమాత్రం నీ నిర్ణయాన్ని సడలించకు సుమా!

సూర్య: (సగర్వంగా) ఈ 'సూర్యం' సంగతి మీకు పూర్తిగా తెలీదండీ! మాట అన్నానంటే శపథం పట్టినట్టే అనుకోండి...అందుకే, మా నాన్న కూడా మనమంటే హడలెత్తి పోతాడు.

సీతా: అవుతే, నేను నిశ్చింతగా వుండొచ్చు. ఆఁ...అన్నట్టు వున్నవాడివి వుంటున్నావుగా? మా అబ్బాయి రాకుండా వెళ్ళిపో. వాడు వట్టి కోపిష్టి.

సూర్య: (గుటక మ్రింగుతూ) అతని వాటం చూస్తూనే తెలుస్తుందండీ! నాకు అంతకంటె భయం ఆమెను ఓసారి కలిసి పోదామని వుంది. రోజుకి ఒక్కసారైనా ఆమెను చూడకుండా వుండలేకపోతున్నానండీ.

సీతా: (వెటకారంగా) ఆ పిచ్చి అల్లాంటిదిలే...సరే, వస్తానుండు...

సూర్య: (దిగులుగా) వెళ్ళిపోతారా?

సీతా: మరేం చెయ్యమంటా వయ్యా?

సూర్య: అన్నపూర్ణని ఓ సారి పిలవరూ!

సీతా: (చిరుకోపంతో) నీకు యేమన్నా మతి వుందా లేదా? నేనా పిలుస్తాను? మంచివాడివే! అంత ధైర్యం లేనివాడివి తిరుగు ముఖం పట్టు... (చరచరా బైటికి పోతాడు)

సూర్య: (దిగులుగా స్వగతం) వెధవది. మనకీ విషయాల్లో ధైర్యం యేడ్చింది కాదు...(కాస్త ముందుకు వెళ్ళి, ధైర్యం చాలక మళ్ళీ వెనక్కి వచ్చేసి, కృతనిశ్చయుడై మళ్ళీ ముందుకి అడుగు వేస్తాడు) ఏమండీ...ఏమండోయ్...
(లోపల్నుంచి అన్నపూర్ణ వస్తుంది మెల్లగా. విధవరాలని యిట్టే గుర్తు పట్టేసే అలంకరణ...మొహంలో దైన్యం తొంగి చూస్తుంటుంది)

అన్న: (సూర్యం యెదురుగా చూడగానే ఆమె గుండెలు ఝల్లుమంటాయి. మొహం మరింత వాడి పోతుంది...అయినా ఆమె భావాలు వ్యక్తం కాకుండా వుండేందుకు ప్రయత్నిస్తుంది) ఎవరు కావాలండీ?

సూర్య: (రెప్పవేయకుండా ఆమెవేపుచూస్తూ) ఎవరికోనమో అయితే, యిప్పుడెందుకు వస్తాను చెప్పండి? మిమ్మల్ని రోజుకోసారి అయినా చూడకుండా వుండలేకపోతున్నానండీ! నా మనసుని మీరు పూర్తిగా అపహరించారు.

అన్న: (కాస్త ముందుకి వచ్చి ప్రక్కకి మొహం త్రిప్పుకొంటూ ఆవేదనా భరితంగా) మీకు నా మీద యెందుకింత కక్ష చెప్పండి? నేను మీకేం అపకారం చేశాను? (కళ్ళనీరు కారుస్తుంది)

సూర్య: (అర్థంకాక) కక్షా? మీమీదా? ఏవిఁటి మీరు అంటున్నది? మీపై నాకు హద్దులేని అనురాగం, ప్రేమలే వున్నాయిగాని, కక్షలేదే? మీ కోసం ప్రాణాలనైనా త్యాగం చేసే ప్రేమ నాది. దాన్ని మీరు 'కక్ష' అనడం నాకే బాధగా వుంది.

అన్న: (ఆవేదనతో) మీ ప్రేమను అంతవరకే పరిమితంచెయ్యండి సూర్యంగారూ నన్నే పెళ్ళి చేసుకోవడానికి మీరు యింత పట్టుదల వహించారెందుకో నాకు బోధపడ్డం లేదు.

సూర్య: (ఉత్సాహం) అదీ. అలా అడగండి చెప్తాను. మొదట్నుంచీ మీరంటే నాకు అభిమానం అధికం. మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలని ఆనాడే ప్రయత్నించాను. కాని, మా నాన్న ఒప్పుకోలేదు. మీ వివాహం జరిగింది. దాంతో నాలో అసంతృప్తి పెరిగింది నిరుత్సాహంతో కాలం గడుపుతున్నాను. నా మొండి పట్టు చూసి మా నాన్నే తన పట్టుదలను విరమించుకుని, నాకు అనుకూలంగా మారారు. కాని, యేం లాభం? సమయం మించిపోయింది... (క్షణం ఆగి) రోజులు నిర్దయిగా గడిచాయి. మీ భర్త చనిపోయినట్లు కబురు తెలిసింది. నాలో అణగివున్న ఆశలు మళ్ళీ రేకెత్తాయి. మిమ్మల్ని పెళ్ళిచేసుకోవాలని పట్టుబట్టాను. మా నాన్న కూడా యిప్పుడు అడ్డు చెప్పలేదు. మీరు లేకపోతే నేను బ్రతకలేని స్థితికి వచ్చాను.

అన్న: (నిట్టూర్చి) మీ గ్రుడ్డి ప్రేమలో ఒక్క విషయం విస్మరిస్తున్నారు. నేను విధవను, నా భర్త చనిపోయి యెన్నాళ్ళో కాలేదు. నా స్వామిని నేను మర్చిపోలేదన్న విషయం మీరు గుర్తుంచుకోవాలి. (వెక్కి వెక్కి యేడుస్తూ) ఈ పరిస్థితుల్లో నన్ను వివాహం చేసుకుని, మీరు సుఖించలేరు.

సూర్య: మీరు నా సరసను వుంటే చాలు అదే నాకు పదివేలు. మిమ్మల్ని చూస్తూ యిలా కూర్చున్నా, నాకు అందులోనే ఆనందం లభిస్తుంది

అన్న: (బాధగా) మిమ్మల్ని యెలా నచ్చజెప్పడమో బోధపడ్డం లేదు. మీరంటే నాకు సోదరభావం తప్పించి, మరోభావం కలగడం లేదు నా మనసు నా స్వామికి అర్పితమయ్యిందిగా? మరొహరికి లభించదు. మిమ్మల్ని ప్రాధేయ పడుతున్నాను. ప్రార్థిస్తున్నాను. ఈ ప్రయత్నం నుండి విరమించుకోండి.

సూర్య: (షాక్ తిని) మీ రెందుకిలా వ్యతిరేకంగావున్నారో తెలీడం లేదు. నేనేం అందవిహీనుణ్ణా? ధనహీనుణ్ణా? లేక వయసు మళ్ళినవాణ్ణా? అన్ని విధాలా మీ పూర్వపు భర్తకంటే అధికుణ్ణి.

అన్న: (రుద్ధ కంఠంతో) అయ్యుండవచ్చు. అవన్నీ మీరు నాకు జ్ఞాపకం చెయ్యకండి (క్షణం ఆగి) హిందూ వనిత ఒక్కరికే జీవితంలో హృదయమిస్తుంది ఆయన నన్నూ, యీ లోకాన్నీ విడిచిపోయినంత మాత్రాన, ఆయన రూపు నా నుండి వేరు కాలేదు నా హృదయ పీఠంలో చిరస్థాయిగా నిల్చిపోతుంది. ఆ రూపమే నా ఆరాధ్య దేవత ఆయన చనిపోయినా, నాలో సజీవంగా వున్నట్టే: మీరు మాత్రం నా మీద ఆశపెట్టుకోవద్దని నా ప్రార్థన.

సూర్య: (నిరుత్సాహంగా బేలముఖం వేసి) నా వుత్సాహానికి గొడ్డలిపెట్టు పెడుతున్నారు మరోసారి ఆలోచించండి.

అన్న: ఆలోచించే చెప్తున్నాను నా మీద మీకు యేపాటి ఆదరాభిమానాలు వున్నా, యీ పెళ్లి ప్రయత్నం విరమించుకోమని, నా కన్నీటితో వేడుకుంటున్నాను (కళ్ల నీరు పెట్టుకొని చరచరా లోపలికి పోతుంది)

సూర్య: అన్నపూర్ణా అన్న... (అప్పటికే అన్నపూర్ణ లోపలికి పోతుంది. దిగులుగా వెనక్కి తిరుగుతాడు రెండడుగులు వేసే సరికి అప్పుడే బైటినుండి వస్తున్న రాజారావు కంట బడతాడు. ఇద్దరూ ఒకర్నొకరు అదోలా చూసుకుంటారు) మీరు...మీరు...(ప్రశ్నించాలనుకునే తడబడతాడు)

రాజా: నా పేరు రాజారావు లెండి వీరి అల్లుడి స్నేహితుణ్ణి.

సూర్య: (వింతగా చూస్తూ) ఏవిఁటి...ఏవిఁటీ...చనిపోయిన సుదర్శనంగారి స్నేహితులా?

రాజా: ఔనండీ

సూర్య: అలాగటండీ: పాపం, ఆయన చిన్న వయస్సులో చనిపోవడం శోచనీయమైన విషయం సుమండీ:

రాజా: అది యెవ్వరమూ చెప్పలేమండీ: మృత్యువు దాపరిస్తే వయస్సుతో ప్రమేయమే లేదు ఇద్దరమూ ఒకే బండిలో ఒకే పెట్టెలో ప్రయాణం చేస్తున్నాం మా రైలు, ప్రమాదానికి గురయ్యింది. ఒక్క దగ్గర వున్న వాళ్ళమైనా, అతను చనిపోవడం, నేను బ్రతికి బైటపడ్డం, విధి వైచిత్ర్యం కాకపోతే యింకేవిఁటి చెప్పండి?

సూర్య: (ఆశ్చర్యంతో కళ్ళింతవి చేసుకుని) ఎవిఁటేవిఁటీ; ఆయన చనిపోయినప్పుడు మీరు దగ్గరే వున్నారన్నమాట? మీరు మృత్యుముఖంనుండి తప్పుకున్నారంటే యెంత అదృష్ట జాతకులు?

రాజా: అదేనండీ నేనూ అనుకుంటుంటాను? అదృష్టం ఉండాలిగా?

అపాయాలు తప్పడం యెంత సేపు? (నిట్టూర్చి) పాపం, ఆ అమ్మాయి మరీ దురదృష్టవంతురాలు సుమండీ

సూర్య: ఏ అమ్మాయండీ?

రాజా: ఇంకెవరు? సుదర్శనం గారి భార్య...

సూర్య: (మందహాసంతో) ఆమెకేవండీ? ఆమెను నేను కొద్ది దినాల్లో వివాహం చేసుకో బోతున్నాను.. పెద్దింటి కోడ లవ్వబోతుంది... ఇంక దురదృష్టమేమిటి?

రాజా: (ఆశ్చర్యంగాచూసి) ఏవిఁటీ మీరు పెళ్ళి చేసుకో బోతున్నారా?

సూర్య: (మందహాసంతో) మీకు ఆశ్చర్యంగా వుందికదూ? చదువుకున్న నాలాంటి సంస్కారి, విధవా వివాహానికి ముందంజ వెయ్యకపోతే, యింకెవరు dare చేస్తారు. చెప్పండి? ఈ చిన్నవయస్సులో ఆమె విధవరాలై యెడారి పుష్పంలా మ్రగ్గిపోవల్సిందేనా? అది నాకు యిష్టంలేదు సుమండీ? అందుకే, యీ ప్రయత్నం.

రాజా: కాని, ఆమె ఒప్పుకుందా?

సూర్య: ఆమె ఒప్పుకోవడం యెందుకండీ? వధువు యిష్టపడితేనే వివాహాలు చేస్తున్నారా అందరూ? ఆమె చిన్నాన్న గారు ఒప్పుకున్నారు. ఆమెకి సంరక్షకుడు వుమన్ గార్డియన్ అతనే కదండీ? ఇంక మాకు కావల్సిందేఁమిటి? అయినా, అతను ఒప్పుకొక యేంచేస్తాడు లెండి? అతను మాకేమీ కట్నాలూ కానుకాలూ యివ్వనవసరం లేదుగా...మేమే తిరిగి పైకం యిస్తున్నాం...

రాజా: (వింతగా చూసి) వరుడు వాళ్ళు యిస్తున్నారా?

సూర్య: (చిన్నగా నవ్వి) ఔనండీ? వెయ్యిరూపాయలు, యివ్వడా నికి నిర్ణయమయింది. మాకు కావల్సింది అన్నపూర్ణగాని? డబ్బుకాదు. మీకు తెలేదేమో గాని? మాకు బోలెడు డబ్బుంది...కావలంటే మా నాన్న ఆ వెయ్యి రూపాయలు ఒక్క నెలలో ఆర్జించేస్తాడు.

రాజా: అంతా బాగానేవుంది. కాని, మీరు ఆ అమ్మాయిని పశువుని కొన్నట్టు కొనుకుంటున్నారన్న విషయం మర్చిపోవద్దు

సూర్యం: (కనుబొమ్మలు చిట్లించి) ఏవిఁటి మీరంటున్నది?

రాజా: మరేమనమంటారు? ఆమె యిష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా డబ్బే ప్రధానంగా గల వాళ్ళ చిన్నాన్నను ఒప్పించి కొనుకుంటున్నారన్నమాట డబ్బిచ్చి సంతలో పశువు కొనడానికి, దీనికీగల వ్యత్యాసమేమిఁటీ కాస్త నాకు చెప్పండి...

సూర్య: (తికమకపడి) అబ్బే... మీరు పొరబడుతున్నారండీ? డబ్బు కేవలం వాళ్ళ చిన్నాన్న తృప్తికోసమే యిస్తున్నా మండీ:

రాజా: అదే నేనంటున్నదీను... డబ్బు యివ్వకపోతే, అతను యీ వివాహానికి ఒప్పుకోడు. . ఎంతడబ్బిచ్చి మీరు ఆమెను భార్యగా స్వీకరించినా ఆమె హృదాయాన్ని మాత్రం పొందలేరు.

సూర్య: పెళ్ళి జరగడమే తరవాయండీ: తక్షణం నా ప్రేమతో ఆమెను వుక్కిరిబిక్కిరి చేసేసి మనస్సు మార్చేయానా?

రాజా: (వెటకారంగా) లేకపోతే డబ్బిచ్చి మార్చేస్తారు.... యేం? మీరు అనుకున్నంత సులభసాధ్యం కాదండోయ్ పోనీ ఆమెనే ఓసారి కలిసి మీ మనోభిప్రాయాన్ని వెల్లడి చెయ్యకూడదూ:

సూర్య: (దిగులుగా మొహం పెట్టి) అదీ అయ్యిందండీ:

రాజా: ఏమయింది?

సూర్య: ప్చ్ పెళ్లికి యిష్టపడ్డం లేదు... పైగా యీప్రయత్నం విరమించుకోమని నన్ను బ్రతి మాలుతుంది ఏం చెయ్యడం చెప్పండి.

రాజా: చూశారా? ఆమెకి మిమ్మల్ని పెళ్ళిచేసుకోడవం యిష్టం లేదని ఖచ్చితంగా తేలిపోయింది. అప్పటికీ మీరీ ప్రయ త్నం కొనసాగించడం బావుందంటారా?

సూర్య: మీరవుతే తేలిగ్గా చెప్పేశారుగాని? ఆమెను పెళ్ళి చేసుకో పోతే నేను జీవించలేనండీ. నా ప్రేమ పిచ్చి అట్లాంటిది.

రాజా: (సూటిగా) మీ స్వార్థంకోసం, మీ సుఖం కోసం, ఒక అమాయికురాల్ని, ఒక అసహాయురాల్ని, ఆహుతి చేస్తారా?

సూర్య: (అసహనంతో) మీకివన్నీ అనవసరం...ఏదో అడిగారు కదా అని చెప్తుంటే, నోటికొచ్చినట్టు వాగుతున్నారే. మీ పాటి జ్ఞానం నాకూ వుంది. నేను ఆమెను పెళ్ళి చేసు కుంటాను. చేసుకుని తీరుతాను. బ్రహ్మరుద్రాదులు వచ్చినా సరే, మా పెళ్ళి ఆగదు...ఆఁ...యీ సూర్యం సంగతి మీకింకా తెలీదు.

రాజా: (నిట్టూర్చి) సరే ..మీరంత పట్టదలలో వుంటే, నేనేం

చెప్పినా ప్రయోజనంలేదు ... (నీరసంగా కుడివేపు గది లోకి పోతాడు)

సూర్య: (చిరుకోపంతో రాజారావు పోయిన వేపే చూస్తూ) పాన కంలో పుడకలా వీడెవడు? అన్నపూర్ణని నేను పెళ్ళి చేసు కుంటే వీడికేం? ఇంతకీ యెవరితడు? గొప్పగా నీతులు వర్ణిస్తున్నాడే. (మెల్లగా అనుకుంటాడు స్వగతంలో)

(సీతారామయ్య వెలుపలినుండి వస్తాడు)

సీతా: (నవ్వుకుంటూ వచ్చి) ఏవిటోయ్ ఆ కలవరింతలు?

సూర్య: (తడబడి, వెకిలిగా నవ్వుతూ) అబ్బే యేమీ లేదండీ... ఆఁ...మా నాన్నగారున్నారా? ఏమంటారేవిటి.

సీతా: ఏమంటారు? నీ పట్టుదల వల్ల 'వూఁ' కొట్టారేగాని అత నికేమీ యిష్టం లేదట యీ పెళ్ళి. త్వరలోనే ముహూర్తం నిశ్చయించడానికి నిర్ణయమయింది. (క్షణం ఆగి) ఎలాగో అన్నపూర్ణని మళ్ళీ ఓ యింటిదానిగా చేసి పంపానంటే, నాకో పెద్ద భారం దించుకున్నట్టే అవుతుంది. పాత ఆచారాన్ని ఓ ప్రక్కకునెట్టి, పురోగమిస్తున్నానన్న పేరూ వస్తుంది

సూర్య: నిజం చెప్పాలంటే, ఆ ఘనత నాకు దక్కాలండీ. నా పట్టుదలే లేకపోతే, యీ ప్రయత్నాలే వుండవుగా.

సీతా: పోనీ, అలాగే అనుకుందాం. దానికేం? (ఇటూ అటూ చూసి) నాకు కావల్సింది అన్నపూర్ణ ఒక యింటి కోడల వ్వం...డబ్బు విషయం వుండనే వుందనుకో, నీకు కావ ల్సింది, అన్నపూర్ణ నీ భార్య అవ్వడం...అన్నట్టు అమ్మా యితో మాట్లాడావా? ఏమందేవిటి?

సూర్య: (దిగులుగా) ఈ పెళ్ళికి ఆమె సుముఖంగా వున్నట్టు తోచడం లేదండీ. పైపెచ్చు యీ పెళ్ళి ప్రయత్నం మాను కోమని నన్ను బ్రతిమాలుతోంది. ఏవిటీ ఆమె పిచ్చి ధోరణి నాకు బోధపడ్డం లేదు.

సీతా: అదంతా నీకెందులేవోయ్...పిల్లనివ్వడం నా వంతు... పెళ్ళి చేసుకోవడం నీ వంతు.

సూర్య: (ఉత్సాహంగా నవ్వుతూ) అది యెలాగో జరుగుతుందను కొండి. అహఁ. అదికాదు నేనన్నది. అన్నపూర్ణ యీ విధంగా విముఖత చూపడంలోని అంతరార్థం నాకు అవ గాహన కావడం లేదండీ

సీతా: (చిన్నగా నవ్వి) పెళ్ళి జరిగే వరకు ఆడపిల్లలు అలాగే అంటారోయ్... నీకు తెలీదు. పెళ్ళి జరిగాక వాళ్ళే దారికి వస్తారు. అది నీలోవుంది.

సూర్య: నా సంగతి మీకు తెలీదు. ఆ మూడు ముళ్ళూ వెయ్య నీయండి, ఆమె మనసు చిటికెలో మార్చేస్తాను.

సీతా: చూడు సూర్యం. యెందుకన్నా మంచిది మీనాన్నకి నువ్వూ ఓసారి గుర్తుచెయ్యి వీలున్నంత దగ్గర్లో ముహూర్తం పెట్టించమని.

సూర్య: మీకింకాభయం అనవసరం. ఇప్పటికే మా నాన్న హడలు కొట్టేశాడు. ఇంక జాప్యం చెయ్యడులెండి.

సీతా: అయినా ఓసారి చెప్పుదూ! నిజంగా నువ్వుచాలా అదృష్ట వంతుడివోయ్. అన్నపూర్ణలాంటి భార్య అందరికీ లభ్యం కాదు. గుణవతి...రూపవతి...యింకేం కావాలి?

సూర్య: అందుకే కదండీ, నేను యిన్ని అవస్థలు పడుతున్నాను. (తన్మయుడై) జీవితమంతా హాయిగా ఆమె అందాన్ని ఆస్వాదిస్తూ గడిపెయ్యొచ్చు. (ఏదో జ్ఞప్తికి వచ్చి) వస్తానండి మరి; మీ అబ్బాయి వస్తాడేమోనని ఓప్రక్క గుండెలు కొట్టుకుంటూనే ఉన్నాయి.

సీతా: (చిన్నగా నవ్వి) నేను వున్నాను కదోయ్...ఫరవాలేదులే.

సూర్య: మా నాన్నతో చెప్పాలి కదండీ.

సీతా: సరే అవుతే...వెళ్ళు...వీలైతే డబ్బుకాస్త ముందుగానే సర్దుబాటు చేస్తే...(అర్ధోక్తిలో ఆపివేస్తాడు)

సూర్య: ఓ, దానికేముంది, నేను స్వయంగా మీకు తెచ్చిస్తాను. వస్తా (నిష్క్రమిస్తాడు)

సీతా: (క్షణం వూరుకుని, యేం చెయ్యడమూ తోచక రెండుసార్లు యిటూ అటూ పచార్లుచేసి ఒక నిర్ణయానికి వస్తూ) అమ్మాయ్, అన్నపూర్ణా... (పిలుస్తాడు)

అన్న: (లోపల్నుంచి వస్తూ) ఏం బాబాయ్?

సీతా: (తడబడి) ఏం చేస్తున్నావమ్మా?

అన్న: బియ్యం చేస్తున్నా బాబాయ్.

సీతా: (ఎలా ప్రారంభించాలో తోచక ప్రసంగం మారుస్తాడు) అన్నట్టు మన సుదర్శనం స్నేహితుడు యింకా కదలడేం, ఎన్నాళ్ళని మనింట్లో వుంటాడు? లోకులన్నా యేమను కుంటారు.

అన్న: (బాధగా) నేనేం చెప్పగలను బాబాయ్.

సీతా: (తనతప్పు తెలుసుకుని) ఔనులే... నువ్వేం చెప్పగలవు? అతనికి ఆ యింగితం వుండాలిగాని; (అకస్మాత్తుగా ఆవేదన పడుతున్నట్టు మొహం పెట్టి) నీ ఖర్మమిట్లా కాలింది గాని, లేకుంటే యెంత ఆనందంగా వుండవల్సిన దానవు; మీ నాన్న పెళ్ళి ప్రయత్నం చేస్తున్నప్పుడే చెప్పాను ఆ సుదర్శనంకి యివ్వొద్దని; నా మాట వింటేనా? ఇదిగో యిప్పుడు యెవరు అనుభవిస్తున్నారు. అయినకేం, మహారాజులా జీవితం చాలించాడు. నిశ్చింతగా యే లోకం లోనో వున్నాడు. మీఆయిన మట్టుకు మీఆయిన పోయాడు. ఎటొచ్చీ మనమే యీ బాధలన్నీ చూస్తూ, వేదన అనుభవిస్తున్నాం. (బాధపడతాడు)

అన్న: (మాట్లాడదు. దుఃఖంతో కుమిలిపోతుంటుంది)

సీతా: (బాధగా) విధి నీపట్ల చాలా క్రూరంగా చూసిందమ్మా! లేకపోతే, యీ పిన్నవయస్సులో నీకు వైధవ్యం ప్రాప్తించడ మేమిటి? జీవితాంతం నువ్విలా గడపడం యెంత ఘోరం? అది తలంచుకుంటేనే నా గుండెలు నీరై పోతున్నాయి. అందుకే నీ సుఖం కోసం, నీ ఆనందం కొసం నీకు పెళ్ళి చెయ్యాలన్న ప్రయత్నం నేను చేస్తున్నట్టు నీకు తెలుసునుగా! ఆ సూర్యంకూడా...

అన్న: (అర్ధోక్తిలో అందుకుని రుద్ధ కంఠంతో) నాకు మళ్ళీ పెళ్ళేమిటి బాబాయ్?

సీతా: (నచ్చజెప్పే ధోరణిలో) అలా అనకమ్మా! నీ ఆవేదన, నీ కన్నీరు నేను చూళ్ళేకపోతున్నాను. నీ నొసట యింత కుంకుమబొట్టు, చేతికి గలగల మంటూ యిన్ని గాజులు, మెళ్ళో ధగధగ మెరిసే మంగళసూత్రంతో, లక్ష్మిలా తిరగవల్సిన నువ్వు యిలా నిర్జీవంగా తిరగడం నాకు యెంత బాధగా వుందో నీకేం తెలుసు? నా బాధను యెలా నీతో చెప్పడం; నా కూతురొహటీ, నువ్వొహటీ కాదు. అందుకే యీ సంబంధం చూశాను. అటువంటి సంబంధం అందరికి అందుబాటులో వుంటుందా? అది నీ అదృష్టమే అనుకో!

అన్న: (రుద్ధకంఠంతో) నాకు మళ్ళీ పెళ్ళి వద్దు బాబాయ్. నా జీవితం ఆయనతోనే ముగిసింది. ఆయిన నా హృదయ పీఠంలో శాశ్వతమైన స్థానాన్ని ఆక్రమించి పోయారు. ఆ స్థానం మరొకరికి లభించదు. మీ కూతురొహటీ నేనొకటీ కాదు. మీయింట్లో నాకింత చోటిస్తే, శేష జీవితమంతా యిలానే గడుపుకుంటాను. నా కోరిక మన్నించండిబాబాయ్ (మొహం దించుకుని గుడ్లనీరు నింపుకుంటుంది)

సీతా: (కంగారుపడి) నువ్వు చాలా అజ్ఞానంలో వున్నావు అన్నపూర్ణా! ఇదంతా నేనెందుకు చేస్తున్నానో అర్థం చేసుకోలేదు నువ్వు. నీ శ్రేయస్సుకే నీ సుఖానికే. నువ్వూ అందరిలా కళ కళ లాడుతూ ఆనందంగా జీవితం గడపాలనే నా వాంఛ.

అన్న: (దుఃఖంతో) నాకింక ఆనందం యెలా వస్తుంది బాబాయ్ ఇంక సుఖాలెందుకు నాకు; ఈ మోడు వారిన జీవితం, నశించడానికే గాని, పుష్పించడానిక్కాదు నన్ను బలవంత పర్చకండి బాబాయ్. నా ప్రార్థన మన్నించండి.

సీతా: (అసహనంతో) ఏమిటమ్మా నీ మొండిపట్టు? చెప్తున్న దంతా యెవరికోసం! నేను యింత శ్రమపడి, తగు పెద్ద మనుషులతో సంబంధం చెయ్యాలని తాపత్రయపడి చివరికి ఖాయి పరిస్తే నువ్విప్పుడిలా అంటావా? ఇంక నా గౌరవం యేముంటుంది.

అన్న: (బాధగా) మొదట్నుంచి నేను పెళ్ళి వద్దనే మొరబెట్టుకుంటున్నాను కదా బాబాయ్!

సీతా: అవుతే నా సరదాకోసం చేస్తున్నానంటావా? మంచిదానవే! పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యకుండా పెళ్ళి చేసుకుని హాయిగా సంసారం చెయ్యి.

అన్న: నా నిర్ణయం మార్చుకోలేను బాబాయ్.

సీతా: (కోపంగా) మార్చుకోలేవు; హూ! ఎలా మార్చుకోలేవో నేనూ చూస్తాను. నీకు పెళ్ళి జరగడం మాత్రం ఖాయం. అది మాత్రం గుర్తుంచుకో.

అన్న: (రుద్ధ కంఠంతో) నాలాంటి అనాథను, అసహాయురాలిగా చేసి బలవంతపు పెళ్ళి జరపడం మీకు న్యాయమనిపిస్తే అలాగే జరగనీయండి. కాని నన్ను సజీవంతో పీటలమీద చూళ్ళేరు. (బావురు మంటూ లోపలికి పోతుంది.)

సీతా: (తెల్లబోయి ఆమె వెళ్ళిపోయిన వేపే చూస్తూ) హూ! (పచారు చేస్తూ విసుగ్గా ఆలోచనలు సాగిస్తాడు. అతనిలో కోపం భయం మిళితమై సంక్షోభాన్ని రేకెత్తిస్తాయి. అప్పుడే భాస్కరం బైట్నించి వస్తాడు)

భాస్క: ఏమిటి నాన్నా, అలావున్నారు?

సీతా: (మొహం ప్రక్కకు దాచుకుని) అబ్బే, ఏమీ లేదురా (ప్రస్తావన మార్చాలనుకుని) అన్నట్టు, ఆ రాజారావు యెన్నాళ్ళిక్కడ తిష్ఠ వేస్తాడ్రా! ఈ గడ్డు రోజుల్లో ఒక్క

మనిషినైనా యిన్నిరోజులు ఆదరించడం యెంత కష్టం. అతనికైనా ఆ లోక జ్ఞానం వుండొద్దూ?

భాస్క: (వెటకారంగా) మీరు చేయబోతున్న పెళ్ళి చూసిపోదా మనుకుని వుండిపోయాడో యేవిటో?

సీతా: (ప్రక్కవాటుగాచూసి) పెళ్ళా?

భాస్క: (వెటకారంగా) అదేవిటి? మీరు చేస్తున్న ప్రయత్నం మీకు ఒక్కరికే తెలుసునని అనుకుంటున్నారా? అన్నపూర్ణ పెళ్ళి నిర్ణయిస్తున్నారుగా!

సీతా: (మొండిగా) ఔను; నిర్ణయిస్తున్నాను. నిర్ణయించేశాననుకో. ఇందులో తప్పేముంది? దాని సుఖంకోసం, ఆనందంకోసం యీ ప్రయత్నం చేశాను. లక్షణమైన సంబంధం చూచాను.

భాస్క: ఎంత నవనీత హృదయం మీది? చెల్లాయి తనకీ పెళ్ళి వద్దని మొరపెట్టుకుంటున్నా మీరీ ప్రయత్నం యెందుకు చేస్తున్నట్టు? ఆమె సుఖాన్ని ఆశించేనా? మీలో ఏ స్వార్థమూ లేకుండానే ప్రయత్నిస్తున్నారా?

సీతా: పెళ్ళి వద్దని అన్నపూర్ణ చెప్పలేదే?

భాస్క: క్షణం క్రితం ఆమె మీతో మొరబెట్టుకొంటున్నదంతా యేవిటి? పెళ్ళికావాలనే అంటున్నదా?

సీతా: (సూటిగా చూసి) నువ్వు విన్నావా?

భాస్క: ఔను. అంతా విన్నాను. మీరెందుకు నాన్నా యింత క్రూరంగా ప్రవర్తిస్తున్నారు? కుటుంబరావు యిచ్చే ముష్టి వెయ్యి రూపాయలకోసమే యింత దిగజారిపోయారా? అన్నపూర్ణ జీవితం వెయ్యి రూపాయల విలువా? ఇష్టంలేని పెళ్ళి, అది మళ్ళీ పెళ్ళిచేస్తే చెల్లాయి సజీవంగా వుంటుందనే మీ భావనా? ఆమె ఆత్మహత్య చేసుకుంటే ఆ పాపం యెవర్ని చుట్టుకుంటుందో ఆలోచించారా? అంతెందుకు? సంఘం దృష్టిలో నేరస్థులు మీరే అవుతా రన్న విషయం విస్మరిస్తున్నారా? మీ స్వంతకూతురవుతే మీరు యిలాగే ప్రవర్తించేవారా?

సీతా: (వుద్రేకంతో) భాస్కరం!

భాస్క: (వెటకారంగా మందహాసంచేసి)కోపమొచ్చిందా?.. కాని ఆలోచించండి నాన్నా, ఇది మన కుటుంబ ప్రతిష్ఠకు సంబంధించిన సమస్య. అన్నపూర్ణ నా తోబుట్టువు కాక పోయినా పెద్దనాన్న కూతురు పరాయి వ్యక్తికాదు. రక్త బంధువు. ఆమె వినాశనం మన శ్రేయోదాయకంకాదు. ఆమె జీవితమంతా యిలానే గడుపుతానంటుంటే మీ రెందుకు బలవంతంగా ఆ పిచ్చివాడికి ముడిపెడతారు?

సీతా: సూర్యం పిచ్చివాడా? నీకేమైనా మతిపోయిందిరా?

భాస్క: వాడో పిచ్చివాడి క్రిందేజమ. మనిషవుతే నాజూగ్గా కనిపి స్తాడుగానీ, మెదడులో వత్తి మన్నుంది. అయినా నాన్నా. బావపోయి యెన్నాళ్ళయిపోయిందని? ఇప్పుడే ప్రయత్నం చెయ్యటానికి మీకు యెలా మనసొప్పిందో? లోకంయేమను కుంటుందో నన్న ఆలోచననైన లేదుమీకు.

సీతా: లోకంతో మనకేంపనిరా? అన్నపూర్ణ సుఖిస్తుందని యీ ప్రయత్నం చేస్తున్నాం.

భాస్క: ఆమెపొందేది సుఖంకాదునాన్నా: యమయాతన. చేజేతులా ఆమెను నరకకొంపలో పడదోస్తున్నారు. నామాటవినండి. మీప్రయత్నం విరమించుకోండి. లేకపోతే మీకూ నాకూ విరోధం తథ్యం.

సీతా: (స్తంభించిపోయి) నీకు మతి చలించినట్టుందిరా?

భాస్క: నాకుకాదు మతిచలించడం మీకేమోనని నా అనుమానం..

సీతా: (లాభంలేదనుకుని కొడుక్కిదగ్గరగా వస్తాడు) ఎందుకురా అంత కోపం? మీ పెద్దనాన్న బ్రతికి వుండగా మనకి యే విధంగా సహాయం చేశాడనీ? అటువంటప్పుడు అతని కూతు ర్ని మనం మాత్రం యెన్నాళ్ళు పోషించగలం? ఓయింటి దానిగా చేసేస్తే, దాని బ్రతుకు అదిబ్రతుకుతుంది కదా అని నా అభిప్రాయం.

భాస్క: చూశారా, మీ అసలురంగు బైటపడింది? ఎదటివాళ్ళు సహాయం చేస్తేనే, మీరువాళ్ళకి సహాయం చేస్తారన్నమాట రక్తబంధువుల విషయంలోనూ అంతేనా? స్వార్థంతో యెంతగా దిగజారిపోయారు నాన్నా? అందరూ మీలాంటి మనస్తత్వంతోనే వుంటే మరి మానవత్వం యెక్కడుం టుంది? సానుభూతికి చోటేది? కరుణ, జాలి, వీటి నామ రూపాలే వుండవేమో?

సీతా: (విసుగ్గా) అవన్నీ యిప్పుడు యేవరిక్కావాలిరా?

భాస్క: మీకు అవసరంలేకపోవచ్చు కాని, నేను మాత్రం మీ ప్రవర్తనకు తాళం వెయ్యలేను. తోబుట్టువుకాకపోయినా చెల్లాయిని, కళ్ళారచూస్తూ అన్యాయం చెయ్యలేను. నేను సంస్కారయుతసంఘంలో మెలుగుతున్నవాణ్ణి చదువు కున్నవాణ్ణి. అవసరమైతే, నేనే ఆమెను ఆదుకుంటాను.

సీతా: (చిరుకోపంతో) ఏమిటి నువ్వంటున్నది?

భాస్క: ఔన్నాన్నా! చెల్లాయిపెళ్ళికి నేను అంగీకరించలేను. ఆమెకి మీ యింట స్థానం లేదంటే, నేనే ఆమెను తీసుకపోయి పోషిస్తాను. అది నా కర్తవ్యంగా భావిస్తాను.

సీతా: (కోపం ప్రదర్శించడం లాభంలేదనుకుని) అబ్బాయ్ తొందర పడకురా: కుటుంబరావుతో బంధుత్వం మనకి అన్ని విధాల శ్రేయోదాయకం భవిష్యత్తున అతని సహకారం మనకి వుపకరిస్తుంది.

భాస్క: మన స్వార్ధం కోసం, ఓ అమాయకురాలి జీవితం నాశనం చేస్తారా నాన్నా?

సీతా: నీ మొహం! నాశనం చెయ్యడమేమిటి శ్రీమంతుల యింటికి కోడలుగా వెళ్ళడం అందరికీ లభ్యంకాని ఒకవరంలాంటిది. అన్నపూర్ణ అక్కడ యెంతో సుఖపడుతుంది. అదీ గాక. మనం వాళ్ళకేమీ కట్నాలూ కానుకలూ యివ్వడంలేదు. ఏదో ఆ అబ్బాయి మోజు పడుతున్నాడు గాబట్టి మనకే వెయ్యిరూపాయలు యిస్తామంటున్నారు. అల్లాంటిఅవకాశం మనకింక వస్తుందటావా?

[సరిగ్గా అదే సమయానికి కుడివేపె గదినుండి రాజారావు వస్తాడు అతని మొహం జేవురించి వుంటుంది.]

రాజా: (వస్తూ) నేను రెండువేలిస్తాను, అన్నపూర్ణని నాకిచ్చిపెళ్ళి చెయ్యండి ఈవిధంగానైనా నాస్నేహితుణ్ణి ఆజన్మాంతం జ్ఞాపకముంచు కుంటాను.

సీతా. (ఆశ్చర్యంతో కళ్ళ నిలవేసి) రెండువేలా?

రాజా: అవును రెండు వేలిస్తాను.

భాస్క? (రాజారావు వేపు వింతగా చూసి) రాజారావుగారూ, మీరేనా యీమాట అంటున్నది?

రాజా: ఔను భాస్కరం; తప్పేముంది? మీనాన్నగారికి కావల్సింది డబ్బు: అన్నపూర్ణను పరాధీనం చెయ్యిడం నాకు బాధగా వుంది. అందుకే ఆమెను నేను భార్యగా స్వీకరించ దల్చాను.

భాస్క: (అసహ్యించుకుని)మీమనస్సుకూడా యింత మలినమైనదని నేను వూహించలేదు రాజారావుగారు? మనుషుల మాటలకు మనసుకి యింత విభేదం వుంటుందని అనుకోలేదు. మీస్నేహితుడి మరణానికి సానుభూతి చూపుతూ, అతని భార్యనే వివాహంచేసుకుంటానని చెప్పడానికి మీకునోరెట్లా వచ్చిందో అర్థంకాదు.

రాజా: (వుద్రేకంతో) స్వంతకూతురు కాపోయినా, సోదరుని కూతుర్ని ఆమెకు వ్యతిరేకంగా పశువుని అమ్మిని విధంగా ఆమెను పరాధీనం చేస్తున్న మీ నాన్నగారిని అప్రశ్న వెయ్యరేం?

సీతా: మీరు హద్దులు దాటుతున్నారు రాజారావుగారు?

రాజా: (బాధగా) ఔను! నిజం చెప్తున్న వాళ్ళంతా హద్దులు దాటుతున్నవారే? ఆమె పెళ్ళి వద్దు మొర్రో అంటూవుంటే, బలవంతంగా ముడి పెడతానంటున్న మీలోయెంత స్వార్థం వుందో తెలుస్తునేవుంది. మీకు హృదయం లేకపోయినా నాకుంది రెండువేలు తీసుకుని ఆమెను అప్పగించడానికి మీకు సమ్మతమేనా?

సీతా: (చిరుకోపంతో) నాకు రెండువేలు అవసరంలేదు. నాకేమి ధనాశలేదు. నేనుకోరేదంతా ఆమె సంపన్నుల కోడలు అవుతుందని?.

రాజా; పాపం: మీది చాలా సహృదయం; మీలో ఆకోరికే వున్నట్ట వుతే, డబ్బు తీసుకోవడంయెందుకు వారినుండి, ఆమె కిష్టంలేని వివాహం చెయ్యడమెందుకు? ఏవిధమైన స్వార్ధం లేకుండానే చేస్తున్నారా యివన్నీను?

సీతా: (కోపంగా) అవన్నీ నీకు అనవసరం, ఇవి మాస్వవిషయాలు అతిధిగా వచ్చిన నీకు యిటువంటి అధిక ప్రసంగం కూడదు. తక్షణం నాయింటి నుండి పో...

భాస్క: (బిక్కమోహంవేసి) నాన్నా...

రాజా: (అదోలానవ్వి) ఫరవాలేదు భాస్కరం.. ఆయన అనకపోయినా నేను పోవల్సిన వాణ్ణే.

భాస్క: అయినా రాజారావుగారూ తెలీక అడుగుతాను... మీరింత సహృదలైవుండి యిలా ఎందుకు ప్రవర్తించారు?

రాజా: (నిట్టూర్చి)ఇక్కడి పరిస్థితులు తెలుసుకున్నాక, నాలోమానవత్వం క్షీణించిపోయింది. భాస్కరం. అలా ప్రవర్తించకుండా వుండలేకపోయాను. అసభ్యంగా ప్రవర్తించానని మీరంతా అనుకోవచ్చు. కాని, ఒక మనిషికి మరోమనిషికి యెంత విభేదం వుందో, కొందరికి డబ్బు యెటువంటి మార్పు తెస్తుందో, ప్రత్యక్షంగా యీరోజు అర్థంచేసుకున్నాను నిజంగా నాహృదయం యెంత గాయపడిందో యేవరికీ తెలీదు...

భాస్క: (అర్థంచేసుకోలేక) మీధోరణి నాకేమి బోధపడ్డంలేదండీ రాజారావుగారూ మీహృదయం గాయిపడ్డం యెందుకు?

రాజా: (సూటిగా భాస్కరం వేపుచూసి) ఇంత వరకూ వచ్చాక యింక దాచడ మెందుకు భాస్కరం? (నిట్టూర్చి) నేను సుదర్శనం స్నేహితుణ్ణి కాదు.. నే నే సుదర్శనంని: అన్నపూర్ణ భర్తను, మీ బావను.

[భాస్కరం విస్తుపోయి అతనివేపు చూస్తుంటాడు. సీతారామయ్య స్తంభించిపోయి, కళ్ళప్పగిచి, సుదర్శనం వేపుచూస్తూ వుంటాడు. అతని పెదాలుమాత్రం వణుకుతూ వుంటాయి. భాస్కరం ఆనందాన్నిపట్టలేక ముందుకు గంతేస్తాడు. లోపల్నుంచి అంతావింటున్న అన్నపూర్ణ అదేసమయంలో ద్వారం దగ్గరకువచ్చి ఆనందబాష్పాలతో చెమ్మగిల్లిన కళ్ళు ఒత్తుకుంటూ నుంచుని వుంటుంది, ఆమె మొహంలో జీవిత తేజస్సు ప్రస్ఫుటమౌతుంది.

భాస్క: (ఆనందం పట్టలేక) నిజంగానా బావా? నువ్వుబ్రతికే వున్నావా?

రాజా: (మందహాసంతో) నీకు నమ్మకం కలగడంలేదా భాస్కరం ఇదిగోచూడు నా చేతిమీది పచ్చబొట్టు పేరు (చొక్కాచేతిని మడిచి) నేను ఎంత గడ్డం పెంచివున్నా, ఆ మాత్రం గుర్తుపట్టలేక పోతున్నావా?

భాస్క: (అమాంతంగా రాజారావుని [సుదర్శనంని] కౌగలించు కుంటూ) బావా! యీవేళ నాకు యెంతో ఆనందంగా వుంది. (ద్వారం వేపుచూస్తాడు. అన్నపూర్ణ వికసితవదనారవిందయై కనిపిస్తుంది) చెల్లాయ్.. ఇదిగో బావ....

[అన్నపూర్ణ అమితోత్సాహంతో ఆనందం పట్టలేక చర చరావచ్చి సుదర్శనం కాళ్ళదగ్గర కూలబడుతుంది]

అన్న: నేను చాలా అదృష్టవంతురాల్నండీ భగవండు నాప్రార్థనలు విన్నాడు.(ఆనందబాష్పాలు దారావాహినిగా ప్రవహిస్తాయి)

సుద(రాజా): నేనుకూడా అదృష్టవంతుణ్ణే అన్నపూర్ణా: నీ పసుపు కుంకుమ చాలా పవిత్రమైనది. అందుకే అతిఘోరమైన రైలుప్రమాదంలో కాస్తంత దెబ్బలుతగిలినా. బ్రతికి బైట పడగలిగాను. (అంటూ ఆమెను లేవదీస్తాడు)

భాస్క: (నవ్వి అయినా యీవేషం యేమిటి బావా?

సుద(రాజా): ఇదివేషమేమీకాదు భాస్కరం. నా నిజస్వరూపమే అవుతే యిన్నాళ్ళు గడ్డం గీసుకోకపోవడంవల్ల, తగిలిన దెబ్బలు మచ్చలుగా యేర్పడ్డంవల్లా నారూపంలో కాస్తంతా మార్పు వచ్చినమాట వాస్తవమే: సుదర్శనం అంటే యెవరూనమ్మలేనట్టుగా తయారయ్యాను, కాని, పరిశీలనా దృష్టితో చూసేవాళ్ళు పసిగట్టేస్తారు.

భాస్క: నేను అప్పుడప్పుడు అనుకునేవాణ్ణి—నీకూ రాజారావుకి పోలికలున్నాయని అవుతే, నాసంశయాన్ని ధైర్యంచేసి అడగలేక పోయాను. అయినాబావా, యిన్నాళ్ళూయిలా అజ్ఞాతంగా మారుపేరుతో గడపవల్సిన ఖర్మం యేం పట్టింది నీకు?

సుద. (మందహాసంతో) మీనాన్నగారి మనస్తత్వాన్ని ఆకళింపు చేసుకోవాలన్న వుద్దేశంతోనే, మారుపేరుతో వుండాల్సి వచ్చింది ఆయన నిజరూపం యింత వికృతంగా వుండి, వెగటుకలిగిస్తుందని నేనెప్పుడూ వూహించలేదు. మీతండ్రీ కొడుకుల మనః ప్రవృత్తిలో యెంత వ్యత్యాసముంది.

(వెలుపలినుండి సూర్యం ఆత్రంగా వస్తాడు. అతని చేతిలో నోట్లకట్ట వుంటుంది)

సూర్య: (వస్తూనే రాజారావుని, అన్నపూర్ణని ఒక్కదగ్గరచూసి, వుగ్రుడైపోయి) సీతారామయ్యగారూ, యేమిటిదంతా?

భాస్క: (వెటకారంగా) స్వప్నం కాదులెండి సూర్యంగారూ? వాస్తవాన్నే మీరు వీక్షిస్తున్నారు.

సూర్య: (విస్తుపోయి—చిరుకోపంతో) అంటే మీబావగారి స్నేహితుడికిచ్చి పెళ్ళిచేస్తున్నారన్నమాట అన్నపూర్ణని (సీతారామయ్య వేపుతిరిగి) సీతరామయ్యగారూ యేమిటిది నన్నిం దుకిలా మోసగించారు? డబ్బుముందుగా తెమ్మంటే,ఇదిగో తెచ్చానే ఇన్నాళ్ల నా శ్రమను స్వప్నాల్ని భగ్నం చెయ్య డం మీకు న్యాయంగా వుందా?

భాస్క: ఇందులో అన్యాయమేమి జరుగలేదు సూర్యం. ఈయన మా బావ స్నేహితుడు కాదు. స్వయంగా మా బావే గడ్డం పెంచడంవల్ల మొహంమీద గాయపు మచ్చల యేర్పడ్డంవల్ల గుర్తు పట్టలేకపోయాం.

సూర్య: (విస్తుపోయి) మీ బావా! బ్రతికే వున్నాడా? లేక దయ్య..

సుద: (అందుకు కోపంగా) నోర్ముయ్. డబ్బుతో మనుషుల్ని కొంటున్న నువ్వూ ఒక మనిషివేనా? నీకంటె ఆదెయ్యా నయం. ముందు బైటికి నడు. వూం. నీ మొహం చూడ్డ కూడా పాపమే.

సూర్య: (అదరిపోయి) సీతారామయ్యగారూ, యేమిటీ అవమాన

సుద: అవమాన మేమిటి? ముందు బైటికి నడు (కోపంగా రెండడుగులు ముందుకు వేస్తాడు)

సూర్య: (భయంతో) పోతాను, పోతాను (బెదురుతూ బైట జారుకుంటాడు)

సుద: పిచ్చి వెధవ! (భార్యవేపు తిరిగి) అన్నపూర్ణా! మనం మనింటికి పోదాం నడు. ఇక్కడ ఒక్క క్షణం వుండొద్దు,

అన్న: (గతుక్కుమని) అదేవిఁటండీ?

సుద: ఔను, యీ యింట్లో ఒక్క క్షణంకూడా వుండడానికి నాకు మనస్కరించడంలేదు.

భాస్క: అంతమాట అనొద్దు బావా! జరిగిందేదో జరిగింది. అదంతా ఒక స్వప్నంలా భావించి మర్చిపో. మా నాన్న చేసింది క్షమించరాని తప్పని నేను ఒప్పుకుంటున్నాను. ఆయిన మనస్తత్వం తెలసిన నువ్వుకూడా తొందర పడితే యెట్లా?

సీతా: (తన తప్పును యేనాడో తెలుసుకున్నా, పశ్చాత్తాప పడి సుదర్శనంకి దగ్గరగా వచ్చాడు. అతని మొహం బాగా పాలిపోయి వుంటుంది) నాయినా సుదర్శనం; నా తప్పును నేనే ఒప్పుకుంటున్నాను. నా బుద్ధి గడ్డితిని అలా ప్రవర్తించాను. నన్ను క్షమించు. నిజానికి క్షమార్హుణ్ణి కాదు. అయినా పశ్చాత్తాప పడినవాళ్ళను క్షమించడం ధర్మం. ఇదిగో లెంపలు వేసుకుంటున్నాను. (లెంపలు వేసుకుంటాడు)

అన్న: (నవ్వును ఆపుకుంటూ) ఛా! అదేవిఁటి బాబాయ్ చిన్నపిల్లాడిలా? జరిగిందేదో జరిగింది లెండి.

సీతా: (బాధగా) లేదమ్మా అన్నపూర్ణా! నేను కిరాతకుణ్ణి. నాకు యే శిక్ష విధించినా తప్పులేదు. నీవంటి ఉత్తమురాలి హృదయాన్ని నొప్పించాను. భగవంతుడు యెప్పటికైనా నన్ను శిక్షిస్తాడు. (మొహం దించుకుంటాడు)

సుద: చేసిన తప్పుకి పశ్చాత్తాప పడ్డమే ప్రాయశ్చిత్తమంటారు. పెద్దలు మావఁగారూ! నేను తొందర పడ్డం యీ పరిస్థితుల్లో మంచిదికాదు. మీ అందర్నీ అసంతృప్తి పర్చడం యెందుకు; రెండు రోజులు వుండే వెళ్తాం.

అన్న: (మందహాసంతో) భలేవారండీ మీరు. (లోపలికి చరచరా వుత్సాహంతో పోతుంది)

సీతా: (అన్నపూర్ణ పోయినవేపే చూస్తూ) అమ్మాయి కళకళలాడుతూ వుండడం మళ్ళీ యెన్నాళ్ళకు చూశాను. (మరింక అక్కడ వుండలేక మెల్లగా లోపలికి పోతాడు)

భాస్క: (మందహాసంతో) అయినా బావా, నువ్వుఆడిన నాటకం యేమిబాగులేదు సుమా: బ్రతికివుండి, మరణించినట్లు కథల్లి నాటకమాడ్డం, చాలా అసభ్యంగావుంది: ఒకవేళ నాన్న నిర్ణయించిన పెళ్ళిజరిగిపోతే, అప్పుడు ఏంచేసేవాడివి?

సుద: అలా జరక్కుండా వుండడానికేగా, యిక్కడ తిష్టవేశాను?

భాస్క: నువ్వు మంచి నటుడివి సుమా?

సుద: జీవితమే నాటకంకదా భాస్కరం! ఆ నాటకంలో ప్రతివ్యక్తి నటుడే:

భాస్క: (నవ్వుతూ)ఇంతకీ, యిప్పుడు నువ్వు సుదర్శనంవా? లేక రాజారావువా?

సుద: (నవ్వి)నిజరూపం బైట పడ్డాక. యింక మారు పేరెందుకు? పదలోపలికి...

(ఇద్దరు నవ్వుకుంటూ లోపలికి వెళ్తుండగా)

—తెర—



అభ్యుదయం

శ్రీ చింతా హనుమంతరావు

ఏనాడైనా విన్నారా మీ
రేనాడైనా విన్నారా.
ఇతర ప్రభుత్వము ఏలిననాడూ ॥ఏ॥

పండిత జవహరు పరిపాలనలో
పాడిపంటలకు కొదవే లేదని ॥ఏ॥

పవిత్రమైన భరతభూమిలో
ఫలితము లిచ్చే ప్లానులుపెట్టీ!
నూతన ప్రాజెక్టులనూగట్టీ
నిరుద్యోగమును నిర్మూలించీ!
రైతుల కష్టములాలోచించీ!
వాయిద పద్ధతులప్పులనిచ్చీ
ఎరువులనెన్నో లభింపజేసీ!
పంటజాడ్యముల నిర్మూలించీ!
జపానుపద్ధతితో వరిసాగు
పంటలు బాగుగపండించారని ॥ఏ॥

విద్యాలయములనెన్నోగట్టీ
విరివిగపిల్లల బడులను జేర్చి
పాఠ్యభాగముల పరిశీలించి
కఠినపద్ధతుల నిర్మూలించి
స్కాలర్‌షిప్పుల నెక్కువయిచ్చీ
భోజన సదుపాయములను జేసీ,
వయోజనులకు పాఠశాలలూ!
అంధులకెన్నో విద్యాలయములు.
అఖిల ప్రాంతములలో నిలిపి
విద్యావ్యాప్తికి దోహదమిచ్చీ,
విద్యాధికులెందరొన్నో నియమించీ,
జీతభత్యములు బాగుగనిచ్చీ
జీవనభృతిని కల్పించారని ॥ఏ॥

వైద్యాలయములు నిర్మించియునూ!
రోగములన్నిటి నిర్మూలించీ!
నూతన మందులనెన్నోదెచ్చి:
అంటురోగములు నశింపజేసి
పశువైద్యములను ప్రోత్సహించి
పశుపోషణమును బాగుగచేసి
పశువుల ఆస్పత్రులనుగట్టి,
ప్రతివారికి సాయముచేసిరని ॥ఏ॥

అస్పృశ్యతనూ అంతముచేసి
అనుభవమైనా ప్లానులువేసీ
హరిజనులంటె గౌరవముంచి
గాంధీచెప్పిన దారిని నడచుచు
ఉచితనివేశస్థలములు విద్య,
ఉన్నతపదవులు ఉద్యోగములు
దేవాలయముల అర్చకులునుగ
దివ్యముగా హరిజనులనుంచి
అంటరానివాడన్నను ఖైదు
ఐదువందలు వడ్డించారని ॥ఏ॥

మాలవికాగ్నిమిత్రం నాటకమా ?

శ్రీ శ్రీనివాస సోదరులు

కాళిదాసు రచించిన మాళవికాగ్ని మిత్ర ప్రస్తావనలో "మాలవి కాగ్ని మిత్రం నామనాటకం" అని వుంది. మాలవికాగ్ని మిత్రంలో ఐదు అంకాలున్నాయి.

"పంచాంకంచ షడంకంచ సప్తాంకంచ తథాపరం
అష్టాంకంచ నవాంకంచ దశాంకం నాటకంవిదుః"

కావ్యాలం. సంగ్ర. 9_48

అని సాహిత్య శాస్త్రకారులు చెప్పటంచేత నాటకంలో ఐదు నుంచి పది వరకూ అంకాలుండవచ్చును. కనుక ఈ దృష్టితో మాలవికాగ్ని మిత్రము నాటకమే అవుతున్నది.

నాటకానికి ఇంకొక లక్షణం—

"ఏకోరసోంగీ కర్తవ్యః వీరః శృంగార ఏవవా"

కావ్యా సం. 9_43

వీర శృంగారాల్లో ఏదో ఒక రసం అంగిరసంగా వుండాలి. మాలవికాగ్నిమిత్రంలో శృంగారం అంగిరసం కనుక ఇదీ నాటక లక్షణానుకూలమే.

కాని—నాటకంలో నాయకుడు ధీరోధత్తుడుగా వుండాలి.

"అభిగమ్యగుణైర్యుక్తో ధీరోదాత్తః ప్రతాపవాన్
కీర్తికామో మహోత్సాహః, త్రయ్యాస్త్రాతా మహీపతిః
ప్రఖ్యాతవంశో రాజర్షిః. దివ్యోవాయత్ర నాయకః"

దశరూ.3_21, 22

అగ్నిమిత్రుడు శుంగవంశజుడైన భారత చక్రవర్తి. అశ్వ మేధయాజి. కాని మిగిలిన గుణాలతనిలో లేని వాటిలోనే జమ. యాగాశ్వాన్ని రక్షించటానికి పోగల కొడుకున్నాడు. అంటే అతని వయస్సు సుమారు నలభైదాటి వుండవచ్చు. ఒక పట్టపు రాణి వుండి, ఇంకొక వలపుల భార్య వుంది. ఇలా వుడింస్నీ అతడి మనస్సు చిన్న వయస్సులో ఉన్న ఒక సేవకురాలి మీద లగ్నమైంది. ఆమెకోసం పడరాని పాట్లు పడతాడు. కడకు ఒక సన్నివేశంలో పట్టుబడి తన వలపుల భార్య ఇరావతి కాళ్ళమీద పడటానికూడా వెనుదీయడు. "నూనమిదానీ మనుజ్ఞాతమ్" అను కుంటాడు. దాసుడితప్పులు దండంతో సరి అని సరిపెట్టుకునే స్వభావం. ఇవన్నీ కాముక లక్షణాలు.

ఇంక తన సైన్యాలు యుద్ధాల్లో నిమగ్నమై యున్నా యితనికి ఆవైపు దృష్టిలేదు. వాళ్ళ తంటాలు వాళ్ళేపడతారు. మనం హాయిగా అంతః పురంలో విహరిద్దామనుకునే ప్రవృత్తే కనపడుతుంది. ఇవన్నీ ధీరలలిత నాయకుడి లక్షణాలు.

"సచవాయత్త సిద్ధి స్స్యాన్నిశ్చిన్తో భోగతత్పరః
సుఖీమృదుః కలాసక్తః స్యాద్ధీరలలితోమతః"

కావ్యా. సం. 4_5, 6

ఇందులో చెప్పిన ధీరలలిత లక్షణాలు అగ్నిమిత్రుడికి వున్నాయి. నాయకుడు ధీరోదాత్తుడు కాడు గనుక మాళవికాగ్ని మిత్రం నాటకమనటానికవకాశం కనిపించటంలేదు.

పైగా నాయకుడెంత ముఖ్యమో నాటకానికి ఇతివృత్తం గూడా అంత ముఖ్యమే. నాటకంలో ఇతివృత్తం...

"తత్రప్రఖ్యాతం విధాతవ్యం వృత్తమత్రాధికారికమ్"

దశరూ. 3_22

ప్రఖ్యాతం అంటే "ఇతిహాస నిబన్ధనమ్" (ప్రతా. పు 87) అగ్ని మిత్రుడు ఐతిహాసిక పురుషుడే కాని కథమాత్రం కల్పితం. కనుక ఇది "ప్రఖ్యాతం" కిందికి రాదు. అంటే మాళవికాగ్ని మిత్రంలో ఆధికానిక వృత్తం (main theme) ప్రఖ్యాతం కాదు కనుక ఈ విధంగా కూడా ఇది నాటక మనటానికి వీలు లేదు.

కనుక అంకసంఖ్య తప్ప మాళ వికాగ్ని మిత్రం నాటక మవటానికి ఆస్కారం ఏమీలేదని తేలింది. అయితే యిది రూపక భేదాల్లో దేనిలో చేరుతుంది?

ధీరలలితుడు నాయకుడుగా ఉండే రూపకానికి నాటిక అని పేరుంది. దాని లక్షణమిది:—

నాటికా క్లప్త వృత్తాస్యాత్ స్త్రీ ప్రాయా చతురంకికా
ప్రఖ్యాతో ధీర లలిత స్తత్రస్యాన్నాయకో నృపః
స్యాద స్తః పురసంబద్ధా సంగీత వ్యాపృతాథవా
నవానురాగా కన్యాత్ర నాయికా నృపవంశజా
సంప్ర వర్తేత నేతాస్యాం దేవ్యాస్త్రాసేన శంకితః
దేవీ భవేత్పున ర్జ్యేష్ఠా ప్రగల్భా నృపవంశజా
పదేపదే మానవతీ తద్వశః సంగమోద్వయోః
వృత్తిఃస్యాత్ కైశికీ స్వల్ప విమర్శాః సంధయః పునః.
సాహి, దర్ప. 6—

నాటికలో ప్రఖ్యాతుడైన రాజు ధీర లలితుడు నాయకుడు: అగ్నిమిత్రుడు ప్రఖ్యాత భారత చక్రవర్తి, ధీరలలితుడు.

ఇతివృత్తం కల్పితమైనది. ఎక్కువమంది స్త్రీలతో కూడి వున్నది: మాళవికాగ్నిమిత్రంలో రాజు చారిత్రక పురుషుడే గాని కథ అంతా కల్పితమే. ఇందులో రాజు పట్టపు రాణిధారిణి, వలపుల భార్య ఇరావతి, పరివ్రాజిక, నాయిక మాలవిక, వీరందరి చెలికత్తెలు ఈవిధంగా పదముగ్గురు స్త్రీలే ఉన్నారు. కథ వీళ్ళందరినీ చుట్టిముట్టే తిరుగుతూంటుంది.

అంతఃపురములో చిక్కినదీ, సంగీతం నేర్చుకుంటున్నదీ రాజవంశానికి చెందినదీ అయిన కన్య నాయికగా వుంటుంది. ఆమె కొత్తగా అనురాగోదయం కలిగినదౌతుంది: మాళవిక నాయిక. ఈమె రాకుమారి. అన్నయైన మాధవసేనుడితో కలిసి ప్రయాణం చేస్తుండగా మాధవసేనుడి దాయాదుడైన విదర్భరాజు వీరిని పట్టుకుంటాడు. మాధవసేనుడి మంత్రి సుమతి మాలవికను తప్పించి తన చెల్లెలితో కూడా విదిశానగరం వెళ్ళే బాటసారుల గుంపులో కలిసి పోతూంటాడు. దారిలో దొంగల గుంపు బాటసారులపై తల పడుతుంది. సుమతి యుద్ధంలో చనిపోతాడు. అతని చెల్లెలు కౌశికి మూర్ఛపోతుంది. మాళవిక తప్పించుకొని పోయి ఆటవికులద్వారా అగ్నిమిత్రుడి రాజ్యపు సరిహద్దులో దుర్గపాలకుడుగా ఉన్న వీరసేనుడి వద్దకు చేరుతుంది. అతడు ధారిణీ దేవికి తక్కువ కులపు సవతితల్లికి పుట్టిన సోదరుడు. అతడు మాళవికను ధారిణి దగ్గరకు పంపగా ఆమె నాట్యం నేర్పిస్తూ తనవద్ద వుంచుకుంది. కనుక మాళవిక రాజవంశానికి చెందినది. అతఃపురములో చిక్కుకున్నది. సంగీతం నృత్యం నేర్చుకుంటున్నది. నాట్యాచారుడీమెను 'బాలా' అనీ, వకులావలిక ''దారికా'' అనీ పేర్కొనటం చేతను, రాజు ఈమెను ప్రత్యక్షంగా నాట్య సమయంలో చూచినప్పుడు "నిబిడోన్నత స్తన మురః" అని వర్ణించటం చేతను ఈమె పదహారు పద్దెనిమిదేళ్ళ వయస్సులో వుండి యుండవచ్చును. ''అవిజ్ఞాత హృదయం భర్తారమభిలష న్త్యాత్మనోపితా వల్లిజ్జే''అని (అం. 3) మాళవిక అనుకొన్న దానిని బట్టి అమె నవజాతరాగ అని స్పష్టం.

రాజు తన రాణికి వెరుస్తూ చాటుమాటుగా ఈ నాయికతో ప్రేమకలాపం సాగిస్తాడు: పరభృతిక మధుకరికతో అంటుంది. "కేవలం దేవ్యాధారిణ్యాశ్చిత్తం రక్షన్నాత్మనః ప్రభుత్వం నదర్శయతి" (3 అం. ప్రవేశకం) "కేవలం ధారిణికి కోపం వస్తుందేమోనని రాజుమాలవిక విషయంలో స్వేచ్ఛగా వర్తించటం లేదు" అని తృతీయాంకంలోనూ, చతుర్థాంకంలోనూ, అశోక వృక్షం దగ్గరా, సముద్ర గృహంలోనూ మాలవికతో రహస్య సమావేశమే ఏర్పాటు చెయ్యబడింది. కాని రెండు సార్లూ రాజు వలపుల భార్య ఇరావతి పానకంలోపుడకలాగా వచ్చి రసభంగం చేసింది అశోకవృక్షం దగ్గరికి ఇరావతి వచ్చినప్పుడు రాజు—"అబ్బే నాకు మాళవికతోటి ఏం పని. ఏదో నువ్వు ఆలస్యం చేశావని కాస్త మనోవినోదనం కోసం ప్రవర్తించాను" అని మభ్య పెట్టబోయాడు. "నమే మాలవికాయాం కశ్చిదర్థః. మయాత్వం చిరయ సీతి యథాకథం చిదాత్మా వినోదితః" (3 అం.) నమ్మటానికి ఆమె పసిపిల్ల కాదు గదా: ఎంత నచ్చజెప్పజూచినా వినక కోపంతో ఆమె పోబోతుంటే చివరికి కాళ్ల మీద కూడా పడ్డాడు. తీరా యీ విషయం తీసుకెళ్ళి ఇరావతి ధారిణికి ముట్టించింది. ఆమె మాళవికను, చెలికత్తె రకుళావలికను పాతాళగృహంలో బందీ చేసింది. ఈ సంగతి విదూషకుడు చెప్పినప్పుడు రాజు "అహో, దీర్ఘరోషతా తత్రభవత్యాః" "ఈ ఇరావతి కెంత దీర్ఘ రోషం!" అని బాధ పడ్డాడు. ఇలా అగ్నిమిత్రుడి ప్రణయ కలాపం భార్యలకు వెరుస్తూ సాగింది.

రాజు పెద్దభార్య రాజవంశజురాలు ప్రగల్భ, మాటిమాటికి కోపం కలదీని. నాయికా నాయకులకలయిక యీమె చేతులో వుంటుంది: మాళవికాగ్నిమిత్రంలో ధారిణి రాజు పెద్ద భార్య. రాజవంశజ, ప్రగల్భ. (ప్రౌఢా సంపూర్ణయౌవనా—ప్రతా నాయ 55) కాని ఈమె తేపతేపకూకోపం తెచ్చుకునే స్వభావం కలది మాత్రం కాదు. ఉదార స్వభావం కలది. మొదట్లో రాజు దృష్టి చిత్రంలో మాలవిక మీదపడి అడిగినప్పుడు ఆమె సమాధానం చెప్ప లేదు (''తతోఽవధీరితవచనో భర్తాపునఃపునః నిర్బన్ధుం ప్రవృత్తః. యావద్దేవీనకథయతి—" వకులావలికా 1 అం.వి.) కాని బాల్య

చాపల్యంచేత చెల్లెలు వసులక్ష్మి మాలవిక అని చెప్పివేసినప్పటి నుంచీ మాలవికను రాజు దృష్టిపథంనుంచి తప్పించటానికి జాగ్రత్త తీసుకుంది. (సాంప్రతం మాలవికా సవిశేషం భర్తుర్ద ర్శన పథాద్రక్ష్యతే—వకులా 1 అం. వి.) నాట్యాచార్యులైన హర దత్త గణదాసులు తగవులాడుకోటం మాలవిక నాట్యప్రదర్శనం ఏర్పాటు కావటం ధారిణికి ఇష్టంలేదు. ఇది రాజు గూడు పుఠాణీ అని కనిపెట్టి గణదాసునితో "అచిరోపనీతాతే శిష్యా తదపరినిష్ఠి తస్యోపదేశస్యాన్యాయ్యం ప్రదర్శనమ్" (నీ శిష్యురాలు కొత్తగా నేర్చుకుంటున్నది. బాగా అభ్యాసంకాని ఉపదేశం ప్రదర్శించటం న్యాయంకాదు) అని చెప్పి వారించబోతుంది. గణదాసుడు "అచి రోపనీత అయినా ఆమె ప్రదర్శన కౌశలంలో నాకు నమ్మకముంది. ఆమె ప్రదర్శనం వల్లనే నా శక్తి బోధపడుతుం"దని రాణికి చెప్పు కుంటాడు. అప్పటికీ రాణి "తేన హిద్వావపి భగవత్యా ఉపదేశం దర్శయతమ్" (1 అం.) "అయితే మీ రిద్దరూ పరివ్రాజికముందు ప్రదర్శనం జరిపించండి" అని చెప్పి రాజును దూరంగా ఉంచటా నికి ప్రయత్నిస్తుంది. కాని పరివ్రాజికకూ్కడా రాజుకూ మాల వికకూ సంబంధం కలగటం ఇష్టమే కనుక "ఎంత సర్వజ్ఞులైనా ఒక్కరే న్యాయనిర్ణయం చెయ్యటం తప్పు" అంటుంది. ధారిణిలో లోపల "ముగ్ధే! కింమాం జాగృతీమపిసుప్తామివకరోషి" (నేను జాగ్రత్తగా ఉన్నా నా కళ్లు ముయ్యటానికి ప్రయత్నిస్తు న్నావే) అనుకుంటుంది. విదూషకుడు గణదాసునకు తిరిపెడు తాడు. గణదాసుడు "ప్రదర్శనానికి ఒప్పుకోకపోతే నన్ను మీరు వొదిలేసినట్టే భావిస్తాను" అంటాడు. ధారిణి గత్యంతరం లేక అంగీకరించి చివరికి నర్మగర్భంగా "ఈ మాత్రం నైపుణ్యం రాజ కార్యాల్లో వుంటే ఎంత బాగుండును!" అని మందలించింది. కాని రాజులో కామపిశాచం గృహిణి నర్మగర్భిత వాక్యాలని ఖాతరు చేసే స్థితిలో లేదు.

అయితే కాళిదాసు ధారిణిని ఆదర్శ గృహిణిగా, ఉదార హృదయగా చిత్రించదలచాడు. రాజు తప్పుత్రోవలో పడుతుంటే అందుకు సాయంచేస్తున్నాడని తెలిసికూడా విదూషకుడికి పాము కరిచింది, నాగముద్రిక కావాలనగానే మాళవికను విడిపించటానికి అది పనికి వస్తుందనే భావం కూడాలేకుండా వెంటనే ధారిణి ముద్రికను ఇచ్చివేస్తుంది. విదూషకుడిమీద ఎంతో సానుభూతి చూపిస్తుంది. మాలవిక రాజదారిక అని తెలిసినప్పుడు ఆమెను బాధించినందుకు, పరిచారికగా వినియోగించుకున్నందుకు ధారిణి ఎంతో బాధపడుతుంది. "చందనంఖిలు మయాపాదు కాపరిభోగేణ దూషితమ్" (5అం.) అనుకుంటుంది. మాధవసేనుడి మంత్రి సుమతి కోరిక ప్రకారం ధారిణి మాలవికను రాజుకు భార్యగా సమర్పించటానికి నిశ్చయించింది. తాను పట్టపురాణి ఏమిచేసినా స్వాతంత్ర్యం కలది. ఐనా ముందుగా ఇరావతికి సంగతి సంద ర్భాలు తెలిపి ఆమెచేతగూడా ఊఁ అనిపించటంలోనూ, పరివ్రాజిక అనుమతి తీసుకోటంలోనూ ఆమె ఔదార్యం కనబడుతుంది.

మరి నాటికాలక్షణంలో రాజభార్య "పదేపదే మానవతీ"గా వుంటుందనీ వుందిగదా దాన్ని అనుసరించటానికి కాళిదాసు ఇరావ తిని ప్రవేశపెట్టాడు. ఆమె అశోకవృక్షం దగ్గర రాజు మాలవికను కలిసినప్పుడు పానకంలో పుడకలాగా వస్తుంది. తనమొలనూలితో రాజును కొట్టబోతుంది. "అవిశ్వసనీయ హృదయోసి, శఠ." అని నిందిస్తుంది. రాజుకాళ్ళమీద పడ్డా దులపరించుకొని పోతుంది. సముద్ర గృహంలో, పాతాళగృహంనుంచి విడిపించబడిన మాలవి కను రాజుకలసుకున్నప్పుడు కూడా, ఇరావతి పరిచారికవల్ల సూచన తెలుసుకొని వచ్చిపడుతుంది. అక్కస్సంతాతీరేట్టు "అపి నిర్విఘ్నమనోరథోదివస సంకేతోమిథునస్య" అని రాజునూ, "వకులావలికే, దూత్యధికారవిషయా సంపూర్ణాతే ప్రతిజ్ఞా" అని వకులావలికను ఎత్తిపొడుస్తుంది. "కుపితాపి ఇదానీంకింకరిష్యామి" అని బాధపడుతుంది. "అన్యసంక్రాన్తేష్వస్మాకం భాగధేయేషు యదిపునః కుప్యేయంతతోహం హాస్యాభవేయమ్" అని పేద కోపం వెదవులచేటనిపిస్తుంది. అంతటితో వదలదు. ధారిణికి కబురు పంపుతుంది. ఇలా 'పదేపదే మానవతీ' గా ఇరావతిని చిత్రించి కాళిదాసు నాటికా లక్షణాన్ని పూర్తిచేసుకున్నాడు.

ఈ విధంగా మాలవి కాగ్ని మిత్రం నాయకుణ్ణిబట్టీ ఇతి వృత్తాన్నిబట్టీ, రసాన్నిబట్టీ నాటికగా రచింపబడింది. అంక సంఖ్య మాత్రమే నాటికాత్వానికి వ్యతిరేకంగా వుంది. నాటిక కైశికీ వృత్తిలోవుండాలని వుండటంచేతనూ, దానికి నర్మము, నర్మస్పందము, నర్మస్ఫోటము, నర్మగర్భమూ అనే నాలుగంగా లుండటంచేత నాలుగంకాలుండదగునని నిబంధించబడింది.

"కైశిక్యంగైశ్చతుర్భిశ్చయుక్తాంకైరివనాటికా"

కావ్యా. సంగ్ర. 9—125

ఈ నాలుగంగాలకూ నాలుగంకాలు వ్రాయటం పొసగదు. కనుక ఇది ప్రాయవచనంగా గ్రహించాలి. సామాన్యంగా నాలు గంకాలుండాలి అని అనుకుంటే ఐదంకాలున్నంత మాత్రంచేత మాలవికాగ్ని మిత్రం నాటిక కాకుండా పోదుగదా! "యదిచేష్యతే! ఏకద్విత్ర్యంక పాత్రాదిభేదేనా నన్త రూపతా" అని దశ రూపకంలో(3—45)కొంత స్వాతంత్ర్యం ఇయ్యబడింది గూడా.

ఇంక పేరుపెట్టే విషయంలోకూడా నాటికకు ఒక నిబంధన వుంది:

"నాటికాసట్టకాదీనాంనాయికాభిర్విశేషణమ్"

కావ్యా. సం. 9.31

నాటికకు నాయిక పేరుపెట్టాలి. ఇక్కడ మాలవిక అంటే చాలును. కాని అగ్నిమిత్రుడి పేరుకూడా చేర్చబడింది. సామాన్యంగా నాటకేతరములైన ప్రకరణాదులకు నాయికానాయకుల పేర్లతో కలిపి పేరు పెట్టడం సాహిత్య శాస్త్రసిద్ధం.

"నాయికానాయకాఖ్యానాత్సంజ్ఞాప్రకరణాదిషు"

కావ్యా. సం. 9—31

ఒక పక్షంలో నాటికాదులు గూడా నాటకేతరాలే గనుక నాయికా నాయకుల పేర్లు కలిసిన పేరుపెట్టటం అంత అసంగతం కాదని సరిపెట్టుకోవచ్చు.

ఈచర్చవల్ల తేలిన సారాంశం—మాలవికాగ్నిమిత్రం నాటకం కాదనీ; నాటికేఅనీ కనుక ప్రస్తావనలో బహుశా పూర్వం "కాళిదాస గ్రథితవస్తు మాలవికాగ్నిమిత్రం నామనాటకమ్" అనే చోట 'నాటకమ్' అనే పదానికి బదులు 'నాటిక' అని వుండేదేమో అని ఊహించటానికి కవకాశముంది. వాక్యం చివర ప్రయోక్తవ్యం అనేచోట ప్రయోక్తవ్యా అని వుండి వుండవచ్చుననిపిస్తున్నది. తరువాత పారిపార్శ్వకుడి ప్రసంగంలో 'కాళిదాసస్యక్రియామిమాం' అనే స్త్రీలింగప్రయోగ స్వారస్యంచేత గూడా ఈఊహ కొంతబల పడుతుంది కాని, ఇదంతా ఊహామాత్రమే ముద్రితప్రతుల్లో ఎక్కడా 'నాటికా' అనేపదం పాఠాంతరంగా చూపబడలేదు.

'నాటకమ్' అని వుండటానికి ఒక కారణం వూహించవచ్చు. కాళిదాసు కాలానికి నాటిక అనే ప్రక్రియ రూఢం కాకపోయి ఉండవచ్చు. అతని తరువాత కాలంలో ప్రియదర్శిక, రత్నావళి విద్ధసాలభంజిక మొదలైన నాటికలు ప్రచురంగా వచ్చాయి. కనక తన కాలంలో ప్రచారంలో వున్న దశరూపకాల్లోనూ మాళవికాగ్నిమిత్రం నాటకేతరాలైన ప్రకారణాదుల్లో చేరదు కనుక కాళిదాసు దీనికి నాటకమని పేరు పెట్టివుండవచ్చు. ప్రకరణం మల్లేనే ఉత్పాద్యమైన ఇతి వృత్తంవున్నది కావటంచేత పేరుపెట్టేటప్పుడు ప్రకరణాదులకు నిబంధించిన విధంగా నాయికానాయకుల పేర్లు కలసిన పేరు పెట్టివుండవచ్చును. అలానే విక్రమోర్వశీయాన్నిన్నీ కాళిదాసు నాటకమనే వ్యవహరించాడు ప్రస్తావనలో. అప్పటికి త్రోటకమనే ఉపరూపకం రూపొంది వుండకపోవచ్చు అందువల్లనే యిలాజరిగివుంటుంది. తరువాత వ్యాఖ్యాతలు విక్రమోర్వశీయ ప్రస్తావనలో త్రోటకమనేపాఠం లక్షణాన్నిబట్టి కల్పించివుంటారు. ముఖ్యంగా రంగనాథదీక్షితుడి వ్యాఖ్యలో త్రోటకమనే పాఠం కనపడుతున్నది. సాహిత్య శాస్త్రం గ్రంథాల్లోవిక్రమోర్వశీయం త్రోటకానికి ఉదాహరణగా ఇవ్వబడుతూ వచ్చింది.కాని మాళవికాగ్నిమిత్రం విషయంమాత్రం నాటకమా, నాటికా అని ఎవరూ చర్చించినట్టు కనబడ్లేదు.



తరుణి వంపు సొంపు లరసి మురిసిపోకు
తంపులుండు వంపు సొంపులందె
చూడ రగులు సెగలు సొగసుగా నుండవా?
జనమతాంతరంగ! వినుర! రంగ!

కళా కృష్ణల "కృష్ణశతశతి"

మాతృ వందనము

శ్రీ వేంకట పార్వతీశ్వరకవులు

హరి హర నాధమండలి పినాకిని గంగ
సీమంత దామసు।శవహింప

శోభన, కృష్ణవేణీ భద్రగామిని
మరకతహార విస్ఫురణ నెఱప

నిఖిల పుణ్యాపగా నిలయగోదావరి
మణిహేమ కాంచికా మహిమనింప

పావన నాగావళీ వంశధారలు
చరణ మంజీర వైఖరిభజింప


అఖిల వైభవ సముపేత యాంధ్రమాత
ప్రాజ్య సువిశాల సుప్రజారాజ్యపీఠి
నోలగంబుండె విజయ ముహూర్తమందు
నందఱేకమై కొలువుడీ యాంధ్రులార।

ఎదుగు బొదుగులేని యేబ్రాసి బ్రతుకేల?
మంచి చెడులు లేని మమత లేల?
ఆడ మగయు కాని మోడు జన్మేలరా?
జనసుతాంతరంగ। వినుర। రంగ।


కళా కృష్ణుల "కృష్ణశతి"




ఆంధ్ర ప్రదేశ్ లఘు పరిశ్రమల అభివృద్ధి సంస్థ. డైరెక్టర్ల బోర్డు తొలి సమావేశాన్ని
గత సెప్టెంబరు 22 వ తేదీన ముఖ్య మంత్రి ప్రారంభించారు.




అనంతగిరిలోని క్షయరోగ చికిత్సా కేంద్రం జనరల్ వార్డు లోపలి దృశ్యం.




మహబూబ్‌నగరంలోని స్త్రీల ప్రాతిపదిక శిక్షణ కేంద్రంలో సభ్యురాండ్రు సూలువడుకుతున్న దృశ్యం.




కర్నూలు పంచాయతీ సమితి లక్ష్మీపురంలో, బ్లాకు నిధుల నుంచి సగం సహాయంతో గ్రామస్థులు నిర్మించిన సాముదాయిక సభా మందిరం, మహిళా సంక్షేమ కేంద్రం.




ఒరిస్సా గవర్నరు శ్రీ సుక్తాంకర్, ఐ.సి.ఎస్., ఇటీవల హైదరాబాదుకు విచ్చేసిన సందర్భంలో నిలోఫర్ ఆసుపత్రిలోని ఎక్స్-రే యంత్రాన్ని చూస్తున్న దృశ్యం.



ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీకి గత సెప్టెంబరు 18 వ తేదీన హైదరాబాదులోని జూబిలీహాలులో రాష్ట్ర గవర్నరు ప్రారంభోత్సవం చేస్తున్న దృశ్యం. ఈ సందర్భంలో కుమారి యామినీ కృష్ణమూర్తి నాట్య ప్రదర్శనం జరిగింది.



ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూ గత అక్టోబరు 3 వ తేదీన బేగంపేట విమానాశ్రయంలో కొంచెం సేపు ఆగిన సమయంలో పిల్లలతో గడిపారు



హైదరాబాదు సమీపంలో సరూర్‌నగర్‌లోని కోళ్ల పెంపకం క్షేత్రం.


THEN

CART TRACKS — THE CURSE ON THE FARMER



NOW

SURFACED ROADS — HIS BOON



THEN

UNBRIDGED CROSSINGS — NATURAL BARRIERS FOR MOVEMENT OF MEN *and* MATERIALS



NOW

BRIDGES—THE LINKS THAT ESTABLISH CONTACTS



"ఆంధ్ర ప్రదేశ్" ప్రకటన రేట్లు

'ఆంధ్రప్రదేశ్' పత్రికలో ఈ దిగువ రేట్లప్రకారం ప్రకటనలు స్వీకరించబడగలవు,

వివరాలు	మూడు భాషల పత్రికలకు			ఒక భాష పత్రికకు		
	పూర్తి పేజీ రూ	సగం పేజీ రూ	పావు పేజీ రూ	పూర్తి పేజీ రూ	సగం పేజీ రూ	పావు పేజీ రూ
లోపలి పేజీ	200	125	75	100	55	30
వెనుకవైపు కవరుపేజీ	350	—	—	150	—	—
2,3 కవరు పేజీలు	250	—	—	125	—	—

ఒక సంవత్సరం కొరకు స్థలమును కంట్రాక్టు తీసుకొన్నవారికి 20 శతి రిబేటు ఇవ్వబడుతుంది.

షరతులు

1. సాంకేతిక వివరాలు: $10\frac{3}{4} \times 8\frac{1}{2}''$ డెమ్మీ.
2. ముందరి టైటిల్ పేజీపై ప్రకటనలు వేయబడవు.
3. పావుపేజీకంటే తక్కువ ప్రకటనలు స్వీకరించబడవు.
4. ప్రకటించవలసిన విషయము, అది వేయబడవలసిన స్థలము మొదలగు వివరాలు, దానికయే మొత్తమూ ప్రతినెల 8 వ తేదీలోపుగా ఈ కార్యాలయానికి చేరినట్లయితే, ఆ ప్రకటన మరుసటి నెల పత్రికలో ప్రచురింపబడుతుంది. ప్రకటనకయ్యే మొత్తమును మనియార్డరు ద్వారాగాని, లేక క్రాస్ చేసిన డిమాండు డ్రాఫ్ట్‌ద్వారాగాని పంపవలెను. డిమాండు డ్రాఫ్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధముల శాఖ డైరెక్టర్, హైదరాబాదు-దక్కన్ పేరిట వ్రాయబడవలెను.
5. ప్రకటన నిమిత్తమై పంపబడు బ్లాకుల విషయంలో తగుజాగ్రత్త వహింపబడుతుంది. అయితే మిషను మీద బ్లాకులు గనుక పగిలిపోయినయితే అందుకు ఈ శాఖ బాధ్యత వహించదు.
6. ప్రకటన ఎంతస్థలంలో ఏవైనం ప్రకారం వేయవలసిందీ. ఒక భాష పత్రికలో వేయవలెనా, లేక మూడుభాషల పత్రికలలో వేయవలెనా అనే వివరాలను స్పష్టంగా తెలియపరచాలి. ఉత్తర ప్రత్యుత్త రాలను, పైకమును ఈదిగువ చిరునామాకు పంపవలెను.

డైరెక్టర్
సమాచార పౌరసంబంధముల శాఖ
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం
హైదరాబాద్-1

అధికాహారోత్పత్తికి అధునాతన పద్ధతులు

శ్రీ పి.వి.యల్.యన్. రావు

జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం క్రింద 1954 లో ప్రథమ దశ అభివృద్ధి మండలంగా ఆరంభమై 1958లో అడ్-హాక్ సమితిగా యెన్నుకొనబడి 1959 లో పంచాయితీ సమితిగా మారిన అనంతపురం జిల్లా కొడిగెనహళ్లి అభివృద్ధి మండలం అనేక రంగాల్లో అద్వితీయమైన అభివృద్ధి సాధించగలిగింది, హిందూపురం తాలూకాలో సగానికిపైగా వ్యాపించివున్న యీ బ్లాకు ప్రాంతంలోని నలుబైపైచిలుకు గ్రామాల్లో 70,845 మంది ప్రజలు నివసిస్తున్నారు. అధికారుల, అనధికారులు చేతులు చేతులు కలిపి అధికాహారోత్పత్తికి అధికమైన కృషి చేస్తూ వచ్చారు మొదటి నుండి యీ ప్రాంతంలో. ముఖ్యంగా నీటి పారుదల పథకాలకు ప్రముఖ స్థానం యివ్వబడటంతో యిది సులువుగా సాధించబడ గలిగింది.

ఈ ప్రాంతంలోని నీటి వనర్లు—చెరువులు, బావులు, ఊట కాలువలు అన్నీ కూడా వర్షా ధారాలే. ఇక్కడి సరాసరి వర్షపాతం అయినా 22 అంగళాలు రాష్ట్రం మొత్తంలోనే తక్కువ అయింది. ఆకాశంవైపు ఆతురతతోచూసి గాలికి దూదిపింజిల్లా యెగిరిపోయే మేఘాలను చూసి నిరాశా నిస్పృహలతో నిట్టూర్చేవాడు రైతు. సమాజాభివృద్ధి కార్యక్రమం రావటంతో భారత దేశపు పల్లె ప్రాంతం క్రొత్త చిగుళ్లను తొడిగి నవజీవాన్ని పుణికి పుచ్చుకొన్నది. మానవ హృదయంలో నవ దృక్పథం యేర్పడింది. తమ పరిస్థితులను మెరుగు పరచుకోవాలనే భావం ప్రతివారి మనస్సులో నాటుకు పోయింది.

ఈ ప్రాంతంలో ప్రవహించే పెన్నార్, జయమంగళలు—పేరుకు నదులేగని వర్షపు నీటిని మోసుక వచ్చేవాగుల్లాటివి నిజానికి. అయితే వీటి పరిసరాల్లో త్రవ్వేబావుల్లో నీరు బాగా నిలువ వుండేది. అందువల్ల ప్రప్రథమంగా బ్లాకు ప్రాంతంలో యెక్కువ బావులు త్రవ్వటానికి సంకల్పించబడింది. మొత్తం ప్రస్తుతం రెండువేలకు పైగా బావులు యీప్రాంతంలో వున్నవి. ఈ బావుల నీటిపారుదలక్రింద ఏడు వేలఎకరాలకుపైగాభూమి సాగవుతూన్నది. ఈబావులు రైతులు త్రవ్వుకునేందుకు వుత్సాహం కలిపించేందుకు బ్లాకు అధికారులు ముప్పైయేడున్నర వేలు సబ్సిడీలుగాను, అయిదున్నర లక్షలు అప్పుగాను యిచ్చారు.

అధునాతనయుగంలో నీటిపారుదల, విద్యుచ్ఛక్తి పథకాలకు అవినాభావసంబంధం వున్నది. విద్యుచ్ఛక్తివాడకంతో చవుకగా నీటిని పారించుకోవచ్చు ప్రజల దృఢసంకల్పము, అధికారుల సానుభూతి సహాయాలమూలంగా యీప్రాంతంలోని నలుబై గ్రామాలలో ముప్పైరెండు గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా అవుతూ ఉన్నది. రైతులు 363 పంపుసెట్లు, ఎలెక్ట్రిక్ మోటార్లు యేర్పాటు చేసికొని వున్నారు. దీనిమూలంగా రెండువేల ఎకరాలు అదనంగా సాగు అవుతూ 20, వేలటన్నులు అధికంగా ఆహారోత్పత్తి అవుతున్నది ఈప్రాంతంలోని పరిగి చెరువు ప్రజలకు చాలా వుపయోగమయింది అయితే పై అంచెల్లో మైసూరు రాష్ట్రంవారు దీనికి వచ్చే నీటి వరదలను ప్రక్కకు తప్పించారు. దీనితో ప్రజల్లో ఒక విధమైన అసంతృప్తి యేర్పడింది

ప్రజలకు అదనంగా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం పెన్నార్-కుముద్వతి, అనే చిన్న ప్రాజెక్టును యిరువై లక్షల ఖర్చుతో నిర్మించారు. ఈ ప్రాజెక్టునుండి పడుచెరువులకు నీరు సరఫరా అవటమేగాకుండా పరిసర ప్రాంతాలలోని బావులకు యెక్కువనీరు వస్తున్నదికూడాను దీనివల్ల ఎనిమిదివేల ఎకరాల భూమిసాగవుతున్నది.

అధికారులనుండిఆర్థిక సాంకేతిక సహాయాలను పొందుతూ ప్రగతి పథంలో పయనించి భూమాతనుండి అధికలబ్ధిని పొందాలనే అకుంఠిత దీక్షతో ముందుకువచ్చిన వుత్సాహవంతులు యీబ్లాకులో అనేకమంది ఉన్నారు. సిరికొళం గ్రామంలోని శ్రీరామరెడ్డి,

కొట్నూరులో శ్రీ నరసింహారెడ్డి 'అంకుశనాళి (Syphon System పద్ధతిద్వారా నీటిని పల్లంనుండి మెరక ప్రాంతాలకు పారించి మొట్టమొదటసారిగ నూరు ఎకరాలభూమిని సాగుచేస్తున్నారు. కొటిపి గ్రామంలో శ్రీ రామయ్య బావిని 63 అడుగులు లోతు బోరింగ్ చేసి నీటిని 50ఎకరాల భూమికి పారిస్తూవున్నాడు

ఆహార ధాన్యాల ఉత్పత్తిలోనేగాక వాణిజ్యపంటల్లో కూడా యీబ్లాకు ప్రాంతం ముందడుగు వేసింది. అయిదువేల ఎకరాల్లో చెరుకు, మూడువేల ఎకరాల్లో మిరపకాయలు యీ ప్రాంతంలో పండుతూ వున్నవి. హిందూపురంలో ప్రభుత్వం ఒక చెరుకు ప్రదర్శనా కేంద్రాన్ని ఒక వరివిత్తనాలక్షేత్రాన్ని ప్రారంభించింది. వీనివల్ల రైతులకు మేలిరకాల విత్తనాలు బాగా సరఫరా అవుతూ వున్నాయి. బ్లాకుప్రారంభం నాటికి, నేటికి చూసుకుంటే వరి 116 శాతము, రాగి 150 శాతము, చెరకు 167శాతం, మిర్చి 150శాతం అధికంగా ఉత్పత్తి అవుపిస్తోంది.

ప్రధానినెహ్రూ అన్నట్లు సాధించింది గొప్పదే అయినా, సాధించ వలసింది యింకా గొప్పదనే విషయం అన్ని రంగాలకు వర్తిస్తుంది. ట్రాక్టర్లు బుల్‌డోజర్లు వాడి అనేక ప్రాంతాలను చదునుచేసి నీటి పారుదలకు అనువుగా చేసికోవలసిన అవసరం యెంతోవున్నది. సాంకేతిక సహకార సంస్థ సహాయం యీ విషయంలో పొందే అవకాశం రైతులు అందరూ కలసి ఆలోచించవలసివుంటుంది.

క్షామానికి పేరువడ్డ యీ రాయలసీమప్రాంతానికి బావులు, గొట్టపుబావులు, మోటారుపంపుసెట్లు, ఆయిలు యింజన్లు–ఒక విధంగా వరప్రసాదాలు లాటివి. వీని మూలంగా బీడువారిన పేద భూములు పచ్చనిపంట భూములుగా మారి కన్నులకు పండువగా కలకలలాడుతూ పల్లెప్రజల జీవనవాడినే మార్చివేయగల మహత్తర మహత్తు ఉద్భవిస్తున్నది.



బ్రతుకె మోసమైన గతియించురోసమ్ము

రోసమారమనసె మాసిపోవు

మనసెమాసిపోవ మానవత్వమెసున్న

జనను తాంతరంగ! వినుర! రంగ!

ఆంధ్రప్రతిష్ఠ

శ్రీ ఎం. వి. రమణరావు

వందే తెలుంగు మాతా
వందే పావన చరిత్ర వందే పూతా
వందే భాగ్యోపేతా
వందే మాంపాహి పాహి యాంధ్రీవందే.

భారతీయుడ వైనందుకు గర్వపడుమని వివేకానందుడన ఆంధ్రుడుగ. జన్మించుట కొద్ది తపస్సున లభించునది కాదని అప్పయ్య దీక్షితుడు నుడివినాడు. ఏతత్ప్రతిభా మాహాత్మ్యము లట్టివి. దేశదేశాలగూడా ఆకర్షించినదాంధ్రము. పండిత ప్రకాండులచే గూడ ఆదరింపఁబడినదాంధ్రభాష ఇట్టి ఆంధ్ర ప్రతిష్ఠ ఎట్టిదో గమనింతము.

ఆంధ్రజాతి నిన్నటిదిగాదు. మొన్నటిది గాదు, ప్రప్రథమ మున దీని ప్రసక్తి ఐతరేయ బ్రాహ్మణమున కన్పట్టు చున్నది.

> "తస్యహ విశ్వామిత్రస్యైక శతః పుత్రాణి ఆసుః । పంచాదశ దేవజ్యాయాం సోమధుచ్ఛందసః । పంచా శత్కనీయాఃస్త ద్యే జ్యాయాం సోనతే కుశలం మేని రేతా నమవ్యా జహారాం స్తాన్వ్యః ప్రజాభక్షిష్ఠీతి । తఏతాంధ్రాః పుండ్రాఃశబరాః పుళిందా మూతిబా ఇత్యుదంత్యా బహవోభవంతి వైశ్వామిత్ర దస్యూ నాంభూయిష్ఠాః॥ (7 సం. 3 అ.) విశ్వామిత్రునిచే శప్తులైన

వారట ఆంధ్రాది జాతులు. మూతిబ, శబరజాతులు గూడా ఆంధ్ర త్వమునే సూచించుచున్నవి. "అరింద"యను తెలుగు శబ్దమునకు సరియైన సంభాషణమొకటి ఋగ్వేదమున గలదట. ఆపస్తంబ మహర్షి వేదర్షియై వేద మంత్రముల కొన్నింటిని రచించెను మరియు యజుర్వేదమునకు సంబంధించిన తైత్తరీయ సంహితా బ్రాహ్మణములతో ఏకాగ్నికాండమును కలిపి యేర్పఱచిన ప్రత్యేక వేద శాఖకు ఆంధ్ర పాఠమని పేరు. విశ్వామిత్రునిచే శపింపబడిన పుత్రులు ఆంధ్రులై కొందరు దక్షిణమునకు వచ్చినట్లు రామాయ ణము నుడువుచున్నది. దశరథుని సమకాలికులలో 'ఆంధ్రరాజు' కూడా కలడట. భారతములో ఆంధ్రజాతి యుదహరింప బడినవి. "అంగవంగ కళింగా బ్యాసుహ్మ పుండ్రాంధ్ర సంజ్ఞితా" యని భాగవతమున గూడ గలదు. "కిరాతహూణాంధ్ర పుళింద పుల్కసా అభీలకంకా యవనాఃకషాదయః" యనిన భాగవత శ్లోకమును తెలిగించుచు పోతన "యవలక్ష్మత కిరాతహూణ పటుకంకా భీల చండాల సంభవులుం దక్క" యని ఆంధ్ర శబ్దమును వదలి యనువదించినాడు ఆంధ్రులు అనువారు తుషార జాతితో కలిసి అక్షునదీతీరమున నివసించి నట్లు వాయు పురాణము నుడువు చున్నది. ఈ అక్షునదియే హిందూకుష్ పర్వతముల కావలనున్న అక్సస్ రామావతారము గడచి 1,46,16,017 (క్రీ. శ. 1961) సంవత్సరములని పండితులు గణించి యున్నారు. మరివేదమున గూడ ప్రస్తుతింప బడిన యాంధ్రుడెంత ప్రాచీనుడు.

ఆంధ్రులార్యులా, ద్రావిడులా యని యొకశంక. ఆంధ్రులు శప్తులైనవారని ఐతరేయ బ్రాహ్మణము, కాన వీరి దాసురీ జాతి యని యొక వాదము అసురులన్నంత మాత్రమున రాక్షసులని దుర్మార్గులని యనుకొనుటకు వీలు లేదు. ఋగ్వేదమున శివ, యింద్రవరుణాదులకు అసుర సంబోధన మున్నది. పరశురామునచే తరుమ బడినవారు ద్రావిడులని భారతము నుడువుచున్నది. మరి ఆంధ్రుల పరశురాము డెచ్చట తరిమినాడు? ఆర్యులు క్రమముగ వృద్ధినొందిరి. వారేమే దేశముల నివసించిన ఆ నామముచే పిలువ బడుదురని మనువు శాసించి యున్నాడు. (10—21, 22) హ్యూయనుసాంగు కాలమునాటి కాంధ్రదేశ మున్నది. దండి దశ కుమార చరిత్రలో ఆంధ్ర నగరమును పేర్కొనినాడు. అంతయేల దశరథుని సమకాలికుడాంధ్ర రాజు గాదా! కావున నీ యాంధ్ర దేశమున నివసించిన యార్యులే యాంధ్రులు. మితాక్షరీ, స్మృతి చంద్రికాది గ్రంథములు ఆంధ్ర దేశమున దిరిగిన సంస్కారము పొందవలెనని నుడువుట ఆర్యులు కారని భ్రమించుట చేతనే,

యుగయుగముల నుండియు నప్రతిహతముగ వర్ధిల్లుచున్న నీ యాంధ్రమున సువర్ణాక్షరముల లిఖింపదగిన నామములు కొన్ని గలవు. శ్రీరాముని కాలమునాటికి పూర్వులు దండకారణ్యమును చేరిరి. అందు ఆంధ్రులకు చెందిన కోసల రాజ్యమున్నది. ఈ కోసల కన్యకయే కౌసల్య. అంతియకాని కోసలదేశపు రాజగు దశరథుడు ఆదే కోసలదేశపు రాజకుమార్తె కౌసల్యను వివాహ మాడలేదు వీరి కుమారుడే రాముడు. కావున శ్రీరాముడాంధ్రుల దౌహిత్రుడు. ఆంధ్రమున రామకథ శతకోటి విస్తర ప్రవహిత మగుటకును, భద్రాచలమున రాముడు నెలకొనుటకును నివియే కారణము. కరూశదేశమును పాలించిన మల్లవీరుడగు చాణూరుడు ఆంధ్రుడని హరివంశము నందున్నది. దశరథుని సమకాలికు డాంధ్ర రాజట. రావణుడు తెలుగునకు వ్యాకరణము వ్రాసెనని ప్రతీతి. రావణ్ బంశీలని (రావణవంశీయులు) యొక జాతి యిప్పటికిని గలదు. పరమశివుని మామయగు దక్షుడు యజ్ఞమొన ర్చిన దాక్షారామ మాంధ్రదేశముననే నెలకొని యున్నది. ఆ ప్రదేశ మును పరిపాలించిన భీమరాజు కుమార్తెయే దమయంతి. కణ్వ మహర్షి ఆంధ్రభాషకొక వ్యాకరణము వ్రాసినట్లు అధొక్షజపుక్కిక అథర్వణ కారికలు, ఆంధ్రకౌముది యను గ్రంథముల మూలమున దెలియుచున్నది. ఈ కణ్వుడే శకుంతలను పెంచినట్లు "అథ తృతీయయా శకుంతలా నాలపిత్యప్సరా భరతం దధేపరః సహస్రా విన్ద్రియా శ్వాన్మేవ్యాన్య అహరద్విజత్వ పృథివీగ్ స్వరాజ్యమితి" యని కాణ్వ శతపథ బ్రాహ్మణమున గలదు. ఆంధ్ర దేశమున నివ సించి భరతుని పెంచిన యాంధ్రుడు కణ్వుడు. భారతదేశమున కా నామము గల్గుట కాధారుడైన భరతుడు పుట్టి పెరిగిన దాంధ్ర దేశముననే పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ గ్రామమే కన్యకా పరమేశ్వరుల జన్మస్థానము. దైవీశక్తుల కాధారమైన యాంధ్రము చరితార్థము గాదా!

దీనికే త్రిలింగమనియు, తెలుగనియు, తెనుగనియు నామాంతరములు. మూడు లింగముల మధ్యనున్న దేశము త్రిలింగ మని యర్థము. ఆ త్రిలింగముల వివరము విద్యానాథ మహాకవి ప్రతాపరుద్ర యశోభూషణమున నిట్లు నుడివినాడు.

"యైర్దేశస్త్రిభి రేష యాతి మహతీం ఖ్యాతిం త్రిలింగాఖ్యయా
యేశాంకాకతి రాజకీర్తి విభవైః కైలాస శైలాకృతా:
తేదేవాః ప్రసరత్ప్ర సాదమధురా శ్రీశైల కాళేశ్వర
ద్రాక్షారామ నివాసినః ప్రతిదినం త్వచ్ఛ్రేయసే జాగ్రతు"

శ్రీశైల కాళేశ్వర ద్రాక్షారామములగ త్రిలింగములు. ఈ త్రిలింగ శబ్దభవమే తెలుంగము, తెలుంగులు. సెన్ తమిళమునను హళగన్నడమునను తెలుంగము శబ్దము వాడుదురట. టాలేమీ 'ట్రిలింగాన్' శబ్దము వాడినాడు. బర్మాలో తలైంగులను జాతి గలదు. త్రిలింగ శబ్దమిట్లుండ "సన్దక్షిణాపథత్రి కళింగదేశ మన్వ పాలయత్" అని గుణగ విజయాదిత్యుని శాసనమున "త్రికళింగ" శబ్దమున్నది. అది ఆంధ్ర దేశములో చేరిన కళింగమేనని విమర్శ కులు చెప్పుదురు. మలయాలో విదేశీయులను క్లింగు (కళింగు) లందురట. ఇక తెనుగందురా తేనె+అగు తెనుగయినదనియు, తేనెవంటి భాష తెనుగనియు, ఆ భాష మాటాడువారు తెనుగు లనియు నుడువుదురు. తెన్ అన దక్షిణము, దాక్షిణాత్యులాంధ్రులని మరియొక వాదము.

ఇక యాంధ్రభాష యందురా లాలిత్యమునకు సౌలభ్య మునకు పెట్టినది పేరు. దేశభాషలందు తెలుగు లెస్స యని దేశీ యులు, ప్రాచ్యపు యిటాలియనని విదేశీయులు పొగడిన భాష తెలుగు. దీనింగాంచి మురిసి ముచ్చటపడి నేర్చికొని నిష్ణాతులరై విదేశీయులే బృహద్గ్రంథముల రచించిరన దీని ప్రాశస్త్యమును నుడువుట చర్వితచర్వణము, పద కవిత్వము నందలి శైలి, సంగీత ధోరణి మరేభాషకునులేదు. ఆశుకవిత్వమున కాంధ్రమే తావలము. అవధాన విద్య ఆంధ్రమున కొక ప్రత్యేకత. ఎట్టి పదసముదాయ మైనను ఆంధ్రమున నసంబద్ధార్థ మీయదని బుజువుపఱచునది సమస్య. తిట్టు కవిత్వమునకు గూడ యాంధ్రమనువైనది. భీమకవి మున్నగువారే నిదర్శనము. చిత్ర కవిత్వము, బంధకవిత్వము, ద్వ్యర్థి కావ్యములు ఆంధ్రముననే వ్రాయననువు ప్రబంధ మాంధ్ర కవిత్వ ప్రత్యేకత దండకాది స్తోత్రార్హమౌ బిరుదముల కిదియే నిలయము. (ఇవి సంస్కృతమున సాధ్యమైనను నది సార్వజనీన మౌ భాషగాదు.) అగ్నిమిత్రుడను రాజు ఆంధ్ర భాషలో సూర్యు నారాధింప యాతని అంధత్వము పోయెనట. గోగులపాటి కూర్మ నాథకవి సింహాద్రి నారసింహునిపై తెలుగులోనొక శతకము నుడివినాడు తత్ప్రభావమున తేనెటీగలు చెలరేగి దండెత్తివచ్చిన మహమ్మదీయుల పారద్రోలినవి. అమెరికా, రష్యా మున్నగు దేశములలోగూడ తెలుగు భాషా బోధన జరుగుచున్నది. దేశభాష లందు తెలుగులెస్స గావా మరి!

లలితకళలలో గూడ ఆంధ్రుల దండెవేసిన చేయి. సంగీత భాషలో మహావిద్వాంసులగు రామదాస త్యాగరాజాంధ్రులే సంగీత సాహిత్యముల మేళవించిన కవులును ఆంధ్ర దేశమున నున్నారు. "జంత్రగాత్రముల రాల్గ రగించు విమల గాంధర్వము" నుపాసిం చినవారు వారు. ఆంధ్ర మజంత భాష. అందువల్ల సంగీతమునకు

మరింత యనువుగ నుండును. జాయపసేనాని 'నృత్తరత్నావళి' యను అభినయ శాస్త్ర గ్రంథమును రచించినాడు. రఘునాథమేల యని వీణనే సృష్టించిన రఘునాథరాయ లాంధ్రుడు కూచిపూడి నృత్య మాంధ్రుల సొత్తు. చిత్రలేఖన మందురా అజంతాచిత్రముల నటుంచిన లేపాక్షి చిత్రము లత్యంత రమణీయములు వందల తరబడీ సంవత్సరములనుండి రంగులైనాపోని దా చిత్రకళ. శిల్పములలో నాగార్జునకొండ, అమరావతి, హంపి మున్నగునవినికషోపలములు. ఉలితోరాలకిడిన చక్కిలింత లెంతటి వానినైన గిలిగింతలు పెట్టజాలినవి బాపిరాజు, రవివర్మ మున్నగు చిత్రకారు లాంధ్రులే ఇచటి శిల్పములకు, యిండోనేషియా మున్నగు చోట్లనున్న శిల్పములకు పోలికలున్నవి తోలుబొమ్మలాటలు ఆంధ్రుల ప్రాచీన విద్య. ప్రస్తుతము విదేశములలోగూడ దీనికి విశేష గౌరవము కలదు.

వస్త్రకవ్యాపారముల గూడ ఆంధ్రులు బహు ప్రాచీన కాలమునుండియే సాగించు చుండిరి సముద్ర వ్యాపారమును వారికి కరతలామలకము. విదేశములలో వలసలగూడ యాంధ్రులు స్థాపించియుండిరి. ఆనందకుమారస్వామి నిర్ణయము ప్రకారము తూర్పు దీవులలో ప్రథమ భారతీయవలసలు స్థాపించిన దాంధ్రులే. విదేశీయులతో నిమ్మడి ముమ్మడిగ వ్యాపారము జరిగెడిది. శ్రీనాథుడు హరవిలాసములో చామిసెట్టి వ్యాపార వైభవము నిట్లు నుడివి యున్నాడు.

పంజార కర్పూర పాదపంబులఁ దెచ్చి
జలనోగిబంగారు మొలకదెచ్చి
సింహళమ్మునగరిధ సింధురమ్ములదెచ్చి
హురుమంజి బలుతేజహరులుదెచ్చి
గోవసంశుద్ధ సంకుమద్రవముదెచ్చి
యాపగనాణిముత్యాలుదెచ్చి
చోటంగికస్తూరి కాటంకములుదెచ్చి

చీనిచీనాంబర శ్రేణిదెచ్చి
జగదగోపాలరాయ వేశ్యాభుజంగ
పల్లివాదిత్యభూదాన పరశురామ
కొమరగిరిరాజ దేవేంద్రు కూర్మిహితుడు.
జాణజగజెట్టి దేవయచామిసెట్టి..

నౌకలచిహ్నములుగల రాజులుగూడవెనుక నాంధ్రదేశము నేలియున్నారు ఏతద్వ్యాపార వైభవప్రభావమేయేమో నేటికిని విశాఖపట్టణము నౌకానిర్మాణకేంద్రముగ నుండుట.

ఆంధ్రుల ప్రతిభలట్లున్నవి. ఆంధ్రరక్తమెట్టిదో. ఆంధ్రులలో నెంతెంతటి మహాత్ములుద్భవించిరో, మనదెట్టి వారసత్వమో తెలిసికొనుటయు ఆవశ్యకము. శ్రీరామాముల విషయము తెలిసికొంటిమి ఖడ్గతిక్కన, మనుబోతరాజు, బాలచంద్రాది సాహసులు త్యాగులు ఆంధ్రులు. మాంచాల నాగరుద్రమాది వీరనారులాంధ్రులు యుగంధరతిమ్మరుసు భాస్కరాది విజ్ఞాననిధులౌమహామంత్రు లాంధ్రులు. రామదాస త్యాగయాది గాయకులు భక్తులు ఆంధ్రులు. వేమన, బ్రహ్మనసిద్ధనాది యోగులాంధ్రులు, నాగార్జునుడాంధ్రుడు. శాలివాహన కృష్ణరాయాదిరాజులాంధ్రులు. కలియుగ భీమార్జును లాంధ్రులు. ఆంగ్లేయులకు గుండెగాలమై నిలచిన వారాంధ్రులు. ఆంధ్రసాతవాహన చక్రవర్తి నారుమాసములలో విద్వాంసునొనర్చిన కాతంత్రవ్యాకరణ కర్తశర్వవర్మయాంధ్రుడు. సర్పదష్టులకు జీవదాతయై నెగడిన పాముల నరసయ్య యాంధ్రుడు. హిట్లరు కాలమున జర్మనీ వెడలిన వేదవిద్వాంసుడు దండిభట్ల విశ్వనాథశాస్త్రి యాంధ్రుడు. శంకర రామానుజమధ్వా చార్యులు మువ్వురును ఆంధ్రులని యొకపండితుడు నిరూపించియున్నాడు ఆంధ్రముననే గాక ప్రాపంచిక సాహిత్యముననే యింతటి సాహిత్యమును సృష్టించినవాడు లేడనిపించుకొనిన శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి యాంధ్రుడు. ఇంకను ననేకుల పాలకులవీరుల కవుల పండితుల అవధానుల శిల్పుల చిత్రకారుల గాయకుల గన్న రత్నగర్భ యాంధ్రి. మనవారసత్వముంజూచి పొంగిపోవలదా!

ఆధునికమున దీని ప్రతిష్ఠ తగ్గినదాయను ప్రశ్నయుద్భవించుట కవకాశమేలేదు. అమరజీవుల త్యాగఫలమున విశాలాంధ్ర మేర్పడినది. ఆరువందలమైళ్ళ సముద్రతీరము, నదులు. పీఠభూములు, పర్వతములు, అరణ్యములు, జలపాతములు మున్నగు సమస్త ప్రాకృతిక సంపదలతో శోభిల్లుచున్న దాంధ్రదేశము మూడు నదులచే సస్యశ్యామల మగుచున్న దేశమాంధ్రము. అంతర్వేది, భద్రాచల, సింహాచలాదిక్షేత్రము లాంధ్రదేశముననే నెలకొనియున్నవి. శ్రీశైలశిఖరం దృష్ట్వాపునర్జన్మనవిద్యతేయని ప్రసిద్ధినొందిన శ్రీశైలమును, కళా వేంకట నాయకీ యగు వేంకటేశ్వరుఁడును ఆంధ్రప్రాంతముననే నెలకొని యున్నారు.

ఆంధ్రులును దాని కనుగుణముగనే యున్నారు. పదునాల్గు

(మిగతా 62వ పేజీలో)

"సమస్సుమాంజలి"

శ్రీ బృందావనం రంగాచార్యులు.

అమల చరితా!
అఖిల వినుతా!
ఆంధ్ర మాతా!
వందనం

మృదుల వర్తని
ముగ్ధ భాషిణి
ఆంధ్ర జననీ!
వందనం

ఆదికవి నన్నయ మహర్షికి
పాదపూజ లొనర్చినావట;
వాదనైపుణి వెలయుపండిత
రాయలను సేవించినావట;
తిక్కనార్యుని కండచక్కెర
తెలుగుపలుకుల కలరినావట;
రాగలొలుడు త్యాగరాజ
ధ్యానసుధ తల దాల్చినావట;
మాతా! వందనం.

మంటిలో రతనాలుజిమ్మే
మహిమగల కృష్ణమ్మతల్లీ!
కొల్లగా ధాన్యాలుపిండే
గుణముగల గోదావరమ్మ;
అమృత ధారలు చిలికినీపై
అందములు చిందించుతారట
మాతా! వందనం.

పరువు గలిగిన భాగ్యశాలివి
కడుపు పండిన కన్నతల్లివి
దీవనలు దీర్ఘాయురస్తని
తెల్పవమ్మా! కల్పవల్లివి.
వందనం; వందనం.

ఆంధ్ర ప్రతిష్ఠ

(61 వ పేజీ తరువాయి)

రాష్ట్రములలో ఆరురాష్ట్రములకు గవర్నరులాంధ్రులు. ప్రవాసాంధ్రులలో ఉన్నతపదవులలో నున్నవారున్నారు. కేంద్రమునగూడ ఆంధ్రులున్నత పదవులలోగలరు. లోకసభ సభాపతి అనంతశయనమయ్యంగా రాంధ్రుడు. రాజ్యసభాధ్యక్షుడు సర్వేపల్లి రాధాకృష్ణమనీషియాంధ్రుడు. భారత రాజ్యాంగమంతయు ఆంధ్రుల చేతి మీదుగ నడుచుచున్నదన్నను నతిశయోక్తి కాదేమో!

ప్రభుత్వము పరిగణించిన శకమాంధ్రుల శకమే. ఆంగ్లేయుల మకుటమున విరాజిల్లెడు కొహినూరువజ్ర మాంధ్రదేశములోనిదే. ఇట్టి యాంధ్రిధన్య. ఆంధ్రుడుగ జన్మించుట తపోఫలమను మాట కాదనువారుండరు. ఆంధ్రుడు చరితార్థుడు.

ఆంధ్రదేశాన జన్మించి యాంధ్రభాష
మాటలాడుచు యాంధ్రత్వమాశ్రయింప
గర్వపడవోయి యాంధ్రుడా గర్వపడుమ
ఆంధ్రిప్రతిభలచాటంగ ప్రతినగొనుమా!

—జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ—

? ? ?
ప్రశ్నోత్తరావళి

ప్రశ్న: 190 శ్రీ టి. రామారావు, పోతవరం, పశ్చిమ గోదావరి జిల్లా.

పశ్చిమ గోదావరి జిల్లాలో నల్లజర్లనుండి (పోతవరం మీదుగా) కొయ్యలగూడెం వరకుగల రోడ్డులో ఎర్రకాలువపై వంతెన కట్టుటకు ఎంతడబ్బు మంజూరు చేసిరి? పని ఎప్పుడు ప్రారంభించెదరు? ఎప్పటికి పూర్తి అగును?

సమాధానం: ఎర్రకాలువకు అడ్డంగా వంతెనను నిర్మించటంతో సహా నల్లజర్లనుంచి పోతవరం వరకు రోడ్డు మార్గాన్ని అభివృద్ధి పరిచే పనికి 1961 మార్చి 9వ తేదీన రూ. 7.50 లక్షల మంజూరీ లభించింది. ఎర్ర కాలవకు వంతెన నిర్మించే పని మినహా రోడ్డును అభివృద్ధి పరిచే పనులు ప్రస్తుతం అమలు జరుగుతున్నాయి. వంతెన నిర్మాణం నిధులు సమకూరిన వెంటనే చేపట్టబడుతుంది. ధనాభావం వల్ల 1961–62 వ సంవత్సరంలో దీని నిర్మాణం జరిగే సూచనలు లేవు. వంతెన నిర్మాణ వ్యయం అంచనా రూ. 5 70 లక్షలు.

ప్రశ్న: 191 శ్రీ ఎం.వి. రాజరత్నాచార్, తిమ్మనచిర్ల; అనంతపురం జిల్లా.

రెండవ పంచవర్ష ప్రణాళికా కాలములో రిజిస్టరు చేయించుకున్న నిరుద్యోగులెందరు? ఎంత మందికి ఉద్యోగములు లభించినవి? ప్రస్తుతము నిరుద్యోగులుగా వున్నవారి సంఖ్య ఎంత?

సమాధానం: రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో అంటే 1956 ఏప్రిల్ 1వ తేదీ లగాయతు 1961 ఏప్రిల్ 1వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ఉద్యోగ సాధక కేంద్రాలలో మొత్తం 7,32,219 మంది అభ్యర్థులు ఉద్యోగార్థం తమ పేర్లు నమోదు చేయించుకున్నారు (రిజిస్ట్రేషన్ను పునరుద్ధరణ చేయించుకున్నవారి సంఖ్య కూడా దీనిలో చేరివుంది)

ఈ కాలంలో రాష్ట్రంలోని విభిన్న ఉద్యోగ సాధక కేంద్రాలు మొత్తం 80,842 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు చూపించారు.

ఉద్యోగ సాధక కేంద్రాలలో నమోదై ఉద్యోగాలు లభించకుండా వున్నవారి సంఖ్య 1961 ఏప్రిల్ 1వ తేదీనాటికి 102382 వుంది.

ప్రశ్న: 192 శ్రీ ఏ.వి సుబ్బారావు, వాకతిప్ప, తూర్పుగోదావరి జిల్లా.

రేడియో లైసెన్సులద్వారా లభించే ధనం, ఆకాశవాణి కేంద్రాలనిర్వహణకు సరిపోతుందా?

సమాధానం: లేదు.

(2) వార్షికాదాయం ఎంత?

సమా: 1959–60 వ సంవత్సరంలో రూ. 3, 10, 53, 637 ల ఆదాయం లభించింది.

(3) ఖర్చుయెంత?

సమా: 1959–60 లో జరిగిన వ్యయం రూ. 4,86,54,773 (ఆవృత్తవ్యయం) (1960–61వ సంవత్సరపు అంకెలు సిద్ధంగా లేవు)

(4) ఒకగంటకు ఎంత పారితోషికం చెల్లిస్తారు?

సమా: కళాకారులకు, సమయాన్నిబట్టి కాక వారి ప్రదర్శనల స్థాయినిబట్టి పారితోషికం చెల్లించటం జరుగుతుంది. రూ. 10/– మొదలు రూ. 150/– వరకు పారితోషికంగా చెల్లించడమవుతుంది.

(5) ప్రయాణ భత్యంకూడా చెల్లిస్తారా?

సమా: అవును.

ప్రశ్న: 193 శ్రీ కె. వెంకటేశ్వరరావు, పెదకూరపాడు, గుంటూరుజిల్లా

తెలుగు, కన్నడ భాషలకు చాలా దగ్గర సంబంధమున్నది కనుక కన్నడ లిపినికూడ తెలుగులిపిలోనికి మారుస్తారని వింటున్నాము. ఈరెండు భాషలు ఎప్పటికి కలుస్తాయి?

సమాధానం: తెలుగు కన్నడ భాషలకు ఒకేలిపిన రూపొందించే పని తెలుగు లిపి సంస్కరణల సంఘంకు సంబంధించినది ఈసంఘం నివేదిక ప్రస్తుతం పరిశీలనలో వుంది.

ప్రశ్న: 194, శ్రీడి. నారాయణరెడ్డి, బండపొసనపల్లి, మెదక్‌జిల్లా

మెదక్‌జిల్లా అంకింపేటవద్ద పసుపులేరుకు అడ్డంగా ఆనకట్ట నిర్మింపబడే సంగతి యదార్థమేనా? తృతీయ ప్రణాళికా కాలంలోనే దీని నిర్మాణం జరుగుతుందా?

సమాధానం: మెదక్ జిల్లాలో అంకింపేట సమీపంలో పసుపులేరుకు అడ్డంగా ఆనకట్ట నిర్మించటానికి సంబంధించిన పథకం 1948-49వ సంవత్సరంలోనూ, తరువాత 1954వ సంవత్సరం లోనూ పరిశీలించబడింది. కాని ఈ పథకం సాంకేతికంగా ప్రయోజనకారి కాకపోవటంచేత నిర్మాణాన్ని చేపట్టలేదు. ఆంధ్రప్రదేశ్ తృతీయ ప్రణాళికా పథకాలలో దీన్ని చేర్చలేదు.

ప్రశ్న: 195 శ్రీ పి. పట్టాభిరెడ్డి, దామలచెరువు, చిత్తూరుజిల్లా

చిత్తూరులో స్థాపింపడుతున్న చక్కెర ఫ్యాక్టరీ ఈ సంపత్సరమే ఉత్పత్తి ప్రారంభిస్తుందా? లేనియెడల ఎప్పటినుంచి ఉత్పత్తి ఆరంభిస్తుంది? దీన్ని స్థాపించేపని ఎంతవరకు సాగినది?

సమాధానం: రోజుకు 1000 టన్నులు చెరకును పిండే శక్తిగల చక్కెర ఫ్యాక్టరీ నొకదానిని సహకార ప్రాతిపదికపై చిత్తూరులో స్థాపించుకోవడానికి లైసెన్సు జారిచేశారు. ఫ్యాక్టరీ స్థలాన్ని స్వాదీన పర్చుకోవడం ముగిసింది. యంత్రపరికరాలకు ఆర్డరుచేశారు. 1962-63 క్రషింగ్ సీజనులో బహుశా ఈఫ్యాక్టరీ ఉత్పత్తి ప్రారంభిస్తుంది.

ఈ ఫ్యాక్టరీ మూలవ్యయిం రూ. 1.35 కోట్లు సుమారు 350 మంది కార్మికులకు దీనిలో పనిలభిస్తుంది.

పశ్న: 196 శ్రీ టి. జి. రమణరావు, గుంటకల్

చిత్తూరు వద్ద పారిశ్రామికవాడకు శంకుస్థాపనచేస్తూ గుంతకల్లుపద్ద ఒకచిన్న ఉక్కుకర్మాగారము(Re-rolling mill) ను నెలకొల్పుటకు రాష్ట్రప్రభుత్వము నిశ్చయించినదని వెల్లడించారు. ఇది ఎంతవరకు నిజము? దీనివల్ల కలుగు లాభమేమిటి? పెట్టుబడిఎంత? ఎంతమంది ఈ కర్మాగారములో పనిచేయగలరు? ఎప్పుడు నెలకొల్పబడగలదు?

సమాధానం: రెండు షిఫ్టుల పద్ధతిపై సంవత్సరానికి 500 టన్నులు ఉత్పత్తిచేసే శక్తిగల చిన్న ఉక్కు కర్మాగారం (Re-rolling mill) ఒకటి ప్రైవేటు రంగంలో గుంతకల్లులో స్థాపింపబడే అవకాశం వుంది. దీనికి ప్రభుత్వం ఇంకా లైసెన్సు ఇవ్వలేదు. కర్మాగారం పెట్టుబడివ్యయం, దీనిలో లభించే ఉద్యోగవకాశాలు మొదలైన అంశాలకు సంబంధించిన వివరాలను ఇంకా సిద్ధం చేయవలసి వుంది. లైసెన్సుజారీచేసే అధికారం భారతప్రభుత్వానికి వుంటుంది. రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు మాత్రం చేస్తుంది.

ప్రశ్న: 197 శ్రీ ఎ. రామన్‌గౌడ్, దక్షిణవిజయపురి

(అ) బహుమతి బాండ్ల "డ్రా" ఫలితాలను ఎలా ప్రకటిస్తారు?

సమా: "డ్రా"లు బహిరంగంగానేజరుగుతాయి. బహుమతిపొందిన బాండ్ల నెంబర్లను "డ్రా"జరిగిన ప్రదేశములోనే ప్రకటిస్తారు. అంతేకాక వాటిని రేడియోలోకూడా ప్రకటిస్తారు. భారతదేశ గెజెటులోనూ, ప్రధానమైన వార్తాపత్రికల్లోకూడా ప్రకటిస్తారు. పోతే జాబితాలను బాండ్లు విక్రయించే కార్యాలయాలలో అందరూ చూచుకోడానికి వీలుగా వుంచుతారు. అయిదు నయాపైసలకు ఒకటి చొప్పున జాబితాలను విక్రయిస్తారుకూడా.

(ఆ) బహుమతి పొందిన బాండు ఖరీదుదారు "డ్రా" ఫలితం తెలియక డబ్బు అడగకుండా ఊరక వున్నట్టయితే ఏమి చేస్తారు?

సమా: బహుమతి బడసిన బాండు ఖరీదుదారు "డ్రా" జరిగిన తరువాత ఎప్పుడైనా "బాండ్లు" విక్రయించే కార్యాలయం దేనిలోనైనా తన బాండును చూపించి బహుమతి మొత్తాన్ని పొందవచ్చును. బహుమతి మొత్తాలను తీసుకోని బాండ్ల నెంబర్లను కూడా వార్తా పత్రికలలో ప్రకటిస్తారు. "డ్రా" జరిగినప్పుడల్లా బాండ్లు విక్రయించే కార్యాలయం వద్దకువెళ్ళి బహుమతిపొందిన బాండ్ల జాబితాలను పరిశీలించు కోవటం బాండ్ల కొనుగోలుదార్లు చేయాలి.

(ఇ) ప్రతి మూడవ నెల మొదటి రోజునూ "డ్రా" జరిగెడి

తేదీగా నిర్ణయించి వస్తే, "డ్రా" ఫలితాల ప్రకటనకు కూడా ఏమైనా తేదీని నిర్ణయించారా?

సమా: బహుమతి గెల్చిన బాండ్ల నెంబర్లను "డ్రా" జరిగిన రోజు ననే రేడియోలో ప్రకటిస్తారు. ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందిన బాండు నెంబర్లను ఆ మర్నాడు ప్రసిద్ధవార్తా పత్రిక లన్నింటిలోను ప్రకటిస్తారు. అన్ని వరుసలలోనూ బహుమతి పొందిన బాండ్ల నెంబర్లతో కూడిన పూర్తి జాబితాను "డ్రా" జరిగిన వారం రోజుల లోపుగా భారత ప్రభుత్వ గెజెటులో ప్రకటిస్తారు. సుమారు ఒక పక్షం రోజుల తరువాత దాన్ని దేశంలోని ప్రసిద్ధ వార్తాపత్రికలలో ప్రకటిస్తారు.

(ఈ) 1960వ సంవత్సరం నుంచీ జరిగిన బహుమతి బాండ్ల 'డ్రా' ఫలితాల జాబితాలను తెప్పించుకోవడానికి వీలుంటుందా?

సమా: 1961 జూన్ 1వ తేదీన జరిగిన "డ్రా" లగాయతు తదనంతరం జరిగిన "డ్రా" ఫలితాల జాబితాల ముద్రిత ప్రతులను నాగపూర్‌లోని నేషనల్ సేవింగ్స్ కమీషనరు (పోస్టు బాక్సు నెం. 96), ఆయనవద్ద పేర్లు నమోదు చేయించుకున్న వ్యక్తులకు పంపిస్తారు. పేర్లు నమోదు చేయించుకోవడానికి గాను ఆయనకు రూ. 1.50 న.పై. ల మొత్తాన్ని మనియార్డరు ద్వారా కానీ, పోస్టల్ ఆర్డరు ద్వారా కానీ లేదా తపాల బిళ్ళల రూపంలోకాని చెల్లించవలసి వుంటుంది.

మొదటి 3 "డ్రా" ల ఫలితాలను అంటే 1960 సెప్టెంబరు 1వ తేదీన, 1960 డిశెంబరు 1వ తేదీన, 1661 మార్చి 1వ తేదీన జరిగిన డ్రాల ఫలితాల జాబితాలను బాండ్లు విక్రయింప బడే ఏ కార్యాలయం నుంచైనా పొందవచ్చును

ప్రశ్న: 198 శ్రీ ఎం. సత్యనారాయణ, ప్రగడవరం, పశ్చిమ గోదావరి జిల్లా.

ఇదివరకటి "మద్రాస్ ఎడ్యుకేషనల్ రూల్స్" ఇప్పటి "ఆంధ్ర ఎడ్యుకేషనల్ రూల్స్" ఒకటేనా? అట్లయిన "ఆంధ్ర ఎడ్యుకేషనల్ రూల్స్" ప్రతులను తెప్పించు కొనవలెనన్న ఎవరికి వ్రాసి ఎట్లు తెప్పించుకొనవలెనో తెలియజేయ గోర్తాను.

సమా: ఆంధ్రప్రదేశ్ ఏకీకృత విద్యా నియమావళిని ప్రభుత్వం ఆమోదించ వలసి వుంది. కాబట్టి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంచే సవరింప బడినట్టి పూర్వపు మద్రాసు విద్యా నియమావళియే ప్రస్తుతం ఆంధ్ర ప్రాంతంలో అమల్లో వుంది. అలాగే 1956 నవంబరు 1వ తేదీకి పూర్వం తెలంగాణా ప్రాంతంలో అమల్లో నున్న విద్యా నియమావళియే ఇప్పుడు తెలంగాణా ప్రాంతంలో వర్తింపులో నున్నది. కనుక ఆంధ్రప్రదేశ్ విద్యా నియమావళి ప్రతులను సరఫరా చేయటం, వాటిని ప్రభుత్వం ఆమోదించిన తరువాతనే కాని జరగదు.



మాటచెప్పునపుడు మర్యాదకొనను
నమ్మలేక లోన కుమ్ములాడు
ఒరుల నమ్మలేని ఒంటరి బాధరా!
జనసుతాంతరంగ! విసుర! రంగ!

గ్రామీణ ప్రాంతాలకు విద్యుచ్ఛక్తి సరఫరా

1961 ఆగస్టు నెలలో తెలంగాణాలోని ఈ క్రింద పేర్కొన్న గ్రామాలకు నూతనంగా విద్యుచ్ఛక్తి సౌకర్యాలను విస్తరింపజేశారు:–

వరుస నం.	గ్రామం పేరు.	తాలూకా.	జిల్లా.	తేదీ.
1	యెలవర్తి	చేవెళ్ల	హైదరాబాదు	25–8–1961
2	యెర్లపల్లి	చేవెళ్ల	హైదరాబాదు	30–8–1961
3	మాధారం	హైద్రాబాదు తూర్పు	హైదరాబాదు	5–8–1961
4	చందుపట్లగూడెం	హైద్రాబాదు తూర్పు	హైదరాబాదు	14–8–1961
5	చండ్లపూరు	సిద్దిపేట	మెదక్	7–8–1961
6	గోపాలపేట	సిద్దిపేట	మెదక్	30–8–1961
7	పద్మాభపల్లి	సిద్దిపేట	మెదక్	31–8–1961
8	బిజిరీషరీఫ్	హుజూరాబాదు	కరీంనగర్	27–8–1961
9	వత్తిలాల	హుజూరాబాదు	కరీంనగర్	25–8–1961
10	తంగుల	హుజూరాబాదు	కరీంనగర్	27–8–1961
11	ఎలగందుకుంట	హుజూరాబాదు	కరీంనగర్	27–8–1961
12	గుంద్రాపల్లి	హుజూరాబాదు	కరీంనగర్	28–8–1961
13	గట్లదుద్దంపల్లి	కరీంనగర్	కరీంనగర్	14–8–1961
14	ధర్మసాగర్	వరంగల్లు	వరంగల్లు	16–8–1961

గిరిజన సంక్షేమము

శ్రీ కేశిరాజు వెంకట నృసింహ అప్పారావు

క్రొండ జాతుల ఉద్ధరణ ఏ విధముగా జరుగవలెను? అను విషయమును చర్చించుట ఈ వ్యాసము యొక్క ముఖ్యోద్దేశము. ఇది ఒక కఠినమైన సమస్య. ఏలయన వెల్లడి వారితో ఎట్టి సంబధము లేకుండ మహారణ్యములలో నివసించుచున్న ఈ జాతులలో మనకంటె విభిన్నమైన మనస్తత్వము, ఆచార వ్యవహారములు ఏర్పడి యున్నవి. వానిని గమనింపకుండ వెల్లడి ప్రాంతములలో వలెనే అక్కడకూడ సంఘసేవా కార్యక్రమములు కొనసాగింప దలచినచో ఆశాభంగమే కాక విపరీత ఫలితములు కూడ కలుగ గలవు. ఇంతేకాక మనము చేయు సముద్ధరణ కార్యక్రమముల ఫలితముగా వారిలో కొంత నాగరికత మనము చొప్పించ గలిగినను, మనలోని అవాంఛనీయమైన నాగరికత అక్కడకు ప్రాకకుండ చూడవలసిన ఆవశ్యకతకూడ కలదు. కొండజాతులవారికి మనము నేర్పవలసిన విషయములే కాక, వారి నుండి మనము నేర్చుకొన వలసిన విషయములుకూడ కొన్ని కలవు. కనుకనే మన ప్రధానమంత్రి అనేక పర్యాయములు మన కార్యక్రమ పద్ధతి కొండజాతుల సహజసంస్కృతిని నిర్మూలించునదిగా ఉండరాదని చెప్పియున్నారు. నిరాడంబరత, సత్యభాషణము, అతిథి సత్కారము, సామూహిక జీవనము, వ్యక్తిస్వామ్య రాహిత్యము మున్నగు గుణములచేతను, ప్రకృతి రామణీయకతచేతను అనేక గిరిజన గ్రామములు పురాణములలో వర్ణింపబడిన మునిపల్లెలను దలపించుచుండును. ఆ వాతావరణమును చెడగొట్టకుండ వారిని విజ్ఞానవంతులుగా చేయగల్గినచో అవి నిజమైన ఋష్యాశ్రమములుగా మాఱి వెల్లడివారికి విశ్రాంతి స్థానములుగా నుపయోగపడగలవనుటలో అసంభావ్యత యేమియునుండదు. అట్టి దృష్టితో పనిచేసిననాడు అట్టి ఫలితము తప్పక కలుగ గలదు. గాంధీమహాత్ముని స్వప్నము భారతదేశమంతయు అట్టి ఋష్యాశ్రమమయముగా మాఱవలెననియే: కాని ప్రస్తుత ప్రపంచ వాతావరణముయొక్క ఒత్తిడిచే ఆ స్వప్నము ఇంతటిలో నెరవేరు అవకాశములేదు. అయినను అట్టి ఒత్తిడి ఏ మాత్రమును లేని కొండజాతి ప్రాంతములలో గాంధీజీ స్వప్నము సఫలమగుటకు అవకాశము కలదు. మన ప్రభుత్వము ఈ దృష్టితో ఈ సమస్యను వీక్షించుట వాంఛనీయము

ఈ దృష్టితో చూచినచో గిరిజన సేవా సంఘముల ప్రాముఖ్యము గోచరింపగలదు. తక్కిన హరిజనులు, వెనుకబడినవారు, విముక్తజాతులు మున్నగు వెల్లడివారి విషయములో కంటె ఈ కొండజాతుల సముద్ధరణలో ప్రభుత్వము సేవాసంస్థల సహకారము నెక్కువ గైకొనవలెను. అంతయు మేమే చేయగలమని అనుకొన్నచో కలుగునది ఆశాభంగమే! దీనికి హేతువు కొండజాతుల వారి విలక్షణమైన మనస్తత్వమే. గిరిజనులకు కావలసిన సౌకర్యములు ప్రభుత్వమువారు కల్పించినను, ఆ సౌకర్యములను స్వీకరించు ప్రవృత్తి, శక్తి గిరిజనులలో ఇంకను కలుగలేదు. ప్రభుత్వోద్యోగులెంత ప్రేమతో పిలిచి నప్పటికి ఆదివాసులు వారిని సమీపించుటకు భయపడెదరు. ఇందు ప్రభుత్వోద్యోగుల దోషమేమియు లేదు. వారు స్వచ్ఛమైన హృదయముతో పనిచేసినను ఆదివాసులకు వారియెడల భక్తికంటె భయమెక్కువ. వారు ఆడంబరముగా కన్పించక పోయినను శిక్షించు అధికారము గలవారుగదా! అదేచాలు వారిని బెదరగొట్టుటకు. ఒక కుటుంబములో తల్లికంటె తండ్రియొద్ద పిల్లలకు చనువు తక్కువగా ఉండును. దీనికి కారణము, పోషించునప్పటికిని అవసరమైనచో శిక్షించువాడు తండ్రి తల్లికి ప్రేమించుటయే తప్ప శిక్షించుట తెలియదు. వయస్సులో పెద్దవారైనను బుద్ధివికాసములో చిన్నపిల్లలవంటి వారైన గిరిజనులకు తండ్రి స్థానములో ప్రభుత్వమును, తల్లి స్థానంలో సేవా సంస్థలును ఉండి పనిచేసినప్పుడే వారు సత్వరాభివృద్ధి చెందగలరు.

ఇచ్చట దీనికి సదృశమగు ఒక సన్నివేశము జ్ఞప్తికి వచ్చుచున్నది. మహాకవి కాళిదాసు తన శకుంతల నాటకములో ఒక అందమైన ప్రకృతి చిత్రణము చేసినాడు. శకుంతలా దుష్యంతు

లిద్దరు కణ్వాశ్రమములో కూర్చుండి సల్లాపించుచుండగా అచ్చటికొక లేడి వచ్చినది. అదిచాల దప్పికతో నున్నది. ఇదిచూచి దుష్యంతుడు (రాజు) వెంటనేఒక ఆకు దొన్నెతో నీరు తీసికొని దానిని తన దగ్గరకు పిలిచెను. కాని అది రాలేదు. చాల విధముల బుజ్జగించెను. ఆతడు రాజవేషములోకూడ లేడు. అయినను లేడి రాలేదు అప్పుడు శకుంతల ఆ దొన్నెను తన చేతిలోనికి తీసికొని పిలిచెను. వెంటనే ఆలేడి వచ్చి నీటిని త్రాగెను. అది చూచి దుష్యంతుడు నవ్వుచు "సర్వఃసగాధేషు విశ్వసితి" (ప్రతివారును తనవారినేగాని నమ్మరుగదా!) అని పల్కెను. ఈ ఆదివాసులు కూడా ఆలేళ్ళ వలెనే అమాయికులు. భయస్థులు. వారి జాతికి చెందినవారిని, లేదా వారికి సేవచేయుచు వారి ఆత్మీయతను సంపాదించుకున్న వారినితప్ప వారు నమ్మరు. సేవా సంస్థల కార్యకర్తలందఱు వారికి ఆత్మీయులు. ఏలయన వారికి సేవ చేయుటయే వీరి వ్రతము. వీరి దృష్టిలో అది గిరిజనసేవ కాదు. గిరీశసేవ (ఈశ్వరసేవ) ఇందు వీరికెట్టి ప్రతి ఫలాపేక్షయు లేదు. శ్రీ పుసులూరి కోదండ రామయ్యగారు, క్రీ.శే. రెబ్బా ప్రగడ మందేశ్వరశర్మగారు వంటి సంఘసేవకులు ఎంతో త్యాగముతో, ఎన్నో సంవత్సరములనుండి చేసిన కృషి ఫలితముగనే వారిలో ఈమాత్రమైనను చైతన్యము కలిగినది. కాని యింకను కలుగవలసినంత చైతన్యము కలుగలేదు. కొండజాతులవారికీయబడిన ప్రత్యేక సౌకర్యముల వ్యవధికూడ చాల తక్కువగనే యున్నది. ఈ దృష్టితో ప్రభుత్వము, సేవాసంస్థలు కలిసి పనిచేసిననే తప్ప వీరి సంక్షేమము సత్వరముగను, సంతృప్తికరముగను సాధింపపడజాలదు. ప్రభుత్వ ప్రణాళికలు జయప్రదము కావలెనన్న ప్రజా సహకార మావశ్యకము. కొండజాతుల సహకారము సంపాదించుటకు సేవాసంస్థలను ప్రభుత్వము ఉపయోగించు కొనవలెను బ్రిటిషు ప్రభుత్వంవలె ముఠాదార్లు, పెత్తందార్లు, షాహుకార్లు మున్నగు వారి సహకారముతో తమ కార్యక్రమములు సాగించదలచినచో చివరకు ప్రభుత్వమునకు కల్గునది ఆశాభంగమే. వారు ప్రజలను భయపెట్టి లోబర్చుకొనగలరు గాని ప్రేమచే లోబర్చుకొనజాలరు. భయముచేత చేసిన పనికి, ప్రేమచేత చేసిన పనికి ఏమియు పోలికయే ఉండదు. ప్రభుత్వముయొక్క పనులకు, సంస్థలయొక్క పనులకు నడుమ విరోధములేదు. ఇద్దరుచేయు పనియొక్క లక్ష్యము ఒక్కటే; కార్యవిభాగము మాత్రము ఉండును. అనగా పూర్తి నిర్మాణము ప్రభుత్వము చేసిన అందు ప్రాణప్రతిష్ఠ సేవా సంస్థలు చేయగలవు. పాఠశాలలు స్థాపించుటకు ప్రభుత్వము ధనసహాయము, పిల్లలను చదివించు పనిని సేవా సంస్థలు చేయగలవు ఇవిగాక కేవలము ప్రభుత్వమే చేయవలసిన పెద్దపెద్ద ప్రాజెక్టులను వారే చేయవలెను. ఇట్లుకాక అన్నియు మనమే చేయగల మనుకొనుట పొరపాటు. ఈ సేవా సంస్థలు ప్రభుత్వముయొక్క పనులను సుకరము చేయగలవని ప్రభుత్వము గుర్తింపవలెను. ఈ సంస్థలకు ఎంత సహాయము చేసినను అది సార్థకమే కాని నిరర్థకము కాదు. లేనిచో ప్రభుత్వము వెచ్చించు ధనములో చాలభాగము అమాయకులైన కొండవారి పేరుచెప్పి ఏ కొలది మంది స్వార్థపరులకో దక్కగలదు ఏజన్సీ ప్రాంతములలో గూడ పంచాయతీలను ఏర్పాటు చేయనెంచుట ముదావహమే అయినను సేవాసంస్థలను ప్రభుత్వము ఆర్థికముగను, నైతికముగను బలపర్చని యెడల ఈ పంచాయతీలు కూడ ప్రజాపీడకుల చేతులలో పడిపోయే ప్రమాదము కలదు. వెల్లడిలో కలిగిన రాజకీయ చైతన్యములో శతాంశమైనను ఏజన్సీ ప్రాంతములలో కలుగలేదని ఈ సందర్భమున ప్రభుత్వము గమనింపవలసి యున్నది

కొండజాతులలో విద్యా ప్రచారమె అన్నిటికంటె ప్రధానమైనది. ప్రభుత్వమువారు అచ్చటచ్చట పాఠశాలలను స్థాపించినను పొరుగూరికి వెళ్ళి చదువుకొనవలెనను తృష్ణ వారిలో ఇంకను కలుగలేదు ఇందువలన పిల్లలకు తమ యింటి యందే విద్యాభిరుచి కలుగచేయుటకు మేమొక పద్ధతిని ప్రారంభించితిమి. గిరిజనులలోనె అయిదవ తరగతివరకు చదువుకున్న వారినేరి వారికి కొంత శిక్షణయిచ్చి వారిద్వారా ఆయా గ్రామములలో చదువుల బడులు నడుపబడు చున్నవి. ఇందులో చదువుట, వ్రాయుట, లెక్కలు, నూలుతీయుట, కథలు, పాటలు మొదలైనవి నేర్పబడుచున్నవి. ఈ విధముగా నేలంటు వదలిన విద్యార్థి తనంతతానే ప్రభుత్వ పాఠశాలకు వెళ్లుచున్నాడు. ఇట్టివి అరువది చదువుల బడులు విశాఖపట్టణం జిల్లా మాడుగుల ఏజన్సీలో ఈ సంఘ పక్షమున నడుచుచున్నవి. ఈ నడుపుచున్న వారందఱు గిరిజనులే. దీనివలన ఆ ప్రాంతమందలి ప్రభుత్వపాఠశాలలు తక్కిన ఏజన్సీ ప్రాంతములకంటె సంఖ్యావృద్ధి కలవై యున్నవి. ఈ సంఘ స్థాపకులైన కీ శే. మందేశ్వరశర్మగారి కృషిఫలితముగా ఈ ప్రచారకులుకూడ కేవల సేవా భావముతోనే చాలాకాలము పని చేసిరి. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము కూడ ఈ కార్యక్రమమును గుర్తించి గత మూడు సంవత్సరములలోను ఈ సంస్థకు తగు ఆర్థిక సహాయము చేసిరి. ఈ సంవత్సరముకూడ అట్టి సహాయము లభింపగలదని ఆశించుచున్నాము.

పారిశ్రామిక విశేషాలు

(సెప్టెంబరు 1961)

(రాష్ట్ర పారిశ్రామిక రంగంలో అనుదినం అభివృద్ధిపథకాలు ప్రవేశపెట్టబడుతున్నాయి వాటినిగురించి తెలుసుకోవడం పారిశ్రామిక వేత్తలకూ, ప్రజలకు ముఖ్యం. కాబట్టి ముఖ్యపారిశ్రామిక విశేషాలు ఈ శీర్షిక క్రింద పొందుపరచబడినాయి)

హైద్రాబాదులో సనత్‌నగర్ వద్ద సింథటిక్ డ్రగ్స్ ఫ్యాక్టరీ స్థాపనకు శీఘ్రగతిని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ పథకంపై రష్యా నిపుణులు అందజేసిన నివేదికలను రాష్ట్ర ఇంజనీర్లు పరిశీలించి వాటిపై తమ అభిప్రాయాలను పథకం నిర్వహణాధికారికి తెలియపరిచారు. ఫ్యాక్టరీకి అవసరమైన భూమిని సేకరించటం పూర్తయింది. సివిల్‌వర్క్స్, సిబ్బంది నియామకానికై అధికార్లు తగుచర్యలు తీసుకుంటున్నారు.

భారీ విద్యుత్పరికరాల ఫ్యాక్టరీ

ఆంధ్రప్రదేశ్‌లో మెదక్‌జిల్లా రామచంద్రాపురం సమీపంలో భారీ విద్యుత్పరికరాల ఫ్యాక్టరీని నెలకొల్పదలిచినట్టు భారత ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం నిర్వహణాధికారీ, జక్ నిపుణులు ఫ్యాక్టరీ స్థలాన్ని ఇటీవల పరిశీలించారు. భూమిని స్వాధీన పర్చుకోడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇతర ఏర్పాట్లుకూడా త్వరిత గతిని సాగిపోతున్నాయి.

ఉక్కు కర్మాగారం

ఉక్కు కర్మాగారంకు అవసరమైన ముడివస్తువులు ఆంధ్రప్రదేశ్‌లో కావల్సినంతగా లభిస్తాయి కాబట్టి రాష్ట్రంలో ఒక చిన్నతరహా ఉక్కు కర్మాగారాన్ని స్థాపించవలసిన ఆవశ్యకతను గురించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారత ప్రభుత్వానికి నొక్కి చెప్తూవుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉక్కుకర్మాగారం స్థాపనావకాశాలను గూర్చి పరిశీలించడానికై కేంద్రప్రభుత్వం నియమించిన సాంకేతిక సంఘం సూచననుసరించి రాష్ట్రంలోలభించే ముడివస్తువుల నమూనాలను పరీక్షార్థం జమ్షడ్‌పూర్‌లోని జాతీయ పరిశోధనశాలకు పంపించారు. ఫలితాలు బహుశా త్వరలోనే తెలియవచ్చు.

ప్రభుత్వ రంగం

గాజుసామానుల ఉత్పత్తికి ఏకీకృత పథకం

హైద్రాబాదు పరిసర ప్రాంతాలలోనూ, రాష్ట్రంలోని కొన్ని ఇతర ప్రదేశాలలోను శిలాస్ఫటికములు మొదలైన ముడిపదార్థాలు సమృద్ధిగా లభిస్తాయి కాబట్టి హైద్రాబాదులో వివిధ గాజు సామానుల ఉత్పత్తికై తృతీయ ప్రణాళికా కాలంలో ఏకీకృత పథకాన్ని అమలు పరచటానికి తలపెట్టారు. రాష్ట్రప్రభుత్వ ఆహ్వానాన్ని పురస్కరించుకొని గత ఆగస్టు 28వ తేదీన హైద్రాబాదుకు విచ్చే హంగరీ గాజుపరిశ్రమ నిపుణులు, హైద్రాబాదు సమీపంలో శిలాస్ఫటికములు లభించే ప్రదేశాలను సందర్శించారు. భారత దేశంలో గాజు పరిశ్రమ స్థాయినిగురించీ, దేశంలోని వివిధ గాజు ఫ్యాక్టరీల నిర్వహణ పద్ధతులను గురించికూడా వారు తెలుసుకున్నారు. ఈ ఏకీకృత పథకంలో గాజు స్ఫటికముల ఉత్పత్తి పథకాన్నికూడా చేర్చడానికి యోచిస్తున్నారు. ఏకీకృత పథకంపై హంగరీనిపుణులు సమగ్రనివేదికను బహుశా నెలరోజుల్లో సమర్పించ వచ్చనుకుంటున్నారు.

ప్రైవేటు రంగం

సంవత్సరానికి 3,000 మోపెడ్లు (పైడిల్ త్రొక్క నవసరం లేకుండా యంత్ర సహాయంతో నడిచే సైకిళ్లు) ను ఉత్పత్తి చేసే శక్తిగల ఒక ఫ్యాక్టరీని హైద్రాబాదులో స్థాపించడానికి భారత ప్రభుత్వం లైసెన్సు మంజూరు చేసింది. రోజుకు 100 టన్నుల గోధుమను విసిరే శక్తిగల ఒక పిండి మిల్లును నెలకొల్పుకోడానికి కూడా లైసెన్సు ఇచ్చారు.

సహకార చక్కెర ఫ్యాక్టరీ

సహకార చక్కెర ఫ్యాక్టరీలపై ప్రభుత్వం నియమించిన

ఉన్నతాధికార సంఘం తొలి సమావేశం గత ఆగస్టు 26వ తేదీన జరిగింది. ప్రస్తుతం నిర్మాణంలోనున్న సహకార చక్కెర ఫ్యాక్టరీల వ్యవహారాలను ఈ సమావేశంలో సమీక్షించారు. ఈ ఫ్యాక్టరీల ప్రతినిధులుకూడా సమావేశంలో పాల్గొన్నారు. ఆముదాల వలస, చోడవరం, పాలకొల్లు, చిత్తూరులో సహకార చక్కెర ఫ్యాక్టరీల స్థాపనకు త్వరితగతిని ఏర్పాట్లు జరుగుతున్నాయి. 1961–62 క్రషింగ్ సీజన్‌నుంచి వీటిలో ఉత్పత్తి ప్రారంభమవు తుంది.

ఈ ఫ్యాక్టరీల వ్యవహారాలను చూడటానికై రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేకాధికారిని కూడా నియమించింది.

నిజాం చక్కెర ఫ్యాక్టరీ

నిజాం చక్కెర ఫ్యాక్టరీని విస్తృతపరిచే పని వేగంగా సాగుతున్నది. విస్తరణ కార్యక్రమానికి అవసరమైన యంత్రపరి పరికరాలను శీఘ్రంగా రవాణా చేయటానికి మెస్సర్స్ ప్రోటస్ ఇంజనీరింగ్ కంపెనీ, జాతీయ పారిశ్రామికాభివృద్ధి సంస్థలతో సంప్రదించే నిమిత్తం ఈ ఫ్యాక్టరీ చీఫ్‌మెకానికల్ ఇంజనీర్ ఇటీవల బొంబాయి, పింప్రీలకు వెళ్లారు.

"పారిశ్రామిక గృహనిర్మాణ పథకం" క్రింద ఫ్యాక్టరీ కార్మికులకు రెండుగదుల ఇండ్లు, పాఠశాలా భవనాల నిర్మాణం కూడా చురుగ్గా సాగుతున్నది.

వేతన నిర్ణాయక సంఘం వారి సిఫార్సులను అమలుపరచ టానికి ఫ్యాక్టరీ అధికార్లు తగుచర్యలు తీసుకుంటున్నారు. ఈసిఫా ర్సులను అమలు పరచటంవల్ల చాలామంది ఉద్యోగులకు ప్రయో జనం కలుగుతుందనుకుంటున్నారు.

లఘుపరిశ్రమలు

లఘుపరిశ్రమల అభివృద్ధికై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్థాపించిన రాష్ట్ర లఘుపరిశ్రమల అభివృద్ధి సంస్థకు గత సెప్టెం బరు 22వ తేదీన ముఖ్యమంత్రి లాంఛనప్రాయంగా ప్రారంభోత్స వం చేశారు.

చేతిపరిశ్రమలు

రాష్ట్ర చేతిపరిశ్రమల సలహా మండలివారు ఇటీవల సమా వేశమై చేతిపరిశ్రమల సహకారసంస్థలకు ప్రతిదానికీ ఒకటిచొప్పున మదింపు సంఘాలను నియమించటానికీ, చేతిపరిశ్రమల అభివృద్ధికి శీఘ్రంగా నిర్ణయాలు గైకొనటానికి వీలుండేందుకై రాష్ట్రసలహా మండలికి ఒక స్థాయీసంఘాన్ని స్థాపించటానికి తీర్మానించారు.

అఖిలభారత చేతిపరిశ్రమల బోర్డు 20వ సాధారణ సమావే శం గత సెప్టెంబరు 8వ తేదీన హైద్రాబాదులో జరిగింది దేశమం తటినుంచీ అనేక మంది ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. చేతిపరిశ్రమల అభివృద్ధికి సంబంధించిన వివిధ విషయాలు ఈ సమావేశంలో చర్చకు వచ్చాయి.

కొత్తఢిల్లీలో 1961 నవంబరు 14వ తేదీనుంచి జరిగే భారత పారిశ్రామిక ప్రదర్శనంలో పాల్గొనటానికి రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది.



ప్రగతి పథంలో

(జిల్లాల నుంచి అందిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను గురించిన సంక్షిప్తవార్తలు)

ఆదిలాబాదు

ఒక రూపాయి పొదుపు ఉద్యమం

చిన్నూరు తాలూకా కిష్టంపేటలో సెప్టెంబరు 24 వ తేదీన ఒక రూపాయి పొదుపు ఉద్యమానికి ప్రారంభోత్సం జరిగింది.

అనంతపురం

రేకు పనిముట్ల కర్మాగారం

ఉరవకొండలో రు 185000 లవ్యయంతో రేకు పనిముట్ల కర్మాగారాన్ని ప్రారంభించే పథకాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది,

కడప

సహాయక పారిశ్రామిక వాడ

ప్రొద్దుటూరులో ప్రైవేటు రంగలో స్థాపించే సహాయక పారిశ్రామిక వాడకు ప్రభుత్వం యిటీవల రు. 27 లక్షల మొత్తాన్ని మంజూరు చేసింది.

చిత్తూరు

శ్రమదానంతో రోడ్డు నిర్మాణం

కొత్త వెంకటాపురంలో సెప్టెంబరు 22 వ తేదీన శ్రమదానంతో రెండు మైళ్ల పొడువు రోడ్డు వేశారు.

తూర్పు గోదావరి

రూపాయి పొదుపు పథకం

గొల్లప్రోలు సమితి బ్లాకుకు చెందిన ధర్మవరంలో 1961 సెప్టెంబరులో ఒక రూపాయి పొదుపు ఉద్యమానికి ప్రారంభోత్సవం జరిగింది.

గుంటూరు

పంచాయతీ భవనానికి శంకు స్థాపన

మోపర్రు (తెనాలి తాలూకా) పంచాయతీ భవనానికి జిల్లా పరిషత్తు అధ్యక్షుడు సెప్టెంబరు 29 న శంకు స్థాపన చేశారు.

పాఠశాల భవనానికి శంకుస్థాపన

కూచినపల్లి గ్రామం (ఈ పూరు పంచాయతీ సమితి బ్లాకు) లోని ప్రాథమిక పాఠశాల భవనానికి సెప్టెంబరులో శంకుస్థాపన జరిగింది. ఈ భవన స్థలాన్ని కూచినపల్లి గ్రామస్థులు శ్రీ కె కోటయ్య, శ్రీ బి. నరసయ్య గారలు సమితికి విరాళంగా ఇచ్చారు.

దుగ్గిరాలలో కుట్టుపని కేంద్రం

ఈమని పంచాయతీ సమితి ఆధ్వర్యాన సెప్టెంబరులో, మహిళలకొరకు ఒక కుట్టు పని కేంద్రం ప్రారంభింప బడింది.

హైదరాబాదు

నవందగిలో వెనుకబడిన తరగతి విద్యార్థులకు వసతిగృహం

తాండూరు పంచాయతీ సమితి నవందగిలో వెనుక బడిన తరుగతుల వారి కొరకు నిర్మింపబడిన వసతి గృహానికి సెప్టెంబరు 23 న, జిల్లా పరిషత్తు అధ్యక్షుడు ప్రారంభోత్సవం చేశారు.

తాండూరులో తాగూరు హాలు

తాండూరు (పంచాయతీ సమితి)లో నిర్మించబడిన తాగూరు హాలుకు సెప్టెంబరు 22 న ప్రారంభోత్సవం జరిగింది.

మేడ్చల్ కిసాన్ క్లబ్ ముందంజ

మేడ్చల్‌లోని కిసాన్ క్లబ్బు, పైరు సంరక్షణ చర్యలను

చక్కగా అవలంబిచటం ద్వారా బ్లాకు మొత్తానికి ఆదర్శవంత మైనదిగా ఉన్నది. ఈ ఉద్యమం క్రింద గ్రామంలో 200 ఎకరాల మేరలో వరి పంటను వేయాలని నిర్ణయించారు. వ్యవసాయ పరికరాల కొనుగోలు నిమిత్తం క్లబ్బు రు. 200 లను విరాళంగా ఇచ్చింది చిన్న మొత్తాల పొదుపు ఉద్యమాన్ని కూడా వీరు ప్రాగంభించారు. రు. 60 లు వసూలైంది

కుత్బుల్లాపూల్ 'పొదుపు గ్రామం'గా ప్రకటించబడింది. 200 కుటుంబాలున్న ఈగ్రామంలో రు. 310 ల విలువగల ఒక రూపాయి స్టాంపులు, అయిదు రూపాయల బాండ్లు అమ్ముడైనవి.

మంచినీటి బావుల నిమిత్తం రు. ఒక లక్ష

హైదరాబాదు జిల్లా పరిషత్తు స్థాయి సంఘం, ఈ సంవత్సరం, జిల్లాలోని నాలుగు బ్లాకులలో మంచి నీటి బావుల నిర్మాణానికిగాను సెప్టెంబరు నెలలో ఒక లక్ష రూపాయల మొత్తాన్ని మంజూరు చేసింది. ఈ సంవత్సరంలో ఉపకార వేతనాలిచ్చేందుకు మరొక రు. 1.40 లక్షల మొత్తాన్ని కూడా మంజూరు చేసింది.

కరీంనగర్

చిన్న మొత్తాల పొదుపు

చిన్న మొత్తాల పొదుపు, బహుమతి పత్రాల అమ్మకం క్రింద 1961 మే నెల నుండి ఈ జిల్లాలో మొత్తం రు 1033720 లు వసూలైనవి.

లోక సహాయక సేన శిబిరం

సుల్తానాబాదులో సెప్టెంబరు నెలలో లోక సహాయక సేన శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు 525 మంది శిక్షణ పొందారు.

ఖమ్మం

లిఫ్ట్ ఇరిగేషన్ యూనిట్ల మంజూరీ

మధిర బ్లాకుకు రెండు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను జిల్లా పరిషత్తు అక్టోబరు 9 న మంజూరు చేసింది. వీటి వల్ల రు. 71000 లవ్యయంతో 344 ఎకరాలకు నీటి పారుదలవసతి లభిస్తుంది.

బేసిక్ శిక్షణ పాఠశాల

భద్రాచలంలో ప్రత్యేకంగా ప్రభుత్వ జూనియర్ బేసిక్ శిక్షణ పాఠశాలను స్థాపించే నిమిత్తం భవన నిర్మాణాలకై రాష్ట్ర ప్రభుత్వం రు. 240000 లను మంజూరు చేసింది.

కోయ బాలికల వసతి గృహానికై భవన నిర్మాణం నిమిత్తం రు 40000 లనూ, ప్రభుత్వ ప్రాథమికోన్నత బహుళార్థ సాధక పాఠశాలలో అయిదు తరగతి గదుల నిర్మాణం నిమిత్తం రు. 61000 లను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది.

గ్రామీణ సాముదాయిక వర్కుషాపు

రు. 32900 ల అంచనా వ్యయంతో కల్లూరు పంచాయతీ సమితిలో ఒక గ్రామీణ సాముదాయిక వర్కుషాపు స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది.

కల్లూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాపనకు జిల్లా పరిషత్తు రు. 38000 లను మంజూరు చేసింది.

కృష్ణా

గ్రామస్థులచే రోడ్డు నిర్మాణం.

తిరువూరు పంచాయతీ సమితి కనుమూరు గ్రామస్థులు, తమ గ్రామంలో సెప్టెంబరు 16 నుండి18 వరకూ నిర్వహింపబడిన గ్రామ సహాయక శిక్షణ శిబిరం సందర్భంలో ఒక ఫర్లాంగు పొడవు రోడ్డును వేశారు.

బాలభట శిక్షణ శిబిరం.

మచిలీ పట్నంలో బాలభటులు, గైడ్‌మాస్టర్ల శిక్షణ శిబిరం సెప్టెంబరులో పదిరోజులపాటు నిర్వహింపబడింది. తూర్పుకృష్ణా నుండి 26 మంది, పశ్చిమ కృష్ణానుండి 22 మంది ఉపాధ్యాయులు దీనికి హాజరయ్యారు.

కర్నూలు

నీటివనరులకు రు. 126000.

మామూలుగా నిర్వహణకు, మరమ్మతులకిచ్చే మొత్తం కాకుండా, చిన్నతరహా నీటివనరుల నిమిత్తం అదనంగా రు. 126000 లను జిల్లాపరిషత్తు మంజూరు చేసింది. విస్తృత ప్రాతిపదిక పై ఎరువుల వాడకం పథకం క్రింద సమితులకు రు 75000 లను పంచి పెట్టింది. ఒక లక్ష రూ. ల అంచనావ్యంతో స్వంతానికి ఒక ముద్రణశాలను నడపడానికి కూడా నిర్ణయించారు. రు.250,000 లఖర్చుతో సంజమల పెరు సోమలగ్రామాల మధ్య రోడ్డు వేయటానికి కూడా మంజూరు చేశారు

మహబూబ్‌నగర్

బాలురకు గవర్నరు ఉపదేశం.

గవర్నర్ శ్రీ భీమసేన్‌సచార్ సెప్టెంబరులో మహబూబ్‌నగర్‌లో పర్యటించిన సందర్భంలో దేవరకదర గ్రామబాలురకు హితోపదేశంచేశారు తాను చెప్పినవాక్యాలను తిరిగి ఉచ్చరించిన ప్రతి బాలునికి ఒక్కొక్క రూపాయి చొప్పున ఇస్తానని అన్నారు బాలురు సత్యమే పలకాలని క్రమశిక్షణగల వివేకవంతులైన పౌరులుగా తయారవాలని ఆయన హితవుచెప్పారు. 50 మంది బాలురు ఈ ప్రతిజ్ఞ చేశారు గవర్నరు స్వయంగావారికి రూపాయిలను ఇచ్చారు.

నీటిసరఫరా

మహబూబ్‌నగర్‌లో ప్రస్తుతంఉన్న నీటిసరఫరా పథకాన్ని రు. 527700 ల ఖర్చుతో పెంపొందించే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

మెదక్

ప్రణాళికా ప్రదర్శనం.

రామాయంపేటలో సెప్టెంబరు ఆఖరి వారంలో ప్రణాళికా ప్రదర్శన జరిగింది. పంచాయతీ సమితి మేలిరకం విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పరికరాలను ప్రదర్శించడం ఇందులోని గమనార్హమైన అంశం.

నల్గొండ

గ్రామీణరోడ్లు

నల్గొండ జిల్లాలోని రోడ్లనిమిత్తం ప్రభుత్వం రు. 1 16 లక్షలను మంజూరు చేసింది

సహకార సంఘాలకు బహుమతి షీల్డులు

గవర్నర్ శ్రీభీమసేన్ సచార్, ఇటీవల తమ నల్గొండ జిల్లా పర్యటన సందర్భంలో జిల్లాలోని మూడు సహకార సంఘాలకు రోలింగు షీల్డులను బహుకరించారు. అవిఇవి:— జూలూరులోని పెద్దతరహా సహకార పరపతి సంఘం: చౌటుప్పల్ అమ్మనబ్రోలులలోని సహకార పరపతి సంఘాలు. షాయిగూడలోని సహకార గ్రామీణ బ్యాంకు అధ్యక్షులు శ్రీ వి. ప్రతాపరెడ్డి గారికి ఒకసువర్ణ పతకాన్ని బహుకరించారు. భువనగిరి సహకార కేంద్ర బ్యాంకువారి తరఫున ఈ బహుమతులు ఇవ్వబడినవి.

నాగార్జునసాగర్ వద్ద పశుపెంపకం క్షేత్రం.

మూడవ ప్రణాళికలో నాగార్జున సాగర్ వద్ద రు. 10 లక్షల వ్యయంతో ఒక పశుపెంపక కేంద్రాన్ని స్థాపిస్తారు. ఈ క్షేత్రం ప్రజలకు, నవీన పద్ధతులలో పశువులపెంపకం, పోషణ, వ్యాధి నిరోధం, నివారణ పద్ధతులు, పశుగ్రాసం పండించడం, నిల్వచేయడం, వంటి పద్ధతులను బోధించే కేంద్రంగా పనిచేస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో ఉత్తమ రకం పశువులను పెంపొందించే నిమిత్తం మేలిరకం జాతికి చెందిన ఎద్దులను కూడా ఇది సరఫరా చేస్తుంది.

గ్రామస్థుల రేడియో గోష్టి:

గ్రామస్థుల రేడియో గోష్ఠిపై సమాచార పౌరసంబంధాల శాఖవారు నియమించిన మదింపు సంఘంవారు సూర్యాపేట పంచాయతీ సమితి పిల్లలమర్రిలోని రేడియోగోష్ఠి కేంద్రాన్ని సందర్శించి దాని కార్యకలాపాలను పరిశీలించారు.

ఆరోగ్య కేంద్రానికి రు. 8000 ల సేకరణ

ఆలేరు పంచాయతీ సమితి ప్రజలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాపనకు రు. 8000 లను విరాళంగా ఇచ్చారు.

''ఖైదీలచే కాలువ నిర్మాణం''

రాష్ట్రమంతటి నుండీ తేబడిన ఖైదీలు త్వరలోనే నాగార్జునసాగర్ ఎడమకాల్వ త్రవ్వకాన్ని ప్రారంభిస్తారు. మిర్యాలగూడెం తాలూకాలోని ముంగల గ్రామ సమీపంలో 2¼ మైళ్ల పొడవుకాలువను వీరుత్రవ్వుతారు. అక్కడే వీరికి ఒక జైలును కూడా ఏర్పాటు చేస్తారు ఈ పని చేసే 750 మంది ఖైదీలను గోడలమధ్య బంధించరు. కాని వీరు పనిచేసే చోట చుట్టుగా ముండ్లతీగెను వేస్తారు. ఈపని మూలంగా ప్రాజెక్టు వ్యయంలో సుమారు రు 6.5 లక్షల ఖర్చు తగ్గుతుందని అంచనా వేశారు. ఈ త్రవ్వకం పని కంట్రాక్టరులకు అప్పగిస్తే రు. 10 లక్షలు వ్యయమవుతుంది. ఖైదీలు గనుక చేస్తే రు 3.5 లక్షలు మాత్రం ఖర్చు కాగలదు.

చిన్నమొత్తాల పొదుపు.

చిన్నమొత్తాల పొదుపు బహుమతి పత్రాల అమ్మకం మూలంగా నల్గొండ జిల్లాలో ఇంతవరకు మొత్తం రు. 1, 59 లక్షలు వసూలయింది. రాష్ట్రమంతటిలోనూ బహుమతిపత్రాల ద్వారా ఈజిల్లాలోనే అత్యధిక మొత్తం లభించింది.

నెల్లూరు.

పూర్వ విస్తరణ బ్లాకు

సూళ్లూరుపేట పూర్వవిస్తరణ బ్లాకుకు సెప్టెంబరు 29 న లాంఛనంగా ప్రారంభోత్సవం జరిగింది.

బీదరైతులకు పట్టాలు

తిక్కవరం, చింతవరం గ్రామాలలోని బీదరైతులకు సెప్టెంబరులో 1054 ఎకరాల మేరకు 587 పట్టాలు పంచి పెట్ట బడ్డాయి.

పొదుపు ఉద్యమం.

జాతీయ పొదుపుఉద్యమంలో చైతన్యవంతమైన పాత్ర తీసు కొనవలసిందిగా తన సభ్యులకు, తోటపల్లి గూడూరు పంచాయతీ సమితి విజ్ఞప్తి చేసింది. తమ తమ ప్రాంతాలలో ఈ ఉద్యమాన్ని ఇంటింటికీ ప్రచారం చేస్తామని సభ్యులందరూ హామి ఇచ్చారు.

ప్రాథమిక పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణం ఖర్చులో సగం మొత్తాన్ని భరించడానికి గాను రు. 1000లకు మించని మొత్తాన్ని మంజూరుచెయ్యాలని పంచాయతీ సమితి నిర్ణయించింది.

పశువైద్య ప్రథమ చికిత్సా కేంద్రం

పశువైద్యంలో ప్రథమ చికిత్సా కేంద్రానికై కడివేడులో నూతనంగా నిర్మింప బడిన భవనానికి సెప్టెంబరు 13న ప్రారంభో త్సవం జరిగింది గ్రామానికి చెందిన శ్రీ డి. వెంకురెడ్డి, శ్రీ డి, దశరథరామరెడ్డి గారలు ఈ భవనాన్ని విరాళంగా ఇచ్చారు.

నిజామాబాదు

వృత్తిపనుల శిక్షణా కేంద్రం ప్రారంభం

నిజామాబాదులో మహిళలకు ఒక వృత్తిపనుల శిక్షణా కేంద్రాన్ని సెప్టెంబరు 16న ప్రారంభించారు.

కామారెడ్డి పంచాయతీ సమితి ఆధ్వర్యాన రామారెడ్డిలో నిర్మింపబడనున్న ఆరోగ్య కేంద్రానికి, రామారెడ్డి గ్రామస్థులు రు. 10000 లనూ, రెండు ఎకరాల భూమినీ, తమ విరాళంగా సమర్పించారు.

బియ్యపు మిల్లుల రక్షణ పోటీలు

సెప్టెంబరు 14న నిజామాబాదులో జరిగిన ఉత్సవాలలో ముఖ్యమంత్రి, జిల్లా బియ్యపు మిల్లుల రక్షణపోటీ వారంలో గెలు పొందిన వారికి బహుమతులను పంచిపెట్టారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ కార్మిక శాఖల మంత్రి, ఫ్యాక్టరీల ప్రధాన పరిశీల నాధికారి ఉత్తమమైన కంచెకుగాను ప్రథమ బహూమతి పొందిన విత్తనాని పారిశ్రామిక సంస్థను (నిజామాబాదు) కూడా సందర్శించి, అక్కడి రక్షణ ఏర్పాట్లను చూశారు

శ్రీకాకుళం

చిన్న మొత్తాల పొదుపు

టెక్కలి పంచాయతీ సమితి సెప్టెంబరు 24న సమా వేశమై, ప్రతి పంచాయతీనికూడా రు. 2000 ల మొత్తాన్ని చిన్న మొత్తాల పొదుపుకు వినియోగించ వలసిందిగా కోరాలని తీర్మా నించింది.

టెలిఫోను ఏక్చేంజి

నర్సన్న పేటలో సెప్టెంబరు 30న ఒక టెలిఫోను ఎక్చేం జిని తెరిచారు.

విశాఖపట్టణం

ఉపాధ్యాయులకు జాతీయ అవార్డులు

ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఉన్నందుకూ, బోధనా దక్షతకూ ఉపాధ్యాయుల కివ్వబడే జాతీయ అవార్డు, ఈ సంవత్సరం విజయ నగరం తాలూకా, సంగుడిబిల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడైన శ్రీ పి నరసింహంకు లభించింది. వారికి రు. 500 ల మొత్తాన్ని బహుకరిస్తారు. ఈ విధంగా ఉపాధ్యాయునికి బహు మతి రావడం ఈ తాలూకాలో ఇదే ప్రథమం.

మహిళలకు వయోజన పాఠశాల

విజయనగరం పట్టణ మహిళా సంఘం ఆవరణలో సెప్టెం బరు 17న మహిళల వయోజన పాఠశాలను తెరిచారు.

ప్రణాళికా ప్రదర్శనం

కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన విజయనగరంలో సెప్టెంబరు 12 నుండి 21 వరకూ "నవభారత నిర్మాణం" పేరుతో పంచవర్ష ప్రణాళికలను గూర్చిన ప్రదర్శనం జరిగింది.

ఈ ప్రదర్శన, నీటి వనరులు, విద్యుచ్ఛక్తి, వ్యవసాయం— సమాజాభ్యుదయం, పరిశ్రమలు, రవాణా, వార్తా సౌకర్యాలు— సాంఘికసేవ అనే ఆరు భాగాలుగా విభజింప బడింది. ప్రతిరోజూ డాక్యుమెంటరీ ఫిల్ములు ప్రదర్శింప బడ్డాయి.

పంచాయతీ కార్యాలయానికి నూతన భవనం

గోపాల పట్నంలో పంచాయతీ కార్యాలయ భవనానికి సెప్టెంబరు 11న శంకుస్థాపన చేశారు.

వరంగల్లు

పాఠశాల ప్రారంభం

దోర్నకల్లులోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల సైన్సు బ్లాకుకు వ్యవసాయ మంత్రి సెప్టెంబరు 30న శంకుస్థాపన చేశారు. దీనికి రు. 30000 లు ఖర్చవుతుందని అంచనా.

గృహ నిర్మాణ పథకం

ఈ సంవత్సరం వరంగల్లు జిల్లాలోని మధ్య తరగతి, స్వల్పాదాయవర్గాల వారికి సహకార సంఘాలద్వారా గృహాలను నిర్మించే పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రు. 2 లక్షల మొత్తాన్ని మంజూరు చేసింది.

పశ్చిమ గోదావరి

టెలిఫోన్ ఎక్ఛేంజి

ఆటోమేటిక్ టెలిఫోనుఎక్ఛేంజిని సెప్టెంబరు 25న వేగేశ్వరపురంలో తెరిచారు.

సహకార సేవా సంస్థ

పోలవరం బ్లాకుకు చెందిన కృష్ణారావుపేటలో సెప్టెంబరు 17 న, సహకార సేవా సంస్థకు ప్రారంభోత్సవం జరిగింది.


తోళ్లనుపదును చేయడంలో శిక్షణ

పశువేదలలో తోళ్లను పదును చేయడంలో బోధన–శిక్షణ లనిచ్చే కేంద్రానికి, కొవ్వూరు పంచాయతీ సమితి అధ్యక్షులు సెప్టెంబరు 15 న ప్రారంభోత్సవం జరిపారు.

గాంధీ తత్వబోధన

గాంధీ తత్వబోధనకై ఒక విభాగాన్ని ఏర్పాటు చేసే నిమిత్తం ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఏటా రు. 4800 లను విరాళంగా ఇవ్వడానికి జిల్లా పరిషత్తు మంజూరు చేసింది.

తణుకు, వీరవాసరం ఆచంట, పాలకొల్లు, పెనుగొండ, పెరవలి బ్లాకులలో నిర్బంధ ప్రాథమిక విద్యను ప్రవేశ పెట్టాలని కూడా పరిషత్తు నిర్ణయించింది. గోపన్నపాలెంలో ప్రాంతీయ గ్రామీణ వృత్తి పనివారి శిక్షణా కేంద్రాన్ని, కొవ్వూరులో ఒక గ్రామీణ పారిశ్రామికవాడను నెలకొల్పడానికికూడా నిశ్చయించారు. పంచదార పన్నుల ద్వారా లభించిన మొత్తం నుండి రు. 8 లక్షల గ్రాంటుతో 11 రోడ్డు పనులకు కూడా అనుమతించారు.



తానెనమ్మబోడు తనకున్న కన్నునే
నమ్మకమ్ములేని నంగనాచి
తననెకాదు తుదికి తనహృదిన్నమ్మడు
జననుతాంతరంగ! వినుర! రంగ!

కళాకృష్ణుల "కృష్ణశతశతి"

సంగ్రహ ప్రకటనలు

నూత్న పారిశ్రామిక సంస్థలు

విదేశ మారకం కొరతదృష్ట్యానై తేనేమి, విదేశ మారక ద్రవ్యాన్ని చాలా మితంగా ఖర్చుపెట్టవలసిన అవసరం దృష్ట్యా నై తేనేమి, స్టెయిన్‌లెస్‌స్టీల్ రేకులతో తయారుచేసే పాత్రసామగ్రి, ఆసుపత్రి పరికరాల ఉత్పత్తికై ఆంధ్రప్రదేశ్‌లో లఘుపరిశ్రమల రంగంలో కొత్తగా పారిశ్రామిక సంస్థలను ప్రారంభించటాన్ని ప్రోత్సహించకుండటానికి నిశ్చయించ బడినది. అదే ప్రకారం ఇత్తడి, రాగిపాత్రల తయారీకై ప్రారంభించే నూత్న పారిశ్రామిక సంస్థలనుకూడా ప్రోత్సహించటం జరగదు ఇట్టి సంస్థలను నెలకొల్పదలచినవారికి, అవసరమైన ముడిసరకు లభ్యం చేయ బడదు కాబట్టి త్వరపడి వాటిని స్థాపించకుండా ఉండవలసిందిగా విజ్ఞప్తి చేయడమవుతున్నది.

భవనాల కంట్రోలు చట్టం

1960 వ. సం. పు. ఆంధ్రప్రదేశ్ భవనాల (కౌలు, కిరాయ, తొలిగింపు) కంట్రోలు చట్టం 1960 ఏప్రిల్ 21వ తేదీనుండి అమలులోకి వచ్చింది. ఈ చట్టం 20వ సెక్షనులోని (1)వ సబ్ సెక్షన్ననుసరించి, సబార్డినేటు జడ్జికిగాని లేదా ఒకటికంటె ఎక్కువ మంది సబార్డినేటులున్న సందర్భములో ప్రిన్సిపల్ సబార్డినేటు జడ్జికిగాని అప్పీలు చేసుకోవచ్చును. ఆయా జడ్జీల అధికారపరధిలో ఆ ప్రాంతాలు చేరి వుండాలి

ఆదిలాబాదు, మెదక్ జిల్లాలలోనూ, భద్రాచలం డివిజన్ లోను, ప్రాంతీయ ఆధిపత్యంగల సబార్డినేటు జడ్జీలు లేరు. రాజ మండ్రిలో ఉన్న సబార్డినేటు జడ్జికి రాజమండ్రి తాలూకాపై ఆధి పత్యంలేదు. అదేవిధంగా ఏలూరులో ఉన్న సబార్డినేటు జడ్జికి, ఏలూరు, చింతలపూడి తాలూకాలపై ఆధిపత్యం లేదు. అందువల్ల యీ ప్రాంతాలలో చట్టాన్ని అమలు పరచుటలో ఇబ్బందులు వస్తున్నవి. కనుక వాటిని నివారించేందుకుగాను, ఈ చట్టాన్ననుస రించి వచ్చే అప్పీళ్ళను స్వీకరించే అధికారాన్ని ఆ ప్రాంతం జిల్లా జడ్జీలకు, ఖమ్మంలోని ప్రభుత్వ ప్రతినిధికి సంక్రమింప జేసినట్టు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

గుంటూరు డ్రైనేజి పథకం

గుంటూరు భూగర్భ మురుగు పారుదల పథకం మొదటి దశ పనిని మూడవ పంచవర్ష ప్రణాళికా కాలంలో అమలుపరచ టానికి ప్రభుత్వం నిశ్చయించింది. ఈ పథకానికి దిగువవిధంగా పెట్టుబడి సమకూర్చ బడుతుంది. (అ) గుంటూరు మునిసిపాలిటి రూ. 20.00 లక్షల మొత్తాన్ని డిపాజిటు చేస్తుంది. (ఆ) నాల్గు సంవత్సరాలవరకు ఏడాదికి రూ. 3 5 లక్షల చొప్పున ఈ మునిసి పాలిటీ ఇస్తుంది. (ఇ) రూ. 25 00 లక్షల మేరకు ఈ మునిసి పాలిటీ ఋణం సేకరిస్తుంది.

తెలుగు తరగతులు

జంటనగరములలోని ప్రభుత్వ కార్యాలయాలలో పని చేస్తున్న తెలుగు రాని ఉద్యోగులు తెలుగు నేర్చుకునేందుకు వీలుగా తెలుగు బోధనా తరగతులను ప్రారంభించడానికి ప్రభుత్వం ఆదేశించింది ఒక్కొక్క తరగతిలో ప్రవేశాల సంఖ్య 40 కి మించకుండా వుంటుంది వారానికి మూడు గంటల చొప్పున రోజు విడిచి రోజు సాయంత్రం 4_30 గం. నుండి 5_30 గంటలవరకు తరగతులు నడుపబడ్తాయి. జంటనగరాలలోని వేరువేరు ప్రాంతా లలో యెక్కువ కార్యాలయాలు ఉన్న ప్రదేశాలలో యీ తరగతు లను తెరుస్తారు. యీ బోధన యేడాదిపాటు జరుగుతుంది. జంట

నగరాలలో ప్రథమంగా 71 తరగతులు ప్రారంభిస్తారు. శిక్షణ కాలం పూర్తి అయిన తర్వాత, విద్యాశాఖ డైరెక్టర్ అభ్యర్థులకు పరీక్ష పెట్టి, ఉత్తీర్ణులైన వారికి యోగ్యతా పత్రాలు యిస్తారు.

మునిసిపల్ పరిపాలన డైరెక్టరేటు

ఇంతవరకు స్థానిక పరిపాలనా శాఖ డైరెక్టరు అధీనంలో ఉన్న యీ క్రింది ఉద్యోగులు యికనుంచి మునిసిపల్ పరిపాలన డైరెక్టర్ ఆధ్వర్యంలో పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది: (1) స్థానిక పరిపాలనా శాఖ డిప్యూటీ డైరెక్టరు ఒకరు మునిసిపల్ పరిపాలనా శాఖ డిప్యూటీ డైరెక్టరుగా వ్యవహరిస్తారు. (2) స్థానిక పరిపాలనా శాఖ అసిస్టెంటు ఇన్‌స్పెక్టరు జనరల్ ఒకరు యిక నుండి మునిసిపల్ పరిపాలనా శాఖ అసిస్టెంటు డైరెక్టరుగా పని చేస్తారు. (3) ఒక ముఖ్య మదింపు అధికారి. (4) ప్రస్తుతం ఉన్న ఇద్దరు కంపోస్టు అభివృద్ధి అధికార్లలో ఒకరు మునిసిపల్ పరిపాలనా శాఖ డైరెక్టరు అధీనంలో పనిచేస్తారు.

మునిసిపల్ పరిపాలనా శాఖ డైరెక్టర్ అధీనంలో మునిసిపల్ పరిపాలన శాఖ ప్రాంతీయ డైరెక్టర్లు ముగ్గురు ఉంటారు. ఇద్దరు ఆంధ్రప్రాంతములోను ఒకరు తెలంగాణా ప్రాంతములోను పనిచేస్తారు,

అసిస్టెంటు ఇనస్పెక్టర్ జనరల్, ప్రాంతీయ ఇన్‌స్పెక్టర్లు, తనిఖీ అధికారులుగా ప్రస్తుతం పనిచేస్తున్న 8 మందిలో నలుగురు పంచాయతీ రాజ్ కమీషనర్ అధీనంలో పని చేస్తారు.

అమ్మకంపన్ను ఎగవేత

మూడువేల రూపాయలకు పైగా అమ్మకం పన్నును ఎగవేసినవారిని గూర్చి సమాచారం ఇచ్చినవారికి లేక అటువంటి సందర్భాలలో పరిశోధనలలో సహకరించే వారికి, వారు ప్రభుత్వోద్యోగులు కాని పక్షంలో బహుమతులను ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వు చేసింది. ఆయాకేసులలో లభించిన అదనపు పన్ను మొత్తంలో $2\frac{1}{2}$ శాతం బహుమతిగా ఇస్తారు. ఎగవేసిన పన్నుల విషయమైచేసిన పరిశోధనను పురస్కరించుకొని యీబహుమతి ఇవ్వబడుతుంది. అంతేకాని కేసును పరిశోధించిన సంవత్సరాలు లెక్కలోనికి తీసుకొనబడవు.

బహుమతి మొత్తం రు. 1000 లకు మించనంతవరకు దానిని వాణిజ్య పన్నుల కమీషనర్ మంజూరుచేస్తారు.

అసిస్టెంట్ సర్జన్లకు రాయితీలు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్‌సర్వీస్ కమీషనుచే నేరుగా ఎన్నికచేయబడి రాష్ట్రవైద్యశాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ సర్జన్లను మూడు సంవత్సరాలపాటు సైనిక వైద్యదళంలో పనిచేయటానికి డిప్యూటు చేయటానికై రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది. సైనికశాఖలో ఉత్తమంగా విధులునిర్వహించి గౌరవాభిమానములకు పాత్రులైన అధికార్లకు ప్రమోషను విషయంలో ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. వారు సివిల్ సర్వీసుకు తిరిగి వచ్చినతరువాత సైనిక శాఖలో వారు ఎన్నిసంవత్సరాలు పనిచేశారో అన్నిఅడ్వాన్సు ఇంక్రిమెంట్లు ఇవ్వబడతాయి. సైనికశాఖనుంచి సివిల్ సర్వీస్‌కు తిరిగివచ్చిన తరువాత అదేహోదాలో నియమింపబడే డాక్టర్లకు మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది. అయితే సైనికశాఖలో ఉత్తమంగా పనిచేసిన కారణంగా సివిల్ సర్వీసులో ప్రమోషనుపై నియుక్తులయ్యే అధికార్లకుమాత్రం ఈ అడ్వాన్సు ఇంక్రిమెంట్లు ఇవ్వబడవు.

ఖనిజరాయితీలు

భారత ప్రభుత్వం జారీచేసిన 1960 వసం॥ పు ఖనిజ రాయితీల నియమావళి, 1960 నవంబరు 26వ తేదీనుంచి అమల్లోకి వచ్చింది ఈ నియమావళి ప్రకారం గనుల త్రవ్వకానికి లైసెన్సు కొరకు పెట్టుకున్న దరఖాస్తులపై చర్యతీసుకోవడం, అవి చేరిన 9 నెలల లోపుగా ముగియాలి. కాగా లైసెన్సుల పునరుద్ధరణ కొరకు దాఖలు చేసే దరఖాస్తులు, లైసెన్సు గడుపు ముగిసే లోపుగా పరిష్కరించబడాలి. యిటువంటి సందర్భాలలో లైసెన్సు గడువు పూర్తికావడానికి 90 రోజులు ముందుగానే పునరుద్ధరణ నిమిత్తం దరఖాస్తులు ఇవ్వవలసివుంటుంది.

గనుల కౌలు మంజూరు కొరకు పెట్టుకునే దరఖాస్తులను అవి చేరిన 9 మాసములలోపుగా పరిష్కారం చేయాలి. అలాగే కౌలు పునరుద్ధరణ కొరకు పెట్టుకున్న దరఖాస్తులను అవి అందిన తొంభై రోజులలోపుగా పరిష్కరించాలి. ఇలాంటి సందర్భాలలో కౌలు గడువు ముగియడానికి ఆరునెలల లోపుగా దరఖాస్తులు ఇవ్వడం అవసరం. ఖనిజరాయతీలకొరకు పెట్టిన దరఖాస్తులను నిర్ణీత గడువు లోపుగా రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేయనట్లయితే అపరిష్కృతంగా వుండిపోయిన దరఖాస్తులు, నిర్ణీత గడువు ముగిశాక నిరాకరింపబడినట్లుగా పరిగణించాలని కూడా ఈ నియమావళి నిర్దేశిస్తున్నది,

వన్యమృగ సంరక్షణ సలహా బోర్డు

రాష్ట్ర వన్యమృగ సంరక్షణ సలహాబోర్డు ఎక్స్ అఫీషియో

సభ్యుల సంఖ్యను 8 నుంచి 10 కి పెంచటానికీ, జంతు ప్రదర్శన శాల ఎక్స్ అఫీషియో డైరెక్టరు అయిన అటవీశాఖ డిప్యూటీ ఛీఫ్ కన్సర్వేటరునూ, మత్స్యశాఖ డైరెక్టరును బోర్డు ఎక్స్ అఫీషియో సభ్యులుగా చేర్చుకొనటానికి ప్రభుత్వం ఆదేశించింది. బోర్డు సభ్యత్వం విషయంలో "పశుపోషణ, మత్స్యశాఖల డైరెక్టరు" హోదాను "పశుపోషణశాఖ డైరెక్టరు" గా మార్చటానికి కూడా ప్రభుత్వం ఆదేశించింది.

నెల్లూరు డ్రైనేజి పథకం

నెల్లూరు భూగర్భ మురుగు పారుదల పథకం మొదటి దశ పనిని మూడవ పంచవర్ష ప్రణాళికా కాలంలో అమలు పరచడానికై ప్రభుత్వం ఆదేశించింది. ఈ పని అంచనా వ్యయం రూ. 45.00 లక్షలు. ఈ పథకానికి దిగువ విధంగా పెట్టుబడి సమకూర్చబడుతుంది:

(అ) ప్రజారోగ్య ఇంజనీరింగ్ శాఖ వద్ద నెల్లూరు మునిసిపాలిటీ డిపాజిట్ చేసిన మొత్తం. రూ. 5.00 లక్షలు

(ఆ) వివిధ నిధులకు ఇచ్చిన పెట్టుబడి మొత్తాలలో నుంచి ఈ మునిసిపాలిటి రూ. 7 లక్షలు ఇస్తుంది. రూ. 7.00 ,,

(ఇ) మొదటి మూడు సంవత్సరాలవరకు ఏడాదికి రూ.1 లక్ష చొప్పున మునిసిపాలిటి ఇస్తుంది రూ. 3.00 ,,

(ఈ) ప్రభుత్వం హామీతో రూ. 30 00 లక్షల మేరకు మునిసిపాలిటీ ఋణం సేకరిస్తుంది. రూ.30.00 ,,

మొత్తం రూ. 45.00 లక్షలు

రాష్ట్ర కార్మిక సలహా బోర్డు

రాష్ట్ర కార్మిక సలహా బోర్డులో పనివారల ప్రతినిధి అయిన కార్మిక నాయకుడు కీ.శే శ్రీ కె. సోమయాజులు స్థానే ప్రదేశ్ హింద్ మజ్దూర్ సభ ప్రధానకార్యదర్శి శ్రీ యం. గోవిందాచారిని బోర్డు సభ్యునిగా ప్రభుత్వం నామినేటు చేసింది. యజమానుల ప్రతినిధులలో ఒకరైన శ్రీ సి యస్. త్యాబ్జి స్థానంలో ఆంధ్ర ప్రదేశ్ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య అధ్యక్షుడు శ్రీరామారావు మాచర్లను కూడాబోర్డు సభ్యునిగా ప్రభుత్వం నామినేటు చేసింది.

ప్రభుత్వ న్యాయవాదులకు ఫీజు చెల్లింపు

ప్రభుత్వం మరియు మునిసిపల్ లేదా పట్టణకమిటీ ఉభయ పార్టీలుగావుండి, ఇరుపక్షాల వాదనలు ఒకే రకంగా వున్న వ్యాజ్యాలకు పనిచేసే ప్రభుత్వ న్యాయవాదులకు ఫీజుచెల్లింపుకుసంబంధించి తెలంగాణా ప్రాంతంలో నిర్దిష్టమైన నిబంధనలేవీ అమల్లో లేవు. కాబట్టి 1956 వ సం. పు ఆంధ్రప్రదేశ్ (తెలంగాణా ప్రాంతం) జిల్లా మునిసిపాలిటీల చట్టాన్ననుసరించి నియమావళిని రూపొందించే వరకూ ప్రస్తుతం ఆంధ్రప్రాంతంలో అమలులో ఉన్న నియమావళినే తెలంగాణా ప్రాంతానికి కూడా వర్తింపజేయడానికి ప్రభుత్వం ఆదేశించింది.ఈవర్తింపు తక్షణమే అమల్లోకివస్తుంది

సంక్షేమాధికారి విద్యార్హతలు

1948 వ సం పు ఫ్యాక్టరీల చట్టనిబంధనల క్రింద ఫ్యాక్టరీ యజమానులచే సంక్షేమాధికారిగా నియమించబడే వ్యక్తికి అవసరమైన విద్యార్హతలుగా 1960 వ సం. పు ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీల నియమావళి 76—ఎ—నిబంధనలోని ఉప సూత్రం (2) (1) లో ఉదహరించిన వాటితో పాటు, మద్రాసు విశ్వవిద్యాలయం సోషల్ సర్వీసు డిప్లొమానుగూడా తగినఅర్హతగా ప్రభుత్వం గుర్తించింది.



గ్రంథసమీక్ష

కళాసౌధము

రచయిత : విద్వాన్ తలమర్ల కళానిధి:

వెల : రూపాయి

62 పేజీలు

ఇది యాభైకి పైగా శీర్షికలున్న ఖండకావ్యం. తొలిపూజ, పల్లెపూలు, సుధానిధి అనే మూడు భాగాలుగా యీ కావ్యం విభజింపబడింది.

తెనుగులో పద్యకవిత్వానికి సంబంధించినంత వరకు కవి యొక్క శైలి ఎలావుందో చెప్పాలంటే ఆయన చంపక మాలాది నాలుగు ముఖ్య వృత్తాలను ఎలా నడుపుతాడో చూడకుండా చెప్పడం కష్టం. యీ ఖండికలలో వృత్తాలు లేవు. ఇది గీతాలు, ఆటవెలదులు ప్రధానంగా గల ప్రేమ కవిత్వపు తరహాకు చెందిన కావ్యం. ఒకటి రెండు చోట్ల ముత్యాలు రసం, సీసం, మంజరీత్యాది ఛందస్సులు సకత్తుగా వాడ బడినవి. శైలి చాలా చోట్ల పల్చగా, పేలవంగా వుంది. భావం చాలా చోట్ల బలంగా లేదు ప్రబంధ యుగాంతంలో చవిలేని కావ్యాలు పుట్టినట్లు, యీ ఖండ కావ్యం ప్రేమ కవిత్వపు క్షీణ దశను సూచిస్తున్నదేమో ననే అనుమానం కల్గుతున్నది.

మస్తాన్‌వలీ, కార్మిక సఖుడు, సద్గురుమూర్తి, గోమాత ఋతుశోభ మొదలైన కొద్ది ఖండికలలో తప్ప, మిలిగిన అన్నింటిలో విరహజన్యమైన ప్రేమ కవిత్వమే కనిపిస్తుంది. 'గర్భిణీరాగి పొలములు' వంటి దుష్ట సమాసాలు 'నీదుయుపనూహ నమ్ము' వంటి అనవసరపు విసంధులు చాలా చోట్ల కనిపిస్తాయి. యింక యతిదోషాలకు లెక్కేలేదు. ఇవన్నీ కవిగారు తెలిసే చేశారో, తెలియక చేశారో మనకు తెలియదు.

కవిగారికి పల్లె జీవితం మీద ఎక్కువమక్కువ: రాగి పొలాలు, కాపుకన్నెలు, పశువులు మేపే గొల్ల పిల్లవాళ్లు, కంది చేలు, శెనగచేలు మొదలగు వాటిని తన కవితా వస్తువులుగా చేసుకుని కవి తన్మయుడవుతాడు. అలాగే,

"మటమటమండెడు యెండలో
జొటజొట చెమచోడ్చె దేర చోద్యము(గాగన్
పటపట రాళ్లను గొట్టుచు
కటకట! కష్టింతువయ్య కార్మికసఖుడా!"

అని కార్మికుని దీనావస్థనుచూసి కన్నీ రొలికించుతాడు.

ఈ కావ్యం శ్రీ నీలం సంజీవరెడ్డిగారికి అంకితం. ఈ కావ్య కన్యాదానానికి సుప్రసిద్ధ పండితులు శ్రీ జమ్మలమడక మాధవరామ శర్మగారు" పౌరోహిత్యం" వహించారు. మైసూరు విశ్వవిద్యాలయ తెలుగుభాషా శాఖాధ్యక్షులు శ్రీ కె. సుబ్బరామప్పగారు 'మున్నుడి' పలకుతూ "భావానుగుణమైన భాష కూడ యీతని కవిత్వంలో కని పిస్తుంది తగు ప్రోత్సాహమిచ్చిన పైకి రాగలడు" అన్నారు. అవసరమైన ప్రోత్సాహం యీ కవిగారికి లభిస్తుందని ఆశిద్దాం.

మణిమనోహరులు

రచయిత : విద్వాన్‌తలమర్ల కళానిధి.

ఈ కథానికను ఒక చిన్న పుస్తక రూపంలో పెనుగొండ తాలూకా తలమర్లలోని సారస్వత సమితివారు ప్రకటించారు. ఇదొక వర్ణాంతర వివాహగాధ. మణి హరిజన యువతి. సుంకని కూతురు. బి ఎ చదువుకుంది. మనోహరుడు రెడ్డి బిడ్డ. ఇద్దరూ కళాశాల జీవితంలో కలిశారు. తండ్రి ఎంత వద్దన్నా వినక మనోహరుడు సంఘ సేవాభిలాషతో మణిని పెండ్లి చేసుకుంటాడు. అనంతపురంలో పెద్దపెద్ద నాయకుల ఆధ్వర్యాన యీ వివాహం జరుగుతుంది. కులభేదాలు, మతభేదాలు పాటించడం అనాగరికమనీ, దేశానికి ద్రోహం చేయడమేననీ రచయిత నిరూపించాడు. గాంధీమహాత్మకు జై అనే నినాదంతో కథ

ముగుస్తుంది. శైలి గ్రాంధిక వేషంతో చాలా కృతకంగా వుంది. కథావస్తువు ఎంత ఆధునికంగా వుందో, కథన పద్ధతి అంత పాతదిగా వుంది.

"కులపతి"

పెండ్లి పరీక్ష

రచన : తురగా కృష్ణమోహన్‌రావు.
141 పేజీలు
వెల : రూపాయిన్నర.
ప్రతులు దొరుకు చోటు : ప్రత్యూష ప్రచురణలు
A—11—270, చిక్కడపల్లి, హైదరాబాదు.

రేడియోలో ప్రసారమైన శ్రవ్యనాటికలూ (ఒక్కటి తప్ప) పత్రికల్లో ప్రచురింపబడ్డ వ్యాసాలూ ఒకచోట చేర్చి "పెళ్లి పరీక్ష" అనే పుస్తకంగా ప్రచురించారు "ప్రత్యూష ప్రచురణలవారు.

తెలుగులో కథానికా రచనలో జరిగినంత కృషి వ్యాస రచన చెయ్యడంలో జరగలేదు. ముఖ్యంగా తెలుగులో "లైటర్ వీన్"లో వ్యాసాలు చాల తక్కువ. కృష్ణమోహన్ వ్యాసాలు చక్కని కాలక్షేపం ఇతని వ్యాసాల్లో "హ్యూమర్" ఉంది. ఒకప్పుడది బాగుంటుంది కూడాను. అది కేవలం మాట విరుపుతో ఆగిపోయి ఊరుకుంటుంది. ఇంతకన్న సంఘటనలతో "హ్యూమర్" పుట్టించగలగటం ఉత్తమం.

"ద్రాక్షారా మోదంతం" సన్మానాలమీద ప్రచారపు మోజు మీద చక్కని సెటైర్. ఓడిపోయిన పందెం చాలా suggestive గా ఉంది. అత్యాశకు పోవడం అనేది మన నాగరికతలో ఎట్లా ఇమిడి పోయిందో దాంట్లోంచి బయట పడటం ఎంత అవసరమో నారాయణరావు పాత్ర ద్వారా సూచిస్తాడు రచయిత యీ శ్రవ్య నాటికలో

"పెండ్లి పరీక్ష" లోని నాటికల్లో సంభాషణలు కవ్వించి నవ్విస్తాయి. కొన్ని పాత్రలు మన చుట్టూరా తిరిగే వాళ్లని గూర్చి కావటంవల్ల మననిచూసి మనం నవ్వుకో గలుగుతాము ముఖ చిత్రం ముచ్చటగా వుంది. "జి"

ఉపనిషత్సముచ్చయము

(ప్రథమ భాగము)

గ్రంథకర్త: పంతుల లక్ష్మీనారాయణ శాస్త్రి
డెమ్మీ ఆక్టెవో 165 పుటలు
మూల్యం: నాల్గు రూపాయలు.
ప్రతులకు : గ్రంధకర్త పేర, ఆంధ్రభాషా ప్రధానాధ్యాపకుడు, ప్రభుత్వమహారాజావారి సంస్కృత కళాశాల, పత్తిపాటివారి వీధి విజయనగరం అని వ్రాయవలెను.

ఈ గ్రంథములో ఈశావాస్య, నిరాలంబ, పైంగల, అధ్యాత్మోపనిషత్తులకు ఆంధ్రానువాదములు కవులు. అంతేగాక అనువాదకులు మూలమునిచ్చిచక్కని వ్యాఖ్యానమును వ్రాసినారు. ఈ వ్యాఖ్యానమునకు 'ప్రభ' యని పేరిడినారు. కవనము వ్రాయుట వేరు ఉపనిషదర్థములను అందరికి తెలియునట్లు వ్రాయుట వేరు. వీరు సులభమగు శైలిలో పద్యములలో మూలోపనిషత్తులందలి భావములు వెలువరించుటయే కాకతాత్పర్యమును గూడ రచించినారు. మచ్చునకు ఈ అనువాదమును గమనింపుడు:—

శ్లో॥ లోకానువర్తనం త్యక్త్వా, త్యక్త్వాదేహానువర్తనమ్
శాస్త్రానువర్తనంత్యక్త్వా. స్వాధ్యాసాపనయంకురు
(అధ్యాత్మోపనిషత్తు)

ఆంధ్రానువాదము:—

కం॥ విడువుము జగదనువర్తన
ముడుగుము దేహానువర్తనోద్యోగంబున్
తడవకు శాస్త్రానుగమము
నడుపుముదేహోదులాత్మయనెడి తలంపున్.

అనువాదమీ విధముగ సుబోధకముగ నుండును మూలములోని భావమును పద్యముననిమిడ్చుట కష్టమనిపించిన తావుల సులభమగు వచనములో తాత్పర్యమును వ్రాసినారు గ్రంధకర్తలు శ్రీ రమణమహర్షి శిష్యులు. ఈ ఉపనిషత్తులు వేరువేరుగా అచ్చుపడిన పిదప వాటిని ఒక పుస్తకముగా బైండు చేసినారు. దీనివలన పుట సంఖ్యలు క్రమముగా లేవు. ప్రతి ఉపనిషత్తు మధ్యన ఉన్న అవతారికలను అనుబంధముగా చేర్చిన బాగుండెడిది. శ్రీపంతుల లక్ష్మీనారాయణశాస్త్రీగారా నందవర్ధనుని ధ్వన్యాలోకమునకు ఆంధ్రాను వాదము వెలయించిన విద్వత్కవులు. వారచిరకాలములోనే దీని రెండవ భాగమును రచించి ముముక్షువుల మన్ననలనందుదురుగాక. —"పి"

శేఖరం కథలు

రచన: శ్రీ పోతుకూచి సాంబశివరావు
వెల: ఒకరూపాయి యాభైనయాపైసలు

పుటలు: నూరు
ప్రకాశకులు: చందా నారాయణశ్రేష్ఠి
(విద్యావిషయక ప్రకాశకులు)
సికింద్రాబాదు_హైద్రాబాదు_వరంగల్

ఈ పుస్తకం పేరునుబట్టి ఇది 'శేఖరం'ను గురించినకథల సంపుటి అని అనుకోడానికి ఎంత అవకాశం వుందో, 'శేఖరం' వ్రాసిన కథల సంకలనం అని భావించడానికి కూడా అంతే ఆస్కారంవుంది. ఎందుచేతనంటే, 'భట్టివిక్రమార్క కథలు', 'బుచ్చిబాబుకథలు', 'కాటమరాజుకథలు', 'కరుణా కుమార కథలు మొదలైన మన పుస్తకాలు ఈ రెండు వాదనలనూ బలపరిచేవిగా వున్నాయి. అయినా ఈపుస్తక రచయిత పేరును మొదటే తెలుసుకున్నాము కాబట్టిఇది పైవాటిలో మొదటి వర్గంలోనే చేరిపోతుందనే విషయం తేలిపోయింది.


'శేఖరం'_ రచయిత శ్రీ పోతుకూచి సాంబశివరావు సృష్టించిన సర్వగుణసంపన్నమైననాయకపాత్ర. శేఖరం సర్వజ్ఞుడు. ఆధునిక నాయక లక్షణాలన్నీ అతనిలో మూర్తీభవించి వున్నాయి.

మహాప్రస్థానంగా సాగిపోయే 'శేఖరం' జీవితఘటనలను మనకు కథలుగా అందివ్వదలిచారు శ్రీ సాంబశివరావు. తత్సంకల్ప సాధనలో ఈ పుస్తక ప్రకటన అయన తొలి యత్నం.

నటీరావు, కాంతం పాత్రల వలనే ఈ పాత్రనుకూడా తీర్చిదిద్దదలచినట్టు రచయిత ప్రయత్నం ద్యోతకమవుతుంది

ఈ పుస్తకంలో శేఖరాన్ని గురించిన కథలు, గాథలు_ చౌకులో, సంఘర్షణ, సాలిగూళ్లు, ఆహ్వానం, అంతర్భావాలు, కాలయంత్రంలో సాయంత్రం, రేపుమీదఆశ, ఆశలేనిరేపు, వీడ్కోలు అనే తొమ్మిది శీర్షికలక్రింద పొందుపరచబడినాయి. అయితే ఈ కథలేవీ కూడా శేఖరం పాత్రను సమగ్రంగా, పరిపూర్ణంగా చిత్రించవు. ఇవన్నీ అతని ప్రేమోదంతాలు, ప్రణయగాథలుగానే వున్నాయి కాగా విఫల మనోరథుడు, భగ్నప్రేమికుడుగానే మనకు శేఖరం ప్రతి కథలోనూ కనిపిస్తాడు. కాబట్టి ఈ అంశాన్ని వెల్లడించడం వరకే ఈ పుస్తకం లక్ష్యం పరిమితమైనట్టు భావించవచ్చు. "నీలి గగనంలో తేలే తెల్లదూది మేఘాన్నీ, చీకట్లో మెరిసే తారకనూ, ఆకులు ఆలాపించే గాలిపాటను ప్రేమించాడు శేఖరం. వాటిచుట్టూ తిరిగాడు. కాని అవి అందలేదు. అయినాఅపూర్వమైన అనుభూతులు మిగిలాయి. వాటన్నింటిని మించిప్రేమించిన ఆమెనుంచికూడా అదే ఫలితం అని శేఖరంవ్యథ. తెల్లదూది మేఘం గగనం వొంపులో ఒరిగిపోయింది. వేకువజాము వెలుగుల్లో తార అదృశ్యమైంది. సంధ్యాకాలంలో ఆకులమధ్య అణిగిపోయింది గాలిపాట. జీవితంలోని తొలిమలుపులో ఆమె తననుంచి దూరమైపోయింది అని శేఖరం వేదన," అంటూ శేఖరాన్ని గూర్చి రచయిత చెప్పిన పరిచయ వాక్యాలు ఈ విషయాన్ని ధృవపరుస్తున్నాయి.

ఈ సంపుటాన్ని గూర్చి చెప్పాల్సిన విశేషాంశమేమిటంటే ఇందులోని కథలన్నింటిదీ ఒకేరకమైన ఇతివృత్తమైనప్పటికీ ఏకథా పఠితులకు విసుగుపుట్టించదు. కాగా ఆసక్తితో ఆసాంతంవరకు చదివింపజేసే ఆకర్షణ వీటిలోవుంది. అయితే అక్కడక్కడా శైలి ఇబ్బంది కలిగిస్తుంటుంది. ఆకర్షణీయమైన ముఖచిత్రంతో సచిత్రంగా ఈ పుస్తకాన్ని వెలువరించినందుకు ప్రకాశకులు ప్రత్యేకంగా అభినందనీయులు. _జ.రా.



ప్రగతికి మూలం

డాక్టర్ యస్. గోవిందరాజులు

గడచిన అర్ధదశాబ్దిలో ఆంధ్రప్రదేశ్ విద్యా రంగంలో సాధించిన అభివృద్ధి ప్రశంసార్హమైనది. ఈ కాలంలో వివిధ విద్యాసంస్థల స్థాపనలో, విద్యార్థులసంఖ్యలో గమనింపదగినంతగా పెరుగుదల ఏర్పడింది. విద్యార్థులు, విద్యాసంస్థల పరిమాణంలోనే కాకుండా ప్రమాణంలో కూడా అభివృద్ధిని సాధిస్తున్నందుకూ, సత్సంప్రదాయాలను పరిపోషిస్తున్నందుకు ప్రభుత్వాన్ని అభినందించవలసి ఉన్నది. మన విద్యారంగం పరిస్థితి ఈ విధంగా సంతృప్తికరంగా వుండటానికి శ్రీ ఎస్. బి. పి. పట్టాభిరామారావుగారు ప్రధాన కారకులని చెప్పవచ్చును విద్యారంగానికి నిర్దేశించవలసిన అనుల్లంఘనీయమైన అవధుల విషయంలో శ్రీ పట్టాభిరామారావుగారికి విస్పష్టమైన అభిప్రాయాలున్నాయి. రెండు విశ్వవిద్యాలయాలసిండికేటు సభ్యులుగాగడించిన దీర్ఘకాల అనుభవం వీరికి ఈ దక్షతను కలుగజేసింది. పోతే ఈ విషయంలో విద్యాశాఖచేస్తున్న కృషికూడా ప్రశంసనీయమైనదే.

తృతీయ ప్రణాళికలో విద్యావిస్తరణ పథకాలకు కేటాయించిన మొత్తం స్వల్పం, ఇంతకంటే ఎక్కువ మొత్తాన్ని ప్రత్యేకించటానికి బహుశా సాధ్యపడలేదేమో. మనం దారిద్ర్యంనుంచి విముక్తులం కావాలంటే దాన్ని విద్యావ్యాప్తి ద్వారానే సాధించకలుగుతాము. భావితరంవారైన మన బాలబాలికలకు ఉన్నతాదర్శాలను కలుగజేయాలంటే, వారిని సద్వర్తనులుగా రూపొందించాలంటే సక్రమమైన విద్యావిధానాన్ని అవలంబించవలసిఉన్నది. ఈ దృష్ట్యా మూడవ ప్రణాళికలో విద్యాభివృద్ధి కార్యక్రమాలకు ఇప్పుడు చేసిన కేటాయింపు చాలదనీ, ఇంకా ఎక్కువ మొత్తం కేటాయించవలసిన అవసరం వున్నదని అనిపించటం సహేతుకమే.

దేశంలోని అన్యప్రాంతాల పాఠశాలలూ, కళాశాలల కంటే మన రాష్ట్రంలోని ఈ విద్యాసంస్థలు స్థాయిలో ఏ విధంగాను తక్కువవికావనే సంతృప్తి మనకున్నప్పటికీ వాటి ప్రమాణాన్ని హితోధికంగా పెంపొందించటానికి తీవ్రంగా ప్రయత్నించవలసిన అవసరంకూడా వుంది. ఈ పని మనం చేయనట్లయితే మనవిద్యాసంస్థలు ఆ అంతస్థునుంచి దిగజారడం తథ్యం మనం స్థాయిని పెంపొందించనట్లయితే విద్యాభివృద్ధి పథకాలకై ఇప్పుడు మనం చేస్తున్న ఈ స్వల్పవ్యయంకూడా నిరర్థకమవుతుంది.

ప్రతిప్రాణీ ఆహారాన్ని సంపాదించుకొనకొనకలిగే స్థితిలోనూ, బలాధిక్యత, ప్రతిభాసామర్థ్యాలద్వారా విపత్తులను అధిగమించకలిగే స్థితిలోను వుండాలి. ఇది ప్రాథమిక అవసరం. ఇతర జీవరాశులవలెనే మనుష్యులుకూడా తమ మనుగడకై కొన్ని సహజ లక్షణాలను అలవర్చుకున్నారు. అయితే ఈ విషయాలను తెలుసుకోవటానికి జంతుకోటిలో పిల్లలకు వాటి తల్లో, నేస్తమో సాయపడవల్సివుంటుంది. కాగా మానవుని విషయంలో ఈ శిక్షణా వశ్యకత మరీఎక్కువ. మానవ నాగరికత ఎంత క్లిష్టంగా పరిణమిస్తుందో, మానవవిజ్ఞానం ఎంత అభివృద్ధిచెందుతుందో అంత జటిలంగా ఈ శిక్షణ పరిణమిస్తుంది. కాబట్టి నేటి బాలబాలికలకు, వారు జీవనాధారం సరిగా పొందకలిగే విధంగానూ, వారిలో ఆత్మవిశ్వాసం బలపడే విధంగాను విద్యగరపాలి. ఈ లక్ష్యాల కనుగుణంగా విద్యావిధానాన్ని రూపొందించాలి.

జంతుజాలం మందలుగానో, గుంపులు గుంపులుగానో జీవిస్తాయి. అవి ఆవిధంగా జీవించాలనే విషయంతో పాటు మరో సంగతినికూడా గ్రహించవలసి వుంటుంది. పూర్తి మందపట్లా అలాగే మందలోని ప్రతి సహవాసి పట్లా ఎలా నడుచుకోవాలో వాటికి స్వభావసిద్ధంగానే అబ్బుతుంది. అయితేకొన్ని సందర్భాలలో ఈవిషయాన్ని అనుభవంమీద గ్రహించటంకూడా కద్దు.ఈమర్యాద పాటింపునే మనుష్యుల విషయంలో అయితే సంఘంయెడల గౌరవం ప్రదర్శించడమనీ, సాటివారువి హక్కులపట్ల గౌరవం చూపటమని అంటాము.

ధర్మచింతన చేయటం మానవ స్వభావం. ఈ నైజమే

ఆతన్ని జంతుజాలంనుంచి వేరుపరుస్తున్నది. కాబట్టి బాలబాలికలు ధార్మిక లక్షణాలను అలవర్చుకొని వాటి ఆధారంగా సాటి పౌరునితో వుంచుకొనవలసిన సంబంధాన్ని గుర్తించేందుకై విద్య సాధనంగా రూపొందాలి. ఈ విషయంలో దేశం మొత్తంకూడా అయోమయా వస్థలోనే వుందనవచ్చు. కాబట్టి ఇతర వర్గాలతోపాటు విద్యార్థులు కూడా అయోమయ స్థితిలోనే వున్నారు.

జాతీయ సమైక్యతను సాధించడానికీ, నైతిక విలువలను కాపాడటానికి విద్యా సంస్థల ద్వారా గట్టిగా కృషి జరగాలని ప్రధాన మంత్రి పండిట్ నెహ్రూ చేసిన విజ్ఞప్తిపట్ల తప్పుడు పంథాల నవలంబించే వారు ఏమైనా ఆసక్తి చూపితే అందుకు నిజంగా ఆశ్చర్యపడవలసి వుంటుంది. ఈ ప్రవృత్తిగల వ్యక్తులు తమ పంథాలను మార్చుకోనట్ల యితే సాంఘిక ధర్మాల మీద భక్తి విశ్వాసాలుగల విద్యార్థులను పాఠశాలలు సృష్టింపజాలవు. కనుక జాతీయ సమైక్యతా సాధనను త్రికరణ శుద్ధిగా వాంఛిస్తున్నట్లయితే ధర్మబద్ధంగాను, విజాయతీ గాను ప్రవర్తించటానికిప్రతిఒక్కరూ పూనుకోవాలి. సహృదయత, సద్భావాలను అలవర్చుకొననిదే సమైక్యతను సాధించలేము. ప్రజల్లో కొంతలో కొంతవరకైనా ఈ భావాలు అలవడినప్పుడే వాటి వికా సానికి విద్యాసంస్థలు దోహదం చేయ కలుగుతాయి. అప్పుడే స్వార్థపరులు తమ స్వప్రయోజనాలకై విద్యార్థులను ఉపయోగించు కోవటం అంతమొందుతుంది. అప్పుడే జాతీయతా భావానికి, వసుధైక కుటుంబానికి మార్గం సుగమం కాగలుగుతుంది.

పోతే మరో విషయమేమిటంటే మానవుడు బుద్ధి వికా సానికై నిరంతరం విజ్ఞాన సముపార్జన చేస్తూ వుంటాడు. అతడు బుద్ధిజీవి కనుక స్వకీయమైన తత్వజ్ఞానాన్ని పొందగోరుతాడు. కాబట్టి విద్యావ్యాసంగం కేవలం జ్ఞాన సముపార్జనకే కాకుండా ఈ తత్వ విచారణకు కూడా దోహదం చేసేదిగా వుండాలి.

(ఇంగ్లీషు మూలానికి అనువాదం)

1962 జనవరికి

"ఆంధ్ర ప్రదేశ్" ప్రత్యేక సంచిక

1962 జనవరి ఆంధ్ర ప్రదేశ్ సంచిక సంక్రాంతి ప్రత్యేక సంచికగానే కాక, జనవరిలో ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య ఎకాడమీ వారు చేస్తున్న ఇద్దరు సాహిత్య ప్రముఖులు శ్రీ పరవస్తు చిన్నయసూరి శ్రీ గురజాడ అప్పారావుగార్ల వర్ధంతి జమంత్యుత్సవాలను పురస్కరించుకొని సైతం వారిని గురించిన రచనలతో ప్రత్యేక సంచికగా వెలువడుతుంది. చిన్నయసూరి అప్పారావుగార్ల సాహిత్య ప్రశంసలకు జీవితాలకు సంబంధించిన సృజనాత్మకాలైన పద్య గద్యాదిరచనలను ఆంధ్ర ప్రదేశ్ ఆహ్వానిస్తున్నది. ఈ సంచికకు సంబంధించిన ప్రత్యేక రచనలమీద "జనవరి" సంచికకు అని వ్రాసి పంపాలి. ఈ సంబంధమైన రచనలు డిసెంబర్ 10వ తేదీ లోపల యీ క్రింది చిరునామాకు చేరాలి.

ఎడిటర్

ఆంధ్ర ప్రదేశ్ (తెలుగు)

సమాచార పౌర సంబంధముల శాఖా కార్యాలయం, హైదరాబాదు.

ముఖ్యవార్తలు

రాష్ట్రంలో

21-9-1961

జాతీయం చేసిన పాఠ్యపుస్తకాల పంపిణీ సక్రమంగా జరిగేందుకు వీలుగా ఈ సంవత్సరం వీటి విక్రయ బాధ్యత స్థానిక సంస్థలకు అప్పగించబడినట్లు విద్యాశాఖ ప్రకటించింది.

22-9-1961

లఘు పరిశ్రమల అభివృద్ధి సంస్థకు రాష్ట్ర ముఖ్యమంత్రి హైద్రాబాదులో ప్రారంభోత్సవం చేశారు.

24-9-1961

బెంగుళూరులో జరిగిన దక్షిణ ప్రాంతీయ మండల సమావేశంలో కొలార్ జిల్లా ఉరుకావురిపల్లి గ్రామానికి చెందిన 7½ ఎకరాల భూఖండాన్ని ఆంధ్ర ప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాకు బదిలీ చేయటానికి మైసూరు ప్రభుత్వం అంగీకరించింది. దీనికి మారుగా ఇంతే విస్తీర్ణంగల భూభాగాన్ని ఆంధ్ర ప్రదేశ్ నుంచి మైసూరు రాష్ట్రానికి మార్చటం జరుతుంది.

26-9-1961

అనంతపురం జిల్లాలో క్షామ నివారణ చర్యలు గైకొనే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటుగా రూ. 10 లక్షల మంజూరు చేసింది. అత్యవసరంగా గైకొనవల్సిన సహాయక చర్యలకై ఈ మొత్తాన్ని వినియోగిస్తారు.

1-10-1961

తెలంగాణా మిగులు నిధుల నుంచి త్వరలో ఉస్మానియా విశ్వవిద్యాలయంకు రూ. 3 కోట్ల గ్రాంటు లభించగలదని నేడు ముఖ్యమంత్రి వెల్లడించారు

2-10-1961

రాష్ట్రంలో నేటి నుంచి 26 పూర్వ విస్తరణ బ్లాకులను కొత్తగా ప్రారంభించారు.

3-10-1961

గుల్హాతీ కమిషన్ మైసూరు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, మద్రాసు, గుజరాతు, ఒరిస్సారాష్ట్ర ప్రతినిధుల మధ్య ఈ వేళ కొత్త ఢిల్లీలో చర్చలు ప్రారంభమయ్యాయి. కృష్ణా గోదావరినదీ జలాలకు సంబంధించి ఈ కమిషను సేకరించన భోగట్టాపై ఈ చర్చలు జరుగుతున్నాయి.

6-10-1961

ఆంధ్ర ప్రదేశ్‌లో దుక్క ఇనుము కర్మాగారాన్ని నెలకొల్పే అవకాశం వుందని యూనియన్ ఇనుము, ఉక్కు శాఖా మంత్రి సర్దార్ స్వర్ణసింగ్ మద్రాసులో వెల్లడించారు. సింగరేణి గనుల్లో లభించే బొగ్గునూ, ఆ పరిసర ప్రాంతాల్లో లభించే ముడి ఇనుమును వినియోగపరిచే పద్ధతిపై దీనిని నెలకొల్పడం జరగవచ్చని కూడా ఆయన తెలిపారు.

8-10-1961

యూనియన్ రైల్వేల మంత్రి శ్రీ జగ్జీవన్‌రామ్ భీమవరం—గుడివాడ బ్రాడ్‌గేజ్‌లైనుకు ప్రారంభోత్సవం చేశారు.

ప్రణాళికా సమాచార శాఖల మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి చిత్తూరులో జిల్లా సమాచార కేంద్రాన్ని ప్రారంచారు.

9-10-1961

కేంద్ర రైల్వేల మంత్రి శ్రీ జగ్జీవన్‌రామ్ హైద్రాబాదులో పత్రికా ప్రతినిధులతో ముచ్చటిస్తూ, ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేంగా ఒక రైల్వే మండలాన్ని ఏర్పాటు చేయాలనే సూచనను తిరస్కరించారు.

14-10-1961

అనంతపురం జిల్లాలో క్షామ నివారణ చర్యల నిమిత్తమై రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ. 10 లక్షలు మంజూరు చేసింది.

ప్రభుత్వోద్యోగుల మూల వేతనంతో కరువు భత్యంలో అధిక భాగాన్ని కలుపుతూ నేడు ప్రభుత్వం ప్రకటన చేసింది.

ఎయిడెడ్ పాఠశాలల ఉద్యోగులకు అలాగే స్థానిక సంస్థలలో పనిచేసే పూర్తి సమయం ఉద్యోగులకు కూడా ఈ విలీనీకరణ వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది.

15-10- 961

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పురిటిపాపను కుక్క ఎత్తుకోపోయిన ఉదంతాన్ని గూర్చి దర్యాప్తు జరిపే నిమిత్తం వైద్య శాఖ తాత్కాలిక డైరెక్టరు ఆ ఆసుపత్రిని సందర్శించారు

17-10-1961

ఆంధ్ర చేనేత పారిశ్రామికుల సహకార సంఘం వ్యవహారాలపై విచారణ జరిపే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఏక సభ్య కమిషన్ను నియమించింది.

భారతదేశంలో

23-9-1961

కాంగోలో మిత్రరాజ్య సమితికి అవసరమైన వైమానిక శక్తిని పరిశీలించే నిమిత్తం ఎయిర్ వైస్ మార్షల్ పింటో నాయకత్వాన త్రిసభ్య బృందాన్ని భారత ప్రభుత్వం కాంగోకు పంపింది.

25-9-1961

జాతీయ గృహనిర్మాణ సంస్థ అధ్వర్యాన గృహనిర్మాణ సహకార సంఘాలపై మూడు రోజుల పాటు జరిగిన గోష్ఠికి కొత్త ఢిల్లీలో నేడు ప్రారంభోత్సవం జరిగింది.

27-9-1961

పంచదార ధరలపైనా పంపిణీ పైన నేటి నుండి కంట్రోలు రద్దు చేసినట్టు, కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖల మంత్రి వెల్లడించారు.

28-9-1961

ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూ పత్రికా ప్రతినిధుల సమావేశంలో డ్యూరండ్ రేఖపై వెలిబుచ్చిన లభిప్రాయాలకు పాకిస్తాన్ పంపిన నిరసన పత్రాన్ని భారత ప్రభుత్వం త్రోసివేసింది.

30-9-1961

విస్తృత ప్రాతిపదికపై 37 గురు సభ్యులతో సమైక్యతా మండలిని స్థాపించే ప్రతిపాదనను జాతీయ సమైక్యతా సమావేశం అమోదించింది. ఈ మండలి జాతీయ సమైక్యతకు సంబంధించిన విషయాలను మధ్యమధ్య సమీక్షించి తగు సిఫార్సులు చేస్తుంది.

1-10-1961

అకాలీ కాయకుడు మాస్టర్ తారాసింగ్ 48 రోజులుగా కొనసాగిస్తున్న నిరాహార దీక్షను విరమించారు.

ఢిల్లీలో నాల్గు రోజులపాటు సమావేశాలు జరిపిన జాతీయ సమైక్యతా మహసభవారు విద్యావ్యాప్తిద్వారానూ, రాజకీయ పక్షాలకు వర్తించే ప్రవర్తన నిబంధనావళి ద్వారాను జాతీయ సమైక్యతను సాధించాలని నొక్కి చెప్పారు.

5-10-1961

మధురైలో రెండు రోజులపాటు జరిగిన అఖిల భారత కాంగ్రెసు కమిటీ తుది రోజు సమావేశంలో ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూ ప్రసంగిస్తూ భారత దేశాన్ని యింకా విభాగించడమంటూ జరగదని ఉద్ఘాటించారు.

11-10-1961

రాజస్థాన్ లోని హనుమాన్ ఘర్ వద్ద నిర్మించబడిన రాజస్థాన్ కాల్వకు భారత ఉపరాష్ట్రపతి డాక్టర్ యస్. రాధాకృష్ణన్ ప్రారంభోత్సవం చేసి కాలువలోనికి నీరు వదిలారు.

12-10-1961

గ్రామీణ ప్రాంతాల్లోని వెనుకబడిన వర్గాల స్థితిగతుల పరిశీలనకై గత డిసెంబరులో నియమించ బడిన పరిశీలక సంఘం వారు కొత్త ఢిల్లీలో యీరోజు తమ నివేదికపై సంతకాలు చేశారు. 8 మంది సభ్యులు గల ఈ సంఘానికి శ్రీ జయప్రకాశ్ నారాయణ అధ్యక్షులుగా వ్యవహరించారు.

13-10-1961

భారతదేశంలో రైల్వేల అభివృద్ధికై ప్రపంచ బ్యాంకు 50 మిలియను డాలర్ల (రు. 23.75 కోట్లు) అప్పు మంజూరు చేసినట్లు కొత్తఢిల్లీలో అధికారికంగా ప్రకటించారు.

14-10-1961

భారత దేశంలో మొట్టమొదటగా నిర్మించబడిన విద్యుచ్ఛక్తి రైలు యింజనుకు ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ ప్రారంభోత్సవం చేశారు. ఇది చిత్తరంజన్‌లో తయారైంది.

15-10-1961

బీహారు వరదలమూలంగా నష్టపడిన ప్రదేశాలను ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూ విమానంలోనుంచి పరిశీలించారు.

19-10-1961

గుల్జారీలాల్ కమీషన్, బొంబాయిలో మూడురోజులపాటు సమావేశమై, రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన నివేదికలను పరిశీలించింది. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మైసూరు, ఒరిస్సా రాష్ట్రాలతో యీ విషయంలో వీరు సంప్రదింపులు జరిపారు.

20-10-1961

ఈ రోజు ఉదయం హౌరా–రాంచి ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పి ఘోరమైన ప్రమాదానికి గురిఅయిన కారణంగా 30 మంది ప్రయాణీకులు మరణించారు.

విదేశాల్లో

29-9-1961

విమాన ప్రమాదంలో మరణించిన మిత్రరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి శ్రీ హామర్షెల్డ్ భౌతికకాయానికి ఉప్సాల (స్వీడన్) లో అంత్యక్రియలు జరిగాయి.

7-10-1961

సిరియన్ క్రొత్త ప్రభుత్వాన్ని రష్యా, బల్గేరియా ప్రభుత్వాలు గుర్తించినట్టు-డెమాస్కస్ రేడియో ప్రకటించింది.

10-10-1961

క్రొత్త సిరియన్ ప్రభుత్వాన్ని అమెరికా గుర్తించినట్టు ఒక ప్రకటలలో వెల్లడించారు.

16-10-1961

సెప్టెంబరు 18వ తేదీన విమాన ప్రమాదంలో ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి శ్రీ హేమర్షెల్డ్ మరణించిన పరిస్థితులను పరిశీలించుటకు 5 గురు ముఖ్యవ్యక్తులతో ఒక సంఘాన్ని నియమించాలని భారతదేశం మరో నాల్గు రాజ్యాలు తీర్మానాన్ని ప్రవేశ పెట్టాయి.

13-10-1961

కఠినమైన నిబంధనలతో సంపూర్ణ నిరాయుధీకరణ సమస్య పై ప్రాక్పశ్చిమ రాజ్యాలకు అంగీకారం కుదిరే పక్షంలో రష్యా తన మొత్తం రాకెట్లను, అణ్వస్త్రాలను సముద్రంలో పారవేయుటకు సిద్ధంగా ఉన్నదని రష్యా ప్రధానమంత్రి శ్రీ నికితా కృశ్చేవ్ మాస్కోలో వెల్లడించారు.



త్రిమూర్త్యాత్మక - ఆంధ్ర!

ఇది వైకుంఠము–వేంకటేశ్వరుడు, ల
క్ష్మీశుండు కొల్వుండుటన్;

ఇది కైలాసము–మల్లికార్జునుడు, ఆ
ర్యేశుండు చెల్వొందుటన్;

ఇది బ్రహ్మోర్వి–సరస్వతీ చరణ పం
కేజాత మౌటన్; జగా

హృదయ మ్మాంధ్రము; కేల మోడ్తు, పరమ
శ్రీ మన్మథాష స్థితిన్!

—శ్రీ బోయి భీమన్న

ప్రభుత్వ నిర్ణయాలు

రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల వేతనపు స్కేళ్లను సవరించి కరువు భత్యంలో అధికభాగాన్ని బేసిక్ వేతనంతో కలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రమంతటా పింఛనుదార్లకూ, స్థానికసంస్థలలో పనిచేసే పూర్తి సమయం ఉద్యోగులకూ ఎయిడెడ్ పాఠశాలల ఉద్యోగులకు కరువు భత్యంను హెచ్చించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది ఈ నిర్ణయాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ అయిదవ వార్షికోత్సవం సందర్భంగా 1961 నవంబరు ఒకటవతేదీనుండి అమలులోనికి వస్తాయి. ఇందువల్ల రాష్ట్ర ప్రభుత్వానికి అదనంగా రు. 2.25 కోట్లు ఖర్చుఅవుతుంది. రాష్ట్రరాజధానీ నగరంలోనూ, ఇటీవలి జనాభాలెక్కల ప్రకారం ఒకలక్షకు పైబడిన జనాభాగల 10 నగరాలలోనూ, తెలంగాణాలోని నగర మునిసి పాలిటీలలోనూ, ఆంధ్ర ప్రాంతంలోని మునిసిపల్ పట్టణాలన్నింటిలోను పనిచేస్తున్న ప్రభుత్వోద్యోగులందరకూ సవరించివ రేటు ప్రకారం కంపన్సేటరీ అలవెన్సులు చెల్లిస్తారు.

ప్రస్తుతం ప్రభుత్వ అజమాయిషీ క్రింద ఉన్న రాజమంద్రి కాగితపు మిల్లు గూడూరులోని సెరామిక్ ఫ్యాక్టరీ గ్లాసుగాజు ఫ్యాక్టరీల నిర్వహణను పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్‌కు అప్పగించడానికి రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది.

అనంతపురం జిల్లాలోని క్షామపీడిత ప్రాంతాల బాధితుల సహాయార్థం రాష్ట్రప్రభుత్వం అదనంగా రు. 10.లక్షలను మంజూరుచేసింది. ఇంతవరకు ఈకార్యార్థం మంజూరైన మొత్తం రు. 20 లక్షలు.

పెదవులేమొ నవ్వు వెక్కిరించునొసలు

పొట్టనిండ చేదు పుట్టెడుండు

కొంగజపము రీతి కుటిలుల బ్రతుకురా!

జన నుతాంత రంగ! వినుర! రంగ!

కళాకృష్ణుల "కృష్ణశతశతి"

మన్య విప్లవమహా వీరుడు

అల్లూరి సీతారామరాజు చరిత్ర

(ప్రభుత్వ ప్రచురణ)

(రచయిత: యర్రమిల్లి నరసింహారావు)

వెల: రూ. 2-75 న. పై.

ఆంధ్రప్రదేశ్

ప్రణాళికా వారోత్సవముల
ప్రత్యేకానుబంధం

గత ఐదేళ్లలో

ఆంధ్రప్రదేశ్ బహుముఖాభివృద్ధి

శ్రీ దామోదరం సంజీవయ్య

(ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి)

ఆంధ్రప్రదేశ్ తొలి ఐదు సంవత్సరాలలో అన్ని రంగాలలోను గమనార్హమైన అభివృద్ధిని సాధించింది. ప్రణాళికల ఫలితంగా రాష్ట్రం ఆర్థిక పరిపుష్టిని సంతరించుకుంటూ పురోగమిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ మొదటి పంచవర్ష ప్రణాళిక కథయే ఒక విధంగా రెండవ ప్రణాళిక చరిత్రకూడా, యీ కాలంలో రాష్ట్రం సాధించిన విజయాలను గూర్చి కొంత వివరిస్తాను:

ఆహారోత్పత్తి

దేశంలో పెరుగుతున్న జానాభాకు తగినంతగా ఆహారాన్ని పండించటానికీ, పరిశ్రమలకు కావల్సిన ముడి పదార్థాలను ఉత్పత్తి చేయటానికీ, ఎగుమతిచేసే వ్యవసాయ పదార్థాల ఉత్పత్తిని పెంపొందించడానికి వీలుగా రెండవ ప్రణాళికలో వివిధ పథకాలు చేర్చబడ్డాయి. రైతు వ్యక్తిగతంగా పెద్దవిజయాలు సాధించడానికి మాత్రమే ప్రణాళికాబద్ధమైన వ్యవసాయ పథకాలు ఉద్దేశించబడలేదు. అన్ని ప్రాంతాలలోని రైతుల సాధారణ స్థాయిని అందుకునేట్లు చేయుటమే వీటి లక్ష్యం. ఈ ఉద్దేశ్యంతోనే వివిధ వ్యవసాయ పథకాల అమలుకు మొత్తం రు 484.60 లు కేటాయించడమైనది. రెండవ ప్రణాళిక ఆఖరుకు రాష్ట్రంలో అదనంగా 16 43 లక్షల టన్నుల ఆహారధాన్యాలు ఉత్పత్తిచేయాలని సంకల్పించాము. దీనితో రాష్ట్రంలో మొత్తం 70.64 లక్షల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి జరగగలదు. రెండవ ప్రణాళిక ఆఖరుకు యెరువుల సరఫరాద్వారా 4.42 లక్షల టన్నులు, మొక్కల సంరక్షణ చర్యల ద్వారా 1,55 లక్షల టన్నులు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు ఉదాహరణకు జపాన్ పద్ధతి వరిసాగుద్వారా 3.99 లక్షల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి అదనంగా జరుగుతుందని అంచనా. బియ్యం వాడే ప్రజలకు ఆహారంలో లోపించే పోషక పదార్థాలలోటును చేపలు చాలా వరకు తీర్చకలుగుతాయి. ఆంధ్రప్రదేశ్ సముద్రతీర ప్రాంతాల్లో, యితర నదులు, సరస్సులు మొదలైనవాటిలో చేపలు పుష్కలంగా లభిస్తాయి. చేపల పరిశ్రమ అభివృద్ధికై రెండవ ప్రణాళికలో రు. 70 28 లక్షలు కేటాయించారు. సముద్రతీరం మరియు నదులలో చేపల అభివృద్ధికీ, జాలరుల ఆర్థిక సాంఘిక పరిస్థితుల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం వివిధ చర్యలు తీసుకున్నది రెండవ ప్రణాళిక మొదటి నాల్గు సంవత్సరాలలో 70 యాంత్రిక నావలను కొనటం, తగ్గింపు ధరలకు 30,024 పౌండ్ల వలలను జాలర్లకు లభింపచేయడం, 80 మంది జాలర్లకు నవీన పద్ధతులలో శిక్షణ యివ్వడం, చేపలను విల్వచేయటానికై హైద్రాబాదు, నిజాంసాగర్ లలో శీతల గిడ్డంగులను నిర్మించటం, ఉత్పత్తికేంద్రాల నుండి వినియోగకేంద్రాలకు చేపల రవాణాకై 4 వ్యానులు కొనటం జరిగింది.

మేలు రకం పశువులు, కోళ్ల పెంపకం

పశువులు, కోళ్ల కూడా జాతిపురోభివృద్ధికి ప్రాముఖ్యం వహిస్తున్నవి. పశువుల రోగనివారణ చర్యలు తీసుకున్నప్పుడే వీటి అభివృద్ధికి వీలుకలిగి తద్వారా దేశంలో పశుగణాభివృద్ధికి అవకాశం ఏర్పడుతుంది. పశుపోషణశాఖ వారు వీటి అభివృద్ధికై వివిధచర్యలు తీసుకుంటున్నారు పశువులపోషణ, రోగనివారణ చర్యలు తీసుకోవడం ముఖ్యకర్తవ్యం. రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకుకూడా పశువైద్యసౌకర్యాలు కల్పించటానికీ, మేలురకం పశువుల ఉత్పత్తిని అధికం జేయటానికి ఉద్దేశించిన వివిధ పథకాలను రెండవప్రణాళికలో చేర్చారు. యిందుకై రు. 242 67 లక్షలు కేటాయించారు. రెండవ ప్రణాళికా కాలంలో రాష్ట్రంలో 51 పశువైద్యశాలలనునెలకొల్పడం, 15 సంచారదళాలనుస్థాపించడం, 104 ప్రథమచికిత్సా కేంద్రాలను తెరవటం, 34 కీలక గ్రామ కేంద్రాలు, 7 జిల్లా కోళ్లపెంపకంకేంద్రాలను స్థాపించటం జరుగుతుంది. ఈ

ప్రణాళికాకాలంలో లాము, మహానంది, చింతలదీవి, పలమనేరు లలో ఉన్న ప్రభుత్వ పశుపోషణ క్షేత్రాలు అభివృద్ధి పరచబడినవి.

నీటిపారుదల

వ్యవసాయానికి నీటిపారుదల జీవాధారమైనది. ఆహారోత్పత్తిని అధికం చేయటానికీ, వార్షాభావం వల్ల రైతులకు కల్గే యిబ్బందులను నివారించడానికి, నీటి పారుదల సౌకర్యాలను పెంపొందించటానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. భారతదేశంలోని బహుళార్థ సార్థక భారీ నదీలోయ ప్రాజెక్టులలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఒకటి. దీని నిర్మాణాన్ని 1955_56 వ సంవత్సరంలో పూర్వ హైద్రాబాదు, ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రారంభించాయి. యీప్రాజెక్టు ఆనకట్ట కాల్వల త్రవ్వకానికై రెండవ ప్రణాళికలో రు. 39.10 కోట్లు కేటాయించారు. నిర్ణీత కార్యక్రమం ప్రకారం నిర్మాణపు పనులు చురుకుగా జరుగుతున్నవి. కొన్ని ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి అయ్యి మంచి ఫలితాలు కన్పిస్తున్నవి. తక్కిన ప్రాజెక్టుల నిర్మాణం అభివృద్ధి దశలో ఉన్నది. రెండవ ప్రణాళికా కాలంలో భారీ, మధ్యరకం ప్రాజెక్టుల క్రింద రూ. 5.76 లక్షల యెకరాలకు నీరు సరఫరా కాగలదని అంచనా.

విద్యుచ్ఛక్తి

నాగరిక జీవితంలో విద్యుచ్ఛక్తి అభివృద్ధికి చిహ్నం. పరిశ్రమాభివృద్ధికి మూలాధారం కూడా యిదే. జాతీయ సంపదాభివృద్ధికీ, దేశ జీవన స్థాయి అభివృద్ధికి మధ్య విద్యుచ్ఛక్తి అవినాభావసంబంధం కల్పిస్తుంది. రెండవ ప్రణాళికా కాలంలో మొత్తం రూ. 3285.76 ఖర్చుతో 12 పథకాలు చేపట్టారు. మాచ్‌ఖండ్ జలవిద్యుచ్ఛక్తి పథకం, తుంగభద్ర జలవిద్యుచ్ఛక్తి పథకం, ఎగువ సీలేరు జలవిద్యుచ్ఛక్తి పథకం, తెలంగాణా థర్మల్ పథకాలు మొదలైనవి ముఖ్యమైనవి. రెండవ ప్రణాళిక ఆఖరు వరకు హైడ్రో, థర్మల్ విద్యుచ్ఛక్తి ఉత్పత్తి 98.900 కిలోవాట్ల నుండి 2,28,470 కిలోవాట్లకు పెరుగుతుంది. క్రొత్తగా విద్యుచ్ఛక్తి సౌకర్యం పొందిన గ్రామాల సంఖ్య 700 నుండి3213 కి పెరిగింది. విద్యుచ్ఛక్తివాడకందారుల సంఖ్యకూడా 1,49,000 నుండి 29,1,000 వరకు పెరిగింది. వ్యవసాయా వసరాలకు విద్యుచ్ఛక్తి వినియోగిస్తున్నవారి సంఖ్య 4300 నుండి 15000కు పెరిగింది. పోతే విద్యుచ్ఛక్తి వాడే పెద్ద పరిశ్రమల సంఖ్య 150నుండి 352 కు పెరిగింది. 4674000 నుండి 8646000 మంది ప్రజలకు విద్యుక్తి సౌకర్యం కల్పించబడింది. రెండవ ప్రణాళిక ప్రారంభంలో విద్యుచ్ఛక్తి తలసరి వాడకం 7 యూనిట్లు మాత్రమే. రెండవ ప్రణాళిక ఆఖరుకు యిది 15 యూనిట్లకు పెరిగింది

రహదార్లు

దేశానికి రోడ్లు జీవనాడులవంటివి రహదారుల సౌకర్యం సంతృప్తికరంగా లేకుంటే దేశఆర్థిక పరిస్థితి కుంటు పడుతుంది. అందుకే ఉన్న రోడ్లను బాగుచేసి కొత్తగా రహదారులను నిర్మించెందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ప్రాతిపదికపై కార్యక్రమాలను రూపొందించింది. రోడ్లనిర్మాణానికై అధికతర కేటాయింపులు చేశారు. రోడ్లఅభివృద్ధికి, రహదారి సౌకర్యాల విస్తరణకు రెండవ ప్రణాళికలో రు. 593 లక్షలు కేటాయించారు. యీ కాలంలో 342 మైళ్ల కొత్త రోడ్లు, 730 మైళ్ల తారు రోడ్లు, 5 పెద్దవంతెనల నిర్మాణం పూర్తిచేశారు. రోడ్డు రవాణా అభివృద్ధికై రాష్ట ప్రభుత్వం కూడా తగినంత శ్రద్ధ తీసుకున్నది. ప్రయాణీకులు సౌకర్యానికై రాష్ట్ర ప్రభుత్వం వివిధ చర్యలు తీసుకున్నది. రవాణా కార్యనిర్వహణను శాస్త్రీయపద్ధతిలో నిర్వహించుటకుకూడా పూనుకొన్నది. ఆంధ్రలోని మూడు జిల్లాల్లో రోడ్డు రవాణాను జాతీయం చేయడం రాష్ట్ర కార్యక్రమాలలో ఒక ముఖ్య ఘట్టం

ఆరోగ్యం

జాతి ఆరోగ్య పరిస్థితిని మెరుగు పరుచుట, ప్రతివారికి వైద్య సౌకర్యం అందుబాటులో ఉండునట్లు చేయుట ప్రాథమిక ప్రాముఖ్యత వహిస్తుంది. ప్రతి పౌరుడినీ రోగాలనుండి రక్షించుట, వారి ఆరోగ్యాన్ని సంరక్షించుటకు సహాయపడుటయే ఆరోగ్య రంగంలో ప్రభుత్వం చేయ తలపెట్టిన ప్రధాన కార్యక్రమాలు. వైద్య విద్యావిస్తరణ. తాలూకా, జిల్లా ఆసుపత్రులలో యితోధిక సౌకర్యాలు కల్పించుట, గ్రామీణ ప్రాంతాలలో వైద్య సౌకర్యాలను యినుమడింపజేయుటకు అనేక పథకాలను అమలు చేస్తున్నారు. అంటు వ్యాధుల నిర్మూలనకై అనేక రకాలైన ఉద్యమాలు కొనసాగిస్తున్నారు. వైద్య పథకాల అమలుకై రెండవ ప్రణాళికలో రూ. 544.11 లక్షలు కేటాంయిచారు. వివిధ వైద్య కళాశాలలో సంవత్సర ప్రవేశాల సంఖ్యను 290 నుండి 530 వరకు పెంచారు. ప్రైవేటు యాజమాన్యం క్రింద రెండు వైద్య కళాశాలలను ప్రారంభించడానికై తగు సౌకర్యాలు కల్పించారు. ప్రతిదానిలో 100 మంది విద్యార్థులకు ప్రవేశం లభిస్తుంది. యీ కాలంలో 332 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రారంభించడానికి ప్రతిపాదించారు. ప్రైవేటు, స్థానిక సంస్థల అధీనంలో ఉన్న ఆసుపత్రులతో కల్పుకొని రాష్ట్రంలో మొత్తం 17500 పడకలు గల ఆసుపత్రులు ఉన్నాయి.

రెండవ ప్రణాళిక ఆరోగ్య పథకాల ఉద్దేశ్యం యిది:—

1. స్థానిక మరియు పరిసర ప్రాంతం ప్రజలకు సహాయపడుటకు వీలుగా వైద్య సంస్థల నిర్వహణ.

2. వివిధ శిక్షణ పథకాల ద్వారా సాంకేతిక శిక్షణ యిచ్చుట, శిక్షితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించుట.

3. అతి త్వరగా వ్యాపించే అంటువ్యాధుల నిర్మూలనకు, అజమాయిషీకి తగిన చర్యలు తీసుకొనుట.

4. పరిసర పారిశుద్ధ్యం కోసం ఉద్యమ నిర్వహణ.

5. ప్రజల ఆరోగ్య ప్రమాణాన్ని హెచ్చించేందుకు కుటుంబ నియంత్రణ, ఇతర సహాయ కార్యక్రమాలు.

ఈ జాతీయ లక్ష్యాలను సాధించే ఉద్దేశ్యంతో వివిధ రకాలైన ప్రజారోగ్య కార్యక్రమాలను ప్రారంభించే నిమిత్తం రాష్ట్రీ రెండవ ప్రణాళికలో రు. 185.63 లక్షలను కేటాయించారు.

మలేరియాతో బాధపడే 40 లక్షల జనాభాను వ్యాధి బారి నుంచి కాపాడటానికై ఆంధ్రప్రాంతంలో మొదటి ప్రణాళికా కాలంలోని రెండు యూనిట్లనూ కొనసాగించడమే కాకుండా రెండవ ప్రణాళికా కాలంలో మరి రెండు మలేరియా నిరోధక యూనిట్లను స్థాపించారు. బి. సి. జి. టీకాల ద్వారా క్షయ వ్యాధి నిరోధక కార్యక్రమానికై మొదటి ప్రణాళికా కాలంలో స్థాపింపబడిన కేంద్ర పరిపాలనా యూనిట్టు, 6 ఫీల్డు టీములను కొనసాగించడమే కాకుండా మరో ఫీల్డు 6 టీములను స్థాపించారు. మొదటి ప్రణాళికా కాలంలో విశాఖపట్టణంలో ప్రారంభించిన నంజు వ్యాధి పరిశోధనా కేంద్రాన్ని గుంటూరుకు మార్చి రెండవ ప్రణాళికా కాలంలో కూడా కొనసాగించారు. మొదటి ప్రణాళికా కాలంలో ప్రారంభించిన కేంద్రీయ ప్రజారోగ్య ఇంజనీరింగు సంస్థ రెండవ ప్రణాళికలో కూడ కొనసాగించ బడింది. పరిసర ప్రాంతాల పారిశుద్ధ్యం అభివృద్ధికై తగిన నమూనాలను రూపొందించడానికి యీ సంస్థ ప్రయత్నిస్తున్నది. జాతీయ బోద నివారణ కార్యక్రమం క్రింద పని చేసేందుగాను బోద వ్యాధి నిరోధక యూనిట్టును రెండవ ప్రణాళికా కాలంలో కూడా కొనసాగించారు. రాష్ట్రంలోని మలేరియా నిరోధక పథకాల క్రింద పని చేసే సిబ్బందికి శిక్షణ సౌకర్యాలనిచ్చే నిమిత్తం ఒక కేంద్ర మలేరియా పరిశోధన కేంద్రం కూడా స్థాపించబడింది. రెండవ ప్రణాళిక ఆఖరుకు గ్రామీణ ప్రాంతాలలో 122 కుటుంబ నియంత్రణ కేంద్రాలు తెరువబడగలవు.

తెలంగాణా ప్రాంతంలో వైద్య సహాయంలేని మారుమూల గ్రామాలకు క్రొత్తగా మందు పెట్టెలను సరఫరా చేయటానికీ, పాత పెట్టెలలో మందులు నింపటానికి తగు మొత్తాలు కేటాంచారు. తెలంగాణాలో మొదటి ప్రణాళికా కాలంలో ప్రారంభించిన మూడు మలేరియా నిరోధక యూనిట్టులను రెండవ ప్రణాళికా కాలంలో కూడా కొనసాగించారు. గ్రామీణ ప్రజలలో ఆరోగ్య చైతన్యం కలిగించటానికై 1957—58వ సం.లో ఆరో అంటువ్యాధి నిరోధక శకటాలను కొని ఆరోగ్య ప్రచార నిర్వహణకై వైద్య శకటాలు అందుబాటులో లేని ఆరు జిల్లాలకు కేటాయించారు. రెండవ ప్రణాళిక అంతానికి తెలంగాణాలో 54 కుటుంబ నియంత్రణ కేంద్రాలు తెరువబడతాయి.

పారిశ్రామికాభివృద్ధి

గత అయిదు సంవత్సరాలలోనూ పారిశ్రామికాభివృద్ధిలో మన రాష్ట్రం గమనార్హమైన ప్రగతి సాధించింది. భారీ, మధ్య తరహా, చిన్నతరహా, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి మొత్తం రు. 12 కోట్లు ఖర్చయినవి.

పారిశ్రామికాభివృద్ధికీ, లఘుపరిశ్రమలు, ఖనిజాలఅభివృద్ధికై రాష్ట్రంలో మూడు కార్పొరేషన్లు స్థాపించబడటం, పారిశ్రామికోన్నతికి అనుకూల వాతావరణాన్ని సృజించినది. రు 149 లక్షల వ్యయంతో సనత్‌నగర్, సామర్లకోట వరంగల్లు, విజయవాడ, విశాఖపట్టణం, నంద్యాల, కడప, హైద్రాబాదులలో నెలకొల్పబడిన 8 పారిశ్రామిక వాడలు 202 పారిశ్రామిక యూనిట్లకు అవకాశాలను కల్పించినవి. సహాయక ప్రైవేటు పారిశ్రామికవాడల స్థాపనకు ప్రారంభించబడిన నూతనోద్యమం యీ కార్యక్రమానికి మరి కొంత పరిపుష్టి చేకూర్చింది.

విద్య

రాష్ట్రంలో మొత్తం 3 విశ్వ విద్యాలయాలు, 113 కళాశాలలు, 1080 ఉన్నత పాఠశాలలు, 1041 మాధ్యమిక పాఠశాలలు ఉన్నవి. రాష్ట్రీ రెండవ ప్రణాళిక మొత్తం వ్యయంలో సాంకేతిక విద్యతోకలిపి మొత్తం విద్యాపథకాలకైన ఖర్చు రు. 12.80 కోట్లు, అంటే మొత్తం వ్యయంలో 7.3 శాతం. ఇందులో సాధారణ విద్యకు ప్రత్యేకంగా రూ. 1043.13 లక్షలు కేటాయించబడ్డవి.

1955—56లో ప్రాథమిక పాఠశాలల సంఖ్య 28527. వుండగా ప్రణాళిక అంతానికి ఈ సంఖ్య 34307కు పెరిగింది. మాధ్యమిక పాఠశాలలసంఖ్య 281 నుండి 1041కి పెరిగింది. సంపూర్ణాభివృద్ధికోసం స్థానిక సంస్థలకూ, ఎయిడెడ్ పాఠశాలలకూ పెద్ద మొత్తాలను గ్రాంటులుగా ఇచ్చారు. ఉదాహరణకు 1959—60 సంవత్సరంలో ప్రయోగశాల భవనాల నిర్మాణానికిగాను 67 స్థానికసంస్థల ఉన్నత

పాఠశాలలకు ఒక్కొక్కదానికి రు. 30,000ల చొప్పున గ్రాంటుగా మంజూరు చేశారు.

సమాజవికాస కార్యక్రమాలను ప్రారంభించినది మొదలు 1960 మార్చి వరకూ సాంఘిక విద్యపై మొత్తం రు. 71 లక్షలను ఖర్చుపెట్టారు 1959–60 సంవత్సరంలో రాష్ట్రంలో సుమారు 7500 వయోజన విద్యా కేంద్రాలు పని చేస్తున్నవి. సికింద్రాబాదులోని పట్టణకేంద్ర గ్రంథాలయం కాకుండా, తెలంగాణా ప్రాంతలో రెండవ ప్రణాళికా కాలంలో 9 జిల్లాకేంద్ర గ్రంథాలయాలను, 27 శాఖా గ్రంథాలయాలను తెరిచారు ఆంధ్ర ప్రాంతంలోని 11 జిల్లాల ముఖ్య పట్టణాలలో నూ పిల్లల గ్రంథాలయాలు తెరువ బడ్డాయి.

6–11 సంవత్సరాల మధ్య వయస్కులైన పిల్లలకై నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యా పథకాన్ని 1961 జూన్ నెలనుండి రాష్ట్రమంతటా ప్రారంభించారు.

పంచాయతీ రాజ్యం

బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సిఫార్సులను దేశంలో కెల్లా మొట్టమొదట అమలుపరిచిన కీర్తి ఆంధ్రప్రదేశ్‌కు దక్కింది. రాష్ట్రంలో 1959 నవంబరు 1 వ తేదీన చట్టబద్ధమైన పంచాయతీ సమితులు స్థాపించ బడినాయి. తరువాత ఒక నెలకు ఇరవై జిల్లాలలోను జిల్లా పరిషత్తులు ఏర్పడ్డాయి

పంచాయతీలు, పరిషత్తుల స్థాపనతో జనపదాలలో గొప్ప మార్పు వచ్చింది. గ్రామీణులలో నేడు నవచైతన్యం వెల్లివిరుస్తున్నది. మన రాష్ట్రంలో పంచాయతి రాజ్య వ్యవస్థ సాధించిన విజయాలు అన్య ప్రాంతీయులను ఆకర్షించాయి.

సమాజాభివృద్ధి కార్యక్రమాలను అమలు పరచటంలో సైతం రాష్ట్రం అగ్రగామిగా వుంది. కేంద్ర సమాజాభివృద్ధి, సహకార మంత్రిత్వ శాఖవారు సమీక్షించిన 32 అభివృద్ధి కార్యక్రమాలలోనూ 27 అంశాల విషయంలో రాష్ట్రం ప్రథమ లేదా ద్వితీయ స్థానం ఆక్రమించింది

మహిళా సంక్షేమం

మద్రాసు రాష్ట్రం నుంచి విడివడిన తరువాత ఆంధ్రరాష్ట్రానికి స్వంత సర్వీసు హోమ్ లేకుండా పోయింది. మహిళాసంక్షేమ శాఖ తరఫున, తూర్పు గోదావరి జిల్లా సీతానగరంలో కస్తూర్బా గాంధీ జాతీయ స్మారక నిధివారు ఒక సర్వీసు గృహాన్ని నడుపుతున్నారు. అది ఇప్పటికీ పనిచేస్తున్నది. రెండవ ప్రణాళికా కాలంలో హైద్రాబాదు, అనంతపురంలో రెండు సర్వీసు హోమ్‌లను తెరిచారు. ఈ రెంటినీ మహిళా సంక్షేమ శాఖ నిర్వహిస్తున్నది. కొండజాతుల స్త్రీల కొరకు పశ్చిమ గోదావరి జిల్లా కన్నాపురంలో మరో సర్వీస్ హోమ్ తెరవబడినది. ఇదికూడా మహిళా సంక్షేమ శాఖ నిర్వహణ క్రిందనే వుంది, కర్నూలుజిల్లా ఆళ్ళగడ్డలో స్థానిక మహిళా మండలి ఒక సర్వీస్ హోమ్‌ను తెరిచింది, ఇది నాలుగవది.

పూర్వ హైద్రాబాదు రాష్ట్రంలో మహిళా సంక్షేమార్థం ప్రత్యేకంగా ఒక శాఖ లేదు. ఆంధ్ర ప్రాంతంలో మాత్రమే యీ శాఖ పనిచేస్తుండేది. ఈ శాఖ కార్యకలాపాలను తెలంగాణా ప్రాంతానికి కూడ విస్తరింపజేసే తలంపుతో తెలంగాణాలోని 9 జిల్లాలలోను తొమ్మిది జిల్లా అధికార్లను నియమించారు. అంతే కాకుండా పది మహిళా సంక్షేమ విభాగాలను కూడ తెరిచారు.— ఇది గడచిన అయిదు సంవత్సరాల కాలంలో ప్రధానమైన అభివృద్ధి రంగాలలో మన రాష్ట్రం సాధించిన విజయాల సంగ్రహస్వరూపం.

సంపూర్ణ విశ్వాసంతో దీక్షతో రాష్ట్రం ముందుకు సాగుతున్నది. ద్వితీయ ప్రణాళికా విజయం మరింత భారీ ఎత్తున తృతీయ ప్రణాళికను రూపొందించు కోవటానికి మనకు ప్రోత్సాహాన్నిచ్చింది. నవోత్సాహంతో, దీక్షాసక్తులతో పరిశ్రమించి మాతృభూమి ప్రతిష్టను ఇనుమడింప జేయటానికై ప్రతిన పూనుదాం.

అయిదేండ్ల అభివృద్ధి: రాష్ట్ర తృతీయ ప్రణాళిక

ప్రొఫెసర్ యస్.వి. అయ్యర్

1956 నవంబరు 1 వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ జరిగింది. పూర్వ హైద్రాబాదు రాష్ట్రంలోని అత్యధిక భాగం కల్సిపోవటం, హైద్రాబాదు నగరం రాజధాని కావటం నూతన రాష్ట్రానికి పరిపుష్టినీ, స్థిరత్వాన్ని చేకూర్చాయి. ఈ విధంగా ఆంధ్ర ప్రదేశ్ కేంద్ర స్థానాన్నీ, ప్రత్యేక ప్రతిపత్తిని సంతరించుకుంది.

ప్రథమ పంచవర్ష ప్రణాళికారంభం నాటికి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడలేదు కాబట్టి ఆ ప్రణాళికాకాలంలో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడిన ప్రాంతాలలో జరిగిన అభివృద్ధినిగురించి తెలుసుకోవటం కేవలం చారిత్రకంగా మాత్రమే ఆసక్తిదాయకం. కాగా ఆంధ్ర ప్రదేశ్ తృతీయ ప్రణాళికాకర్తలు ఇలా వ్రాశారు:—

"నూత్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణా ప్రాంతాన్ని త్రిభాషా రాష్ట్రమైన పూర్వ హైద్రాబాదు రాష్ట్రం నుంచి విడదీసి చేర్చటంవల్ల ప్రథమ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఈ రాష్ట్రం సాధించిన విజయాలను సమీక్షించటం సాధ్యం కాదు. ఎందుచేత నంటే ఈ కాలంలో తెలంగాణా ప్రాంతంలో జరిగిన అభివృద్ధిని తెలిపే వివరాలు విడిగా లభ్యం కావటం లేదు."

రెండవ పంచవర్ష ప్రణాళికకు మనం రూ. 180.58 కోట్ల ప్రణాళికాబద్ధమైన పెట్టు బడిని నిర్ణంచుకున్నాము.

ఆంధ్ర ప్రదేశ్ తృతీయ ప్రణాళికలో ఈ విధంగా ఉల్లేఖించబడినది:

"రాష్ట్రంలో 16 43 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను అదనంగా పండించటానికై మనం పెట్టుకున్న లక్ష్యం బహుశా రెండవ ప్రణాళిక ముగింపునాటికి నెరవేరుతుంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం నిర్ణీత కార్యక్రమకంటే వేగంగా కొనసాగుతున్నది. ఇతర భారీ మధ్య రకం చిన్నరకం సేద్యపు నీటి వనరుల పథకాల ద్వారా నూతనంగా 8 03 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం విస్తరింప జేయబడినది. విద్యుదుత్పాదనశక్తి 1,30,570 కిలోవాట్లకు పెరిగింది. రాష్ట్రమంతటా 548 భారీ సహకార సంఘాలు స్థాపించబడినాయి. వివిధ సహకార సంస్థల సంఖ్య బాగా హెచ్చింది. వాటి ద్వారా 1960 మార్చి మాసాంతం నాటికి రూ. 16.33 కోట్లమేరకు దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక ఋణాలు ఇవ్వబడినాయి. 1632 మైళ్ల మేరకు కొత్త రోడ్లు వేయటమేమిటి, పాతవాటిని మరమ్మతు చేయటమేమిటి జరిగింది. సాంఘిక సేవా కార్యక్రమాల విస్తరణలో కూడా ఇదే ప్రకారం అభివృద్ధిని సాధించటమైనది. గృహనిర్మాణ కార్యక్రమాన్ననుసరించి సహాయక పారిశ్రామిక గృహనిర్మాణం, సహకార గృహనిర్మాణం, స్వల్పాదాయవర్గాల గృహనిర్మాణ పథకాల క్రింద 7531 నివాసగృహాలు నిర్మించబడినాయి. సమాజాభివృద్ధి కార్యక్రమాలు కూడా యదావిధంగానే విజయవంతంగా అమలు జరుగుతున్నాయి. ఈ విషయంలో రాష్ట్రం సలుపుతున్న కృషి గణనీయమైనది."

పోతే నివేదికలో ఇలా వుంది. "1959-60వ సంవత్సరాంతం నాటికి రాష్ట్రంలో 282 బ్లాకులను కొత్తగా తెరిచారు. 59397 చదరపుమైళ్ల మేరలో ఆవరించివున్న 17,739 గ్రామాలలోని 158లక్షల మంది ప్రజలకు వీటివల్ల ప్రయోజనం చేకూరుతుంది. వీటి కార్యకలాపాల నిర్వహణ బాధ్యతను పూర్తిగా వికేంద్రీకరించి, గ్రామ స్థాయిలో పంచాయతీకీ, బ్లాకుస్థాయిలో సమితికీ, జిల్లాస్థాయిలో పరిషత్తుకు అప్పగించడం జరిగింది."

స్థూలంగా యింత వరకూ సాధించిన విజయాలకు, పథకాల నిర్వహణాధికారులు గర్వించవచ్చును. భౌతిక అంచనాల విజయందృష్ట్యా చెప్పుకోదగినంత అభివృద్ధిని సాధించామనే చెప్పుకోవాలి. దేశంలో ప్రజాస్వామ్యపునాదులను పటిష్ఠం చేసే ప్రత్యేక పరిస్థితులలో గమ్యసుందూరమైనా, మనం సరైన మార్గంలోనే ఉన్నాము. అభివృద్ధి పథంలో యెన్నోడిడుదుడుకులను యెదుర్కోవాల్సి ఉంటుంది.

భారతదేశంలో ప్రణాళికలు యే రాజకీయ పార్టీ లేక ప్రభుత్వ ఉద్యోగులలాభం కొఱకై ప్రవేశ పెట్టినవి కావు. జాతీయ ఆదాయాభివృద్ధిని పెపొందించి తద్వారా పట్టణ, పల్లెవాసుల వ్యక్తిగత స్థాయిని పెంచాలనే దృష్టితోనే దేశంలో పంచవర్ష ప్రణాళికలు ప్రవేశ పెట్టబడ్డాయి. రాష్ట్రంలోని వివిధ సమస్యలను విపులంగా పరిశీలించేందుకు కమిటీలను యేర్పాటుచేసి ప్రణాళికా సంఘం ఆమోదంతో తృతీయ ప్రణాళిక ఖర్చును రు. 308 కోట్లకు స్థిరీకరించారు. రెండవ ప్రణాళిక మొత్తం రు. 180.00 కోట్లు మాత్రమే. యిందులో అభివృద్ధి పథకాలను స్థూలంగా విభజించారు. వ్యవసాయం, సేద్యపు నీటి పారుదల, విద్యుచ్ఛక్తి, పరిశ్రమలు, గనులు, రవాణా సౌకర్యాలు, సాంఘిక సేవ, యితరాలు. ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధిని గురించి తెలుసుకొనగోరే హితైషులకు క్రింది అంకెలు చాలా ఉపయోగపడ్తాయి.

వివిధ కార్యక్రమాల కేటాయింపులను ప్రక్క పేజీలోని వివరణ పట్టికలో చూడవచ్చును—

ఆంధ్రప్రదేశ్ ప్రథమ, ద్వితీయ ప్రణాళికల కేటాయింపులు, మూడవ ప్రణాళిక ప్రతిపాదిత మొత్తాలు.

వరుస క్రమం	ముఖ్యపద్దు	* మొదటి ప్రణాళిక		రెండవ ప్రణాళిక		మూడవ ప్రణాళిక	
		కేటాయింపు	శాతం	కేటాయింపు	శాతం	కేటాయింపు	శాతం
1	వ్యవసాయ పథకాలు	11.94	12.4	36.58	20.2	73.8	23 96
2	సేద్యపు నీటిపారుదల	21.18	21.9	58.01	32.1	76.23	24 99
3	విద్యుచ్ఛక్తి	38.48	39.9	34.69	19.2	64.94	21.29
4	పరిశ్రమలు, ఖనిజములు	1.20	1.2	10.44	5.8	19.43	6.37
5	రవాణా	3.36	3.5	5.90	3.3	11.56	3 79
6	సాంఘిక సేవ	18.51	19.2	32.30	17.9	55.51	18 20
7	యితరములు	1.82	1.9	2.67	1.5	4.25	1.40
	మొత్తం	96.49	100.0	180 59	100.0	305 00	100.0

తెలంగాణా ప్రాంతానికి సంబంధించిన మొదటి ప్రణాళిక అంచనాలు, ఆంధ్రప్రాంతానికి సంబంధించిన మొదటి ప్రణాళిక అంచనాలలో 50 శాతంగా అంచనా వేశారు...

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలను యిందులో విపులంగా యివ్వలేకపోయినా ముఖ్య విషయాలైన. సామూహిక పథకాలు, పంచాయతీ రాజ్యం, పరిశ్రమల అభివృద్ధి వ్యవసాయ పురోభివృద్ధిని గురించి స్థూలంగా యివ్వబడ్డాయి. రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు ప్రణాళికా ఉద్దేశాలను అంద జేయడం ప్రధానమైన విషయము.

వ్యవసాయము

వ్యవసాయోత్పత్తిని గురించి ఆంధ్రప్రదేశ్ ప్రణాళికా రచయితలు క్రింది విధంగా అభిప్రాయం వెల్లడించారు:

"దేశ ఆర్థికాభివృద్ధికై నిర్దేశించిన ప్రణాళికల విజయం, ముఖ్యంగా భూమి, శ్రామికశక్తులను వినియోగించుకోవటంపై ఆధారపడి వున్నది. అధికాహారోత్పత్తి, పరిశ్రమలకు అవసరమైన ముడి సరకుల కొఱతను దృష్టిలో ఉంచుకొని వివిధ పథకాలను తయారు చేయాలి. మొదటి రెండు ప్రణాళికలను యీ సూత్రం పైననే తయారు చేశారు. వ్యవసాయము, సామూహిక అభివృద్ధికి ప్రాధాన్యం యిచ్చారు." నీటిపారుదల వసరులు, మేలురకం విత్తనాలు, యెరువుల వాడకం, భూమిని వ్యవసాయ యోగ్యంచేయటం మొదలైన చర్యలవల్ల ఆహారోత్పత్తి పెరిగింది. నివేదికలో యింకా యీ విధంగా ఉంది.

"రెండవ ప్రణాళికా కాలంలో ఆంధ్ర ప్రాంతంలో 301 విత్తనాల క్షేత్రాల స్థాపన, 301 విత్తనాల గిడ్డంగుల నిర్మాణం జరిగింది. 34785 టన్నుల మేలురకం విత్తనాలు, 9594 టన్నుల జొన్నలు, 21405 టన్నుల వేరుశనగ విత్తులు, 2025 టన్నుల కాయధాన్యం విత్తులు, 646 టన్నుల పచ్చి యెరువు విత్తులు పంచిపెట్టారు. 12 లక్షల టన్నుల కంపోస్టు యెరువును ఉత్పత్తిచేసి పంచిపెట్టారు. రెండవ ప్రణాళికా కాలంలో తెలంగాణా ప్రాంతంలో 144 విత్తనాల క్షేత్రాలు, 144 విత్తనాల గిడ్డంగుల నిర్మాణం జరిగింది. 17177 టన్నుల మేలురకం వరివిత్తనాలు, 991 టన్నుల జొన్న విత్తులు, 448 టన్నుల గోధుమలు, 1988 టన్నుల సజ్జ, 53 టన్నుల కాయ ధాన్యాలు, 2232 టన్నుల ఆముదాలు, 300 టన్నుల నూనె గింజలు, 1101 టన్నుల పచ్చియెరువు విత్తనాల పంపిణీ జరిగింది"

సమాజాభివృద్ధి పథకాలు

సమాజాభివృద్ధి పథకాలు కొందరికి అన్యుల అనుకరణగా గోచరించ వచ్చును. చుచుమ, పథకాల మూల సిద్ధాంతమునకు కొందఱు మాత్రమేవ్యతిరేకులు. ప్రణాళికా రచయితలు తమ నివేదికలో యిలా అన్నారు.

"గ్రామీణ సమస్యలను పరిష్కరించుటకు సహకార మార్గాన్ని అవలంబించుటయే సమాజాభివృద్ధి పథకాల ప్రధాన లక్ష్యం. తమ అభివృద్ధికి తామే పాటు పడి, తమ సమస్యలను స్వయంగా పరిష్కరికచుకొనే మనస్తత్వం ప్రజలలో కలగాలి. స్వయం సహాయమే యీ పథకాల విజయానికి మూలాధారం. ప్రభుత్వం కేవలం ధన సహాయం, వస్తువుల సరఫరా మాత్రం చేస్తుంది. గ్రామిణ ప్రాంతాలలో వ్యర్థంగా నిరుపయోగకంగా వుండిపోతున్న ప్రజాశక్తిని, నిర్మాణ కార్యక్రమాల వైపుకు మళ్ళించాలి. ప్రతి కుటుంబం తమ సమస్యలను తీర్చుకోవటమే గాక సమాజానికి కూడా ఉపయోగ పడాలి"

సమాజాభివృద్ధి పథకాలు, వాస్తవికంగా ప్రజా పథకాలుగా రూపొందించుటకు ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో ప్రాముఖ్యం యిచ్చారు. అందుకే బ్లాకు కార్య నిర్వహణను ప్రజా స్వామ్య వికేంద్రీకరణ ద్వారా మార్చుట అవసర మైనది. రాష్ట్రమును 445 బ్లాకులుగా విభజించారు. అంధ్ర ప్రాంతంలో 297 బ్లాకులు, తెలంగాణా ప్రాంతంలో 148 బ్లాకును ఏర్పడతాయి. రెండవ పంచవర్ష ప్రణాళిక ఆఖరుకు ఆంధ్ర ప్రాంతంలో 189 బ్లాకులు, తెలంగాణాలో 94 బ్లాకులు యేర్పడతాయి. అభివృద్ధి పథకాలకు ప్రజాసహకారం లభించుటకు వీలుగా 1959 నవంబరునుండి పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తులు యేర్పాటు చేశారు.

1963 అక్టోబరు వఱకు మొత్తం రాష్ట్రంలో సమాజాభివృద్ధి పథకాలను ప్రవేశ పెట్టారు. మూడవ ప్రణాళికా కాలంలో ఆంధ్ర ప్రాంతంలో 108 బ్లాకులు, తెలంగాణాలో 54 బ్లాకులు యేర్పాటు చేస్తారు. యిందుకై ఆంధ్రకు రు. 2550 లక్షలు, తెలంగాణాకు రు 1703 లక్షలు కేటాయించారు. యీ పథకాలకు యెంత ప్రాధాన్యం యిస్తే అంత ప్రాముఖ్యం లభిస్తుంది. గ్రామీణులు తమను తాము తెలుసుకునే యీ సవాలు గుర్తింజేసే అధికారులకు, కార్యకర్తలకు రాజేంద్రనగర్ కేంద్రలో ఉపయోగకరమైన శిక్షణ యివ్వ బడుతున్నది.

ప్రణాళికా సంఘం వాస్తవికతను తెలుపుతూ యిలా అన్నది.

"పంచాయతీ రాజ్య పథకం ప్రవేశపెట్ట బడటంతో, యింతవరకూ లోకల్ బోర్డుల పరంగా ఉన్న యితర సమస్యలతో పాటు సమాజాభివృద్ధి కార్యక్రమాలు కూడా పంచాయితీ సమితుల అధీనం అయినవి. వాస్తవ పరిస్థితుల దృష్ట్యా జిల్లా పరిపాలన

లోను, పంచాయితీల కార్య నిర్వహణలోను కొన్ని మార్పులు ఆవశ్యకమైనవి." యిప్పటికి కల్గిన అనుభవంతో మనం సరైన మార్గాన్నే అవలంబించామని నిస్సందేహంగా చెప్పవచ్చు. యిదే విధంగా పనిచేస్తే నిజమైన ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది.

లఘుపరిశ్రమల విషయంలో ఆంధ్రచాలా వెనుకబడిఉన్నది. పరిశ్రమల స్థాపనకై ప్రభుత్వం తనశక్తి కొలది పాటుపడుతున్నది. రాష్ట్రంలో పరిశ్రమల నిర్వహణ అభివృద్ధి బాధ్యతను నిర్వహించుటకు పరిశ్రమాభివృద్ధి కార్పోరేషన్‌ను నెలకొల్పుట సరైన చర్య కాగలదు... క్రొత్త పరిశ్రమల స్థాపనకు, భౌగోళిక, సాంకేతిక ఆర్థిక సర్వే నిర్వహణగూడా యీ కార్పొరేషన్ పరిధిలోనిదే!

వ్యవసాయమే ముఖ్య ఆధారమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామీణ పరిశ్రమలు, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి యెంతో అవసరం. ఉన్నత ప్రమాణంలో వస్తువులు తయారుచేయుటకు వీలుగా కొన్ని ప్రాంతాలలో పారిశ్రామిక వాటికలు స్థాపింపబడి, తగిన సౌకర్యాలు కల్పింపబడినవి. వృత్తిపనివారలకు శిక్షణ గరిపే కేంద్రాలు కూడా ప్రారంభింపబడినవి. ప్రభుత్వ నివేదికలో యింకా యిలా ఉన్నది..: ''గ్రామీణ చిన్నతరహా పరిశ్రమలకు మూడవ ప్రణాళికలో ప్రాధాన్యం యివ్వబడింది. దీనివల్ల ఉద్యోగ అవకాశాలు పెరుగుటేగాక, ఆర్థికాభివృద్ధికూడా జరుగుతుంది. వీటివల్ల ప్రతి ప్రాంతంలోని అన్నిఅవకాశాలను సద్వినియోగ పఱచుట కూడా జరుగుతుంది, చిన్నతరహా పరిశ్రమల పథకాలవల్ల చిన్న చిన్న పట్టణాలను కూడా పారిశ్రామికంగా అభివృధి చేయవచ్చు. యీ పట్టణ పరిసర గ్రామీణ ప్రాంతంకూడా ఆర్థికంగా బలపడుతవి." రెండవ ప్రణాళికా కాలంలో 35నుండి 40వరకు చిన్నతరహా పరిశ్రమలు స్థాపించబడినట్లు ప్రభుత్వం వెల్లడించింది. వీటిద్వారా వాడకం వస్తువులైన సైకిల్ విడిభాగాలు. చేతిపనిముట్లు, వ్యవసాయ పరికరాలు. విద్యుచ్ఛక్తి మోటార్లు, రేడియో రివర్లుసీ ఉత్పత్తి వగైరా అవుతున్నవి.

విద్యుచ్ఛక్తి ఉత్పత్తి విషయంలో ఆంధ్రప్రదేశ్ చాలా సమస్యలు యెదుర్కొంటున్నది. యెన్ని పథకాలు అమలు పరచినా విద్యుచ్ఛక్తి సరఫరా సంతృప్తికరంగా లేదు. రెండవ ప్రణాళికా ప్రారంభంలో తలసరి విద్యుచ్ఛక్తి ఉత్పత్తి 7 యూనిట్లు మాత్రమేఉన్నది. రెండవ ప్రణాళిక ఆఖరుకు యిది 15యూనిట్లకు పెరుగుతుందని ఆశిస్తున్నారు.

ప్రతి కుటుంబానికి సుఖశాంతులను అందజేయుటయే ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థ ముఖ్యుద్దేశ్యము. జాతీయాదాయం సమానంగా పంపిణీ జరిగి అందరికి తిండి, వస్త్రం వసతి సౌకర్యాలు లభింపజేసేవే యీ ప్రణాళికలు. అందరికీ పనిదొరికే అవకాశం ఉండాలి. అన్నిసంస్థలద్వారా ప్రణాళికా ప్రచారం జరుగుతున్నప్పటికీ ప్రజలలో నమ్మకం కల్గించే విధంగా ప్రచారం జరగడం యెంతో అవసరం వ్యాపార ప్రకటనలలో, రేడియోప్రచారంలో ఈదృష్టి లోపిస్తున్నది. ప్రతిస్త్రీపురుషునిలలోను ఆశాభావం చిగిర్చే విధంగా ప్రచార సాధనాలను వినియోగించాలి. భజనలు, కాలక్షేపాలు, సంగీతం ప్రచారసాధనాలు కావాలి. ప్రణాళికలను సరిగా అర్థంజేసుకొని వాటిని విజయవంతంగా అమలుజేయుటకూ తద్వారా జాతీయ పునర్నిర్మాణంలో పాల్గొనుటకు మారుమూల గ్రామాలలోని ప్రతి స్త్రీ పురుషుని సిద్ధంజేయుటకు గాను 1962 ఫిబ్రవరిలో జరిగే ఎన్నికలు, ఎన్నికలలోనినిలబడే ప్రతిఅభ్యర్థికి చక్కని అవకాశాన్ని కల్గిస్తాయి. పార్టీ కక్షలు ప్రజలను పెడదోవ పట్టించగూడదు. ప్రజాభ్యుదయం యొక్క అవశ్యకతను ప్రతివారు తెలుసుకోవాలి, అభివృధి ప్రణాళికలను గూర్చి ప్రజలకు బోధించాలి. మూడవ పంచవర్ష ప్రణాళికఉపోద్ఘాతంలో యిలావుంది:—

"ప్రణాళికనిర్వహణకు అత్యధిక ప్రాధాన్యం యివ్వాలి. ప్రత్యక్ష ఫలితాలను అతివేగంగా పొందడానికి. ఉత్పత్తిని అధికం జేసే అవకాశాలను కల్పించి, పనులు చూపడమే గాక ఉత్పాదకశక్తిని అధికంజేయాలి ఆర్థిక, సాంఘికాభివృధికి, ఐకమత్యం, క్రమశిక్షణ యెంతో అవసరం,. మూడవ ప్రణాళిక అమలుకు అన్ని రంగాలలో సమర్థవంతమైన నాయకత్వం యెంతో అవసరం. ప్రజాసంస్థల పటిష్ఠత, దీక్ష, ప్రజలు ప్రణాళికను సరిగా అర్థంచేసకొని దాని అమలుకు సహాయపడటం, తమ బాధ్యతలను గుర్తించి భవిష్యత్తులో యెంతటి భారాన్నైనా వహించే బాధ్యత స్వీకరించడం యెంతో అవసరం." అభివృద్ధి పథంలో యెదో పెద్ద సవాలు, యింతవరకూ జాగుచేయబడింది యిప్పుడు యీసవాలును స్వీకరించి అభివృద్ధి మార్గాన పయనించాలి, ప్రణాళికా సంఘ. తుదిపలుకులను మననం జేసుకోకుండా యీ వ్యాసాన్ని ముగించలేము:

"తృతీయప్రణాళికా కాలంలో భారతదేశం యెదుర్కొవాల్సిన ముఖ్యవిషయాల పై మా నివేదికలో నొక్కిచెప్పాం, మనకు గలఅన్ని వనరులను సాధ్యమైనంతవరకు ఉపయోగించాలి. ప్రతిపౌరుడు సమస్త జాతీ తాముచేయగలినంత సహాయం జేయాలి మన లక్ష్యాలను, వాటి ప్రాధాన్యతను గుర్తించి మనః పూర్వకంగా వాటికి అంకితమై సర్వశక్తులతో పనిచేస్తే జాతిలక్ష్యాలను సాధించటం సుకరం కాగలదు." ఆంధ్రప్రదేశ్ అవతరణ ఐదవ వార్షికోత్సవ సమయమైన యిప్పుడు మనం ప్రణాళికా సంఘం వారి ప్రతి అక్షరాన్ని మననంజేస్తూ, జాతీయాదాన్ని పెంపొందించి తద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, భారతదేశం అభివృద్ధికి పాటు పడుటకు, వ్యక్తి ఆదాయాన్ని వృద్ధిజేయుటకు శపథంచేద్దాం. యీ విధంగా భారతదేశాన్ని యితర సుసంపన్నమేన దేశాలస్థాయికితెచ్చి, ఆఫ్రికా, ఆసియా, యితర వెనుకబడిన దేశాలకు సహాయంచేసే స్థితికి మనం రావాలి. అందుకు క్రమశిక్షణతో దీక్షతో శ్రమించుటకు దీక్షగైకొనే సుమూర్తం యిదే!...

అనుబంధం

ఆంధ్రప్రదేశ్—రెండవ ప్రణాళిక అంచనావ్యయం, మూడవ ప్రణాళిక కేటాయింపులు.

(రూపాయలు లక్షలలో)

పద్దు	రెండవ ప్రణాళిక అంచనావ్యయం	మూడవ ప్రణాళిక కేటాయింపు
వ్యవసాయోత్పత్తి	546	1246
చిన్నరకం సేద్యపు నీటి వనరులు	710	1826
భూసార సంరక్షణ	77	163
పశుపోషణ	206	385
పాడి క్షేత్రాల నిర్వహణ, పాల సరఫరా	54	296
అడవులు	105	145
మత్స్య సంపద అభివృద్ధి	61	115
గిడ్డంగులు, మార్కెట్ల నిర్వహణ	30	72
1. వ్యవసాయ కార్యక్రమాలు : ...	1789	4248
సహకారం	300	575
సమాజాభివృద్ధి	1575	2550
పంచాయతీలు	22	300
2. సమాజాభివృద్ధి, సహకారం ...	1897	3225
సేద్యపు నీటి వనరులు	5816	7380
వరదల నివారణ	—	243
విద్యుచ్ఛక్తి	3469	6494
3. సేద్యపు నీటి వనరులు, విద్యుచ్ఛక్తి ...	9285	14117
భారీ, మధ్యరకం సేద్యపు నీటి వనరులు	167	600
ఖనిజముల అభివృద్ధి	—	11
గ్రామీణ పరిశ్రమలు, లఘు పరిశ్రమలు	863	1267

పద్దు	రెండవ ప్రణాళిక అంచనా వ్యయం	మూడవ ప్రణాళిక కేటాయింపు
		7
4. పరిశ్రమలు, గనులు ...	1030	188
రోడ్లు	522	800
రోడ్డు రవాణా	32	350
రేవులు, రేవు పట్టణాలు...	—	—
ఇతర రవాణా సౌకర్యాలు	—	—
యాత్రా సౌకర్యాలు	7	6
5. రాకపోకలు, రవాణా సౌకర్యాలు ...	561	1156
సాధారణ విద్య, సాంస్కృతిక కార్యక్రమాలు ...	968	2066
సాంకేతిక విద్య	214	295
ఆరోగ్యం	1027	1900
గృహ నిర్మాణం	457	610
వెనుక బడిన తరగతుల సంక్షేమం	461	537
సాంఘిక సంక్షేమం	43	83
కార్మిక సంక్షేమం	65	135
పబ్లిక్ కార్పొరేషన్	—	(1)
6. సాంఘిక సేవా కార్యక్రమాలు ...	3235	5626
గణాంకములు	15	5
సమాచార, ప్రచార కార్యకలాపాలు	25	20
స్థానిక సంస్థలు	47	—
రాష్ట్ర రాజధాని ప్రాజెక్టులు	180	—
ఇతరములు	—	25
7. ఇతర పద్దులు ...	267	50
పూర్తి మొత్తం	18064	30500

ఆధారం : మూడవ పంచవర్ష ప్రణాళిక—భారత ప్రభుత్వం, ప్రణాళికా సంఘం—పుటలు 740, 741

(ఇంగ్లీషు మూలానికి అనువాదం)

తృతీయ ప్రణాళికలో వ్యవసాయోత్పత్తి

శ్రీ కె. భాస్కరం

1960-61 వ సంవత్సరానికి ఒక శతాబ్దం పూర్వపుదేశ వ్యవసాయోత్పత్తి లెక్కలను పరిశీలిస్తే మొదటి, రెండవ ప్రణాళికల కాలంలోమనం అన్నిరకాల వ్యవసాయపదార్థాలఉత్పత్తిలో35 శాతం, ఆహారధాన్యాల ఉత్పత్తిలో 32 శాతం అభివృద్ధిని సాధించినట్లు తెలుస్తుంది. ఈ అభివృద్ధి గమనార్హమే అయినప్పటికీ దినదినమూ పెరుగుతున్న జనాభా దృష్ట్యాచూస్తే ఇది మనదేశపు అవసరాలను తీర్చడానికి సరిపోదని విధితమౌతుంది. ముందుగా చేసుకొన్న ఏర్పాటు ప్రకారం రు. 250 కోట్ల విలువగల 60 లక్షల టన్నుల ఆహార ధాన్యాలకు బదులుగా మనం రెండవ ప్రణాళిక కాలంలో రు. 660 కోట్ల వ్యయంతో 160 లక్షల టన్నుల ఆహారధాన్యాలను దిగుమతి చేసుకొన్నాం. ఇంతే కాక రు. 200 కోట్ల విలువగల ముడి ప్రత్తి, రు. 30 కోట్ల విలువగల ముడి జనుము కూడా మన పరిశ్రమలకోసమై దిగుమతి చేసుకోడమైనది ఫోర్డ్ ఫౌండేషన్ తాలూకు నిపుణుల బృందం భారత ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో, "1966 నాటికి ఏదో ఒక గట్టి చర్య తీసుకొంటేనే తప్ప పెరుగుతూన్న జనాభా ఆహార సమస్యను పరిష్కరించటంలో దిగుమతులు, కంట్రోలు కార్యక్రమాలు కూడా విఫలమయ్యేటంత క్లిష్ట పరిస్థితి ఏర్పడవచ్చు" అని సూచించారు మూడవ ప్రణాళికాంతానికి ఆహార పదార్థాల ఉత్పత్తిని 760 లక్షల టన్నుల నుండి 1100 లక్షల టన్నులకు పెంచడానికి అనేక మార్గాలను కూడా వారు సూచించారు.

అయితే ఈ పరిస్థితికి భిన్నంగా ఆంధ్ర ప్రదేశ్ భవిష్యత్తుపై ఆశ కలిగిస్తుంది ఆంధ్ర ప్రదేశ్ ప్రధానంగా వ్యావసాయిక రాష్ట్రం "దక్షిణ దేశపు ధాన్యాగారం" అని దీనిని పిలుస్తారు. ఈ రాష్ట్రంలో ఒక్క వరి ధాన్యమే కాకుండా పొగాకు, ఆముదాలు, వేరు శనగ, బెల్లం, మిరప, చింతపండు మొదలైన ఆహార పదార్థాలు కూడా సమృద్ధిగా ఉత్పత్తి అవుతాయి. అంతే కాకుండ మామిడి, అరటి వంటి పండ్లు కూడా ఇక్కడ పుష్కలంగా లభిస్తాయి. ఇండియా అంతటా పండింపబడుతున్న, సిగరెట్టుకు ఉపయోగించె పొగాకులో 95 శాతం పొగాకు ఒక్క ఆంధ్ర ప్రదేశ్‌లోనే పండింప బడుతున్నది. పంటల పోటీలలో గోచరమవుతున్న మన రాష్ట్రపు ప్రమాణాలను—ఎకరానికి 12000 పౌన్లకుపైగా వరి, సుమారు 6000 పౌన్లు జొన్న 9000 పౌన్లు వేరు శనగ, 150 టన్నులను చెరకులనుబట్టి చూస్తే వ్యవసాయోత్పత్తి రంగంలో మన రాష్ట్రానికిగల ఆధిక్యత వెల్లడికాగలదు.

సేద్యపు భూమి విస్తీర్ణంలో కూడా గమనార్హమైన అభివృద్ధి గోచరిస్తున్నది. 1951–52 లో సేద్యపు భూమి విస్తీర్ణం 38 శాతం ఉండగా 1959–60 లో ఆ విస్తీర్ణం 43.1 శాతానికి పెరిగింది. అలాగే 1950–51 లో నీటి పారుదల సౌకర్యంగల భూమి విస్తీర్ణం 23.7 శాతం వుండిన 1959–90 నాటికి అది 28.2 శాతానికి పెరిగింది. ఈ కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 40.1 లక్షల టన్నుల నుండి 65.5 లక్షల టన్నులకు పెరిగింది. ఇది 1951,52 లో ఏర్పడిన 8.6 లక్షల టన్నుల ఆహారకొఱతను తీర్చడమే కాకుండా 1959–60 నాటికి 5.4 లక్షల టన్నుల మిగులు అభివృద్ధిని కూడా సాధించింది. ఎకరా ఉత్పత్తిని పెంపొందింప జేయడమే దీనికి ముఖ్య కారణం. ఈ కాలంలో 1951–52 నుండి 1958–59 నాటికి ఎకరా ఉత్పత్తి, వరి 941 పౌన్ల నుండి 1116 కూ. జొన్న 308 పౌన్ల నుండి 492 కూ, వేరు శనగ 721 నుండి 844 కూ. పొగాకు 681 నుండి 771 పౌనులకూ పెరిగింది.

చక్కెర, వస్త్రంవంటి ప్రధాన వ్యవసాయాధార పరిశ్రమలలో కూడా గమనార్హమైన అభివృద్ధి కనుపిస్తున్నది. చెరకు ఉత్పత్తి 1951 లో 0.48 లక్షల టన్నులు కాగా 1959 నాటికి 1.26 లక్షల టన్నులకు పెరిగింది. నూలు ఉత్పత్తి అదే కాలంలో 146.0 లక్షల పౌనులనుండి 322.0 లక్షల పౌనులకు పెరిగింది.

అధికాహారోత్పత్తికి గల జాతీయ ప్రాముఖ్యం దృష్ట్యా రాష్ట్ర మూడవ ప్రణాళిక కుద్దేశించ బడిన రు. 305 కోట్ల పెట్టు

బడిలోనూ 50 శాతం అంటే రు. 150 కోట్లు వ్యవసాయం, నీటి వనరుల నిమిత్తం వినియోగించాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రణాళికా వ్యయంలో రు. 73.08 కోట్లు వ్యవసాయ కార్యక్రమాలకూ, రు. 76.23 కోట్లు నీటి పారుదల సౌకర్యాలకూ అంటే ప్రణాళికా పెట్టుబడిలో 23;9 శాతం, 25 శాతం మొత్తాలు కేటాయించబడ్డాయి, అంతేగాక విద్యుచ్ఛక్తి ప్రాజెక్టుల నిమిత్తం రు.64,94 కోట్లు కేటాయించారు, ఇవి పరిశ్రమల అభివృద్ధికి దోహదం చేయడమే కాకుండా గ్రామీణ విద్యుచ్ఛక్తీకరణ, లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా వ్యవసాయం నీటి వనరుల కార్యక్రమాలకూ కూడా ప్రోత్సాహాన్నిస్తున్నాయి,

రెండవ ప్రణాళికాంతానికి 70,64 లక్షల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తిని మనం లక్ష్యంగా పెట్టుకొనగా మూడవ ప్రణాళికలో 94.68 లక్షల టన్నులను లక్ష్యంగా పెట్టుకొన్నాము. ఈ ప్రణాళికా కాలంలో ఇంకా 8 లక్షల టన్నుల బెల్లం, 4.5 లక్షల టన్నుల నూనె గింజలు, 35000 బేళ్ళ ప్రత్తిని అధికంగా ఉత్పత్తి చేయడానికి కూడా ఉద్దేశించాము, వ్యవసాయోత్పత్తిని వృద్ధిచేయడానికి గాను సకాలంలో తగినంత ఎరువులు, మేలిరకం విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పరికరాలను సరఫరా చేయడం, పైరుల సంరక్షణ, బుల్‌డోజర్లు, ట్రాక్టర్ల సహాయంతో 2.3 లక్షల ఎకరాల బంజరు భూములను సాగులోనికి తేవడం, సుమారు 2,25 లక్షల ఎకరాల మేరలో కట్టలు వేయటంద్వారా భూసార సంరక్షణ చర్యలను, తీసుకొవడం, 10 లక్షల ఎకరాల మేరలో చిన్న చిన్న కమతాల ఏకీకరణ, 8 5 లక్షల ఎకరాలకు చిన్న తరహా నీటి వనరుల సౌకర్యాలను విస్తరింప జేయడం వంటి చర్యలు గైకొనడానికి నిశ్చయించారు, అధికాహారోత్పత్తి కృషి విజయానికి వ్యవసాయ ఋణాల అవసరం ఎంతైనా ఉంటుంది, అందువలన అధికోత్పత్తిని సాధించడానికై సహకార సంఘాల ద్వారా, గ్రామీణులకు లభింపజేసే ఋణ సౌకర్యాలను ఏడాదికి రు, 66 కోట్లకు పెంచడానికి నిశ్చయించారు.

అయితే ఎరువులు మేలిరకం నిత్తనాల వాడకం, పైరు సంరక్షణ పద్ధతులు మొదలైన సాంకేతిక విధానాలను ఉపయోగించడానికి రైతాంగం అతి మెలకువగానూ, జాగ్రత్తతోనూ ఉండడం ఆవశ్యకం, అప్పుడే అధికాహారోత్పత్తిని సాధించడం సాధ్యమవుతుంది, సాంకేతికమైన సాధనాలకంటె కూడా మానవ కృషి ప్రధానమైనది. ఈ దృష్టితోనే 1952వ సంవత్సరంలో సమాజాభివృద్ధి ఉద్యమాన్ని ప్రారంభించడం జరిగింది. సమాజాభివృద్ధి కార్యక్రమంలో భాగమైన జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం క్రింద వ్యవసాయంలోనూ గ్రామీణ జీవితంలోనూ, సంపూర్ణ ప్రగతిని సాధించటానికి విద్య, బోధనలను ముఖ్యమైన సాధనాలుగా గుర్తించి వాటిని ఆచరించడం జరుగుచున్నది, ప్రజాస్వామ్య వికేంద్రీకరణ పథకం క్రింద ఇటీవల గ్రామ పంచాయతీలు, పంచాయతీ సమితీలు, జిల్లా పరిషత్తులను స్థాపించుకొని ఆంధ్రప్రదేశ్, అన్య ప్రాంతాలకు మార్గదర్శకమైనది. ఈ నూత్న సస్థలు గ్రామీణ ప్రజలలో ఉత్సాహాన్ని రేకెత్తించి, తమ ప్రగతికి తామే బాధ్యత వహించే విధంగా స్థానిక ప్రజల వికాసానికి దోహదం చేస్తున్నది,

(ఇంగ్లీషు మూలానికి అనువాదము)



అత్తమీది కినుక దుత్తమీదను చూపు
చచ్చు పౌరుషంపు సంపదేల?
చాటు పరచి త్రిప్పు చవట మీసములేల?
జనసుతాంత రంగ! వినుర! రంగ!

కళాకృష్ణుల "కృష్ణశతశతి"

ఆంధ్ర ప్రదేశ్ లో రోడ్ల అభివృద్ధి

ఉత్పత్తి, మార్కెటు కార్యకలాపాలను ప్రోత్సహించడానికీ, వ్యవసాయం, పరిశ్రమలను పెంపొందించడానికీ, వర్తక వ్యాపారాల వికాసానికీ, యాత్రలు, సాంఘిక సంబంధాల అభివృద్ధికి, ఒక్క మాటలో చెప్పాలంటే మానవుని సమస్త కార్యకలాపాల నిర్వహణకు రోడ్లు చాలా అవసరం. దేశ రక్షణకు రోడ్లు చాలా ముఖ్యం ఇవి దేశానికి జీవ నాడులవంటివని చెప్పవచ్చును.

భారతదేశంలో రోడ్ల పొడవు చదరపు మైలుకు సగటున 0.25 కాగా, ఆంధ్ర ప్రదేశ్‌లో 0.225 మాత్రమే ఉన్నది. అభివృద్ధిజెందిన దేశాలతోపోల్చి చూస్తే ఇది చాలా తక్కువగా కన్పిస్తుంది. దిగువ పట్టికనుబట్టి ఈ విషయం సుబోధకం కాగలదు:

బ్రిటన్	చ. మైలుకు	2.00	మైళ్లు
ఫ్రాన్సు	చ. మై.	3.04	,,
అమెరికా	చ. మై.	1.00	,,
ఇండియా	చ. మై.	0.25	,,
ఆంధ్ర ప్రదేశ్	చ. మై.	0 23	,,

1961 మార్చి మాసాంతం నాటికి రాష్ట్రంలో రోడ్ల నిడివి ఈ విధంగా వుంది:—

విభజన	సి. సి. యం. యఫ్	బి. టి. యం. ఎఫ్.	డబ్ల్యు బి. యం.	కంకర లేని రోడ్డు	మొత్తం. యం. ఎఫ్
ఎన్. హెచ్.	96.0	1196.0	140.0	—	1432.0
ఎస్. హెచ్.	54.0	1079.0	362.0	—	1495 0
యం. డి. ఆర్. ఎస్	43.0	2439.0	7467.0	377.0	10326.0
ఒ. డి. ఆర్. ఎస్.	—	25.0	2230.0	1213.0	3468.0
వి. ఆర్. ఎస్.	—	8.0	880.0	6205.0	7101.0
మొత్తం	193.0	4747.0	11087.0	7795.0	23822.0

రాకపోకల సదుపాయాలలో దేశంలో రైల్వేల తర్వాత ప్రాముఖ్యం వహించేది రోడ్డు రవాణాయే. 1943 లో వివిధ రాష్ట్రాల చీఫ్ ఇంజనీర్లు సమావేశమై 20 సంవత్సరాల వరకు వర్తించే రోడ్ల అభివృద్ధి ప్రణాళిక నొకదాన్ని రూపొందించారు. భారతదేశంలో శాస్త్రీయ విధానాలలో రోడ్లను అభివృద్ధి చేయడానికి జరిగిన తొలిప్రయత్నం ఇదే. ఈ ప్రణాళిక 'నాగపూర్ ప్రణాళిక'గా ప్రసిద్ధి పొందినది. అభివృద్ధి చెందిన ప్రాంతాలలోని ఏ గ్రామమూ కూడా రోడ్డు మార్గం నుండి 5 మైళ్లకు మించిన దూరంలో ఉండకూడదనీ, ఒక చదరపు మైలు విస్తీర్ణంలో సగటున 0 25 మై చొప్పున రోడ్డు మార్గాలు వుండాలని ఈ ప్రణాళికలో నిర్దేశించబడినది. జాతీయ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరుసగా పంచవర్ష ప్రణాళికలు చేపట్టబడ్డాయి. ఈ విషయంలో రోడ్ల అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసేటప్పుడు నాగపూరు ప్రణాళికను దృష్టిలో పెట్టుకొనే దీనిని తయారు చేశారు. రెండవ ప్రణాళిక ఆఖరుకు నాగపూరు ప్రణాళిక లక్ష్యాలు ఇంచు మించు పూర్తిగా సాధింపబడినవి.

రోడ్డు మార్గాల ప్రణాళికలో నూతనంగా నిర్మింపబడే రోడ్లతో పాటుగా ప్రస్తుతం ఉన్న రోడ్ల అభివృద్ధికి కూడా సమా

న స్థాన మి వ్వా లి. సక్రమంగాలేని రోడ్డు మీద రవాణాకయ్యే ఖర్చు, మంచిగా వున్న రోడ్ల మీ దిరవాణాకయ్యే ఖర్చు లకన్న చాలా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మంచి రహదార్ల మూలంగా జాతీయ సంపద దుర్వ్యయాన్ని నివారించ వచ్చును. ఉదాహరణకు బండ్లదారిన అయితే ఒక ఎడ్ల బండికి 1000 పౌన్ల బరువులు మోయగల సామర్థ్యం ఉన్నదని అనుకొందాం అదే మంచి సిమెంటు కాంక్రీటు రోడ్డు మీద అయితే ఆ ఎడ్ల బండి 4500 పౌన్ల బరువు వరకు మోయకలుగుతుంది. తగినంత ధనం లేని కారణంగా ప్రస్తుతం ఉన్న రోడ్లకు అనేక చోట్ల క్రాసింగు లలో వంతెనలు నిర్మించ లేదు. అందువల్ల ప్రజలు నదులను, వాగులను చిన్న చిన్న పడవల సహాయంతో దాటవలసి వస్తు న్నది. ఇది అనేక ప్రమాదాలకు దారి తీస్తున్నట్టు ఇటీవల సంఘ టలను బట్టి తెలుస్తున్నది. వంతెనల నిర్మాణం వల్ల ఈ ప్రమా దాలను నివారించవచ్చు. పైప్రమాదాలకు తోడుగా వంతెనలు లేనిచోట్ల వర్షాకాలంలో ప్రకృతి కూడా అనేక ఇబ్బందులకు కారణమవుతున్నది. ఆ సమయాలలో ప్రజలు చుట్టు దారులను అనుసరించడం ఇందుమూలంగా రాకపోకల ఖర్చులు అధికం కావడం, ప్రయాణాలు ఆలస్యం కావడంవంటి అనవసర వ్యయా ప్రయాసలు సంభవిస్తున్నవి. దీనిని బట్టి మంచి రోడ్లు దేశపు జాతీయ సంపదను పెంపొందిస్తాయని విదితమవుతున్నది.

అయితే రోడ్ల సంఖ్యను అధికం చేయడానికీ, మంచి రోడ్లను నిర్మించడానికీ అయ్యే ఖర్చు కూడా ఎక్కువే వుంటుంది. ప్రస్తుతం ఉన్న సాధనాలతో ఏ రాష్ట్రమూ కూడా ఈ రెండు లక్ష్యాలనూ ఏకకాలాన సాధించగల అవకాశాలు లేవు. కనుక ఈ రెంటి సమన్వయ మార్గాన్ని అనుసరింప వలసి ఉంటుంది.

ప్రస్తుత రోడ్లు అధ్వాన్న స్థితిలో ఉన్నప్పుడు, రోడ్ల మొత్తం మైలేజిని పెంచడంవల్ల ఏమీ ఉపయోగం వుండదు. ఆంధ్ర ప్రాంతంలో ఒక చ. మైలుకు రోడ్ల సంఖ్య 0.30. ఇది ఇండియా సగటు ప్రమాణం కంటె కూడా అధికం. ప్రస్తుతపు రోడ్లలో ఎక్కువ వాటి పరిస్థితి ముఖ్యంగా డెల్టా ప్రాంతాలలోని వాటి పరిస్థితి శోచనీయంగా ఉన్నది. అందువల్ల రెండవ మూడవ పంచవర్ష ప్రణాళికలలో ఆంధ్ర ప్రాంతంలో ఉన్న రోడ్ల అభివృద్ధికి అత్యధిక ప్రాముఖ్యాన్నిచ్చారు. అయితే తెలంగాణా ప్రాంతంలోని రోడ్ల పరిస్థితి దీనికి భిన్నమైనది. అక్కడ చ. మైలుకు రోడ్ల మైలేజి 0.118. ఇది ఇండియా సగటు ప్రమాణం కంటె చాలా తక్కువ. అందువల్ల రెండవ, మూడవ పంచవర్ష ప్రణాళికలలో, తెలంగాణా ప్రాంతంలో క్రొత్తరోడ్ల నిర్మాణానికి అధిక ప్రాముఖ్యం ఇవ్వ బడింది. మొదటి, రెండవ ప్రణాళికలలో సాధించిన, మూడవ ప్రణాళికలలో సాధింప దలచిన భౌతిక లక్ష్యాలు, అంచనాల వివరాలు ఇవి:

మొదటి పంచవర్ష ప్రణాళిక :—

	ఆంధ్ర	తెలంగాణా	మొత్తం
వ్యయం. (రు.లక్షలలో)	238.69	99.97	338.66
1. క్రొత్తరోడ్ల నిర్మాణం,	25 మై.	126 మై.	151 మై.
2. తారు రోడ్లు	35½ ,,	50 ,,	85½ ,,
3. సిమెంటు చేసినవి	39½ ,,	—	39½ ,,
4. కంకర వేసినవి	109½ ,,	—	109½ ,,
5. పెద్దవంతెనలు (సంఖ్య)	7	—	7

రెండవ పంచవర్ష ప్రణాళిక :—

	ఆంధ్ర	తెలంగాణా	మొత్తం
వ్యయం.	360.68 (రు.లక్షలలో)	226.29 (రు.లక్షలలో)	586.97 (రు.లక్షలలో)
1. క్రొత్తరోడ్ల నిర్మాణం	44 మై.	298 మై.	342 మై.
2. తారురోడ్లు	295 ,,	436 ,,	731 ,,
3. కంకర రోడ్లు	47	—	47
4. పెద్ద వంతెనల నిర్మాణం (సంఖ్య)	5	—	5

మూడవ పంచవర్ష ప్రణాళిక :—

	ఆంధ్ర	తెలంగాణా	మొత్తం
	400 (రు.లక్షలలో)	200 (రు.లక్షలలో)	600 (రు.లక్షలలో)
1 క్రొత్తరోడ్ల నిర్మాణం	36 మై.	176 మై.	212 మై.

2 సిమెంటు కాంక్రీటు			
చేసిన రోడ్లు	46	17	63
3 తారు రోడ్లు	273	124	397
4 కంకర పోసిన			
రోడ్లు	87	9	96
5 పెద్ద వంతెనలు			
(సంఖ్య)	9	6	15

నాగపూరు ప్రణాళికలో తలపెట్టిన లక్ష్యాలు రెండవ పంచ వర్ష ప్రణాళిక అంతానికి సిద్ధించిన తర్వాత, అన్ని రాష్ట్రాల చీఫ్ ఇంజనీర్లు కలిసి రాబోయే 20 సంవత్సరాలలో మన దేశ వర్తక వాణిజ్య పరిస్థితులను శ్రద్ధగా పరిశీలించిన మీదట ఇరువది సంవత్సరాల పర్యంతం పట్టే ఒక అఖిల భారత రోడ్ల అభివృద్ధి ప్రణాళికను తయారు చేశారు. ఇండియా మొత్తం మీద ఈ రోడ్ల అభివృద్ధి ప్రణాళికకు రు. 5200 కోట్లు ఖర్చు కాగలదని అంచనా వేశారు. అందులో మన రాష్ట్రానికి రు. 480 కోట్లు ఖర్చు అవుతుంది. ఈ రోడ్ల అభివృద్ధి ప్రణాళిక స్థూల లక్ష్యాలు ఇవి.

ప్రతిగ్రామానికి రోడ్డు మార్గాం నుండి ఉండే దూరం—

ప్రదేశంతీరు	కంకర రోడ్డు నుండి	ఏవిధమైన రోడ్డునుండైనా
వ్యావసాయిక ప్రదేశాలు అభివృద్ధి చెందిన ప్రాంతాలు	4 మై.	$1\frac{1}{2}$ మై.
పాక్షికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలు	8 ,,	3 ,,
అభివృద్ధి చెందని ప్రాంతాలు. సేద్యయోగ్యంకాని ప్రాంతాలు	12 ,,	5 ,,

ఆంధ్రప్రదేశ్‌లో, ఈ రోడ్ల అభివృద్ధి ప్రణాళిక మూలంగా, ఈ ప్రణాళిక ఆఖరుకు అంటె 1981 నాటికి చ. మైలుకు ఉన్న రోడ్ల మైలేజి 0.225 నుండి 0.55 కు పెరుగుతుంది.

ఒక దేశం యుద్ధకాలంలో కలహ నివారణకుగానీ, శాంతియుత పరిస్థితులలో తన సంపదను పెంపొందించుకోవటానికిగాని రవాణా సౌకర్యాలను కాంక్షిస్తుంది. నాగపూరు ప్రణాళికలో విజయం సాధించిన ఆంధ్ర ప్రదేశ్, తనకున్న పరిమిత సాధనాలతోనే ఈ "బృహత్తర ప్రణాళిక" ధ్యేయాన్ని సాధించ గలననే ప్రగాఢ విశ్వాసంతో ముందుకు పురోగమిస్తున్నది.

పెదవులేమొ నవ్వు వెక్కిరించు నొసలు
పొట్టనిండ చేదు పుట్టెడుండు
కొంగజపము రీతి కుటిలుల బ్రతుకురా!
జనసుతాంత రంగ! వినుర! రంగ!

కళాకృష్ణుల "కృష్ణశతశతి"

పంచాయతీరాజ్య పురోగమనం

వెనుకబడిన గ్రామాలకు సహాయనిధి

బాలిరెడ్డి పాలెం (నెల్లూరు జిల్లా) పంచాయతీ సమితి సభ్యులు వెనుకబడిన గ్రామాలలో సమాజోపయోగకరమైన కార్యక్రమాల నిర్వహణకై తమకు ప్రయాణభత్యంగా లభించే మొత్తాలతో ఒకనిధిని నెలకొల్పారు. నిధిమొత్తాలను సేవింగ్సు బ్యాంకులో డిపాజిట్ చేశారు. బ్లాకు ప్రజలు వివాహాది కార్యాలలో వినియోగించుకోవడానికి గాను అవసరమైన పాత్ర సామానులను, తదితర పరికరాలను కొనడానికిగాను, పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ ఎస్. చంద్రశేఖరరెడ్డి తమ గౌరవభృతిలో కొంత వాటాను విరాళంగా ఇచ్చారు.

గ్రామీణచైతన్యం

గూడురు పంచాయతీ సమితిలోని తిప్పవరప్పాడు, గ్రామీణ అభ్యుదయానికి చెందిన వివిధ రంగాలలో అతి శీఘ్రకాలంలో ప్రశంసనీయమైన ప్రమాణాన్ని సాధించింది.

గతసంవత్సరం ఈ గ్రామ ప్రజలు రు. 600 లను ప్రోగుచేసి తమ శ్రమదానంతో తమ పంట కాలువకు ఒక ఆనకట్టను నిర్మించడంలో సఫలు రయ్యారు. ఈ నూతన సదుపాయం వల్ల సుమారు 250 ఎకరాల భూమికి అదనంగా నీటి పారుదల కల్గించ గలిగారు. బ్లాకు అధికారం క్రింద ఒక వయోజన విద్యాకేంద్రం కూడా స్థాపించబడింది. గ్రామంలోని యువకులు విరాళాల సేకరణార్థం ఒక నాటకాన్ని ప్రదర్శించి రు. 500 లను ప్రోగుచేశారు. ఈ మొత్తాన్ని ఒక గ్రంథాలయ గది నిర్మాణానికై వినియోగించాలని తలపెట్టారు, ఇంతేకాకుండా ఈ గ్రామస్థులు రు. 13000 ల అంచనాతో రెండుగదుల పాఠశాల భవన నిర్మాణానికై రు. 10000 లను తమ విరాళంగా ఇచ్చారు. 6–7 సంవత్సరాల మధ్య వయస్కులైన బాలబాలికలందరూ పాఠశాలకు వెళ్తున్నారు. గూడూరు పంచాయతీ సమితి స్త్రీలకొరకు రెండు కుట్టు పనికేంద్రాలను తెరచింది. సెప్టెంబరు నెల వరకూ 80 మంది వయోజనులను విద్యావంతులుగా చేసింది.

మారుమూల ప్రాంతంలో పారిశ్రామిక ప్రదర్శనం:

1961 సెప్టెంబరు నెలలో అనంతపురంజిల్లా పెనుకొండలో ఒక పారిశ్రామిక ప్రదర్శనం ఏర్పాటు చేశారు. స్థానికంగాతయారైన అనేకవస్తువులు ప్రదర్శించబడినవి, ఈ ప్రదర్శన అనేకులను ఆకర్షించింది.

గ్రామస్థుల విరాళంతో పాఠశాలభవనం పఠనమందిరం నిర్మాణం.

అనంతపురం జిల్లా ఉరవకొండ సమితి రామపురం కొత్తల గ్రామంలో, ఇటీవల ఒక పాఠశాలభవనం, పఠనమందిరం (రు. 8,000 అంచనా వ్యయం) పూర్తిగా విరాళాలతోనే నిర్మించబడింది.

చిన్నమొత్తాల పొదుపు ఉద్యమం ఒకే రోజున రు. 525 ల వసూలు

నార్సింగి (మెదక్ జిల్లా, రామాయంపేట పంచాయతీ సమితి)లో 1961 సెప్టెంబరు 26 న చిన్న మొత్తాల పొదుపు దినోత్సవం జరిగింది. ఆరోజు రు. 525ల మొత్తం వసూలయింది.

మహిళకొరకు నవారు నేత కేంద్రం

1961 సెప్టెంబరు నెలలో మంగళగిరి పంచాయతీ సమితి అధ్వర్యాన రామచంద్రపురంలో ఒక నవారు నేత కేంద్రం ప్రారంభించారు. ఈ కేంద్రంలో మహిళలకు శిక్షణ నిస్తారు.

బహుమతి పత్రాలపై సర్పంచ్ చే సిట్టింగు ఫీజు డిపాజిట్

ముధోలు పంచాయతీ సమితి (అదిలాబాదు జిల్లా) డీగన్ గ్రామ సర్పంచ్, శ్రీ గడ్డన్న తనకులభించే సిట్టింగు ఫీజు మొత్తాలను ముధోలు పంచాయతీ సమితి పేర బహుమతిపత్రాలకై డిపాజిట్ చేస్తున్నారు. వారి బాండ్లలో దేనికైనా బహుమతి లభిస్తే అది సమితికే చెందుతుంది.

పండ్ల మొక్కలు:

ములుగు పంచాయతీ సమితి (వరంగల్లు జిల్లా) లో 1961 ఆగస్టు నెలలో 1063 పండ్ల మొక్కలను నాటారు. ఆ మొక్కలకైన ఖర్చులో సగం బ్లాకు భరించింది.

గ్రామస్థులచే చెఱువు మరమ్మత్తు

ఇటీవలి భారీవర్షాల కారణంగా వేమల పల్లి గ్రామం (నల్గొండ జిల్లా, మిర్యాలగూడా బ్లాకు)లోని పెద్దచెఱువుకు కొంత దెబ్బతగిలింది. అయితే దీన్ని చూసిన గ్రామస్థులు తమ దురదృష్టాన్ని నిందించుకొంటూ ఊరక కూర్చోలేదు. తమలోతాము కొన్ని జట్లుగా ఏర్పడి పట్టుదలతో పనిచేసి చెఱువును తిరిగి యథాస్థితికి తెచ్చారు.

వ్యవసాయదారుల విజ్ఞాన యాత్ర

మెట్‌పల్లి పంచాయతీ సమితి (కరీంనగర్) జిల్లా ప్రాంతానికి చెందిన కర్షకులను రెండు జట్లుగా నిజాంసాగర్, బోధన్, రాజేంద్రనగర్, హైదరాబాదులకు విజ్ఞానయాత్ర నిమిత్తం తీసుకొని వెళ్లారు. మొదటి జట్టులో ఇబ్రహీంపట్నం, ఇయాలపురం, వేములకుర్తి, మోహనరావు పేటలకు చెందిన 33గ్గురు వ్యవసాయదార్లు, రెండవ జట్టులో అమ్మక్కపేట, సతీరం, మోహనరావు పేటలకు చెందిన 31 మంది వ్యవసాయదారులూ ఉన్నారు. బ్లాకు అధికార్లు ప్రతి ఒక్క పర్యటనకు రు 150 ల చొప్పున విరాళం ఇచ్చారు. ఇందులో మొదటి జట్టువారు సెప్టెంబరు 18వ తేదీని, రెండవ జట్టువారు 26వ తేదీని మెటపల్లినుండి బయలుదేరి వెళ్లారు.

శ్రమదానంతో రోడ్డు నిర్మాణం

నారాయణపూరు (నిజామాబాదు జిల్లా, ఆర్మూరు పంచాయతీ సమితి) గ్రామస్థులు ఆగస్టు నెలలో శ్రమదానంతో ఒక మైలు పొడవుగల రోడ్డును వేశారు. ఈ పని అంతా (రు. 6000 ల అంచనా వ్యయం) అయిదు రోజులలో పూర్తి అయింది.



ఒకనిమాటె వినుచు ఊకొట్టు తీర్పరి
న్యాయమూర్తి కాదు మాయమూర్తి
ఒంటికాలువాడు కుంటి కాకుండునా?
జననుంతాంతరంగః వినురః రంగః

జాతీయ ప్రణాళిక – జాతీయ సమైక్యత

శ్రీ చావలి వెంకటహనుమంతరావు

జాతీయ సమైక్యతను గురించి యీ మధ్య చాలా వింటున్నాము. ఈ విషయాన్ని పునరుద్ఘాటించడం యీ వ్యాసం ఉద్దేశ్యం కాదు. జాతీయ సమైక్యతా సాధనలో అధికార అనధికార వ్యక్తులు, సంస్థల బాధ్యత యెంతో యిందులో వివరిస్తాను. జాతీయాభివృద్ధి పైననే జాతీయ సమైక్యతా సాధన ఆధారపడి ఉంటుంది. వీటి రెంటికి అవినాభావ సంబంధముంది, అవి విడదీయరానివి. దేశంలోని విస్తృత ప్రాంతాలలో పనిచేసే నిర్వహణా సంస్థలు దీక్షతోను విధేయతగా పనిచేస్తే యీ లక్ష్యసాధన సుసాధ్యం అవుతుంది. జాతీయ సమైక్యతా సాధన, పంచవర్ష ప్రణాళికల అమలు—యీ రెంటికీ గల సంబంధం అంతగా బహిర్గతం కాదుకానీ, స్థూలంగా పరిశీలిస్తే వీటి అనుబంధం మనకు ద్యోతక మౌతుంది. పంచవర్ష ప్రణాళికలు విజయవంతం కావడానికి ప్రజల సహకారం యెంతో అవసరమనే విషయం అందరూ అంగీకరించినదే. ప్రణాళికా రచన ముఖ్య ఉద్దేశ్యం కొన్ని ముఖ్య లక్ష్యాల సాధనమే. ఉదరహణకు, జాతీయ ఆదాయాభివృద్ధి, ఆర్థిక, సామాజిక అసమానతల తొలగింపు, వ్యవసాయాభివృద్ధి, పరిశ్రమల అభివృద్ధి వగైరా. యీ విధంగా పూర్తి జాతికి వర్తించేవి యీ ప్రణాళికలు. యివి జాతీయ ప్రణాళికలు. 1961 జూలై 5వ తేదీన కేంద్ర ఉద్యోగుల నుద్దేశించి ఒక విజ్ఞప్తి చేస్తూ ప్రణాళికను "ఒక శక్తివంతమైన సాధన" గా వర్ణించారు మన ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూ. జాతీయ ప్రణాళికగా గుర్తించిన కారణంగాను, శక్తివంతమైన సాధన మూలంగా దీన్ని అమలు చేయుటలో ప్రజల పూర్తి సహకార సహాయాలు యెంతో అవసరం. యితర లక్ష్యాలలో, మార్గాలలో విభిన్న తత్వాలు ఉన్నా జాతీయ లక్ష్యం గల ప్రణాళికల అమలుకై అన్ని వర్గాలవారి సహకారం అవసరం యెంతైనా ఉంది. యీ జాతీయ లక్ష్య సాధనకై కుల, మత, వర్గ, ప్రాంతీయ, భాషా, దురభిమానాలను విడనాడటం యెంతో ముఖ్యం. అదే విధంగా జాతీయ ఆర్థికాభివృద్ధికై, జాతీయ అవసరాల ప్రాముఖ్యతను గుర్తించి యిప్పుడు ఉన్న అనైక్యతా పరిస్థితులను రూపుమాపాలి. యిన్ని సంవత్సరాలు క్రమంగా సాధించిన అభివృద్ధిని జాతీయ మూలనిధిగా భావించాలి. అది భవిష్యత్ పురోభివృద్ధికి ప్రాతి పదిక కావాలి. దీనిని దృష్టిలో పెట్టుకొని జాతీయ సమైక్యతా ప్రాముఖ్యాన్నీ అవసరాన్నీ గురించి బాగా ప్రచారం చేయాలి. అంతేగాక మన పురోగమనానికి కావలిసిన ప్రణాళికా అవసరాన్ని, వాటిని జాతీయ స్థాయిలో అమలు పరచవలసిన ఆవశ్యకతను గూర్చి ప్రబోధం చేయాలి. జాతీయ ఆర్థికాభి వృద్ధికి తద్వారా ప్రజల సాంఘిక సంపదాభి వృద్ధికై యివి ఉద్దేశించ బడ్డాయనే సత్యాన్ని ప్రజలు గుర్తించాలి. జాతి సమైక్యంగా ఉన్నప్పుడే జాతీయ ఆర్థిక సాంఘికాభి వృద్ధి సుసాధ్య మౌతుంది. దేశంలోగల వివిధ మత భాషాది వర్గాల వారు మొదట భారతమాత బిడ్డలుగా భావించి, దేశసమైక్యతకై పాటు పడి తద్వారా దేశప్రతిష్ఠను పెంపొందించాలి.

జాతీయ సమైక్యతను భంగపరచే మత సంకుచిత దృష్టిని విడనాడాలని అందుకై వివిధ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, విద్యార్థులు, పత్రికలు, ప్రతి పౌరుడు కొన్ని నియమాలను సూత్రాలను పాటించాలని యీ మధ్యనే కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. పార్టీలు, వ్యక్తులు జాతీయ దృక్పథాన్ని అలవరచుకొని, మత, వర్గ ప్రాంతీయ, భాషా దురభిమానాలను విడనాడుట వీటి ముఖ్యోద్దేశ్యం. జాతీయ లక్ష్యాన్ని సాధించుటకు మనమందఱం ఏకీకృతంగా, సుసంఘటితంగా పని చేయాలి. అనైక్యత యిప్పుడే భయంకరంగా వ్యాపించినదని దీని అర్థం యెంతమాత్రమూగాదు. యీ మధ్యకాలంలో కొన్ని ప్రాంతాల్లో జరిగిన ఉదంతాలవల్ల భవిష్యత్తులో యెట్టి అవాంఛనీయమైన పరిస్థితులు ఏర్పడకుండా ఉండుటకే ముందు జాగ్రత్తగా పై చర్యలు అవసరమైనవి.

జాతీయ ప్రణాళికలో నిర్దేశించిన వివిధ ఆర్థిక సాంఘిక పథకాలను విజయవంతముగా అమలుజేయుట జాతీయ సమైక్యతకు యెంతో అవసరమనే విషయం రూఢి అయినది. యీ లక్ష్య సాధ

(మిగతా 22 వ పేజీలో)

విద్యాభివృద్ధి - తృతీయ ప్రణాళిక

శ్రీ గోపాలరావు ఎక్బోటే

స్థూల దృష్టితో చూచినట్లయితే మనకు మానవుల్లో రెండు రకాల వారు కనిపిస్తారు. ఒక రకం వారు ఆశావాదులైతే మరొక తరహా వారు నిరాశావాదులు. మంచి రోజులు ముందున్నాయనీ, రేపటి దినం నేటికంటే ఉత్సాహకరంగా వుండగలదని ఆశావాదులు విశ్వసిస్తారు. కాగా గడిచిన రోజులే మంచివనీ నేటి కంటే గడ్డుగా రేపటిదినం వుండగలదని నమ్ముతారు, నిరాశావాదులు. ఈ నాడు మన దేశంలో సగటు మనిషి ఈ రెండు వర్గాలకు ఇంచుమించు సరిసమానంగా ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. దీనికి కారణం మనదేశ విద్యావిధానమేనని చెప్పవచ్చును. మన దేశంలో అనుసరించ బడుతున్న విద్యావిధానం ఒక వంక ఆశ, ఉత్సాహాలను కల్గించేదిగా వుంటూనే మరొక వంక నిరాశా నిస్పృహలు జనింప చేసేదిగా కూడా వుంటున్నది.

భారతదేశంలో అమల్లోవున్న విద్యావిధానాలను పునర్వ్యవస్థీకరించే విషయాన్ని అనేక దృక్పథాలనుంచి పరిశీలించ వలసి వుంటుంది. విద్యాభివృద్ధి కార్యక్రమాలను రూపొందిచటంలో ఆర్థిక అంశం ప్రధాన పాత్ర వహిస్తుందనే విషయం సుస్పష్టం

విద్యాపునర్నిర్మాణ పథకాలను ఆర్థిక పరిస్థితి ననుసరించి రూపొదించటం జరుగుతుండటంవల్ల ధనాభావం కారణంగా ఈ పథకాలకు తగు ప్రోత్సాహం లభించకపోవటం మనం చూస్తున్నదే. సమాజంలో ప్రబలంగావున్న అజ్ఞానం. మూఢ విశ్వాసాలను నిర్మూలించటం విద్యాపునర్నిర్మాణ పథకాల ప్రధాన లక్ష్యంగా వుండాలి. వీటి నిర్మూలనపట్ల ఈ నాడు దేశంలో 13 సంవత్సరాల క్రిందటికంటే ఎక్కువ చైతన్యం కానవస్తున్నది. అయినా విద్యాభివృద్ధికి వుంటున్న అవరోధం తొలగలేదు. దేశంలో ప్రస్తుతం కానవస్తున్న చైతన్యాన్ని పెంపొందించి. బాలబాలికలనూ పౌరులను ఇతోధింగా విద్యావంతులను చేయటానికి ప్రతిపౌరుడు యథాశక్తి కృషి చేయాలి. కడచిన 100 సంవత్సరాల మంచి కూడా విద్యా రంగం పరిస్థితి నిరుత్సాహంగానే వుంటున్నది నిధుల కొరత పోతే విద్యా కార్యక్రమాలకంటే ఏ విధంగాను ముఖ్యమైనవిగా భావించటానికి వీల్లేని ఇతర కార్యక్రమాలకు ప్రాధాన్యత లభించటమేదీనికి కారణం బ్రిటిష్ పరిపాలనలో ఈ విధానాలు అమల్లో వుండేవి. ఆ ఛాయలు ఇంకా మనను వెంటాడుతూనే వున్నాయి.

ప్రపంచంలో అన్నింటిలోకీ ప్రథమ స్థానం మానవుడికివ్వాలన్న విషయం ఇంకా గమనింప బడటంలేదు. ప్రాజెక్టులు పరిశ్రమలు ఇవన్నీ ఆ తరువాతి క్రమంలోనే రావాలి. కాబట్టి ఈ భౌతిక ప్రణాళికల పైకంటే మానవ బుద్ధి వికాసానికి అవశ్యకమైన సాధనాలపై ఎక్కువగా పెట్టుబడి పెట్టటం అవసరం. ఏ దృష్ట్యానైనా ఇది వాంఛనీయమే. వివిధ ప్రణాళికలన్నీ మానవ సంక్షేమానికి ఉద్దేశింప బడినవే. భౌతికాభ్యుదయం సాధించటం, ఆ లక్ష్య సాధనకు కృషి చేసే మనుష్యుల ప్రతిభా సామర్థ్యాలపై ఆధారపడి వుంటుంది. సమాజంలో తీవ్రంగా విద్యావ్యాప్తి జరగనిదే ఉన్నత విద్యాప్రమాణాలను నెలకొల్పనిదే నేటి క్లిష్ట పరిస్థితులను తట్టుకోలేము. విభిన్న సాంఘిక సంక్షేమ పథకాలలో విద్యాభివృద్ధి కార్యక్రమాలు ప్రముఖ స్థానాన్నలంకరిస్తాయి. ఎందుచేతనంటే దేశ సామాజిక, ఆర్థిక పరిస్థితుల ఉన్నతి వాటిపై ఆధారపడి వుంటుంది. సాంఘిక రాజకీయ కారణాల దృష్ట్యా సాంఘిక న్యాయం దృష్ట్యా విస్తృతంగా విద్యా వ్యాప్తి జరగటం అవసరమనే విషయాన్ని గుర్తిస్తున్నాము. కాని మన పారిశ్రామిక సాంకేతిక వ్యవసాయాభివృద్ధి పథకాల విజయం కూడా దీనిపైననే ఆధారపడివుందనే సత్యాన్ని విస్మరిస్తున్నాము. కనుకనే విద్యా పథకాలకు పై రంగాలకు చెందిన పథకాలకంటే తక్కువ ప్రాధాన్యం ఇవ్వటం జరుగుతున్నది. ఆర్థిక, వైజ్ఞానాభివృద్ధికి విద్య మూలాధారం అన్న విషయాన్ని తెలుసుకున్నట్లయితే విద్యా పథకాల పట్ల ఉపేక్షాభావం తొలిగిపోగలదు.

పదమూడు సంవత్సరాల మన స్వరాజ్యంలో కొంత అభివృద్ధి కచ్చితంగా జరిగింది. మొదటి, రెండవ ప్రణాళికా కాలాలలో జరిగిన అభివృద్ధిని కాదనలేము ఈపురోగమనాన్ని ఎవ్వరూ నిరోధించలేరు. అందుకు ఎవ్వరైనా పూనుకుంటే ఆ ప్రయత్నంలో వారికి భంగపాటు జరగటం తథ్యం ఈ విషయాన్ని అంతా అంగీకరిస్తారు. కాగా విద్యాభివృద్ధికై అనుసరించే మార్గం విషయంలోనే మనలో ఏకీభావంలేదు. మున్నెన్నడూ లేనంత వేగంగా ముందుకు సాగాలంటారు కొందరు. ఈకృషి నెమ్మదిగానే కొనసాగాలంటారు మరికొందరు. దీనినిబట్టి పురోగమించాలనే మనమంతా అనుకుంటున్నప్పటికీ ఈ ప్రయత్నం వేగవంతంగా జరిగితే కాలక్రమేణ అది తిరోగమనంగా పరిణమించవచ్చనే భయం కొందరికున్నట్టు విదితమవుతుంది. దీనిని మనం పరిమాణం, ప్రమాణాల విషయంలోవచ్చిన సంఘర్షణగా తీసుకోవచ్చు. కనక పాఠశాలల్లో ఉత్తమ విద్యా ప్రమాణాలను నెలకొల్పుతూ వాటిలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించటమే సరైనమార్గం. దీనితో అంతా ఏకీభవిస్తారనుకుంటాను.

కేటాయింపులు

మన విద్యారంగానికి సంబంధించిన ఈ అంశాలతో పాటు దీని కేటాయింపులను గురించికూడా తెలుసుకోవడం ఉపయుక్తం. మొదటి ప్రణాళికలో విద్యా పథకాలకు రూ. 169 కోట్లు కేటాయించారు—కేంద్రానికి రూ. 44 కోట్లు, రాష్ట్రాలకు రూ. 125 కోట్లు—రెండవ ప్రణాళికలో రూ. 275 కోట్లు—కేంద్రం రూ. 68 కోట్ల రాష్ట్రాలు రూ.207 కోట్లు-కేటాయించబడినాయి. మొదటి ప్రణాళికకంటే రెండవ ప్రణాళిక కేటాయింపు అధికం. అయితే మొదటి ప్రణాళికలోమొత్తం పెట్టుబడిలో విద్యకు చేసిన కేటాయింపునూటికి 7వ వంతు కాగా రెండవ ప్రణాళికలో 6 వ వంతును మాత్రమే ఈ పద్దుకు ప్రత్యేకించడం జరిగింది. కేంద్రం కేటాయింపులో నుంచి 1958—59 వ సం. లో నూటికి 26 వంతులు సాంకేతిక విద్యకు, 21 వంతులు ప్రాథమిక విద్యకు, 18 వంతులు సెకండరీ విద్యకు, 12 వంతులు విశ్వవిద్యాలయ విద్యకు, 9 వంతులు ఇతర అంశములకు, 14 వంతులు ఉపకార వేతనాలు సాంఘిక సంక్షేమానికి ఖర్చు చేశారు. దేశంలోని రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలలో మూడింటిలో 1958—59 వ సం.లో వాటి బడ్జెటు ప్రతిపాదనలలో నూటికి 25 వంతులకు పైగా విద్యా పథకాలకు కేటాయించటం జరిగింది. తొమ్మిది రాష్ట్రాలకు 20—25 వంతుల మధ్య పోతే మిగతా రెండింటికి 10వ వంతుకంటే తక్కువ మొత్తాలు కేటాయించడమైనది. ఈ సంవత్సరం (1958—59) లో విద్యాపథకాలకు అత్యధిక మొత్తం ప్రత్యేకించిన ఘనత బొంబాయికి దక్కుతుంది. యు.పి., ఎం.పి. మద్రాసు, పశ్చిమ బెంగాలు రాష్ట్రాలు వరుసగా ఆ తరువాతి స్థానాలు ఆక్రమించాయి. మొత్తం రు. 100 కోట్లలో మన రాష్ట్రంలో 1961—62 సంవత్సరం బడ్జెటులో విద్యకై రు. 17.43 కోట్లు కేటాయించారు. ఒకవేళ యీ మొత్తమంతా ఖర్చుచేసినా—(చేస్తేఘనకార్యమే) రాష్ట్రం ఖర్చుచేసే మొత్తం రు. 160 36 కోట్లలో యిది 9.41% శాతం కాగలదు. రాబడి దృష్ట్యాఖర్చును అంచనా వేస్తే యిది 17 శాతం మాత్రమే కాగలదు. ఆంధ్రప్రదేశ్ విద్యా విషయాలలో వెనుకబడి ఉండుటకు యితర కారణాలతో పాటు యిదికూడా ఒకటి కాగలదు. విద్యా విషయంలో యితర రాష్ట్రాలతో మన రాష్ట్రాన్ని పోల్చిచూస్తే చెప్పుకో దగినంతగా అభివృద్ధి సాధించలేదనే తెలుస్తుంది. ప్రతి ప్రణాళికా మనను యితర రాష్ట్రాలకన్నా ఒక్కొక్క మెట్టు వెనుకకు పడేస్తున్నట్టుగా కన్పిస్తుంది. ఉదాహరణకు: మొదటి ప్రణాళిక ఆఖరుకు 6—11 మధ్యవయస్సుగల బాలల విద్యావ్యాప్తి విషయంలో భారతదేశంలో మన రాష్ట్రం 7వ స్థానం ఆక్రమించింది. రెండవ ప్రణాళికా ఆఖరుకు మనం 8వ స్థానానికి దిగాము. అదే విధంగా 11—14 మధ్య వయస్సుగల బాలల విద్యావ్యాప్తిలో మన స్థానం 9 కాగా రెండవ ప్రణాళిక ఆఖరుకు 10వ స్థానానికి వచ్చాం. 14—17 మధ్య వయస్సుగల బాలల విద్యావిషయంలో మొదటి ప్రణాళికా ప్రారంభంలో 8వ స్థానం కాగా ప్రణాళిక ఆఖరుకు 9కి దిగాం, విద్యావ్యాప్తికై మనం యెన్ని అభివృద్ధికర మార్గాలను అవలంబించినా యితరరాష్ట్రాలకన్నా మనం వెనుకబడే ఉన్నామని తెలుస్తుంది. అక్షరాస్యతదృష్ట్యా చూచినా యితర రాష్ట్రాలు సాధించిన అభివృద్ధికి మనరాష్ట్రాన్ని పోల్చుకోలేం. ప్రణాళికలో, రాష్ట్ర బడ్జెటులోను విద్యకై చాలాతక్కువ కేటాయింపులు జరిగినా, కేటాయించిన మొత్తాన్ని వివిధ స్థాయిలలో సరైన మార్గాన పంపిణీ జరగాలి. యిక్కడ కూడా ప్రాధాన్యత ప్రశ్న తలెత్తుతుంది. విద్యావ్యాప్తిలో గల వివిధ దశలలోని అవసరాలు, వాటి ప్రాధాన్యతను గుర్తించి సమాన ప్రతిపత్తియివ్వాలి. వివిధ దశల వైవిధ్యం వాటి అవసరాలు నిజంగా గుర్తించాల్సినవే. మొత్తం మీద చూస్తే యీ వివిధ దశలు కూడా అసలు లక్ష్యంలోని అంతర్భాగాలే కాకుండా ఒకదానికొకటి ముడి పడి ఉన్నవి. యివన్నీ తగినన్ని వనరులులేని కారణాన ఉదయించినట్టివే. విద్యతోపాటు యితర అన్ని విషయాలలోను మన దేశంయితర దేశాలకన్నా చాలా వెనుకబడిఉన్న కారణంగా తగినన్ని కేటాయింపులు జరుగుటసాధ్యం కాకపోవచ్చు. అంతమాత్రాన విద్యావ్యాప్తిలోని యే దశను మనంవిస్మరించడంగానీ, తక్కువ

చూడటంగాని జరగకూడదు. మనకు ఉన్న తక్కువ వనరుల దృష్ట్యా. దేనికి ప్రాధాన్యం యివ్వాలో దేనికెంత కేటాయించాలో జాగ్రత్తగా పరిశీలించి ఆ విధంగా కేటాయింపులు చేయాల్సి ఉంటుంది. విద్యావ్యాప్తి వివిధ దశలలో దేనికి ప్రాధాన్యం యివ్వాలనే ప్రశ్న ఉండనే ఉన్నది. విద్యానాణ్యత విద్యా పరిమాణాల రెంటి సమన్వయం జరగాలి. మొదటి రెండు ప్రణాళికలలో యీవిషయమై చాలా తర్జనభర్జన జరిగింది. దాని ఫలితంగా ప్రాథమిక విద్యా వ్యాప్తికి పరిమాణ వైఖరిని, విశ్వవిద్యాలయం, సెకండరీ విద్యా వ్యాప్తికై నాణ్యతను దృష్టిలో ఉంచుకొని పథకాలను అమలు పర్చారు. వ్యక్తి, సామాజిక అవసరాలను కూడా దృష్టిలోఉంచారు. రాష్ట్రంలో విద్యావ్యాప్తిని విస్తరింపజేయడానికి మనకు తగినన్ని వనరులులేని కారణాన దీనికై జరిగే కేటాయింపులు చాలా జాగ్రత్తతో చేయాలనే విషయంలో రెండు అభిప్రాయాలు లేవు. అన్ని రకాలైన అనవసరపు వ్యయాలను తగ్గించాలి. తక్కువ ఖర్చుతో కనీస విద్యా స్థాయినైనా కల్గించుట ఉత్తమమైనది. ఆర్థికంగాను విద్యావిషయకంగాను అభివృద్ధిజెందిన దేశాలలో విద్యనభ్యసించడం మన దేశంలో కన్నా చాలారెట్లు ఖర్చుతో కూడినపని అనే విషయాన్ని మనం గుర్తించుకోవాలి. మన పొరుగు దేశాలైన సిలోను, థాయిలాండులో యీ ఖర్చు మరీయెక్కువ. వచ్చేసంవత్సరాలలో ప్రతి సంవత్సర బడ్జెటులో విద్యకై 25 శాతం కేటాయింపు ఉండాలి. రాష్ట్ర ప్రణాళికలోని మొత్తంలో 10 శాతం కన్నా యెక్కువగా కేటాయించాలి. అప్పుడే విద్యా నాణ్యత గాని, పరిమాణంగాని అభివృద్ధి జెందే అవకాశం ఉంటుంది.

యితోధిక మొత్తాల కేటాయింపు

పన్నుల విషయమై చర్చిల్ అన్న మాటలను కొద్ది మార్పులతో విద్యకై చేసే ఖర్చు విషయములలో కూడా మనం అన్వయించుకోవచ్చు. విద్యకై చేసే ఖర్చు పెరిగింది, పెరుగుతున్నది, యికముందు పెరుగుతుంది కూడా. యెన్నో కారణాల వల్ల యీ ఖర్చు పెరిగింది. అన్ని దశల విద్యా వ్యాప్తివల్ల యిలా జరుగుతున్నది.

విద్యా వ్యాప్తికై డబ్బు సమస్య వచ్చినప్పుడు విశ్వవిద్యాలయాలను మనం విస్మరించరాదు. 4300 లక్షల జనాభాకు 40 విశ్వ విద్యాలయాలు ఉన్నవి. పశ్చిమ రాజ్యాలతో పోల్చి చూస్తే యిది అంత చెప్పుకోదగిన సంఖ్య కాదు. దక్షిణాఫ్రికాలో 20 లక్షల జనాభాకు 5 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. కెనడాలో 90 లక్షల జనాభాకు 13 విశ్వవిద్యాలయాలు ఉన్నవి. ఆస్ట్రేలియాలో $50\frac{1}{2}$ లక్షలకు 7 విశ్వ విద్యాలయాలు ఉన్నాయి. అదే విధంగా భారత దేశంలోని విశ్వ విద్యాలయం విద్యార్థుల నిష్పత్తి కూడా యితర దేశాలకన్నా చాలా తక్కువగా ఉంది. భారత దేశంలో ప్రతి 1400 మంది విద్యార్థులకు ఒక విశ్వ విద్యాలయం ఉంటే యు.యస్.ఏ లో 70 మంది విద్యార్థులకు ఒక విశ్వ విద్యాలయం, బ్రిటన్‌లో 700 విద్యార్థులకు ఒక విశ్వ విద్యాలయం ఉన్నది. యీ విధంగా భారతదేశంలో విశ్వవిద్యాలయాల సంఖ్య విద్యార్థుల నిష్పత్తి చాలా తక్కువగా ఉన్నదని స్పష్టమవుతున్నది. యిప్పుడు అభివృద్ధి సాధించిన విశ్వవిద్యాలయ విద్యారంగంలో మనం సాధించాల్సినది చాలా ఉన్నది. విశ్వవిద్యాలయాలపైజరిగే ఖర్చు సహజంగానే చాలాపెరిగింది. భవిష్యత్తులో గూడా పెరుగుతుంది.

సెకండరీ విద్యావిధానంలో మార్పులకారణంగా వీటి ఖర్చు కూడా పెరిగింది. ఉపాధ్యాయుల జీతాల పెరుగుదల కారణంగా ఖర్చులు అధికమయినాయి. నూతన విధానాల ద్వారా విద్యాబోధన పటిష్ఠంగా జరగాలంటే ఉపాధ్యాయులకు సరైన జీతాలు యివ్వాలి. ప్రభుత్వం పే కమిషన్ సిఫార్సులను కొన్నింటిని ఆమోదించి అమలు జరిపినా, ఉపాధ్యాయుల జీతాల విషయం యింకా అపరిష్కృతంగానే ఉన్నవి. భవనాలు, పరికరాలు పరిశోధనాలయాలు, లైబ్రరీల నిమిత్తం చాలా ఖర్చుజరిగింది. విద్యకై అనువైన పరిస్థితులను కల్పించుచే నేటి ఉత్తమ విద్యనిర్వచనం యీ విషయాన్ని నిశితంగా గుర్తించకుండా సెకండరీ విద్యా ఫలితాలను యెక్కువ ఆశించడం భావ్యంగాదు.

ప్రాథమిక విద్య:

వంద యేండ్లనుంచీ ప్రాథమిక విద్యను విస్మరిస్తూవచ్చారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతనే పెక్కుమంది విద్యార్థులకు ప్రాథమిక విద్యా సౌకర్యం కల్పించే ప్రయత్నాలు జరిగినవి. యీ సంవత్సరంనుండీ రాష్ట్ర వ్యాప్తంగా ఉచితనిర్బంధ ప్రాథమిక విద్యా పథకం అమలువల్ల ఖర్చు చాలా వరకు పెరిగే అవకాశం ఉంది. బేసిక్ విద్యావిధానాన్ని జాతీయ ప్రాతిపదికపై అమలు జరుపుటపై జరిగే ఖర్చును గురించి కూడా చర్చలు జరుగుతున్నాయి. పాఠశాలకు వెళ్ళే వయస్సు ఉన్న పిల్లలందరికి ప్రాథమిక విద్యా పథకాన్ని అమలు జరిపినయడల, అందులో యే కొద్ది మందో సెకండరీ, ఉన్నత విద్యలకు వెళ్తారు కాబట్టి, యీ ప్రాథమికవిద్యను పటిష్ఠంగా బోధించే వీలు ఉండాలి. వికేంద్రీకరణ పథకం అనుసరించి 1959 సంవత్సరంనుండి అన్ని ప్రాథమిక, సెకం

డరీ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం, జిల్లాపరిషత్తులకు, పంచాయితీ సమితులకు ఒప్పగించింది. అంత మాత్రాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగంనుండి తప్పుకున్నట్లుగా భావించరాదు. విశ్వవిద్యాలయాల సమన్వయం స్థాయి నిర్ణేబాధ్యత మినహా రాజ్యాంగం ప్రకారం విద్యా విషయం రాష్ట్రం పరిధి లోనిదే. యీ విషయం దృష్ట్యా ప్రాథమిక, సెకండరీ విద్యా విషయంలో, ప్రత్యేకంగా ఉత్తమ పౌరులుగా శిక్షణ యివ్వటంలోగల పూర్తిబాధ్యత కేంద్రానికి సహజంగా ఉండదు. 14 సంవత్సరాల వయస్సుగల ప్రతి పౌరునికి ఉచిత నిర్బంధ విద్య గరపాలని మన రాజ్యాంగంలో నిర్దేశించబడింది. యీ విధంగా యీ బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటిపై కూడా ఉన్నది. జిల్లాపరిషత్తు, పంచాయితీ సమితుల ఆర్థిక పరిస్థితులు, యీ వసతులు కల్పించే శక్తిని యివ్వజాలవు. అందుకే సెకండరీ, ప్రాథమిక విద్యావ్యాప్తికై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ సహకార పూర్వకంగా నిర్వర్తించాలి.

కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్న ఆర్థిక వనరులు విద్యా సమస్య ప్రాముఖ్యత తెల్సినమనం, విద్యావ్యాప్తికై దొరికే ప్రతి అవకాశాన్ని లక్ష్యసాధనకై వినియోగించుకోవాల్సిన అవసరం యెంతోకలదు.

జాతినిర్మాణానికి విద్యయెంతో ప్రాముఖ్యం వహిస్తుంది కాబట్టి దీనిపై యెంత ఖర్చుచేసినా తక్కువగానే భావించాలి. ప్రారంభంలో విద్యకై ఖర్చుచేసే దానితో పెద్ద లాభం కలుగక పోవచ్చును. ఉద్దీపనశక్తిని కల్గించి, అర్హతశక్తిగల వారిని వెలుగుకు తీసుక రావటమే వీటి ఫలితం.

(ఇంగ్లీషు మూలానికి అనువాదం)

జాతీయ ప్రణాళిక – జాతీయ సమైక్యత

(18 వ పేజీ తరువాయి)

నకై ప్రతి భారతీయుడు అతను యేమి చేసినా దీనికి అనుగుణంగాను, దోహదకరంగాను వ్యవహరించాలి. కేంద్ర ప్రభుత్వోద్యోగులకై ప్రధానమంత్రి చేసిన విజ్ఞప్తి అందరికు వర్తిస్తుంది. ప్రధాన మంత్రి తన విజ్ఞప్తిలో యిలా అన్నారు.

"ప్రజల భావ సమైక్యత కొరకు, జాతీయ సమైక్యతను పెంపొందించుటకు మనలో ప్రతి ఒక్కరు కష్టించి పని చేయాలి"

మనం కలలుగనే భారత దేశాన్ని నిర్మించుటకు, అధికార అనధికారులు నిర్వహించే కార్యక్రమాలలో జాతీయ భావ సమైక్యతా ధోరణి ద్యోతకం కావాలని అయన విజ్ఞప్తి చేశారు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రణాళికా ప్రబోధ ప్రచారం చేసే భారత ప్రభుత్వం ప్రచార సంస్థలకు, ప్రజలలో సమైక్యతా భావాన్ని కల్గించేందుకు చక్కని అవకాశాన్ని కల్గిస్తుంది. సాంస్కృతిక, ఆర్థిక, సాంఘిక అభివృద్ధికై పాటుపడే యితర అధికార, అనధికార సంస్థల, వ్యక్తుల సహకారంతో వారు సమైక్యతా భావాన్ని కల్గించే బాధ్యతను స్వీకరించి దానికై పాటుపడాలి. ఫిల్ము ప్రదర్శనాలు, రేడియో, పత్రికా వగైరా సాధనాలను కూడా దీనికై వినియోగించాలి. ముందుగానే చెప్పినట్లు, జాతీయ ప్రణాళికా విజయం, అధికార అనధికారుల చర్యలపై ఆధారపడి ఉంటుంది....

(ఇంగ్లీషు మూలానికి అనువాదం)

రచయితలు

1 తెలుగులెంక శ్రీ తుమ్మల సీతారామమూర్తి, అప్పికట్ల, బాపట్ల తాలూకా, గుంటూరు జిల్లా.

2 డాక్టర్ గిడుగు వేంకట సీతాపతి, హైదరాబాదు—4.

3 శ్రీ జంధ్యాల లక్ష్మీనారాయణ శాస్త్రి, ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ కళాశాల, అనంతపురం.

4 శ్రీ జి.వి.రామమూర్తి. దక్షిణ భారత ప్రెస్సు, హైదరాబాదు-4

5 శ్రీ కన్నెకంటి వీరభద్రాచార్యులు, (పల్నాటి సోదర కవులు) మోర్జంపాడు, పలనాడు తాలూకా, గుంటూరు జిల్లా.

6 శ్రీ మధురాంతకం రాజారాం, మొగలాల, చిత్తూరు జిల్లా.

7 శ్రీ యస్.శ్రీనివాసాచార్యులు, తెలుగు పండితులు, జిల్లాపరిషత్తు హయ్యర్ సెకండరీస్కూలు, జమ్మికుంట, కరీంనగరు జిల్లా.

8 డాక్టర్ దివాకర్ల వేంకటావధాని, రీడరు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు—2

9 శ్రీ జ్ఞానానందకవి, తెలుగు పండితులు, మక్‌లారిన్ హైస్కూల్, కాకినాడ.

10 శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు, స్పీకరు, ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ, హైదరాబాదు.

11 శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు, ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ కళాశాల, రాజమహేంద్రవరము.

12 శ్రీ యం.గున్నేశ్వరరావు, ఎక్స్టెన్షన్ ఆఫీసరు, గుంటవాడ పంచాయతీ సమితి, విశాఖపట్టం.

13 శ్రీ ఆర్. శ్రీమన్నారాయణశర్మ, ప్రధానోపాధ్యాయులు. జిల్లా పరిషత్తు సెకండరీ పాఠశాల, చినమాధవరం, నల్లగొండ జిల్లా.

14 శ్రీ ముద్దంశెట్టి హనుమంతరావు, ఖరగ్‌పూర్, పశ్చిమబెంగాలు.

15 శ్రీ చింతా హనుమంతరావు. గోకవరం, తాళ్ళపాలెం, కృష్ణా జిల్లా.

16 శ్రీ శ్రీనివాస సోదరులు, శతావధానులు, సికింద్రాబాదు

17 శ్రీ పి.వి.యల్.యన్.రావు, జిల్లా పౌర సంబంధ శాఖాధికారి, అనంతపురం.

18 శ్రీ యం.వి.రమణారావు, తెనాలి, గుంటూరు జిల్లా.

19 శ్రీ బృందావనం రంగాచార్యులు, సీనియర్ తెనుగు పండితులు వై.ఆర్. హైస్కూలు, పర్చూరు, గుంటూరుజిల్లా.

20 శ్రీ కేశిరాజు వేంకట నృసింహ అప్పారావు, ఉపాధ్యక్షులు, సంస్కృత కళాశాల, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లా.

21 డాక్టర్ యస్. గోవిందరాజులు, ఉపాధ్యక్షులు, శ్రీ వేంకటేశ్వర విశ్వకళా పరిషత్తు తిరుపతి, చిత్తూరుజిల్లా.

22 శ్రీ దామోదరం సంజీవయ్య, ముఖ్యమంత్రి, హైదరాబాదు.

23 ప్రొఫెసర్. ఎస్.వి.అయ్యర్, డైరెక్టర్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనమిక్స్, హైదరాబాదు.

24 శ్రీ కె. భాస్కరం, లెక్చరర్, వ్యవసాయ కళాశాల, హైదరాబాదు.

25 శ్రీ చావలి వెంకట హన్మంతరావు, పంచవర్ష ప్రణాళికా ప్రచారశాఖ ప్రాంతీయాధికారి, హైదరాబాదు.

26 శ్రీ గోపాలరావు ఎక్బోటే, అడ్వొకేటు, హైదరాబాదు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

వైశాల్యం	....	1,06,052 చదరపు మైళ్ళు
జనసంఖ్య	... .	35,977,999*
పురుషులు	....	18,175,349*
స్త్రీలు	....	17,802,650*
సగటు వర్షపాతం	....	35.65"
అరణ్య ప్రదేశం	....	1,40,26,000 ఎకరాలు
జిల్లాలు	....	20
తాలూకాలు	....	189
రెవిన్యూ సర్కిళ్లు	....	1,000
పట్టణాలు	... .	223
గ్రామాలు	....	28,945
పంటలక్రింది ప్రదేశం 58-59	... .	2,73,02,000 ఎకరాలు
కొళ్ళ సంఖ్య	....	42,45,832
1958-59 లో నీటి పారుదలను పొందిన ప్రదేశం	....	86,29,900 ఎకరాలు
1958-59 లో వుత్పత్తి అయిన ఆహారధాన్యాలు	....	161,56 లక్షల టన్నులు
పాల వుత్పత్తి	....	15,5 లక్షల గాలన్లు
రైలు మార్గాలు	....	3009.13 మైళ్ళు
జాతీయ రహదార్లు	....	1,415 ,,
రాష్ట్ర రహదార్లు	....	3593 ,,
జిల్లా పెద్ద రోడ్లు	....	8220 ,,
జిల్లా ఇతర రోడ్లు	....	2852 ,,
గ్రామాల రోడ్లు	....	3442 ,,
పాఠశాలలు	... ...	36,375
కళాశాలలు 1959-60	....	113
వృత్తి విద్యా కళాశాలలు	....	36
తృతీయ పంచవర్ష ప్రణాళిక ప్రమాణం	రూ.	305 కోట్లు

1961-62 బడ్జెటు:

ఆదాయం	.... రూ.	85.12 కోట్లు
వ్యయం	.... ,,	87.62 ,,
పెట్టుబడి ఖర్చు	.... ,,	34.55 ,,

*(1961 జనాభా లెక్కల తాత్కాలిక వివరాల ప్రకారం)


OPENING OF GDV-BVRM CONVERSION TO BG
BVRM
GDV